గీతామృతం

తెలుగు అనువాదము, వ్యాఖ్యానము

డా. రాఘవేంద్ర ప్రసాద్, యం.డి.



Dr. Raghavendra S. Prasad, MD

గీతామృతం

డా. రాఘవేంద్ర యస్. ప్రసాద్

ముఖచిత్రం : సముద్రాల సురేంద్రరావు
ముద్రణాశాల : రైన్‌బో ప్రింట్ ప్యాక్
తెలుగు డి.టి.పి : సాంబశివరావు పెద్ది, లక్ష్మి గేదెల

మూల్యం : రూ. 100/-
ISBN : 978-1-5136-0843-3
మొదటి ముద్రణ : జనవరి, 2016
రెండవ ముద్రణ : సెప్టెంబర్, 2016
మూడవ ముద్రణ : మార్చి, 2018

ప్రచురణకర్తలు:
కళ్యాణిరాఘవం పబ్లికేషన్స్
1320 N. Cedar Hill Road,
Cedar Hill, Texas 75104
Ph: 214-325-1969 USA
India Mobile: 78934 12166
prasadrs27@hotmail.com
www.nrithinktank.com

ఈ గీతామృతం మూడవ ప్రచురణ

మంచికి మారుపేరై, స్నేహశీలియై, అందరకూ సహాయకారైన

కీర్తిశేషులు వేములపల్లి వేంకట కృష్ణారావు

స్మృత్యర్థం ముద్రించబడింది

జననం

14-06-1932



మరణం

19-01-1991

జన్మస్థలం

వానపాముల, కృష్ణాజిల్లా

Retired General Manager (Geology)

O.N.G.C, Bombay



తృతీయ ముద్రణకు ముందుమాట

నా హృదయగీతమై, నా ఆధ్యాత్మిక సాధనైన యీ గీతామృతం రెండేళ్ళలో మూడవ ప్రచురణకు తయారయినది. తొలుత నాకు ఉపకరించి, నా పరివర్తనకు కారణమైన యీ గీతామృతసారాన్ని జనబాహుళ్యానికి అర్థమయే రీతిలో సరళంగా అందించాలనే ఆశయంతో నలుగురికీ వుపయోగపడే రూవంలో ప్రశ్నోత్తర భగవద్గీత, సంక్షిప్త భగవద్గీత అనే అధ్యాయాలను ఇముడ్చుకొని, చిన్న చిన్న మార్పులు చేర్పులతో యీ మూడవ ప్రచురణ మీముందుకు వచ్చింది. దీనిని ఆహ్వానించి ఆశీర్వదించి మీసలహాలను తెలియజేసి దీని పరిపూర్ణతకు దోహదపడాలని కోరుకుంటూ...

ప్రేమతో

మీ

రాఘవేంద్రప్రసాద్



ద్వితీయ ముద్రణకి ముందుమాట

దాదాపు ఐదు దశాబ్దాల అనుబంధపు చొరవన "రోజూ టి.వి.చూసే బదులుగా భగవద్గీతలోని ఒక శ్లోకం ప్రతిరోజూ చదవవచ్చు గదా మామయ్యా" అన్న నా సలహాకు "అది నాకు అర్థం, పర్థం కాదు గదా" అన్నాడు మామయ్య.

"నీకు అర్థం అయేటట్లు తెలుగులో రాస్తాను" అన్నాను. ఆ పర్యవసానంగా 2016 జనవరిలో ఆయన 90 వసంతాల వేడుకలో ఆ గ్రంథము మొదటి ఎడిషన్ విడుదల చేయటం జరిగింది.

మంచివాడైన మామయ్యకు రెండే భయాలు. ఒకటి మృత్యు భయం, రెండోది వ్యాధి భయం.

తదుపరి హరిద్వార్ నుంచి రుద్రాక్షమాలను తెచ్చి యిచ్చి రోజూ నామస్మరణ చేయమని మామయ్యకు సూచించాను. కృష్ణా పుష్కరాలకు అమెరికా నుండి వచ్చి, తిరిగి కల్యాణితో కలసి హైదరాబాదు వెళుతూ వీడ్కోలు చెప్పే సందర్భంలో మామయ్య కళ్లు చెమ్మగిల్లాయి. మేము చలించాము. అప్రయత్నంగా "మామయ్యా నువ్వు దేనిని గురించిగానీ, ఎవరిని గురించి గాని యేడ్వవద్దు, ఒక్క భగవంతుడిని గురించి మాత్రమే కన్నీరు పెట్టుకోండి" అనే మాటలు నానుంచి వెలువడ్డాయి. పెద్దవాడైన ఆయనతో అంత కటువుగా మాట్లాడినందుకు తరువాత బాధపడ్డాము.

తదుపరి, అన్ని భయాలకు అతీతుడై, మామయ్య 16.09.2016న గుంటూరులో కూర్చున్నవాడు కూర్చున్నట్లుగా రెప్పపాటులో శాశ్వతసమాధి స్థితికి చేరాడు.

మంచి మనసున్నవారు అతితక్కువ శ్రమతో అంతిమగమ్యానికి అభయులై చేరతారు అనటానికి ఇదొక నిదర్శనం. (భ.గీ. 6-27, 28)

ఆయన పరిపూర్ణ మహాప్రస్థానం ఒక వేడుకగా ముగించాం. ఈ సందర్భంగా వేదవిజ్ఞానసారమైన ఉపనిషత్తులు, సర్వఉపనిషత్తుల సారమైన ఈ గీతామృతాన్ని రెండవ ఎడిషన్‌గా పదుగురి ఉపయోగార్థం వెలువరిస్తున్నాము.

ప్రేమతో

మీ

రాఘవేంద్రప్రసాద్

అంకితం

తనే ప్రేరణై, తనే ధారణై,

యీ రాఘవేంద్రుడుని ఒక వేణువుగా పలికించి

వ్రాయించిన యీ నా హృదయ గీతామృతం



నాకు దక్షిణా మూర్తిగా గురువై, నా సర్వస్వమూ అయిన

నా స్వామి పాదపద్మాలకు 90వ జన్మదిన వేడుకల తరుణమున



ప్రేమతో అంకితం

ఉపోద్ఘాతం



హిందూధర్మం ప్రపంచంలో అతి ప్రాచీనం. దానికి వేదాలు మూలం. వేదసారం ఉపనిషత్తులు. ఈ ఉపనిషత్తుల సారమే భగవద్గీత. ఇది హిందువులకు అతి ముఖ్యమైనది. ఇది వేదవ్యాసునిచే సంస్కృతంలో రచించబడిన మహాభారతంలోని భీష్మ పర్వము లోనిది.

విద్యాభ్యాసం శ్రవణ, మనన, నిధి ధ్యాస అనే మూడు దశలు దాటి ప్రత్యక్షానుభవంతో సంపూర్తి అవుతుంది. శాస్త్రజ్ఞానం, పాఠకుని ఆధ్యాత్మిక స్థాయిని బట్టి, మూడు దశల్లో లభిస్తుంది. అవి తాత్పర్యార్థం, విశ్లేషణార్థం, అంతరార్థం. ఈ అంతరార్థం ప్రత్యక్షానుభవంతోనే లభ్యమై, నిర్ధారణఅవుతుంది. ఇదే విద్యకు చరమదశ.

చిన్నతనంలో నాన్న నాటిన బీజాలతో ఆరంభమయింది నా ఆధ్యాత్మిక ప్రయాణం. ఈ ప్రయాణం రామకృష్ణ మఠం, చిన్మయా మిషన్ ద్వారా సాగి, పరమగురు భగవాన్ సత్యసాయి బాబా వారి శిష్యరికంలో పరిపక్వత చెందింది. దాని ఫలితమే ఈ రచన.

అర్జునుని ప్రశ్నలతో, శ్రీకృష్ణపరమాత్మ జవాబులతో ప్రారంభమైన ఒక వ్యాస సంపుటి అప్రయత్నంగానే పరిణతి చెంది యీ యజ్ఞాన్ని ప్రారంభించింది. యీ గీతాయజ్ఞం నా హృదయవాసి అయిన సాయి స్పందనా ధారణతో, మూడు వారాలలోనే పూర్తయింది.

నా హృదయస్పందన, యధాతథంగా కవిత, వచన, వ్యాఖ్యల మిశ్రమంగా ఈ పుస్తక రూపం ధరించింది.

ఈ గీతా యజ్ఞ మధన ప్రథమ లబ్ధిదారుడను నేనే. నాకు లభించిన గీతామృతం అంతరార్థ అనుభవం. ఆ అనుభవమే నాకు భగవత్ ప్రసాదం. దానిని నలుగురికి పంచేదే యీప్రయత్నం. దీనిని సాయి ప్రసాదంగా స్వీకరించి, దీవించమని ప్రార్థన.

ప్రేమతో,

మీ...

రాఘవేంద్ర ప్రసాద్



మంగళాశాసనములు

మాతాశివానంద సరస్వతి
చైతన్య తపోవనం, తాడేపల్లి, ఆంధ్రప్రదేశ్

ఓం

గీతామాత్రేనమః జై రాధేశ్యామ్

ప్రియ దివ్యాత్మ స్వరూపులారా,

మన తెలుగువారికి మరొకసారి గీతామృతఫలం శ్రీమాన్ డాక్టర్ రాఘవేంద్రప్రసాద్‌గారి ద్వారా లభించింది. ముందుగా వారికి మన అభినందనలు. మంగళశాసనములు. భగవద్గీత సంస్కృత శ్లోకము చదివి వ్యాఖ్యానము చేసేవారికి కూడా "రాఘవేంద్రగీత" రమ్యంగా, హృద్యంగా, సులభంగా, సుందరంగా ఉంది. ఇక సామాన్యులకు మహా ఆకర్షణంగా ఉంది.

నాసతో విద్యతే భావః...... తత్వదర్శిభిః (2-16)
ఉండి నశించే దేహమునకు ఉనికి లేదు
కనబడని సత్యమైన ఆత్మకు లేమి లేదు
తత్వజ్ఞానులకు తెలుసు ఈ రెంటి నిజము (2-16)

ఈ ఆత్మ చంపబడదు, కాల్చబడదు
యితడు నిత్యుడు, సర్వవ్యాపి
స్థిరుడు, నిశ్చలుడు, పురాతనుడు (2-24)

చూచునొకడు చమత్కారముగ
చెప్పునొకడు అత్యద్భుతమని
వినును ఒకడు విచిత్రమని
కని, విని, చెప్పినవారెవరును
తెలియరు యీ ఆత్మస్వరూపము
దాని అసలు స్వరూపము (2-29)

ఇంత మంచి మాధుర్య తెలుగు భాషలో భాష్యాలు చదివినా, వ్యాఖ్యానాలు విన్నా అర్థం కాని గీతార్థాన్ని ఒక మామిడి పండు రసంలా, అమృతంలా ఆస్వాదింపజేసిన శ్రీరాఘవేంద్రగారు ధన్యులు.

అంతఃకరణ శుద్ధితో, అంతరంగ సాధన, శోధనలతో మధించగా ప్రసాదించబడిన ఈ గీతామృతం ఒకసారి మీరూ పానం చేయండి. మీ వారందరికీ అందించండి. మీకూ తెలుస్తుంది మన రాఘవేంద్రుని ద్వారా గీతామాత మనకు ఇంత చేరువై, కల్పతరువై, కామధేనువై అమృతాన్ని ప్రసాదించి ఆత్మానందమే మన స్వరూపస్వభావాలు అనే జ్ఞానాన్ని కలిగిస్తుందని...

మరొకసారి మన డాక్టరు రాఘవేంద్రప్రసాద్‌గారికి పాఠకులై, పవిత్రులైన మీ అందరికీ అనేక మంగళాశాసనాలతో

మాతా శివానందసరస్వతి

తొలిపలుకు



డా. రాఘవేంద్ర ప్రసాదు గారు అధ్యాత్మిక మార్గంలో, చింతనతో, భావ ప్రకటనతో చక్కని సచ్ఛీలతతో మనుగడ సాగిస్తున్న జిజ్ఞాసువు. తన జిజ్ఞాసాపథంలో సాగిన ఆలోచనలనీ, గ్రహించిన సద్విషయాలనీ, అక్షర రూపంలో అందించడం వారి ప్రత్యేకత. యిదివరలో హిందూ ధర్మంపై అవగాహన కలిగించే పుస్తకాలను రచించారు.

హిందూ జీవన విధానంలో పలు వ్యవస్థావిశేషాలను విశ్లేషించినారు.. ఇప్పుడు తన భగద్గీతాధ్యయన సరళిని యీ పుస్తక రూపంలో అందించారు. ముందుగా గేయము వంటి రచనతో శ్లోకాలను తెలుగు చేసి, వాటికి సరళమైన భావావిష్కరణచేసారు. భగవద్గీత వంటి మహాగ్రంథాన్ని ప్రతి శ్లోకం అధ్యయనం చేసుకోవటం సామాన్యం కాదు. తను గ్రహించిన అర్థాన్ని తిరిగి అందరికీ తెలియచేయాలనే సంకల్పము అభినందనీయమే.

ఆ సంకల్పాన్ని చక్కగా నెరవేర్చుకున్నారు శ్రీ ప్రసాదు గారు. అనవసరపు విస్తారం లేకుండా, సూటిగా తేటగా వ్రాసారు. వృత్తిరీత్యా గొప్ప వైద్యులై, ప్రవృత్తి రీత్యా భగవదారాధనా తత్పరులై, తత్వచింతన కల వీరు- తన సంస్కారాన్ని చక్కగ ఇందులో ఆవిష్కరించారు. ఇది వీరు చేసిన గొప్ప గీతా సాధన అని అభివర్ణించవచ్చు. తనపైన ప్రత్యేకానుభవాలను కూడా ఇందులో వ్యక్త పరిచారు.

వీరి భావన - సాధన - చింతన అభివందనీయాలు.

శివాకాంక్షలతో

28 జూన్ 2015

సామవేదం షణ్ముఖ శర్మ



తృతీయ ముద్రణకు కృతజ్ఞతలు

జనవరి 2018 లో ఒంగోలు,RIMS లోని, శ్రీ సత్యసాయి ప్రసాద సాధన కేంద్రం వార్షికోత్సవ
సందర్భంగా నేను కర్మయోగం గురించి
మాట్లాడినదానికి, స్పందించి, స్వశ్చందంగా ముందుకు వచ్చి యీ మూడవ
ప్రకరణకు తను నిధులు సమకూర్చి,ఈ ప్రకరణకు
కారణభూతులైన

శ్రీ గురు ప్రసాదు గారు మరియు వారి కుటుంబసభ్యుల

హృదయ విశాలతకు యిదే



నాకృతజ్ఞతాంజలి.

మునుపటిలాగుననే, యీసారికూడా తన సహాయసహకారాలందించిన
శ్రీ పెద్ది సాంబశివరావుగారికీ,
అతి తక్కువ వ్యవధిలో ముద్రించిన రైన్‌బో ప్రింట్ ప్యాక్ వారికీ,
నాప్రతి అక్షరాన్ని, శోధించి, మధించి తప్పులను సరిచేసిన నా అర్ధాంగి
శ్రీమతి కల్యాణికి నాకృతజ్ఞతాంజలి.





ద్వితీయ ముద్రణకు కృతజ్ఞతలు

నా యీ రచనకు పరోక్షంగా కారకమైన మామయ్య శ్రీ చిమటా నారాయణగారికి, ప్రేరణా, ధారణై, నా హృదయ గానమై వెలువరింపజేసిన యీ పద్య, గద్య అక్షర సంపుటికర్త, నా స్వామి సత్యసాయికి, దైవికంగా కలిసి, నిస్వార్ధ సేవాతత్పరతకు మారు పేరై, తెలుగు డి.టి.పి చేసి, నాకు తెలుగు టైపింగ్ నేర్పి, నాకత్యంత సన్నిహిత మిత్రుడైన పెద్ది సాంబశివరావుగారికి, సృజనాత్మకతతో అందముగా ముఖచిత్రాన్నిచ్చిన సముద్రాల సురేంద్రరావు గారికి, నే రాసిన ప్రతి పుటనూ మధించి, జల్లెడ పట్టి, తూరుపారపట్టి, పద వ్యాకరణ సౌష్టవాన్ని సంరక్షించే నా వ్యక్తిగత సంపాదకురాలు, నా సహధర్మచారిణి కళ్యాణికి యిదే నా యీ కృతజ్ఞతాంజలి.

– రాఘవేంద్ర ప్రసాద్

సృష్టి - మోక్షం చిత్రీకరణ




ప్రవృత్తి-నివృత్తి చిత్రీకరణ
సమత్వం
మోక్షం
మోహక్షయం
అద్వైత దర్శనం జ్ఞానం
ధ్యానం
జ్ఞానం
నిష్కామ కర్మం
అనన్యభక్తి
చిత్తశుద్ధి
భగవంతునిపై అనురక్తి - భక్తి
సత్ చింతన (అనన్య దైవ చింతన సద్వచనం (నామ స్మరణ) సత్కర్మ (నిష్కామ కర్మ)
మోక్ష కామం
చతుర్విధ పురుషార్థములు
నివృత్తి మార్గం
సుఖము
తీరి
కోరిక
తీరక
దుఃఖము
ప్రవృత్తి మార్గము
అరిషడ్వర్గములు
కామము
విషయ వస్తు కామము
తీరక
క్రోధం/ ద్వేషము
బుద్ధినాశనం
అధోగతి
వున్నది తగ్గుతుంది
మనో కల్మషం
లోభం
మోహం
రాగము
బంధము
నాకే వుంది
నాకే లేదు అందరికుంది
మదం
మాత్సర్యం
నాకెవ్వరు లేరు
జనన మరణ సంసార పరిభ్రమణ చక్రం
సహస్రారం
అగ్ని
స్వచ్ఛత
ప్రకాశం
అద్వైత దర్శనం జ్ఞానం
ఊర్ధ్వం
ఆత్మ జ్ఞానం వైపు
ఉత్తరాయణం
దక్షిణాయణం
చీకటి
అవిద్య
భ్రమ
క్షీణత
కామ్య
కర్మ
పునర్జన్మ
మూలాధారం

త్రిగుణ సారాంశ పట్టిక

అధ్యాయం	విషయం	సత్వం	రజస్సు	తమస్సు
14	లక్షణాలు	బుద్ధి నిర్మలం, ప్రకాశం సుఖం, జ్ఞానం, నిశ్చలం	రాగం, తృష్ణ, కర్మబంధం, అహంకారం, అత్యాశ	అజ్ఞానం, మోహం, మరపు, నిద్ర అవివేకం
	గుర్తింపు	బుద్ధి, జ్ఞానం, ప్రకాశం	లోభం, కర్మ, అత్యాశ, గడిబిడి	మూర్ఖత్వం, అజ్ఞానం, సోమరితనం
	అణచును	రజో, తమో గుణాలను అణచును	సత్వ, తమో గుణా లను అణచును	సత్వ, రజో గుణాలను అణచును
	పునర్జన్మ	జ్ఞానుల- ఐశ్వర్యవంతుల యిళ్లలో	ప్రాపంచిక విషయ భోగాలలో వున్న కుంటుంబములో	అనాగరికుల యిళ్లలో, పశు పక్ష్యాదులుగా
	ఫలము	సుఖం, బుద్ధి, నిర్మలం, జ్ఞానం	కర్మ: దుఃఖం, లోభం	అజ్ఞానం, మోహం
	దేహాంతర లోకములు	పూర్ధ్వ లోకములు	మానవ లోకము	అధో లోకములు
17	పూజలు	దేవతలను	యక్ష, రాక్షసులను, గంధర్వులను	భూత, ప్రేత పిశాచములను
	ఆహారం	రసము, నూనె ప్రధానము పులుపు, నిదానముగ అరిగేవి, దప్పిక కలిగించనివి	తీపి, వగరు, చేదు, కారం, దప్పిక పుట్టేవి	చెడిపోయినవి, వాసనగొట్టేవి, ఎంగిలి అన్నం
	యజ్ఞం	శాస్త్రములకు అనుగుణం, నిష్కామముగ, ప్రతిఫలా పేక్ష లేకుండా	ప్రతిఫలాపేక్షతో, డంబంతో, ఆర్భాటంతో, ధ్యేయము లేకుండా	పర హాని కోసం అశాస్త్రీయముగ అన్నదానం, మంత్రము లేకుండా
	తపస్సు (మనో, వాచక శారీరక)	స్వచ్ఛత, చిత్తశుద్ధితో, శ్రద్ధతో,	శ్రద్ధ లేకుండా, ఆర్భాటానికి, అహంకారము డంబము కొరకు	పర హాని కోసం మూర్ఖముగా

	శ్రద్ధ	నిర్మల హృదయము, చిత్తశుద్ధితో	అహంకారముతో	సోమరితనంతో
	దానము	తగిన సమయములో, తగిన చోట తగిన వ్యక్తికి, ప్రతిఫలాపేక్ష లేకుండా, అడిగించుకొనకుండా, సహజముగా, బలవంతము లేకుండ యిచ్చేది	గొప్ప కోసం, డంబముతో, బలవంతముతో, అయిష్టంగా, కోపముగా, తగని చోట, తగని కాలములో తగని వ్యక్తికి యిచ్చేది	తిడుతూ అగౌరవంగా, తప్పక, నిర్బంధముతో యిచ్చేది
18	త్యాగం	నిష్కామ కర్మ అందరికీ ఉపయోగపడేలా	స్వార్థముతో, గొప్పలకి, అజ్ఞానముతో	పనులన్నీ వదలి, సోమరిగా
	బుద్ధి	ఆత్మధ్యాసతో, వివేకముతో, విచక్షణతో	బుద్ధిమాంద్యముతో	తప్పును ఒప్పుగా ఒప్పును తప్పుగా
	ధైర్యం	ఆత్మవిశ్వాసము	గొప్ప కోసం, డంబముతో అహంకారం	పర హాని కొరకు, మూర్ఖముగా
	సుఖం	విషము మొదలు, అమృతం తదుపరి	అమృతం మొదలు విషం తదుపరి	మొదలు చివర విషమే
	జ్ఞానం	ఏకాత్మభావన	ద్వైత భావన, అహంకార పూరిత	అజ్ఞానం, అసత్ సత్‌గా, సత్ అసత్‌గా
	కర్మ	నిష్కామ	కామ్య కర్మ	సోమరితనం
	కర్త	నిష్కామం, అకర్తగా	అహంకారంతో	పని పూర్తి చేయకుండా

#	యోగం	పర్యాయ పదం	వివరణ	విశ్లేషణ	మూలం	ఆంగ్లంలో	కార్యం	ఫలం
1	కర్మ యోగం	నిష్కామ కర్మం	సహజమైన కాలి బాట	సహజ ధర్మకర్తృత్వ భావన - అకర్మ	ధర్మం	ATTITUDE of Custodialship Efficient Work Harmonious Work	సేవ	చిత్త శుద్ధి మల దోష హరణం
2	భక్తి యోగం	దైవంపై అనురక్తి	సులువైన బండి బాట	ఆరాధనా భావం ఆర్తి-అర్థార్తి-జిజ్ఞాసు-మోక్ష కామి సాలోక్య-సారూప్య-సామీప్య-సాయుజ్య నవ విధ భక్తి: పర-అపర	ప్రేమ	ADORATION	దయ కరుణ	అహంకార త్యాగం ప్రపన్నత ఆత్మ సమర్పణ
3	ధ్యాన యోగం	చిత్త వృత్తి నిరోధనం సమత్వం	జలధిపై ఓడ	ఒడుదుడుకుల సంసార సాగరంలో జీవన పయనం	శాంతి	EQUANIMITY	నిశ్చలత్వం	యింద్రియ నిగ్రహం విక్షేప దోష హరం
4	జ్ఞాన యోగం	అద్వైత దర్శనం	శీఘ్ర విమాన యానం	ఎరుక ఏకాత్మ భావన అవిద్యా హరం	సత్యం	AWARENESS of Oneness Constant Integrated Awareness	స్వస్వరూప దర్శనం	మోక్షం ఆవరణ దోష హరం

విషయ సూచిక

I	01	గీతా పారాయణాక్రమం - గురుధ్యానం	003
	02	గీతా పారాయణాక్రమం - భగవాన్ శ్రీకృష్ణ ధ్యానం	004
	03	గీతా పారాయణాక్రమం - గీతా స్తోత్రం	006
	04	గీతా పారాయణాక్రమం - గీతా ధ్యానం	009
	05	అర్జునుని ప్రశ్నలు	010
II	01	మొదటి అధ్యాయము : అర్జున విషాద యోగము	013
	02	రెండవ అధ్యాయము : సాంఖ్య యోగము	021
	03	మూడవ అధ్యాయము : కర్మయోగము	041
	04	నాల్గవ అధ్యాయము : జ్ఞాన యోగము	055
	05	ఐదవ అధ్యాయము : కర్మసన్యాస యోగము	069
	06	ఆరవ అధ్యాయము : ఆత్మ సంయమ యోగము	077
	07	ఏడవ అధ్యాయము : విజ్ఞాన యోగము	087
	08	ఎనిమిదవ అధ్యాయము : అక్షరపరబ్రహ్మ యోగము	093
	09	తొమ్మిదవ అధ్యాయము : రాజవిద్యారాజగుహ్య యోగము	101
	10	పదవ అధ్యాయము : విభూతి యోగము	111
	11	పదకొండవ అధ్యాయము: విశ్వరూపసందర్శన యోగము	119

	12	పన్నెండవ అధ్యాయము : భక్తి యోగము	135
	13	పదమూడవ అధ్యాయము : క్షేత్రక్షేత్రజ్ఞ విభాగ యోగము	139
	14	పదునాల్గవ అధ్యాయము : గుణత్రయ విభాగ యోగము	147
	15	పదునైదవ అధ్యాయము : పురుషోత్తమ ప్రాప్తి యోగము	153
	16	పదునారవ అధ్యాయము : దైవాసురసంపద్విభాగ యోగము	159
	17	పదునేడవ అధ్యాయము : శ్రద్ధాత్రయ విభాగ యోగము	163
	18	పదునెనిమిదవ అధ్యాయము : మోక్ష సన్యాస యోగము	169
III	1	భగవద్గీతా సారం	183
	2	ప్రశ్నోత్తర భగవద్గీత	189
	3	మూలశ్లోకాలు	251
	4	సంక్షిప్త భగవద్గీత	329
	5.	పాఠకుల ప్రతిస్పందనలు	334

గురు ధ్యానం



గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణు
గురుర్ దేవో మహేశ్వరః
గురుర్ సాక్షాత్ పరబ్రహ్మః
తస్మై శ్రీగురవేన్నమః

నిర్మలమై శుద్ధజ్ఞాన ప్రకాశమై
ప్రశాంతి హృదయక్షేత్ర దర్పణమై భాసిల్లు
దక్షిణామూర్తి పాదపద్మ యుగళికి
దేహేంద్రియ మనోబుద్ధులను అర్పించి
సవినయముగ సమర్పించు హృదయాంజలి

భగవాన్ శ్రీకృష్ణ ధ్యానం



కృష్ణం వందే జగద్గురుం
దేవకీ వసుదేవ సుతం
యశోద నంద నందనం
గోపికా వల్లభం
రాధికా హృదయవాసం
రుక్మిణీ నాధాయ
కంస చాణూర మర్దనం

పార్ధ సఖాయ
భక్తజన పూజితాయ
సర్వోపనిషత్సార గీతాబోధితాయ
జ్ఞాన ముద్రాయ శ్రీకృష్ణాయ
నమోస్తుతే! ప్రణమోస్తుతే

పుట్టు మూగని అనర్గళ వక్తను చేయువాని
అవిటిని కొండల దూకునటుల చేయువాని
కృపాసంద్రాన జ్ఞానార్తి తీర్చువాని
కొలుతు భక్తితో అట్టి ఆ మాధవుని

వేదమే గోమాతయై
ఉపనిషత్తులే పాలపొదుగై
పార్థుడే లేగదూడయై
భగవానుడే గోపాలుడై
పితికిన క్షీరామృతం యీ గీతా ప్రసాదం
పరమ పవిత్రం, అమృతతుల్యం
నిర్మలం, పూర్ణం, పరమ సుఖదం
ప్రశాంతం, పరమానందకరం

నారాయణుడైన శ్రీకృష్ణభగవాన్
హృదయ బీజాంకురంగా వెలసి
సఖుడైన పార్థునికి బోధగా
పురాణముని వ్యాస విరచిత
శ్రీమద్భారతాంతర్భాగమై
అష్టాదశ అధ్యాయములతో నిండి
స్వానుభవసిద్ధిని ప్రసాదించు
ఓ గీతామాతా! నమోస్తుతే! ప్రణమోస్తుతే!

గీతా స్తోత్రం



గీతా మాతా! నమోస్తుతే! నమోస్తుతే! ప్రణమోస్తుతే!
మమత్వ జనిత శోకం నుండి మమ ధర్మాన్ని ఉద్బోధించి
గమ్యానికి నడిపించే అంతర్వాణివే నీవు.
విషాదాన్నుంచి విముక్తిని కల్గించి ఆనందాన్ని నింపే దివ్య ఔషధం నీవు.
ఇంద్రియాలనుండి మనస్సుకు, మనస్సునుండి బుద్ధికి, బుద్ధి నుండి ఆత్మకు,
దేహం నుండి దేహికి తీసుకెళ్లే జీవప్రవాహమే నీవు.


దైవం – ప్రకృతి వేరనే భావననుండి, ప్రకృతిలో దైవం,
దైవంలో ప్రకృతి, ప్రకృతే దైవం, దైవం ప్రకృతి ఒకటనేవరకూ.
అద్వేష్టా సర్వ భూతానాం నుండి సర్వం విష్ణుమయం జగత్‌కూ
అహం బ్రహ్మోస్మి నుండి సర్వం బ్రహ్మం వరకూ,
అసుర సంపద నుండి సుర సంపదకూ,
దానవత్వం నుండి, మానవత్వానికి, తదుపరి దైవత్వానికీ నిచ్చెనే నీవు!

మరపునుండి ఎరుకకు, అజ్ఞానం నుండి సుజ్ఞానానికి,
సుజ్ఞానం నుండి విజ్ఞానానికి,
విజ్ఞానాన్నుండి దివ్యానుభవంతో ఏకాత్మ దివ్య దర్శనం కల్గించు
మోక్ష ప్రదాయినివి నీవు.
భవబంధమనే సంకెళ్ళనుండి విముక్తి కల్గించి
ఆత్మానంద స్వేచ్ఛను ప్రసాదించే మహా మంత్రం నీవు.

ప్రజలే దైవంగా, దేశమే దేహంగా, సేవే భక్తిగా,
ధర్మమే మార్గంగా, సత్యమే గమ్యంగా,
ప్రేమే ప్రాణంగా త్యాగమే ప్రసాదంగా మార్చి
ప్రత్యక్షానుభవసిద్ధి కలిగించు వెలుగు నీవు.

భవరోగ హారిణి, అజ్ఞాన నిర్మూలిని, సర్వ సందేహ నివారిణి,
మమత్వ బంధ ఛేదిని,
స్వేచ్ఛా ప్రదాయిని, సర్వ ఫలదాయిని, విజ్ఞాన ప్రదాయిని,
సమస్త సుఖదాయిని, ఆనంద ప్రదాయిని
గీతా మాతా నమోస్తుతే, నమోస్తుతే, ప్రణమోస్తుతే!

గీతా ధ్యానం



గీతా పఠనాసక్తి దినదినాభివృద్ధినందుగాక!

గీతాధ్యయనం నా హృదయ గీతమౌనుగాక!

అరిషడ్వర్గ ప్రక్షాళనతో, సత్య, ధర్మ, శాంతి, ప్రేమ,

అహింసా త్యాగములు పెరుగుగాక!

నా భక్తి దైవపూజా పుష్పమగుగాక!

నిష్కామకర్మమే హృదయపూజాపుష్ప పరిమళమగునుగాక!

అద్వైత దర్శనమున జ్ఞానం ప్రకాశించుగాక!

మనోవాక్కాయ కర్మలేకమయి చిత్తశుద్ధి కలుగుగాక!

చిత్తశుద్ధిన ఆత్మానుభవ సిద్ధి కలుగుగాక!

బ్రహ్మం సర్వమై, సర్వం బ్రహ్మమై,

సర్వం బ్రహ్మమగుగాక!

గీతా శ్లోక సంఖ్యా వివరణ


అధ్యాయం	ధృతరాష్ట్రుడు	సంజయుడు	అర్జునుడు	శ్రీకృష్ణుడు	మొత్తము
1	1	25	21		47
2		3	6	63	72
3			3	40	43
4			1	41	42
5			1	28	29
6			5	42	47
7				30	30
8			2	26	28
9				34	34
10			7	35	42
11		8	33	14	55
12			1	19	20
13			1	34	35
14			1	26	27
15				20	20
16				24	24
17			1	27	28
18		5	2	71	78
మొత్తము	**1**	**41**	**85**	**574**	**701**



అర్జునుని ప్రశ్నలు

1	1-21	రథమును యిరుసేనల మధ్యన నిలుపమనెను.	16
2	2-4	నేను గౌరవించు పూజ్యులపై ఎలా యుద్ధము చేయవలె?	22
3	3-54	స్థితప్రజ్ఞుని లక్షణములేవి?	32
4	3-1,2	జ్ఞానకర్మలలో ఏది శ్రేయము?	38
5	3-36	మనుజుడు అప్రమేయముగ ఏ ప్రేరేపణచే పాపకర్మలను చేయును?	45
6	4-3	సమకాలికులమై నీ సూర్యోపదేశము నేనెలా అర్థం చేసుకోగలను?	49
7	5-1	కర్మత్యాగం (జ్ఞానం), నిష్కామ కర్మలలో ఏది మేలు?	61
8	6-33	గాలిని బంధించుట వలె మనసును నిర్దేశించుట అతి కష్టం. యిదెలా సాధ్యం?	74

9	6-37	మనోనిగ్రహము లేక యోగభ్రష్టుడైనవాడు యోగసిద్ధిని పొందక ఏమౌను?	075
10	8-1,2	బ్రహ్మం, ఆధ్యాత్మం, కర్మం, ఆదిభూతమేది, అధియజ్ఞుడెవరు? తెలియుటెట్లు? మరణ సమయమున నీవెటుల తెలియబడగలవు?	083
11	10-12,18	నీ మహిమలను గురించి చెప్పుటకు నీవొక్కడవే తగినవాడవు. నిన్ను నేనెట్లు తెలిసికోగలను?	099
12	11-14	ఆ విశ్వ స్వరూపమును యిక నాకు చూపుము.	109
13	11-46	మునుపటి సౌమ్యరూపమునకు రమ్మని ప్రార్ధించెను	115
14	12-1	సాకార నిరాకార ఆరాధనా భక్తులలో ఎవరు శ్రేష్ఠులు?	119
15	13-1	ప్రకృతి, పురుషుడు, క్షేత్రము, క్షేత్రజ్ఞుడు, జ్ఞానము, జ్ఞేయమును గూర్చి తెలుపుము?	123
16	14-21	త్రిగుణాతీతుని లక్షణాలను తెలుపుము?	132
17	17-1	శాస్త్రనియమములు లేని పూజ సాత్వికమేనా?	143
18	18-1	సన్యాసము, త్యాగము గురించి విశదీకరించుము?	147
	18-73	నా మోహము తొలగినది, సందేహములు తొలగినవి నీ ఆజ్ఞ పాలించుటకు సిద్ధముగా వున్నాను.	158



1

మొదటి అధ్యాయము

అర్జున విషాద యోగము

జ్ఞానాంధుడైన ధృతరాష్ట్రుని మమత్వ "మమకా" బీజంతో మొదలైనది కురుక్షేత్రం. మనలోని మన మమత్వమైన మమకారబంధంతో మొదలవుతుంది మన జీవన కురుక్షేత్రం. ఈ గీతాగ్రంథంలో మూడు మమత్వాలు ఉన్నవి. అవి దేహభ్రాంతితో ఉన్న ధృతరాష్ట్రుని సంకుచిత మమత్వం. ఇది మొదటి మమత్వం, వ్యష్టికి సంబంధించినది, అంటే వ్యక్తికి చెందినది.

రెండవది మనోభ్రాంతితో కూడి ఉన్న అర్జునిని మమత్వం. ఇది సమిష్టి. ఇది 'మేము', 'మా వాళ్లు' అనుకునే భావనతో కూడినది.

మూడవది ఆత్మిక మమత్వం. అది శ్రీకృష్ణుడు బోధించినది, ఆత్మసంబంధమైనది, విశ్వమానవ సౌభ్రాతృత్వం.

భగవద్గీత బోధ, ఓ గానం, ఓ ప్రవాహం, ఓ ఔషధం, అమృతం. ఈ ప్రభావం 'నేను', 'నాది' అనే ధృతరాష్ట్ర భావాన్నుంచి 'మనం', 'మనది' అనే అర్జున భావాన్నుంచి 'సర్వం బ్రహ్మం' అనే కృష్ణ ఏకత్వభావానికి తీసుకుపోయే ప్రవాహం. ఇది 'నేను', 'నాది' అనే జీవనవిషాదకారకమైన మనో ఇంద్రియ విషయవాసనలు అనే విషం నుండి 'సర్వం బ్రహ్మం' అనే అమృతానికి తీసుకు వెళ్లే ప్రవాహం.

'నేను', 'నాది' లు వీడితే సుఖం –వీడకుంటే తప్పదు దుఃఖం
'మనం', 'మనది' లోనే ఉన్నవి– సుఖం, దుఃఖం సమపాళ్ళయి
పరమేష్టి లోకి ఇదే ప్రవేశం– పరమానందమయం, అమృతం

ధృతరాష్ట్రుడిట్లనెను:

ధర్మక్షేత్రమైన కురుక్షేత్రములో, నా(మమకా)పిల్లలూ,
పాండురాజుపిల్లలూ, యుద్ధసన్నద్ధులై
ఏమిచేయుచున్నారు సంజయా: 1–1

ధృతరాష్ట్రునకున్న ఒకే ఒక శ్లోకంలో ఆదిలోనే తన సంకుచత్వాన్ని 'యీ మమకా' అనేపద ప్రయోగంతో జీవనరణరంగమైన కురుక్షేత్రానికి తనకు తెలియకుండానే బీజం నాటాడు. 'ఈ నేను–నాది– నాకు' అనే అసురభావనే మన ప్రతికూలభావన. ఏవిత్తనమో అట్టిమొలక, అట్టివృక్షం, అట్టిఫలం. యీనేను–నాది–నాకు అనే మమత్వబీజం తన వంశనాశనానికి కారణమైనదని గ్రహించవలెను.

సంజయుడు చెప్పెను:

వ్యూహాకారములోనున్న పాండవ సైన్యాన్ని చూచి, గురువగు ద్రోణాచార్యుని సమీపించి దుర్యోధనుడు యిట్లు పలికెను. 1–2

ఆచార్యా! మీశిష్యుడూ, ధీమంతుడూ, ద్రుపదపుత్రుడూ అయిన ధృష్టద్యుమ్నుడిచే వ్యూహాకారముగ నుంచిన పాండవుల మహాసైన్యాన్ని చూడుడు అనెను. 1–3

యీ పాండవసేనలో, ధైర్యవంతులూ, గొప్ప అస్త్రవిద్యా నిపుణులూ, యుద్ధమున భీమార్జునులతో సమానులు పెక్కురు కలరు. వారెవరనిన, యుయుధానుడు, విరాటుడు, మహారధి ద్రుపదుడు, ధృష్టకేతువు, చేకితానుడు, కాశీరాజు పురజిత్తు, శైభ్యుడు, యుధామన్యుడు, ఉత్తమౌజుడు, అభిమన్యుడు. వీరందరూ మహారధులే. 1–4,5,6

ఓద్విజోత్తమా! గురువరేణ్యా!యిక మన సైన్యములో ప్రముఖుల గురించి, మీ జ్ఞాపకమునకు చెప్పుచున్నాను. 1-7

మీరు, భీష్ముడు, కర్ణుడు, కృపాచార్యుడు,
అశ్వద్ధామ, వికర్ణుడు, భూరిశ్రవుడు,
నా కొరకు తమ జీవితములు ధారబోసిన
అనేక వీరులు వివిధవిధయుద్ధసమర్ధులై,
వివిధాయుధములతో నుండిరి. 1-8,9

"యద్భావం తద్భవతి". మన మనస్సులో యే భావమో అదే జరుగును. యీ దుర్యోధనుని మాట రాబోవు ఫలితాలకు సూచన. ప్రతికూల భావాలు ప్రతికూల ఫలితాలకు బీజం.

యిట్టి మన సైన్యం భీష్మునిచే రక్షింపబడుతూ,
అపరిమితముగా నున్నది. భీముడి
రక్షణలో నున్న పాండవసైన్యం పరిమితము. 1-10

అందున మీరంతా మీమీ స్ధానాలలో
పటిష్టంగా వుండి భీష్ముడిని కాపాడాలి. 1-11

"సంశయాత్మ వినశ్యతే". 4-30 తన సైన్యం అపరిమితం అంటూనే, భీష్ముని కాపాడండి అని అనటం, భీష్ముడు పాండవ పక్షపాతి అని అనుమానం యింకా వున్నటుల గోచరిస్తుంది యీ ప్రకటనలో.

యిలా అంటున్న దుర్యోధనునకు సంతోషము కలిగించదలచి, కురు వృద్ధుడైన భీష్ముడు తనశంఖమును పూరించెను. 1-11,12

వెంటనే కౌరవవీరుల శంఖ, భేరీ, ఢక్కా, మృదంగ, గోముఖాది ధ్వనులతో దిక్కులు పిక్కటిల్లినవి. 1-13

తదుపరి శ్వేతఅశ్వాల మహారథములోనున్న కృష్ణార్జునులు తమతమ శంఖములను పూరించిరి. 1–14

శ్రీకృష్ణుడు పాంచజన్యాన్ని, అర్జునుడు దేవదత్తమును, భీముడు పౌండ్రమును, కుంతీసుతుడగు ధర్మరాజు అనంతవిజయమును, నకులుడు ఘోషమును, సహదేవుడు మణిపుష్పకమను శంఖములను ఊదిరి.

1–15,16,17,18

పాండవవీరుల శంఖధ్వని భుమ్యాకాశములు దద్దరిల్లునట్లు అయి దుర్యోధనాదుల గుండెలను బ్రద్దలుచేసెను. 1–19

ఓ ధృతరాష్ట్రమహారాజా! అటుపిమ్మట యిరు సైన్యములు ఆయుధ సన్నద్ధులు అవుతుండగా, కపిధ్వజుడగు అర్జునుడు, యుద్ధసన్నద్ధులైన కౌరవులను చూచి ధనుస్సుచేబూని శ్రీకృష్ణునితో ఇట్లు పలికెను. 1–20

అర్జునుడనెను: (మొదటి ఆజ్ఞ)

'ఓ అచ్యుతా! యీయుద్ధారంభ సమయమున
నేనెవరెవరితో పోరాడవలసి వస్తుందీ చూచుటకు
ఇరుసేనల మధ్యన చక్కగ చూడగలుగు
ప్రదేశమున రథమును నిలుపుమని చెప్పెను. 1–21,22

దుష్టబుద్ధిగల దుర్యోధనునికి ప్రీతి కలిగించుటకు
ఎవరెవరు యోధులు వచ్చిరో చూచెదను. 1–23

అర్జునుడు యుద్ధ వీరునిగా కృష్ణునికిచ్చిన ఒకే ఒక ఆజ్ఞ. తదుపరి వీరుని నుంచి శిష్యుడై తను సందిగ్ధతలో వుండి మార్గదర్శనమునకై ప్రాధేయపడును[2-7]. చివరికి ఆత్మసమర్పణతో అన్ని సంశయములు తీరెనని తన కర్తవ్యాన్ని ఆదేశింపమని వేడును.[18-73]. అర్జునునిలో వచ్చే యీ పరిణామం ప్రతి వ్యక్తిలోను రావలసిన

('అహం- దేహం' అనే అహంకారం నుండి ఆత్మ సమర్పణతో 'అహం ఆత్మ'అనే) మార్పు.

సంజయుడనెను:

ఓ ధృతరాష్ట్రమహారాజా! అర్జునుడీవిధిన అనినంతనే శ్రీకృష్ణుడు ఆ రథమును ఇరుసేనల మధ్య, భీష్మద్రోణుల ఎదుట, ఎల్లరాజులెదుటన నిలిపిన తదుపరి అర్జునా! యీచేరియున్న కౌరవులను చూడుమనెను. 1-24,25

అంతట అర్జునుడు రెండుసేనలందున్న తండ్రులను, తాతలను, గురువులను, మేనమామలను, అన్నదమ్ములను, కొడుకులను, మనుమలను, స్నేహితులను, మామలను, హితులనుచూచెను. 1-26

మమత్వం మన ప్రావీణ్యతను నీరుగారుస్తుంది. మిక్కిలినైపుణ్యమున్న, అందరిచే పొగడబడే ఒక శస్త్రవిపుణుడు తన సంతానముపై శస్త్రచికిత్స చేయలేక, వేరొకవైద్యునికి ఆ బాధ్యతను పురమాయించుట సహజంగా మనం చూసే సత్యం. యిక్కడ మమత్వంలో అతడి ప్రావీణ్యత నీరుకారుతున్నదని గ్రహించవలె. అర్జునునికి కూడా యిదే మమత్వంలో (మాది-మనం-మనది అనే రాజసిక మమత్వం) యోధుడైనవాడు నిర్వీర్యుడయినాడు.

అర్జునుడు యుద్ధభూమి నందు నిలబడివున్న అందరినిచూచి, దయార్ధ్రహృదయుడై, దుఃఖముతో యిట్లుపలికెను. 1-27

అర్జునుడిట్లనెను:

ఓ కృష్ణా! యుద్ధము చేయుటకై యిక్కడ చేరిన యీ బంధు సమూహమును చూచిన నా అవయవములు పట్టు తప్పుచున్నవి, నోరు ఎండిపోవుచున్నది, నా శరీరము గగుర్పాటుతో వేడెక్కుతున్నది, గాండీవం చేజారిపోతున్నది, నిలబడుటకు శక్తిలేకున్నది, నామనసు తల్లడిల్లుచున్నది. 1-30

ఓ కేశవా! దుశ్శకునములు గోచరించుచున్నవి. యీ బంధువులందరిని చంపి నేను పొవుకునేది ఏదీలేదు 1-31

కృష్ణా! నాకు విజయము వలదు
రాజ్యభోగములు వలదు
లేదు నాకు ప్రయోజనం
రాజ్యసుఖభోగములవలన 1-32

ఎవరెవరి కోసమని రాజ్యసుఖభోగములను కోరుకుంటామో వారందరూ- గురువులు, తండ్రులు, కుమారులు, తాతలు, మేనమామలు, మామలు, మనుమలు, బావమరుదులు, యితర బంధువులు. వీరంతా ప్రాణాలపైన ఆశవదలి, యీ రణరంగములోనే వున్నారు. 1-33,34

ఓమధుసూదనా! వాళ్ళ నన్ను చంపదలచిననూ నేను వాళ్ళను చంపను. త్రిలోకాధిపత్యమునకైనను వారిని చంపలేను. యిక యీ రాజ్యము కొరకు చంపుతానా? 1-35

దుర్యోధనాదులను చంపి మనం పొందేదేముంది? పాపాత్ములను చంపితే మనకు పాపమే గదా మిగిలేది. 1-36

మాధవా! దుర్యోధనాదులు మనకు బంధువులు, వారిని చంపుట మేలుకాదు మనకు. స్వజనమును చంపి ఎలా సుఖపడగలము? 1-37

ఓ జనార్దనా! రాజ్యకాంక్షన దుష్టబుద్ధులైనందున కౌరవులు కులక్షయ మిత్రద్రోహ పాపమును చూడలేకున్నారు. 1-38

అదే కులక్షయదోష తప్పిదము, అది తెలిసిన మనము చేయలేము గదా.
1-39

ఓ కృష్ణా! కులక్షయమున
నశించును పురాతన కులధర్మము
కులధర్మము నశించిన అధర్మము పెరుగును. 1-40

అధర్మము పెరిగిన చెడుదురు కులస్త్రీలు,
కులస్త్రీలు చెడిన సంకరమౌను వర్ణము. 1-41

వర్ణసంకరమైన నరకము ఆ జాతికి, కారకునకు-
అధోగతి పాలవుదురు పితృతర్పణ శ్రాద్ధములు లేక 1-42

వర్ణసంకరమున జాతి వినాశనం
జాతి, సంఘ, దేశ, సంస్కృతి, ధర్మవినాశనము. 1-43

వర్ణ, జాతి, సమిష్ఠి ధర్మక్షీణత, జీవన నరకమా జాతికని
జీవనము కడుదుర్భరమని ఆ జాతికి విన్నాము కదా. 1-44

అయ్యో! ఒడిగట్టితిమి తెలియక ఎంత పాపానికి
బంధువుల చంపుటకు రాజ్యకాంక్షతో. 1-45

ధార్తరాష్ట్రులు ఆయుధధారులై,
నిరాయుధుడనైన నన్ను చంపిననూ మంచిదే కదా. 1-46

సంజయుడనెను:

యీలాగున చెప్పి అర్జునుడు రణరంగమున ధనుర్బాణములు జారవైచి అతిశోకాతిశయమున రథములో కూలబడెను. 1-47

విషాదము అనంత ఆనందానికి మూలము. జీవన విషాదముతోనే బాహ్యదృష్టి అంతర్దృష్టిగా మారి, ఆధ్యాత్మిక జీవనమార్గానికి నాంది పలుకుతుంది. మహాకవి వాల్మీకి మృతి చెందిన క్రౌంచపక్షిని చూడటం వలన కలిగిన విషాదంతో

ఆవిర్భవించింది రామాయణ మహాకావ్యం. మహా యోధుడయిన అర్జునుని విషాదంతో మొదలయింది ఈ గీతామృత ప్రవాహం.

అమృతాన్వేషణలో ఆరంభమయిన క్షీరసాగర మధనంలో తొలు దొలుత లభించింది విషం. దానిని పరమేశ్వరునికి అర్పించగా, ఆయన దానిని మింగకుండా, బయటకు వెళ్లగ్రక్కకుండా తన గళమందే నిలుపు కున్నాడు. దానిని బట్టి మనకు తెలుస్తుంది. విషాన్ని (చెడును) మింగి మనమే చెడుగా మారకుండా, బయటకు వెళ్లగక్కి ఇతరులకు హానికలిగించకుండా ఉండాలి అని.

మనలోని మాలిన్యాలను, కల్మషాలను ముందుగా తొలగించుకోకుండా మంచిని నింపినప్పటికీ ప్రయోజనం ఉండదు. అలాగే ఆత్మజ్ఞానాన్ని నింపాలంటే అనాత్మజ్ఞాన కారకమైన అవిద్య, మమత్వాలను విడనాడాలి. గీతా ప్రథమాధ్యాయమైన 'అర్జున విషాదయోగం'లో అర్జునిని మమత్వాన్ని బయటకు తీసుకువచ్చి తన పాత్రను శుద్ధిచేసే ప్రక్రియయే ఈ అధ్యాయం. అర్జునుడు మనందరి ప్రతినిధి.

2

రెండవ అధ్యాయము

సాంఖ్య యోగము

పాండవుల యోధానుయోధుడు ప్రధానరక్షకుడు, కేంద్రబిందువు అయిన అర్జునుడే దిగాలుపడిపోయి, అస్త్రసన్యాసం చేసిన అత్యంత అనూహ్య, ప్రమాదకర, క్లిష్ట పరిస్థితిలో ద్వితీయ అధ్యాయం ఆరంభం అవుతుంది. గత అధ్యాయంలో రధికుడైన అర్జునుడు రథసారధియైన కృష్ణునికి తనరథమును ఇరుసేనలకు మధ్య నిలుపుమని ఆధిక్యతతో ఆజ్ఞాపించాడు. తరువాత మిత్రునిలాగా, తర్కిస్తూ ప్రశ్నించాడు. ఆధిక్యత నుంచి మిత్రునిగా, మిత్రునినుంచి శిష్యునిగా రూపాంతరం చెందిన తరువాతనే కృష్ణుని బోధ వినిపిస్తుంది. మనలో కూడా అహంకారం తగ్గిన తరువాతనే కాని అంతర్వాణి వినపడదు. ఇలా సంక్లిష్టస్థితినుంచి కాపాడటంతో(**Crisis Management**) ఆరంభం అవుతుంది రెండవ అధ్యాయం సాంఖ్యయోగం.

సంజయుడిలా అనెను:

ఖిన్నుడై, అశ్రునయనములతో నున్న అర్జునునితో కృష్ణపరమాత్మ అన్నాడు. 2–1

భగవానుడు చెప్పెను:

ఏవిధి దాపురించెనిది అర్జునా! యీ క్లిష్ట సమయమున
నీకీశోకము, దుఃఖము, మనో చంచలత
నరకద్వారమిదినీకు, అపకీర్తి, అప్రతిష్టకరం
పామరునివలెమాట్లాడెదవు, తగదు నీకిది. 2–2

లెమ్ముఅర్జునా! లెమ్ము! – వలదునీకీ బేలతనం
తగదునీకీ నీచపు దుర్బలత – భయమునువీడి
యుద్ధము చేయుము – నిర్భయముగ. 2–3

అర్జునుడనెను: (రెండవ ప్రశ్న)

మధుసూదనా!
ఏ రీతిగ నే యుద్ధము చేయుదు?
భీష్మద్రోణులు పూజ్యులు నాకు,
వారిపైననే బాణములు వేసి
యే రీతిగ నే యుద్ధము చేయుదు. 2–4

మహా మహులు నా తాతలు, గురువులను
చంపుటకన్నను భిక్షమే మేలగును.
ఆ రక్తపు కూడును నేను తినజాలను. 2–5

అదియునుకాక, గెలుపు ఓటములు ఎవరిని వరించునో ఎవరికీ తెలియవు గదా. గెలుపు, ఓటమిలో ఏది మంచిదో తెలియదు. నా మనసువికలమై, ఉన్నది.

నే గెలిచిన ఎవ్వరు ముదమందెదరో
వారేఎదురుగ నిల్చొనివుంటే,
యుద్ధములోనచంపేదెటుల
వారినిచంపి జీవించుట ఎటుల. 2-6

అజ్ఞానదోషమున పెరిగెను అలజడి
తప్పుఒప్పులు తెలియవు నేడు
ఏదిశ్రేయమో, అదే తెలుపుము నాకు
నీశిష్యుడనై శరణు వేడితిని
కరుణతో, కృపతో ననుశాసింపుము కృష్ణా! 2-7

ప్రేయోమార్గం, శ్రేయోమార్గమని రెండుమార్గాలు కలవు. మొదటిది ప్రియమైన మార్గం, అందరూ యిష్టపడేది. కాని యిది తాత్కాలిక సుఖాన్నిచ్చినా, తదుపరి నష్టాన్నిస్తుంది. కాని, శ్రేయోమార్గం, తొలుత కష్టమైనా తదుపరిమనకు మంచిచేస్తుంది. యిక్కడ గమనించవలసినది, తను అలజడిలో వున్నాకూడా, అర్జునుడు శ్రేయమే కోరాడు కాని, ప్రియం కోరలేదు.

మండుచున్నవి, నాయింద్రియములు
క్షోభతోభగభగ గుండె మండెను
శత్రువులేనిసామ్రాజ్యమేలినను,
యింద్రునిలాగస్వర్గమేలినను
నాయీ దుఃఖము తొలగదు నేడు
తెలుపుము నాకు శ్రేయమేదియో. 2-8

అర్జునుడు యుద్ధ వీరునిగా కృష్ణునికిచ్చిన ఒకే ఒక ఆజ్ఞ.[1-21] తదుపరి వీరుని నుంచి శిష్యుడై తను సందిగ్ధతలో వుండి మార్గదర్శనమునకై ప్రాధేయపడును[2-7]. చివరికి ఆత్మసమర్పణతో అన్ని సంశయములు తీరెనని తన కర్తవ్యాన్ని ఆదేశింపమని వేడును.[18-73]. అర్జునునిలో వచ్చే యీ పరిణామం ప్రతి వ్యక్తిలోను

రావలసిన ('అహం దేహం' అనే అహంకారం నుండి ఆత్మ సమర్పణతో 'అహం ఆత్మ' అనే) మార్పు.

సంజయుడిటులనెను:

శత్రువులను భయమున తపింపజేయగల శక్తిమంతుడైన గుడాకేశుడు యీ విధముగా యుద్ధము చేయనని ఋషీకేశునితో చెప్పి మౌనమున మిన్నకుండెను. 2-9

(మౌనంలోనే అంతర్వాణి వినపడుతుంది. ఇదే ఆత్మవాణి. యుక్తాయుక్త విచక్షణావాణి. ఇదే దైవవాణి, శ్రీకృష్ణ వాణి. మన మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడే ఎదుటివారు చెప్పేదానిలో బాగోగులు గ్రహించ గలుగుతాము. దీనినే శ్రద్ధగా ఆలకించటం అంటారు).

ఓ ధృతరాష్ట్రమహారాజా! ఇరుసేనల మధ్యన దైన్యముగా విలపించు చున్న అర్జునుని జూచి ఋషీకేశుడు చిరునవ్వుతో ఇట్లనెను. 2-10

భగవానుడు చెప్పెను:

శోకింపతగనివారిగూర్చి శోకమెందులకు
జ్ఞానులెవ్వరును బాధపడరు కద
జననమరణములు అతి సహజములవి
వాదించెదవు తెలిసినటులనే
తెలియదు నీకీ సృష్టి రహస్యము
తెలిపెద నిది యిపుడు నీకు 2-11

అర్జునుడు వాదించినంతవరకూ మిన్నకుండిన భగవానుడు, తను శిష్యుడనని శ్రేయమేదియో తెలుపమని ప్రార్థించి మిన్నకున్న తరుణంలోనే భగవత్ వాణి మొదలవుతుంది. ప్రప్రథమంగా మొదట చెప్పినది అత్యవసర ఆపత్కాలిక జ్ఞానం.

దీనినే క్రైసిస్ ఇంటర్వెన్షన్ (Crisis Intervention) అంటారు. దీనితోనే మొదలయినది శ్రీకృష్ణవాణి.

ఒకపరిలేక యిప్పుడుంటిమని
బాధపడెదవు రేపు వుండమని
పుట్టియు, యెదిగియు, తరిగి వెళ్లునది
నిత్యంమారే దేహపు తీరని 2-12

బాల్యం, యవ్వనం,
కౌమారం, వార్ధక్యం
పాంచభౌతిక దేహపు తీరని
నిత్యం మారే దేహము అనిత్యం
కంటికగుపడని ఆత్మే నిత్యం
పుట్టినవానికి తప్పదు చావు
తప్పనిదానికిచింత దేనికని? 2-13

వస్తువిషయముల కలయిక ద్వంద్వం
కష్టసుఖాలకుయిదే బీజము
కష్టసుఖములుకదలు మేఘములు
సుఖదుఃఖముల మేళన జీవన మార్గం
సమభావనమే జీవన శాంతి
ప్రశాంత జీవనమునకు ఇదియే దారి. 2-14

ఓ పురుషశ్రేష్టుడా! యింద్రియ విషయ శబ్దాదులందు చలింపక, శీతోష్ణ, సుఖదుఃఖాదులైన ద్వంద్వములందు సమభావముతో నుండువాడు మోక్షానికి అర్హుడగును. 2-15

ఉండి నశించే దేహమునకు వునికిలేదు
కనపడని, సత్యమైన ఆత్మకు లేమిలేదు
తత్వజ్ఞానులకు తెలుసు యీరెంటి నిజము 2-16

అన్నిటనిండిన ఆత్మకు అంతులేదు,
అవ్యయమైన ఆత్మకు నాశనము లేదు 2-17

దేహమశాశ్వతము, దేహి నిత్యము
దేహినాశరహితుడు, అనంతుడు,
దేహి నిత్యుడు, శాశ్వతుండు.
కావున అర్జునా, యుద్ధము చేయుము
లెమ్ము, దైన్యము వీడుము 2-18

చంపువానిగా, చంపబడువానిగ
ఆత్మ తెలుసని ఎవరు అందురో
తెలియదు వారికి ఆత్మ రహస్యం
ఆత్మ చావదని, ఆత్మ చంపదని
సత్యనిత్య, అనాది ఆత్మయని
జనన, మరణములు లేవుదానికని
తెలిసినవాడే అసలు జ్ఞాని యని
తెలియుము పార్థా వివరించెద నీకు. 2-19,20,21

చిరిగినవస్త్రము వదిలినవాడు -
నూతనవస్త్రమునేరీతి ధరించునో,
చెదరినదేహము వదలిన జీవుడు (ఆత్మ)
నూతనదేహము నాశ్రయించును. 2-22

ఆత్మను శస్త్రము చంపలేదు,
అగ్ని కాల్చలేదు
నీరు తడుపలేదు,
గాలి యెండబెట్ట లేదు 2-23

యీ ఆత్మ చంపబడదు, కాల్చబడదు
ఇతడు నిత్యుడు, సర్వవ్యాపి
స్థిరుడు, నిశ్చలుడు, పురాతనుడు. 2-24

ఆత్మ అగోచరం నేత్రములకు
చింతింప నలవికానిది మనసుకు,
మార్పులేని నిత్యుడతడు
యీ సత్యమెరిగిన దుఃఖము పారిపోవు. 2-25

విశ్వంలో పురుషుడు ఒక్కడే. అదే యీశ్వరుడు, పరమాత్మ, ఆత్మ. తదితరులు స్త్రీలే. అందువల్ల ఆత్మను సంబోధించటంలో పురుషవాచకం వాడబడింది.

ఒకపరి ఆత్మకు జనన మరణములున్నవని తలచిననూ
తప్పని దానికి శోకము తగదు 2-26

పుట్టిన వానికి తప్పదు చావని
చచ్చినవానికి మరుజన్మ తప్పదనిన
దుఃఖమెందులకు తప్పని దానికి? 2-27

ఆద్యంతముల కనపడక,
మధ్యలోనే కనపడు దేహమునకై. 2-28

చూచునొకడు చమత్కారముగ
చెప్పునొకడు అత్యద్భుతమని
వినును ఒకడు విచిత్రమని
కని, విని, చెప్పిన వారెవరును
తెలియరు యీ ఆత్మస్వరూపము,
అసలు స్వరూపము. 2-29

దేహి నిత్యముగాని దేహములు కావు
నిత్యమైన యీ ఆత్మ చంపబడదు
శోకమెందుకు అర్జునా శోకింపదగదు. 2-30

ఓ అర్జునా!
స్వధర్మము నీ క్షత్రియ ధర్మము
ధర్మ రక్షణే నీ కర్తవ్యము
క్షత్రియునకు ధర్మరక్షణ యుద్ధము కన్న
మేలగు కార్యము వేరొకటి లేదు. 2-31.

క్షత్రియ ధర్మం రాజ్య, ప్రజా సంరక్షణ. సామ, దాన, భేద, దండోపాయాలతో రాజ్య సంరక్షణ క్షత్రియ కర్తవ్యం.

యాదృచ్ఛికముగా లభించినదియూ, తెరువబడిన స్వర్గద్వారముల వంటిదియూ అయిన యీ యుద్ధములో భాగస్వాములైన క్షత్రియులు వారి స్వధర్మమైన క్షత్రియధర్మాన్ని నిర్వర్తించి సుఖింతురు. 2-32.

యింకను, నీవు స్వధర్మము మరచి
చేయవేని యీ ధర్మయుద్ధమును
పాపమున, అపకీర్తి, పొందెదవు. 2-33.

జనమెల్లరు నీ యీ అపకీర్తిని
కథలుకథలుగా చెప్పుకుందురు,
ధర్మయుద్ధమున మరణముకన్నను,
కీర్తిగల వీరునికి అపకీర్తి కడు బాధాకరము. 2-34

మును నిను పొగడిన మహారథులునూ
యుద్ధమున పారిన పిరికివాడివని
నిను హేళన చేతురు చులకనగా. 2-35

అంతేకాదు, నీ శత్రువులే నీవసమర్థుడవని
కించపరచి దుర్భాషలాడుదురు,
ఇంతకు మించిన వేరొక దుఃఖము
వుండదు కదా వేరొకటి నీకు. 2-36

ధర్మ యుద్ధమున చంపబడిననూ
వీరస్వర్గమును పొందెద వీవు
ఒకపరి నీవు విజయమొందిన,
అనుభవించెదవు రాజ్యభోగములు
యే విధి చూచిన మేలగు నీకది
యుద్ధము మానుటకన్నను చేయుట నీకు
లెమ్ము అర్జునా! లేలెమ్ము అర్జునా
సంసిద్ధుడవు కమ్ము యుద్ధమునకై 2-37

శీతోష్ణములు, సుఖదుఃఖములు,
లాభనష్టములు, గెలుపుఓటములు
సమతుల్యతను మనమున నిలిపి
సంసిద్ధుడవై యుద్ధము చేయుము
ఈవిధి చేసిన వీడును నీకు
పాపపు చెరన కలుగు దుఃఖము. 2-38

అవసరమైన యుద్ధం చేసి ధర్మ పరిరక్షణ చేయుట క్షత్రియ ధర్మమైననూ, ఆ యుద్ధము, సరైన భావనతోనే చేయవలెనని దీనిభావం. యిది, ప్రతీకార వాంఛతో, లేక, క్రోధంతో, తన బలాన్ని నిరూపించుకొరకో చేయరాదని భావం. కేవలం ధర్మ సంరక్షణార్ధమే యీ తప్పని సరైన యుద్ధాన్ని చేయవలెనని దీని భావం. తొలుత ప్రతీకార వాంఛతో యుద్ధానికి వచ్చిన అర్జునుడు ధర్మ సంరక్షణార్ధం యుద్ధం చేయునటుల సంస్కరింపబడటం గమనార్హం.

ఇంతవరకు నే చెప్పితి నీకు
సాంఖ్యాశాస్త్రపు ఆత్మవివరములు
తెలిపెద నిపుడు, ఎయ్యది తెలిసిన
కర్మబంధ విముక్తుడవు అవుదువో
ఆ యోగ శాస్త్ర కర్మయోగము తెలిపెద
వినుము శ్రద్ధగ నుడివెద నిపుడు. 2-39

ఇంతవరకు కృష్ణుడు తన సందేశంలో అందించినది అత్యయిక పరిస్థితిలో చేయవలసిన ఆపన్నరక్షణ కార్యక్రమం. (Crisis Intervention) ఇపుడు అత్యయిక స్థితిలో నున్న పార్థుడిని సామాన్య స్థితికి తీసుకురావటం ఇంతవరకు చెప్పిన సందేశపు లక్ష్యం. ఇక ముందు జరగబోయేది సాధారణ స్థితినుండి ధైర్యముగా, ధీరుడిగా చేయవలసిన పనిని చేయగల దశకు తీసుకు వెళ్లడం, (జీవన సంగ్రామంలో విధినిర్వహణకు) సన్నద్ధుడిని చేయటం.

ఇంతవరకు విహంగవీక్షణం, ఆత్మిక దర్శనంతో దివినుండి భువిని చూపెడుతూ దానిలో మన పాత్రను స్థూలంగా చూపెట్టిన భగవానుడు దివినుండి దిగివచ్చి మనం చేయవలసిన కర్తవ్య కర్మలను గురించి సవివరంగా, అతి దగ్గరగా (Zooming in) వివరించబోతున్నాడు.

నిష్ఫలము కాదు చేసిన కర్మము
మధ్యన వివిధ అవాంతరముల ఆగిననూ
అభయ మొసంగి రక్షణ చేయును 2-40

ధృఢనిశ్చయమే ఏకాగ్రతకు మూలము,
నిశ్చయమే లేని మనుజుల
మనసు పరుగిడును పరి పరి విధముల పలువైపుల. 2-41.

చేసిన కర్మ నిష్ఫలముకాదెన్నడు. కార్యకారణ సిద్ధాంతపరంగా ప్రతి ఆలోచనకూ, ప్రతి మాటకూ, ప్రతి కార్యానికీ ప్రతి స్పందన లేకుండా వుండదని, నిర్వివాదాంశంగా వుంటుందని దీని భావన. సద్భావన, సత్కార్యం, సత్ఫలితాలకూ, దుర్భావనా, దుష్కార్యాలకు దుష్ఫలితాలు మనం గ్రహించినా, గ్రహించకపోయినా తప్పక వుంటాయనేది దీనిద్వారా అర్ధంచేసుకొనవలెను.

ఓ పార్థా! అవివేకులు, శుష్కవాదులకు
స్వర్గ సుఖాభిలాషులు, విషయ వాంఛాపరులకు,
అల్పజ్ఞులూ, భోగైశ్వర్య ప్రియులు, దృశ్యవ్యామోహితులకు
ఏకాగ్రత కలుగదు దైవచింతనకు 2-42,43,44

వేదము కర్మకాండమున తెలిపిన
త్రిగుణాత్మక విషయ వివరములు వదలి,
ఆశ్రయింపుము శుద్ధ సత్వమును,
నీ యోగక్షేమములు నాకే వదలి
అంతర్ముఖుడవై, ఆత్మజ్ఞానివి కమ్ము. 2-45

నదినీరు వాడెడివానికి, బావినీరు కూడ ఎంత ముఖ్యమో
అదేరీతి, ప్రాముఖ్యత బ్రహ్మజ్ఞాను లిత్తురు కర్మకాండకు
సర్వవేద కర్మకాండ ఫలితమేదియో అదే ఫలము చేకూరును
పరమార్థ తత్వమెరిగిన బ్రహ్మజ్ఞానికిని
అందువలన అర్జునా ఆత్మ జ్ఞానివి కమ్ము నీవు. 2-46

స్వల్పమైన బావి నీరు

మహత్తర నదీప్రవాహపు నీరును

ఉపయుక్తమగునో ఒక్కరీతిగ

సమస్త కర్మమున ఎంత ఫలమున్నదో

అంతే ఫలము పరమాత్మ తత్వమెరిగిన

బ్రహ్మనిష్ఠునకు కలుగు బ్రహ్మానందమున. **2-46.2**

కర్మలకే నీకధికారము - కర్మఫలములకు కాదు,

ప్రతిఫలము ఆశించి - చేయకు కర్మలు,

అలాగని మానకుము కర్మల చేయుట. 2-47

ఈ శ్లోకం కర్మయోగానికి నిర్వచనం. ఎక్కువమంది, పలుమార్లు ఈ శ్లోకాన్ని ఉటంకించినందువల్ల యిది జనప్రాచుర్యం పొందింది.

ఓ ధనుంజయా!

తదేక నిష్ఠన, విషయ త్యాగమున

గెలుపు ఓటములు, లాభనష్టములు

సమముగ నెంచి, కర్మల చేయుము.

సమత్వ బుద్ధియే యోగమనబడును

సమత్వం యోగముచ్యతే 2-48

యోగమునకు వున్న మొదటి నిర్వచనం 'చిత్తవృత్తి నిరోధము', మనసును స్థిరముగా ఉంచుట అని పతంజలి మహర్షి చెప్పెను. సమత్వమే యోగము అనునది ఇంకొక నిర్వచనం. [2-48] సంగమం, అనుసంధానం, ఐక్యత, కలిపేది అని యోగమునకు పలు అర్థములు కూడా ఉన్నవి.

ఓ ధనుంజయా! కామ్య కర్మ కన్న,
నిష్కామ కర్మ ఉత్తమము.
కనుక ఆశ్రయింపుము.
సమత్వరూప నిష్కామకర్మమును.
ప్రతిఫలాపేక్ష కర్మలు అల్పులు సుమా. 2-49

చిత్తశుద్ధిన సమభావమున, యోగమున
చేయు కర్మలు, పాపపుణ్యముల కతీతమై
కర్మ నైపుణ్యతకు దోహదమౌను సదా,
కనుక కర్మ నైపుణ్యమే యోగమనబడు. 2-50

పాప, పుణ్యములు రెండూ కర్మల మూటలు, (గుణములు, సంస్కారములు) అవి వాసనలై జనన, మరణ, పునర్జన్మల పరిభ్రమణ సంసార చక్రంలో బంధాలకు కారకములు అవుతున్నాయి. పైన చెప్పినట్లు నిష్కామకర్మము వలన ఈ పాపపుణ్యములు రెండునూ దగ్ధమై, హృదయము స్వచ్ఛమై, (చిత్తశుద్ధి) కర్మపు మూటల భారము తగ్గి, జ్ఞానయోగ్యతను కలిగించును. కర్మనైపుణ్యానికి, కర్మ సఫలతకు, కర్మ పరిపూర్ణతకు, పరిపక్వానికి నిష్కామకర్మము దోహదకారి. ఇది ఆధ్యాత్మిక జీవినదృక్పథంలోనే కాకుండా భౌతిక, లౌకిక పరంగా కూడా ప్రయోజనకారి.

నిష్కామ కర్మయోగులు, సమత్వ బుద్ధితో, ఫలాపేక్షరహితముగ కర్మలను ఆచరించి దుఃఖరహితమగు మోక్షమును పొందుదురు. 2-51

కర్మయోగమున కలిగిన అజ్ఞానమలిన విమోచనము తదుపరి కలిగిన చిత్తశుద్ధితో, యింద్రియ విషయ విరక్తి కలుగును. తద్వారా విన్న, వినబోవు వాటిపట్ల విషయాసక్తి తగ్గుతుంది. 2-52.

నానావిధశ్రవణములతో (శబ్దకాలుష్యమున) విచలితమైన మనసును పరమాత్మ ధ్యానమున స్థిరముగా నుంచినపుడు, ఆత్మసాక్షాత్కారమునకు అర్హుడవగుదువు. 2-53

మనది కర్మ జన్మ. ఆలోచనా, భావనా, కర్మ శేషం మన ఈ జన్మ. ఈ ఆలోచనా, భావనా, కర్మ శేషమే మన ప్రారబ్ధమై యీ జన్మకు వాసనా, సంస్కారమై మన జీవితాలను నడిపిస్తుంది. పలు జన్మల వాసనా సంస్కారములే తదుపరి మన వారసత్వ జన్యువులవుట కూడ అసాధ్యం కాకూడదు. భవిష్యత్తులో యిది నిర్ధారించబడినా ఆశ్చర్యం లేదు.

ఈ జన్మలో మన దశ, దిశలను నిర్దేశించేవి నాలుగు విషయాలు. 1. పూర్వ జన్మ ఆలోచనా, భావనా, కర్మ శేషం (కర్మ సశేషం), 2. జన్యువులు 3. ఈ జన్మ శ్రమ, తితీక్ష 4. జీవుడు పెరిగే పరిసరాలు.

అర్జునుడు మరి కొన్ని ప్రశ్నలు వేసెను:

(3వ ప్రశ్న : స్థితప్రజ్ఞుని లక్షణములేవి?)

ఓ కేశవా! సమాధి యందున్న స్థితప్రజ్ఞుని
లక్షణములేవి? అతడెట్లు మాట్లాడును?
ఏ రీతిన వుండును? ఎలాసంచరించునో
తెలియజేయ గోరెద నేను 2-54

ఇది అర్జునుని మూడవ ప్రశ్న. స్థితప్రజ్ఞుడి లక్షణాలు: త్రిగుణాతీతుడు, శ్రేష్టమైన యోగి, జ్ఞాని, వీరందరి లక్షణాలను తరచి చూడగా, వేరువేరు అధ్యాయాలలో చెప్పినది వేరుకాదని నిర్ణయానికి రాగలుగుతాము. అంటే ప్రయాణం ఏ దారిలో మొదలుపెట్టినప్పటికీ దాని పరిపక్వతలో అది ఒకే ముఖ్య మార్గానికి దారి చూపును. కనుక ఏ ఒక్క మార్గాన్ని అయినా అర్థం చేసుకుంటే అన్ని దారులను అర్థం చేసుకున్నట్లే అవుతుంది. ఎలాగంటే సముద్రజలంలో ఏ

చారెడు నీటిని చూసినా వాటి ధర్మాలు ఒక్కటే. కర్మ, భక్తి, జ్ఞాన మార్గముల ఏకైక గమ్యము పరమాత్మయే కావున పరమాత్మ లక్షణములు ఈ మార్గములందు ఆపాదించబడినవి. అందులో ఏమార్గమున శోధించినను అవే లక్షణములు గోచరించును. వేరువేరు అధ్యాయములలో నిర్వచించిన స్థితప్రజ్ఞుని (అధ్యా - 2) లక్షణములు, అనన్య భక్తుని లక్షణములు, త్రిగుణాతీతుని లక్షణములు (అధ్యా - 14) ఒకటిగానే ఉన్నవి.

భగవానుడు చెప్పెను:

ఓఅర్జునా!
మనుజుడెవ్వడు సమస్త కోర్కెలు వదలి
చిత్తమునాత్మయందు నిలిపి
ఆ నిర్మల చిత్తమున నిరంతరము
తృప్తిగ, సంతోషముగ నుండునో
ఆతనినందురు స్థితప్రజ్ఞుడని 2-55

దుఃఖమున కృంగక, సుఖమున పొంగక,
రాగ, భయ, క్రోధములు వీడిన వాడే ఆత్మరతుడు
ఆతని అందురు స్థితప్రజ్ఞుడని 2-56

ఎవడు సమస్త మనో యింద్రియ విషయ భోగ విరక్తుడు
ప్రియ, అప్రియముల నిశ్చల జ్ఞాన స్థిరచిత్తుడో
ఆతని అందురు స్థితప్రజ్ఞుడని 2-57

క్లుప్తంగా నిర్మలంగా, నిలకడగా, నిశ్చలంగా, సమంగా, తృప్తిగా, సంతుష్టిగా, ఆత్మ రతిలో, ఆత్మవిశ్వాసంతో, ఆత్మసంతృప్తితో, ఆత్మానందంలో వుండువాడు స్థిత ప్రజ్ఞుడు.

కూర్మము తన అవయవములు
లోనికి ముడుచు నటుల

యోగి మరల్చును తన యింద్రియములను
విషయముల నుండి, స్థిర మదిన నుండు
ఆతని అందురు స్థితప్రజ్ఞుడని. 2-58

శబ్దాది విషయముల స్వీకరించని యెడ
తగ్గును కాని, పోవు విషయ వాసనలు,
ఆత్మానుభవమున తొలగును
విషయ వాసనలు సైతము. 2-59

ఓ కౌంతేయా!
అతి శక్తివంతం యింద్రియ వాసనలు,
మోక్షకాములైన విద్వాంసులను కూడా
ఆకర్షించు తమవైపు అతి బలవంతమున. 2-60

పశ్యతీతి పశువు. బాహ్యదృష్టిగలది పశువు. బాహ్య విచారణ మన పూర్వీకులైన పశువుల సంస్కారం, యింకామనలోనే యిమిడివున్న పాత సంస్కారాల మూటది. దానిని క్రమేణా తగ్గించి మనసును లోలోపలికి మళ్లించి, ఆత్మవైపు త్రిప్పి మానవునిగా జీవించడం మన మానవ ధర్మం. విషయవాసనలు విషం. విషయం విషం సుమా.

యింద్రియనిగ్రహము, మనోస్థిరత్వములతో
(అనన్య చింతనము) నాయందే మనసు నిలిపిన
వాని జ్ఞానము బహుస్థిరం. 2-61.

శబ్దాదివిషయ చింతనన విషయాసక్తి
విషయాసక్తిన ఎదుగును రాగము
రాగమున ఉదయించు క్రోధము 2-62

క్రోధమున నశించు వివేకము
అవివేకమున కలుగు మరపు
మరపుతో పోవు యుక్తాయుక్త విచక్షణ

విచక్షణ పోయిన బుద్ధినాశనము
బుద్ధి నశించిన కలుగు మానవ అధోగతి. 2-62, 63

**శబ్దాది విషయచింతన ⇒ విషయాసక్తి ⇒ రాగము ⇒
క్రోధము ⇒ అవివేకము ⇒ మరపు ⇒
⇒ యుక్తాయుక్త విచక్షణ కోల్పోవుట ⇒ బుద్ధి నాశనము ⇒
మానవ అధోగతి.**

అరిషడ్వర్గములలో ఒక్క కామము విషయాసక్తిగా ప్రత్యక్షమై, క్రోధమై, ఏ విధిన అధోగతికి తీసుకు వెళ్తుందో పై శ్లోకాలలో వివరించబడినది. మన మరపులో క్రోధము ఎదుగుతుంది. అదే విధిన ఎరుకలో కోపము, మిగతా అన్ని అరిషడ్వర్గములు మెల్లగా నశించుతాయి. దీనినే సాక్షీభూతము (witnessing) అంటారు.

మనోనిగ్రహుడు యింద్రియ యుక్తమైన అన్నపానాదుల విషయములను అనుభవించువాడైననూ, మనోనిర్మలతతో శాంతిని పొందుచున్నాడు. 2-64

నిర్మల మనమున కలుగును సమస్త దుఃఖ నివృత్తి,
నిర్మలమున కలుగును మనోస్థిరత్వము. 2-65

మనో స్థిరత్వమున గల్గు ఆత్మ దర్శనము
మనోవికలతన దరికి రాదు ఆత్మజ్ఞానము
వికలతన రాదు సమాధి, యోగము
ఆత్మచింతనము, యోగము లేక శాంతియే లేదు
శాంతి లేని జీవనం, దుఃఖం, దుర్భరం. 2-66

యింద్రియ విషయలోలతన మునిగిన మనసు
సుడిగాలిన చిక్కిన నావ చందమున
లాగబడు యింద్రియ విషయముల చెంతకు 2-67

ఓ మహాబాహో!

కావున మనసును యింద్రియముల విషయముల చెంతకు పోనీయక ఎవరు నిగ్రహించుదురో, అట్టి వానికే స్థిరమైనజ్ఞానం లభించును. 2-68

విషయారాధకుల పగలు -
యింద్రియ నిగ్రహమున్న మోక్షకాములకు రాత్రి
విషయారాధకుల రాత్రి - యోగులకు పగలు
విషయార్థులు నిదురింతురు ఆత్మన-
ఆత్మశోధకులు నిదురింతురు విషయచింతల. 2-69

విషయారాధకులు, మోక్షకాముల మార్గం, గమ్యం, ప్రవర్తన, ఆచరణ ఒకరికొకరికి పరస్పర వ్యతిరేకముగా వుండుట అతి సహజం. ఆత్మతృప్తులు నిదురించు నపుడు, బాహ్యారాధకులు రాత్రంతా క్లబ్బులు, పానశాలల్లో తిరగటం చూస్తూనే వుంటాం. అలాగే ఆత్మతృప్తులు వుదయాన్నే లేచి పనులు చేయువేళ విషయారాధకులు రాత్రంతా తిరిగి తిరిగి అలసి ప్రొద్దున్నే గాఢ నిద్రలో వుండటం పరిపాటి. ఇందులోది ఏవిధంగా చూచినా పరస్పర వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కనపడుతుంది.

నదీ జలములన్నియు
సాగరుని చేరి శాంతి పొందు రీతి
యింద్రియ భోగ్య విషయములు
ఆత్మనిష్టుని చేరినంతనే
పొందును శాంతి. 2-70

వృత్తంలో గమ్యం, మొదలు ఒకే చోట వుండును. దైవంనుండి మొదలైన మన ప్రయాణం లీనమవటంలో సమాప్తి చెందుతుంది, నదీజలాలన్నీ సాగరంలో కలవటంలా. యీనీరు మధ్యలో ఎన్నివిభిన్న మార్గాలలోకి మళ్ళింపబడినా తుట్టతుదకు సాగరంలో కలవవలసిందే. అదే దాని పుట్టినిల్లుకనుక, అదేదాని గమ్యంకూడా.

ఓ పార్థా,

కొర్కెలన్నిటిని నిగ్రహించి, శబ్దాది విషయముల త్యజించి
విషయానురాగము వదలి, అహంకార మమకారములు
విడచినట్టివాడు పొందునెపుడు పరమశాంతి-
యిట్టి శాంతితో బ్రహ్మమును చేరిన
వానికి కలుగదు మోహమిక. 2-71

నిరంతరము, అంత్యకాలమున ఈ స్థితి నున్న
సాధకుడు పొందును బ్రహ్మానంద స్వరూప మోక్షము. 2-72

ఈ సాంఖ్య యోగములో అర్జునుడు యుద్ధనిరాకరణ సమర్ధనా వాదాన్ని కొనసాగించి, తదుపరి సందిగ్ధావస్థలో శరణార్థుడైన శిష్యుడిగా, తనకు శ్రేయమేదియో తెలుపమని వేడెను.

నిష్కామకర్మ నిర్వచనం తదుపరి ఆత్మ వివరణ, స్థితప్రజ్ఞ లక్షణ వివరణ జరిగెను. అరిషడ్వర్గముల వశమైనచో, అధోగతి పొందు క్రమ వివరణ, శాంతిని పొందు మార్గ వివరణము జరిగెను.



3

మూడవ అధ్యాయము

కర్మ యోగము

కురుక్షేత్రములో విషాదమున అర్జునుడు తాను యుద్ధము చేయజాలనని అన్న తరుణమున భగవానుడు రెండవ అధ్యాయమైన సాంఖ్యయోగములో ఆ అత్యయిక పరిస్థితిని ఎదుర్కొనుటకు అవసరమైన అత్యవసర చికిత్సయైన ఆత్మజ్ఞానమును బోధించెను. ఇందులో ఆత్మ నిత్యమని, చావులేనిదని, చంపబడదని, ఈ ఆత్మయే మన నిజస్వరూపమని, దేహము కాదని, దేహము అశాశ్వతమని, కనుక దేహము గురించి దిగులు పడదగదని బోధించి, క్షత్రియ ధర్మము , కర్మయోగం గురించి   వివరాలను పరిచయం చేశాడు. తదుపరి స్థితప్రజ్ఞుని లక్షణాలను వివరించాడు. ప్రస్తుత అధ్యాయంలో నిష్కామకర్మ యోగాన్ని గురించి సవివరంగా తెలియజేయును.

అర్జునుడు ఇలా అడిగెను: (4వ ప్రశ్న)

కర్మకంటే జ్ఞానమే మేలని చెప్పితివి
అయినను నను యా ఘోరమైన

విధ్వంసకర యుద్ధము చేయుమని
నన్నేల పురికొల్పెదవు కేశవా! 3-1

సందిగ్ధపు మాటలు మాని
నిక్కముగ రెండిటిలో నాకేది శ్రేయమో
ఆ మార్గాన్నే నాకు నిర్దేశించుము దయతో. 3-2

అర్జునుని 4వ ప్రశ్న – జ్ఞాన కర్మలలో ఏది మేలు? నిక్కముగ ఈ రెండిటిలో తనకేది శ్రేయమో ఆ మార్గాన్నే తనకు నిర్దేశించుమని అడిగెను.

భగవానుడిలా అన్నాడు:

లోకములో కలవు రెండు మార్గములు
జ్ఞానులకు సాంఖ్యము
కర్మయోగులకు నిష్కామ కర్మము. 3-3

మానిన మాత్రాన కర్మలు మాసిపోవు
మానసిక కర్మకూడ అగును కర్మఫలము
మాని మనసున రగులుటకన్నను
కర్మలు చేయుట మేలగు
మానినంతన కలుగదు జ్ఞానోదయం. 3-4

కర్మ జన్మం మనది,
కర్మం చేయక వుండలేము ఒక క్షణం కూడా!
సహజ ప్రకృతి గుణదోషాన
చేయుచుందుము కర్మలు యాంత్రికంగా 3-5

మానిన కర్మలు మనసులోనె రగిలి ఎదుగును
కర్మేంద్రియాలను అణిచి
బయట మాని, లోలోపల రగిలే వాడిని
వంచకు డందురు లోకులు. 3-6

త్రాగుట మానిన తదుపరి
నిత్యం మద్య చింతనలో నుండువానిని
అందురు కదా తాగని త్రాగుబోతని (dry drunk) 3-6(2)

ఇంద్రియ నిగ్రహముతో
కర్మఫలాపేక్ష లేక
కర్మలు మనోబలాన
ఆచరించువాడే ఉత్తముడు. 3-7

తప్పవు ఎవరికి కర్తవ్య కర్మలు
చేయక మనసున రగిలే కర్మల కంటే
కర్మలాచరించటమే మేలు మనకు
కర్మలు చేయక శరీరసౌష్టవం కూడా దుర్లభం 3-8

నలుగురి మేలు ఎంచి చేసిన కర్మలగును యజ్ఞ సమములు
బంధకారకములు తదితర కర్మలు
చేయుము నీవు నిష్కామ కర్మలను
భగవత్ ప్రీతితో, ప్రతిఫలము కోరక 3-9

ప్రజలతో బాటు సృష్టించె యాగములను
కోరిక తీర్చే కామధేనువీ యజ్ఞమనియె ప్రజాపతి
ఆచరించి అభివృద్ధి చెందుమనుచు దీవించెను
తీరుగాక మన కోరికలనుచు దీవించె ప్రజాపతి. 3-10

నిస్వార్థ కర్మలు, ప్రజోపకర కర్మలు,
ప్రకృతిక్షేమకర కర్మలు పరస్పర శ్రేయం,
దేవతా ప్రియం, సమృద్ధి ఫలములనిచ్చునవి. 3-11

నిష్కామ యజ్ఞముగా చేసిన కర్మల వలన
ముదము నొందినదేవతలు యిచ్చిన భోగములు
పరులకు పంచక తానే తినెడు స్వార్థం చౌర్యం. 3-12

యజ్ఞఫలాన్ని సమిష్టితో పంచిన
శేషాన్నమును దైవ ప్రసాదముగ
భుజించువాడు సజ్జనుండు
అలా పంచక తినెడు ఆహారం
పాపమై హాని సల్పును ఆ స్వార్థపరునకు. 3-13

ప్రకృతి లోని ప్రతి వస్తువు, జీవి సహజంగానే నిష్కామ కర్మ చేయుచునే వుండును. ఏరీతిగా యీనిష్కామకర్మలను ఆచరించవలెను? యీప్రశ్నకు సమాధానం ప్రకృతి ఆచరణనుండి వస్తుంది. ఏరకంగా వృక్షాలు నీడనూ, చల్లని గాలిని, ప్రాణవాయువును యిచ్చి మన కాలుష్యాన్ని (Co_2) తీసు కుంటున్నాయో, అలాగా! ఏరకంగా నదులు ప్రవహిస్తూ, మన దేహార్తిని తీరుస్తూ, భూమిని సశ్యశ్యామలం చేసి, తను మలినమవుతూ, మన కాలుష్యాలను ప్రక్షాళన గావించునో, అలాగా! సూర్య చంద్రులు తర, తమ బేధాలు లేకుండా సమతాభావనతో అందరికీ సమంగా వెలుగును ప్రసాదిస్తారో, అలాగా! గోమాతలు ఎండుగడ్డిని తిని అమృతతుల్యమైన పాలను, తన దూడకంటే ఎక్కువ మనకిచ్చి, తన వ్యర్థాలతో మన పొలాలను సారవంతం చేసి, చనిపోయిన తదుపరి సైతం మన పాదరక్షలై ఎలా ఆద్యంతం సేవ చేస్తాయో అలా! మన దేహంలోని దాదాపు 200 ట్రిలియన్ పైచిలుకు కణాలన్నీ, దేహి కార్యమే స్వకార్యమనే భావనలో పనిచేస్తున్నాయో, అలాగా! నిష్కామ కర్మాచరణ ప్రకృతి సహజ ధర్మం. నిష్కామ కర్మాచరణకు ప్రకృతే మనకు గురువు. నిష్కామ కర్మాచరణ మన స్వధర్మం.

అన్నమున ప్రాణులు - మేఘమున అన్నము
యజ్ఞము వలన (త్యాగమున) మేఘము

నిష్కామసత్కర్మ వలన యజ్ఞం
సంభవించునని తెలియుము పార్థా. 3-14

ఏకాత్మ, అక్షర పరబ్రహ్మ నుండి సద్భావము, సద్భావం నుండి వేదము సంభవించును. ఈ వేదమే సద్వచనము. సద్వచనము నుండి సత్కర్మ సంభవించును. సత్కర్మమే నిష్కామకర్మ యజ్ఞము. నిష్కామకర్మ వలన పరబ్రహ్మము లభించును. 3-15

సద్భావ (అక్షరపరబ్రహ్మ) జనితం సద్వచనం (వేదం)
సద్వచన జనితం సత్కర్మ (యజ్ఞం)
సత్కర్మ (యజ్ఞ) జనితం మేఘం
మేఘ జనితం అన్నం
అన్న జనితం ప్రాణం
ప్రాణ జనితం జీవం 3-15 (2)

జీవ మూలం ప్రాణం
ప్రాణ మూలం అన్నం
అన్న మూలం వర్షం
వర్ష మూలం మేఘం
మేఘ మూలం యజ్ఞం
యజ్ఞ మూలం వేదం
వేద మూలం అక్షర పరబ్రహ్మం 3-15 (3)

నాచే నియమిత
యీ జీవ పరబ్రహ్మ పరిభ్రమణ చక్రాన్ని మరచి
యింద్రియలోలుడై నిష్కామకర్మను
ఆచరించని మానవుడు
వ్యర్థపు పాప జీవనమున
అధోగతి పాలగును. 3-16

ఆత్మ క్రీడునకు, ఆత్మ తృప్తునకు
ఆత్మానందమయునికి
లేదు వేరొక నియమిత కార్యం
కార్యం, కర్మం, కర్తం, భోక్తం
సర్వం ఆత్మమయం పరమాత్మమయం ఆతనికి. 3-17

అట్టి జ్ఞానికి లేదు కర్తవ్య కార్యం
లేదు వేరొక ప్రయోజనం కర్మమున
లేదు దోషం చేయకుండినను
ఆతనికి లేదు స్వప్రయోజనం
అట్టి జ్ఞానికి లేదు వేరొక ప్రయోజనం
ఆశ్రయించి యే ప్రాణినైననూ. 3-18

యీ కారణమున చేయుము సతతం
ప్రతిఫలాపేక్ష లేని కర్తవ్య కర్మలను
ఈ రీతి నిష్కామకర్మలు చేయువాడు
చేరును పరంధామము మోక్షమున. 3-19

జనకుని వంటి విజ్ఞానులు మునుపట
పొందిరి మోక్షము నిష్కామకర్మమున
నిష్కామ కర్మలకే నీవు తగుదువు
ఆదర్శమవుదువు తదితరులకు. 3-20

శ్రేష్ఠులు, సుజనులు, మంచివారలు
యే రీతిన కర్మము ఆచరింతురో
అదే ప్రమాణము సామాన్యులందరికి 3-21

శాస్త్రములు మనకు మొదటి ప్రమాణమైతే - శ్రేష్ఠుల ఆచరణ మనకు రెండవ ప్రమాణము. శ్రేష్ఠుల అచరణ సామాన్యులకు మార్గదర్శకము. స్వతహాగా జ్ఞాని అయిన జనకుడు కూడా సదా నిష్కామ కర్మమునే ఆచరించెను. యితరులకు మార్గదర్శకంగా వుండుటకై యీ మూడవ ప్రమాణము ఆత్మ ప్రమాణము.

పార్థా!
ముల్లోకములందు లేదు
విధిగా చేయవలసిన కార్యము నాకు
పొందవలసినది, పొందదగినది
లేకయు కూడా చేయుదు నేను
నిత్యము కర్మల ఎడతెగక ఎల్లప్పుడు. 3-22

యేలనన పార్థా!
నేనే కర్మల చేయకుండిన
మానవులందరు అనుసరింతురు
అదే మార్గమును - పనులు మానెదరు
సోమరులై చెడెదరు వారు. 3-23

నేను కర్మలు చేయకమానిన
నను ఆదర్శముగా తీసుకొని
ప్రజలు కూడ మానెదరు కర్మలు
వారి భ్రష్టతకు నే కారణమవుదును. 3-24

ఫలాపేక్షతో చేసిన కర్మల
బందీ లవుదురు మూర్ఖజనులు
అందున జ్ఞాని చేయవలె
నిష్కామకర్మము జాతి మేలుకై. 3-25

ఫలాపేక్షతో మసలు మూర్ఖులకు

కదిపి బోధించరు విజ్ఞులు
తాము నిర్మలముగ చేయు కర్మలే
ప్రేరణయై తెచ్చును మార్పు వీరిలో 3-26

త్రిగుణాత్మక జన్మాంతర ప్రారబ్ధకర్మబంధము
సంస్కార వాసనలై, చేయించు కర్మలను
అహంకారమున తామే కర్తలమని యెంచి
కర్మఫల బాధలు, దుఃఖములనుభవింతురు. 3-27

ఆత్మానాత్మ వివేకి యెరుగును
గుణ, కర్మముల మర్మము.
ఇంద్రియ విషయ సంపర్కమే
కర్మకారణమై చేయించు కర్మలను
ఆత్మ యెప్పుడూ సంగరహిత సాక్షి అని
ఇది యెరిగి చేసిన కర్మ అకర్మం,
యిదే నిజ నిష్కామకర్మం. 3-28

ప్రకృతి గుణముల మోహమున
కర్మసంగమున స్వలాభాపేక్షన
కర్తృత్వభావమున చరించు కర్ములను
నిరోధించరు విజ్ఞులెప్పుడు
ప్రేరణ యగును తన ఆచరణపరులకు
మాటకన్న మిన్న ప్రేరణమార్గం,
క్షేమకరం, మోహ నాశకరం. 3-29

మన మాటలకన్నా మన ఆచరణ యితరులపై ఎక్కువ ప్రభావం తీసుకొస్తుంది. అదే మన ఆచరణకున్న మూడు ప్రమాణాలు 1. యద్యదాచరతి శ్రేష్ఠ 2. శాస్త్ర ప్రమాణం 3. ఆత్మ ప్రమాణం. అందుకే అంటారు "కింకరుడు కానిదే, శంకరుడు కాలేడు" అని.

సమస్త కర్మఫలము నా కర్పించి
నీ మదిన నన్ను నిలిపి,
ఆత్మభావంతో, ఆశామమకారముల వదలి,
చిత్తశుద్ధిన నిర్భీతిగా చేయుము యుద్ధము. 3-30

కడు శ్రద్ధతో, అనసూయతన
నిష్కామకర్మ ఆచరణ సాధకులు
విముక్తులవుదురు కర్మ బంధము నుండి
ఇది నిక్కము, తెలియుము. 3-31

యెవరు నిష్కామ కర్మమును
ద్వేషమున అనుసరింపరో
తెలియుము వారు అల్పజ్ఞులని,
మూఢులని, చెడినవారలని. 3-32

లౌకిక జ్ఞానియును, జన్మాంతర సంస్కారబద్ధుడై
కర్మలనాచరించును, నిగ్రహించుట మనసున కష్టతరం
సంస్కారబద్ధముగ పుట్టిన పూర్వజన్మ కర్మములు. 3-33

యింద్రియములకు తమ విషయ సంగమున
యేర్పడి ఉన్నవి రాగద్వేషములు
శత్రువులై వేధించును అవి మనలను
లొంగకూడదు మనుజులెవ్వరు వీటికి. 3-34

విషయమనగా ప్రాపంచక ఆలోచనలు. యివి విషమై మన ఆధ్యాత్మిక పురోగతికి హాని కలిగిస్తాయి.

పూర్వజన్మ కర్మ సంస్కార బంధమొక వైపు
యీ జన్మ ఆధ్యాత్మిక సాధన మరొక వైపు
పూర్వజన్మల ఇంద్రియముల విషయ వాసనల వలన
ఎదిగిన రాగద్వేషాదులను
ఆత్మసంగమను ఖడ్గముతో ఛేదించి
మోక్షమును పొందుటే దీక్ష మనకు. **3-34(2)**

చక్కగ చేసిన పరధర్మము కన్నను,
లేమిగ చేసిన స్వధర్మమే మేలు
స్వధర్మాన కలిగిన మరణం కూడా శ్రేయమే
పరధర్మం అతి భయానకం. 3-35

స్వధర్మం ఆత్మధర్మం
అతి సహజం బహు శ్రేయం
పరధర్మం యెదురీత
హానికరం సౌఖ్యహరం. **3-35(2)**

జన్మజన్మల కర్మఫల వాసనల కలబోత యీ జన్మ
యీ వాసనల బట్టియే జన్మ గుణకర్మ
గుణకర్మలను బట్టియే చాతుర్వర్ణ విభజన
వర్ణమును బట్టియే ధర్మము
సహజ ధర్మమును వీడితే వచ్చును తంటా
వేరొకరి ధర్మము మనకు సరికాదంట
స్వధర్మమే మనకు సహజ ధర్మమౌనంట. **3-35(3)**

అర్జునుడు ఇలా అడిగాడు:

మానవుడు తన ప్రమేయం లేకుండగనే, దేనిచే ప్రేరేపించబడి పాప కర్మలను చేస్తున్నాడు కృష్ణా! 3-36

ఇది అర్జునుని 5వ ప్రశ్న

భగవానుడిలాచెప్పెను:

మితిమీరిన కోరికలకు తృష్ణే కారణం
యిది రజోగుణ జనితం
తీరని కోరికలే ద్వేషముగ మారి
చేయించును మహా పాపములను
మోక్ష మార్గమున కిదియే ప్రబల శత్రువు. 3-37

విషయము విషయాసక్తమై, కామమై
తీరక ద్వేషమై, పాప కారకమై
మోక్షగమ్య శత్రువగును.
విషయము విషము సుమా. 3-37.2

పొగచేత అగ్నియు, మాలిన్యముతో అద్దమూ,
మావి చేత శిశువు కప్పబడినటుల
కామముతో ఆత్మజ్ఞానము కప్పబడి వున్నది. 3-38

కామం అనంగానే మనకు తోచేది స్త్రీ, పురుషుల మధ్యన వుండే ఆకర్షణ. ఇక్కడ పదానికి మితిమీరిన, విశృంఖలత, పట్టుతప్పిన, అదుపు తప్పిన కోరికలు, కోరికలతో కన్నూమిన్నూతెలియని పరిస్థితి (Intense Desire, Pathological Desire). సామాన్యంగా కామము అంటే ప్రతికూలకోరిక అని అర్థం చేసుకొనవలెను. కాని కామం అనేపదాన్ని సానుకూల భావనలో కూడా వాడవచ్చు

మోక్షకామంలోలాగా. కామంలో యుక్తాయుక్త విచక్షణాజ్ఞానాన్ని కోల్పోవటం, కామం వలన ఏర్పడిన విక్షేపం వ్యక్తి విశ్వవిజ్ఞానాన్ని అందుకోటానికి ప్రతిబంధకం అవుతుంది. మనోలయం, మనోస్థిరత్వంలోనే స్ఫురణకు ఆస్కారం వుంది.

నిందింప నలవికానిదియు
అగ్నిలాగ తృప్తిచెందనిదైన
యీ నిత్య శత్రువైన కామముచే
జ్ఞానము కప్పబడి వున్నది. 3-39

యీ కామము ఇంద్రియ, మనో బుద్ధులను నివాస స్థానములుగా చేసుకొని ఆత్మజ్ఞానాన్ని కప్పివైచి, మనుజుని భ్రాంతికి గురిచేస్తున్నది. 3-40

భరత శ్రేష్టుడవైన అర్జునా! మొదట ఇంద్రియములను నిగ్రహించి పాపాత్మకమైనదియు, శాస్త్ర, అనుభవ జ్ఞానాదులను (జ్ఞాన, విజ్ఞాన) నాశనము చేయునదియునైన కామమును నిగ్రహింపుము. 3-41

దేహముకన్న యింద్రియములుమిన్న
యింద్రియములకన్న మనసుమిన్న
మనసుకన్న బుద్ధిమిన్న
బుద్ధికన్నను మిన్న ఎవరో తెలియుము
అర్జునా! అదియే ఆత్మ, పెద్దలు నుతించినది 3-42

కనుక ఓ మహాబాహో! బుద్ధికి అతీతమైన దానిగా ఆత్మనెరిగి, బుద్ధి విచక్షణతో మనసును అరికట్టి, అతి ప్రబల శత్రువైన కామమును జయింపుము.
3-43

ఆత్మను బుద్ధికి అతీతముగా గుర్తించి, ఆత్మశరణు జొచ్చి, ఆత్మతోనే ఇంద్రియ మనోబుద్ధులను లొంగదీసుకొని, శత్రువైన కామమును జయింపుము అర్జునా!
3-43

విషయకామము విషము, ఆత్మకామము మోక్షము
విషయకామము దుఃఖము, నరక ద్వారము
ఆత్మకామము ఆత్మానందకరం, పరంధామ మార్గము
ఛేదింపుము విషయకామమును, మోక్షాసక్తిన. **3-43.2**

విషయకామము బంధించు జీవిని సంసార చెరన
మోక్షకామము కలిగించు జీవన విముక్తిని
మనసు సంసారపు తాళపు చెవి
అది విషయముల వైపు తిరిగిన బంధము
ఆత్మ వైపు తిరిగిన విముక్తి
బంధ విముక్తులకు మనసే కారకం
విషయకామము నరక ద్వారము, దుఃఖము
ఆత్మకామము పరంధామ మార్గము ఆత్మానందకరం,
ఛేదింపుము విషయకామమును, మోక్షాసక్తితో. **3-43.3**

కర్మ జ్ఞానముకన్న సులభ మార్గము, జ్ఞానము కర్మకన్న శ్రీఘ్ర మార్గము. నిష్కామ కర్మ పూర్వజన్మల ప్రారబ్ధ, సంచిత కర్మలను నిర్మూలించి చిత్తశుద్ధిని ప్రసాదించును. చిత్తశుద్ధితో జ్ఞానము లభ్యమౌను.

పూర్వజన్మల ప్రారబ్ధ, సంచిత కర్మలు మన సంస్కారమై మనచే కర్మలను బలవంతముగా చేయించును. మన జన్మకు కారణం ప్రారబ్ధ, సంచిత కర్మలు కావున నిష్కామకర్మము మనకు శ్రేయస్కర సులభమార్గము.

కర్మలతో చిత్తశుద్ధితో జ్ఞానము లభించిన తదుపరి కూడా తనకై ఏ అవసరం లేకపోయిననూ, యితరులకు మార్గదర్శకతకై కర్మలాచరించుట తప్పదు. ఆచరణ రూప సత్యం, ధర్మం. మనలను ధర్మబద్ధం చేసి ధర్మనిబద్ధతతో మన విమోచనకు దారితీస్తుంది. కర్తవ్య కర్మలు ఎవరికిని తప్పవు. అన్ని ధర్మముల కన్న ఆత్మధర్మము మిన్న. ధర్మ సందిగ్ధత కలిగినపుడు సంకుచిత ధర్మం కన్న విస్తృత ధర్మం ఆచరణదాయకమై యున్నది.

ఈ అధ్యాయమున వివరించిన అంశములు

1. యీ మూడవ అధ్యాయము కర్మ యోగ వివరణ. దీనినే నిష్కామ కర్మమని, యజ్ఞమని చెప్పెను.

2. అన్నం, ప్రాణం, జీవం, నిష్కామ కర్మయజ్ఞం, వర్షం, సద్వచనం, సద్భావం, అక్షరపరబ్రహ్మ పరిభ్రమణ చక్రం.

3. శిష్టాచరణ ప్రమాణం గురించి వివరణ చోటుచేసుకొని వుంది.

4. అజ్ఞాని, జ్ఞాని లక్షణ వివరణ, రాగ ద్వేషములకతీతముగ కర్మలాచరించు ఆవశ్యకత.

5. కామ క్రోధాది అరిషడ్వర్గముల జయించు పద్ధతి వివరణ.



4

నాల్గవ అధ్యాయము

జ్ఞాన యోగము

భగవానుడిలా శలవిచ్చాడు:

శాశ్వతమైన యీ యోగాన్ని మునుపు నేను సూర్యునికి బోధించాను. సూర్యుడు తదుపరి మనువునకూ, మనువు ఇక్ష్వాకునకు బోధించారు. 4-1

అర్జునా! యీప్రకారమున రాజర్షులు యీ యోగమును (నిష్కామ కర్మయోగము) పరంపరగా తెలిసికొనిరి. కాలక్రమేణా ఈ యోగము కనుమరుగైనది. 4-2

నీవు నాకు భక్తుడవు, మిత్రుడవు కావున అతిపురాతనమైన యీ యోగమును గురించి నీకు ఇప్పుడు చెప్పితిని. అతిరహస్యము, శ్రేష్టము అయినది యీయోగం. 4-3

అర్జునుడికి ఇంకా సందేహం తీరక అడుగుతున్నాడు: (6 వ ప్రశ్న)

కృష్ణా, నీ జన్మ తదుపరిది, సూర్యజన్మ వెనుకటిది. మరి నీ సూర్యోపదేశము నేనెలా అర్థం చేసుకోగలను! 4-4

భగవానుడిలా సమాధానమిచ్చాడు:

ఓ అర్జునా!
నాకును నీకును గడచినవెన్నో జన్మలు అనాదిగా
నేనెరుగుదు వాటన్నిటిని, నీవెరుగవు యేవికూడ. 4-5

చావు పుట్టుక లేదు నాకు
నాశరహితుడను, ఈశ్వరుడను,
ప్రాణులందు నా ప్రకృతిని వశపరచి
నామాయతో మరల మరల జన్మించెద. 4-6

ధర్మమెప్పుడెప్పుడు క్షీణించునో
అధర్మము వ్యాపించునో
అప్పుడప్పుడు నన్నునేనే
సృష్టించుకొనెదను ఒక అవతారముగా. 4-7

సత్యాచరణ ధర్మం. పకృతి సిద్ధమైన విశ్వ సమతుల్యత ధర్మం. సృష్టి రీతి ధర్మం. ధర్మ అతిక్రమణ జరిగి, సమతుల్యతకుహాని జరిగినప్పుడు, దీనిని సరిచేయుటకు వచ్చే శక్తి అవతారము. అవతారుడు కారణ జన్ముడు. మనది కర్మ జన్మ.

సజ్జనుల సంరక్షణకూ
దుష్కర్ముల దునుముటకు నాశనమునకు
అనంత ధర్మరక్షణకూ
అవతరింతు నేను యుగయుగమున. 4-8

దైవం సాక్షీభూతుడు. తన కృప అందరికీ సమానం. మన పాత్రలనుబట్టి నీరు దొరకురీతిన మన మనోభావనను బట్టి తన ప్రతిస్పందనవుంటుంది. దైవం మనోభావనలకు, ప్రతిస్పందన, ప్రతిబింబం, ప్రతిధ్వని మాత్రమే.

అర్జునా! ఎవరెవరు నా యీ జన్మకర్మ
రహస్య యదార్థమును గ్రహింతురో
వారు పునర్జన్మరాహిత్యము నొంది
నన్నే (మోక్షమును) పొందుదురు. 4-9

మితిమీరిన అనురాగము,
భయ క్రోధములను విడచి
తన మదిలో నను నిలిపి, తాను నాలోన నిలచి
నన్ను ఉపాసించి, నన్ను ఆశ్రయించి
జ్ఞానతపస్వులై నను బడసి పవిత్రులైరి. 4-10

పార్థా ! యెవరేరీతిన (నను) సేవించిన
అదే తీరుగనే పలుకుదును
పలురీతుల జనసేవనం
పలురీతులు నా అనుగ్రహం. 4-11

దైవం సాక్షీభూతుడు. తన కృప అందరికీ సమానం. మన పాత్రలనుబట్టి నీరు దొరకురీతిన మన మనోభావనను బట్టి తన ప్రతిస్పందనవుంటుంది. దైవం మనోభావనలకు, ప్రతిస్పందన, ప్రతిబింబం, ప్రతిధ్వని మాత్రమే.

సర్వమార్గములు నావే
సర్వవిధముల సేవలు నాకే
సర్వరీతుల అనుగ్రహము నాదే
నాది కానిది వేరొకటి యీ విశ్వమున లేదు, లేదు. 4-12

నాలుగు వర్ణములు నే సృష్టించితి
గుణకర్మల ననుసరించి
కర్తనైన నన్ను అకర్తగా యెరిగి
కనపడక ఉన్న నన్ను అనాది అని తెలుసుకో 4-13

సత్వగుణాధికం బ్రాహ్మణ,
రజోగుణాధికం క్షత్రియ,
సత్వ, రజః తమో గుణ మిశ్రమం వైశ్య,
తమో గుణాధికం శూద్ర. 4-13.2

జన్మనందరు శూద్రులౌదురు
మంచినడతతో ద్విజులు
వేదజ్ఞానేన విప్రులు
బ్రహ్మజ్ఞానానుభవాన బ్రాహ్మణులు అవుదురు 4-13.3

జన్మచక్రం కాదిది
పరిణామచక్రం అందరికి
వారసత్వం కాదిది
స్వయంకృషి ప్రతి జీవికి. 4-13.4

జన్మరీతి యెవరికెరుక
చేయు కర్మము విస్పష్టము
జన్మ మందున అందరొకటే
గుణ కర్మ ద్వారా యీ విభజన. 4-13.5

మును జన్మ సంస్కారమున కన్నా
యీ జన్మలోని శ్రమలు మిన్న
ఎలా పుట్టావనుట కాదు
ఎలా నడచావనుట ముఖ్యం
ఎలా ఎదిగావనుట శ్రేష్ఠం
ఎలా వెళ్ళావనుట ముఖ్యం. 4-13.6

శ్రమతో సాధనతో మానవుడే మాధవుడౌతాడు
అనిత్యం, అసుఖం, మాలిన్యం దేహం
అనాది, శుద్ధం, స్వచ్ఛం,

నిత్యానందం, పరమసుఖం, ఆత్మం
శూద్రబ్రాహ్మణ లేదు ఆత్మకు
అందరిలోని ఆత్మ ఒక్కటే
ఉన్నదొక్కటే, అందరిలోన వున్నదొక్కటే! 4-13.7

అది విమలం, నిర్మలం, నిశ్చలం, నిరంతరం, ఆదిమధ్యాంతరహితం, స్వయంప్రకాశం, అనంతం, వర్ణనాతీతం, కేవలం అనుభవగ్రాహ్యం, భౌతిక లౌకికవిద్యా దుస్సాధ్యం, స్వనిదర్శనం, విశ్వాంబరధరం, రూపగుణరహితం, సర్వజ్ఞం, సర్వ వ్యాప్తం, సర్వశక్తిమాన్, అనాది, అపౌరుషేయం, హృదయదయ, కరుణ, ప్రేమల పరివర్తనా సాధ్యం, స్వచ్ఛతా నిలయం, మాలిన్యానికి బహుదూరం, అత్యద్భుతం, అత్యాశ్చర్యకరం, సాక్షీభూతం, అనంతనామం, అనంతరూపం, అనంతప్రాణిం, అనంతసృష్టిం. 4-13.8

ప్రతిపదార్థానికి విభజన - పరార్థానికి కలయిక
అర్థం తెలుసుకొనుటకు విభజన
అంతరార్థం తెలియుటకు కలయిక
తరుగుటకు విభజన - ఎదుగుటకు కలుపుట
అసత్యం విభజన - సత్యం కలుపుట
చెడు విభజన - మంచి కలుపుట
అధర్మం విభజన - ధర్మం కలుపుట
అశాంతి విభజన - శాంతి కలుపుట
హింస విభజన - అహింస కలుపుట
ద్వేషం విభజన - ప్రేమ కలయిక
స్వార్థం విభజన - త్యాగం కలుపుట
విభజన రాక్షసం - ఐక్యత దైవత్వం
ఏకాత్మభావనం- మాయ మటుమాయం
ఉన్నదొక్కటే - అందరొక్కటే
యిదే మనకు శ్రేష్ఠం - దరిచేర్చే భావం. 4-13.9

కర్మలంటవు నాకు – అనాసక్తుడ నేను
సాక్షీభూతిగా నన్నెరిగినవాడు
కర్మబంధ విముక్తుడౌను. 4-14

సత్యాచరణ ధర్మం. ప్రకృతిసిద్ధమైన విశ్వసమతుల్యత ధర్మం. సృష్టిరీతి ధర్మం. ధర్మఅతిక్రమణ జరిగి, సమతుల్యతకు హానిజరిగినప్పుడు, దీనిని సరిచేయుటకు వచ్చేశక్తి అవతారము. అవతారుడు కారణజన్ముడు. మనది కర్మజన్మ.

కర్మలంటవు నాకనగా తామరాకుపై నీటిబొట్టుచందమున. నీటిలో నావవుండి నావలో మనముంటే దరికిచేరతాము. ఆ నీరే నావ లోపలికి వస్తే దరిచేరక మునిగే ప్రమాదం ఉన్నట్లు ప్రపంచంలో మనముండాలి కాని, ప్రపంచం మనలోనికి వెళ్ళకూడదు. అది మనలను ముంచే ప్రమాదంవుంది.

ఇది యెరిగి కర్మల నాచరించిరి
ముముక్షువులు మున్ముందర
పురాతనమైనది యీ నిష్కామకర్మము
ఆచరించి తరించుము అర్జునా! 4-15

కర్మ, అకర్మల అంతరార్థం
తెలియలేరు పండితులు కూడ
సంసార బంధ విముక్తి నొసగు
కర్మ రహస్య మిపుడు నే తెల్పెద. 4-16

చేయదగిన పనికర్మము
నిషిద్ధమైనది వికర్మము
యేమీ చేయకుండిన అకర్మము
చేయుచు చేయనటుల ఉండుటయు అకర్మమే

తెలియవలయు నీవీ తేడా
లోతైనది కర్మ వాస్తవతత్వం. 4-17

కర్మలలో అకర్మను అకర్మలోన కర్మను
అనుభవించువాడు వివేకుడు
సకల కర్మాచరుణుడవును వాడు. 4-18

కామసంకల్పములు లేనికర్మలు
జ్ఞానాగ్నిన దగ్ధమైన కర్మలు
చేయువారిని విజ్ఞులందురు విదులు. 4-19

కర్మఫలమును విడనాడి తృప్తితో
తదితరముల వేటినీ ఆశ్రయించనివాడు
కర్మలు చేసినను చేయనివాడే అవును. 4-20

అత్యాశలు లేక, యింద్రియముల నిగ్రహించి
విషయ, వస్తు అనాసక్తుడైన మనుజుడు
దేహధారణ నిమిత్తము కర్మలు చేసిననూ
అంటవతనికి కర్మఫల పాపములు. 4-21

అతిసహజముగ లభ్యమైన దానితో తృప్తుడు
సుఖదుఃఖాది ద్వంద్వాతీతుడు, మత్సర రహితుడు
ప్రాప్తి, అప్రాప్తముల యెడ సమభావమున్నవాడు
కర్మబద్ధుడు కాడు వాడు కర్మలు చేసినను. 4-22

అనాసక్తుడు, అరిషడ్వర్గబంధ విముక్తుడు,
ఆత్మజ్ఞాన పరిపూర్ణుడు
ఇతరుల మేలుకే కర్మలు సదా చేయువానికి
ఈ కర్మలన్నియు కావుకర్మ, జన్మబంధములు. 4-23

యజ్ఞసాధనములు బ్రహ్మము
యజ్ఞపదార్థము బ్రహ్మము,
యజ్ఞాగ్ని బ్రహ్మము
యజ్ఞ కార్యము బ్రహ్మము,
యజ్ఞకర్త బ్రహ్మము
బ్రహ్మఫలము బ్రహ్మమునకే అర్పణం
బ్రహ్మము బ్రహ్మమునకే సమర్పణం 4-24

వంట పదార్థము బ్రహ్మము
వంట పాత్రలు బ్రహ్మము
అగ్నిహోత్రము బ్రహ్మము
వంట కర్త బ్రహ్మము
వంట పాకము బ్రహ్మము
బ్రహ్మ పదార్థములు బ్రహ్మమునకే అర్పణం
బ్రహ్మము బ్రహ్మమునకే సమర్పణం. 4-24.2

ఈ శ్లోకము భోజనము ముందు చేసే మొదటి ప్రార్థనా శ్లోకముగా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రార్థనలో మనం మన వంట పదార్థము నుండి పాత్రలు, అగ్నిహోత్రము, వంట కర్త, వంట పాకము, బ్రహ్మమునకే అర్పణం అనియూ[4-24], తదుపరి రెండవ ప్రార్థనా శ్లోకమైన "అహం వైశ్వానరో భూత్వ" (సకల ప్రాణుల శరీరాలలో జఠరాగ్నిగా, వైశ్వానర రూపంలో వుండి, ప్రాణ, అపాన వాయు సంపర్కమున, నాలుగు రకముల ఆహారమును జీర్ణము చేయుచున్నాను.[15-14]) అనే రెండవ శ్లోకము దేహంలో జఠరాగ్ని రూపంలో వైశ్వానరుడిగా వుండి, తిన్న ఆహారాన్ని ప్రాణ, అపాన వాయువులతో కలసి శక్తిగా మార్చేది, మనలోని భగవంతుడనెడి భావముతో భుజించే మన సంస్కృతికి అహం ప్రణమోస్తుతే. అనగా ముడి ఆహార పదార్థము నుండి శక్తిగా మారే వరకూ అంతా తనే అనే ఏకాత్మ భావన బహు అద్భుతం. ఆస్వాదించండి.

బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్ బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతం బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మ కర్మ సమాధినా 4-24	**అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్ విధం 15-4**

ఈ రెండు ప్రార్థనా శ్లోకములను నిత్య జీవితంలో వాడి తరించండి.

కొందరు యోగులు సలుపుదురు
తానూ, దైవం వేరను ద్వైత ఆరాధనా యజ్ఞం
మరికొందరు చేతురు హెూమం – అగ్ని పరబ్రహ్మమని
జీవుడు, దేవుడు ఒకటను ఏకాత్మ భావనలో. 4-25

కొందరు యోగులు సమర్పింతురు
శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ విషయ మాలిన్యాలను
ఇంద్రియ హెూమాగ్నికి – త్యాగమొనర్తురు
ఇంద్రియ విషయముల త్యాగయజ్ఞమున 4-26

మరికొందరు సమర్పింతురు
సర్వేంద్రియ విషయవ్యాపారము లన్నియు
మనోనిగ్రహ యోగాగ్నికి –
హెూమ మొనర్తురు జ్ఞానసమాధి యోగయజ్ఞమున. 4-27

కొందరు దాన, ధర్మాది ద్రవ్య యజ్ఞము,
కొందరు తపోయజ్ఞం
కొందరు అష్టాంగ యోగ యజ్ఞం –
ఈ రీతి పలువిధముల యజ్ఞములు చేతురు,
ప్రయత్నశీలురు, దృఢవ్రతులు. 4-28

ప్రాణాయామ తత్పరులు
ప్రాణాపాన గతుల నిరోధించి

అపానము నుండి ప్రాణమును,
ప్రాణమునందు అపానమును
పూరక, కుంభక, రేచకములతో
చేతురు ప్రాణాయామ యజ్ఞము. 4-29

కొందరు ఆహారనియమ నిష్ఠలతో ప్రాణాదివాయువులను ప్రాణమందే హోమము చేతురు. ఇది ప్రాణాగ్ని యజ్ఞం. వీరందరూ యజ్ఞమును తెలిసి, జ్ఞానాగ్నిన పాపదగ్ధము చేసినవారే. 4-30

కురువంశశ్రేష్ఠా! ఆ విధమైన యజ్ఞశేషామృతాన్నమును భుజించువారు శాశ్వతపరబ్రహ్మమును పొందుదురు. అట్టి దొక్కటైనను చేయనివారికి యిహపరాలలో సుఖము లేదు. 4-31

యీ విధముగ యజ్ఞములు అనేకము
చెప్పబడినవి వేదములలో
అవన్నియు పుట్టినవి కర్మయందని
గ్రహించినవాడు పొందును మోక్షం. 4-32

ద్రవ్యయజ్ఞము కంటె మేలు
జ్ఞానయజ్ఞ మెల్లప్పుడు
సమస్తకర్మలకు లేదు నాశనము, అవి
చిత్తశుద్ధితో సమాప్తినొందును జ్ఞానమున. 4-33

సేవలో ద్రవ్యం, కాలం, జ్ఞానం దానం చేసేవారికి తగు గుర్తింపునిస్తాం. సామాన్యంగా మనం ధనం దానం చేసేవారికి అందరికంటే ఎక్కువ గుర్తింపునిస్తాం. సరైనవిధానం జ్ఞానం - శ్రమ - ధనం దానాలకు యిదే వరుసక్రమంలో ప్రాముఖ్యతను యిచ్చి గౌరవించవలెను.

అట్టి జ్ఞానమును తెలియవలయును
తత్వదర్శనుల చరణ శరణ్యమున (సాష్టాంగ నమస్కారముతో),
వుచిత సమయమున ప్రశ్నించిన, సేవించిన
ఉపదేశింతురు నీకు తప్పక. 4-34

నిష్కామకర్మమున లభించు చిత్తశుద్ధి
చిత్తశుద్ధిన లభించు జ్ఞానమునకు అర్హత
అట్టి జ్ఞానము లభించు తత్వదర్శనుల
శరణ్యమున, పరిప్రశ్నన, సేవనమున
ఉపదేశమున తత్వదర్శనుల నుండి. 4-34.2

ఓ పార్థా!
యెద్దానిని తెలిసిన మోహము వీడునో
స్పష్టత కలుగునో,
అత్తరి సమస్త ప్రాణి దర్శనం
నాయందు, నీయందు కలుగును
తెలియుము అట్టి జ్ఞానమును అర్జునా! 4-35

ఒకచో అందరికన్నను పాపము
నీవెక్కువ చేసితివేని, అట్టి
ఆ పాపసముద్రమును
జ్ఞానమను నావతో దాటగలవు తప్పక. 4-36

రగిలే అగ్నిలో సమిధల కుప్పలు
దగ్ధమైనటుల, సమస్తకర్మలు
దగ్ధము అగును జ్ఞానాగ్నిచే. 4-37

జ్ఞానమునకు సరి ప్రపంచమున వేరొకటి లేదు
పొందును అట్టి జ్ఞానమును నిష్కామ కర్మయోగి
కాలగతిన పొందిన ఆత్మానుభవమున. 4-38

శ్రద్ధతో లభించు జ్ఞానము
అది లభించు తీవ్ర కాంక్షన,
సర్వేంద్రియ నిగ్రహమున
తదుపరి త్వరితగతిన శాంతిని
పొందును అనుభవించును శాంతిని. 4-39

సాధకుని సాధన సాధారణంగా ఉంటే ఫలితం ఇవ్వజాలదు. ఆ సాధన ఒక యజ్ఞం, తపస్సులాగా నిరంతరంగా, నిర్విరామంగా తీవ్రస్థాయిలో ఉంటేనే పూర్వజన్మ సంచిత కర్మలమూటలను నిరవశేషంగా దగ్ధము చేయగల జ్ఞానాగ్ని రగులుకొనదు. నీట మునిగే వానికి గాలిపీల్చవలెనన్న ఆకాంక్ష ఎంత తీవ్రముగా ఉండునో, దానికి తులతూగేటంత తీవ్రకాంక్ష సాధకునకు ఉంటే అది తపస్సు స్థాయికి చేరి యజ్ఞఫలములను తప్పక ఇవ్వగలదు.

జ్ఞానహీనుడు, శ్రద్ధాహీనుడు,
సంశయచిత్తుడు
ఇహ, పరలోకసౌఖ్యములేక
వినాశనము చెందును. 4-40

'సంశయాత్మ వినశ్యతి' అనుమాట జీవనసత్యము. సంశయము మన మది యొక్క స్థితికి నిదర్శనం. స్థిరత్వము లేని మనసు సంశయముగా బహిర్గతం అవుతుంది. అస్థిరత్వము మనసు యొక్క కల్మషానికి సూచిక. బాహ్య ప్రపంచము మనో ప్రపంచమునకు ప్రతిచర్య, ప్రతిబింబము, ప్రతిధ్వని. మన ఎదురుగా వున్న అద్దం వంటిది. బయటకు అగుపించు సంశయము మన మనో అస్థిరతా రూపానికి సాక్షి.

మనం సంశయనిర్మూలనకు ఆశించ వలసింది ఎదుటి వారిలో మార్పు కాదు, దర్పణంలోన బింబంలో కాదు. మార్పు రావలసింది వస్తువులో. అప్పుడు బింబం దానికదే మారుతుంది. కనుక సంశయ నిర్మూలనకు పరిణతి చెందవలసింది

అంతరమున. మదిలో ఉన్న కల్మషములు తొలగటం, మనోస్వశ్ఛత, చిత్త శుద్ధిని పొందటం జరగాలి. ఇవి పొందిన సాధకుడు సంశయ రహితుడై స్థిరచిత్తుడు అగును. దానితో ఇతరులపై విశ్వాసం పెరుగును.

ఓ ధనంజయా! కర్మ యోగమున
కర్మఫల త్యాగము చేసినవానిని,
జ్ఞానముతో సర్వసంశయ నివృత్తి అయినవానిని,
కర్మములు బంధించవు. 4-41

కావున ఓ భారతా!
నీ హృదయములో నున్నదియు,
అజ్ఞానమున ఉద్భవించినదియూ,
అయిన యీ సంశయమును
జ్ఞాన ఖడ్గముతో ఛేదించి
నిష్కామముగ యుద్ధము చేయుటకు
లెమ్ము, లేలెమ్ము. 4-42

ఈ అధ్యాయమున వివరించిన అంశములు

1. అవతార క్రమం, సృష్టి రహస్య వివరణ.
2. నిష్కామకర్మయోగ ప్రస్తావన.
3. జ్ఞాని పవిత్ర ఆచరణ.
4. భోజన ప్రార్థన, బ్రహ్మార్పణం
5. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం.
6. వివిధ యజ్ఞముల వర్ణన
7. జ్ఞాన మహిమ, జ్ఞానముతో నిష్కామకర్మ ఆచరణ



5

అయిదవ అధ్యాయము

కర్మ సన్యాస యోగము

కర్మ సన్యాసమనగా కర్మ చేస్తూ చేయకుండుట, సాధకునికి యిది తగదనీ, కర్మత్యాగము కంటే, కర్మఫల త్యాగమైన నిష్కామకర్మమే మేలని తెలిపే అధ్యాయము కనుక దీనిని కర్మసన్యాసయోగం అని అందురు.

అర్జునుడు అడుగుతున్నాడు: (7వ ప్రశ్న)

కర్మము కంటే కర్మత్యాగం మేలని
ఇదే జ్ఞానమని చెప్పితివి ముందు
ఇప్పుడు ప్రోత్సహించెదవు నన్నేల
యీ కర్మ మొనరింపమని
యీ రెంటిలో మేలేదో తేల్చి చెప్పుమా! 5-1

భగవానుడనెను:

కర్మత్యాగం కర్మమునకు
ఒకటే గమ్యం అందరికీ - అదియే మోక్షము

కర్మ త్యాగము జ్ఞానమే
కర్మమనిన నిష్కామ కర్మయోగము
కర్మత్యాగ జ్ఞానము కన్నను
కర్మమే అతి సులభ మార్గము
ఈ రెండు మార్గముల గమ్యం మోక్షమే. 5-2

ఓ మహాబాహో!
రాగద్వేషములు వీడిన కర్మిడే
నిజముగ సన్యాసి యగును-
సంసార బంధవిముక్తు డాతడు 5-3

మూర్ఖులు సాంఖ్యమగు కర్మసన్యాసము
కర్మము వేరు వేరని తలచుదురు
యీ రెంటిలో ఏ ఒక్కటయిన చక్కగ చేసిన
ఫలితము ఒకటే తెలియుము పార్థా! 5-4

జ్ఞానులు యే స్థానమును పొందెదరో
కర్మిలు కూడా పొందెదరు అదే స్థానమును
జ్ఞాన, కర్మముల ఏకదృష్టిన
చూచువారలే నిజమైన విజ్ఞులు 5-5

బహు కష్టతరం కర్మము లేకుండా
బ్రతుకుట, నిష్కామకర్మ ద్వారా సాంఖ్యుడు
తదేక దైవ చింతనమున
పొందు బ్రహ్మమును అతిశీఘ్రముగ. 5-6

కర్మయోగి, పరిశుద్ధ హృదయుడు,
స్థిరమనస్కుడు, యింద్రియ నిగ్రహం కలిగినవాడు

సమస్తభూతాలలోనూ, తనలోనూ వున్న
ఆత్మఒకటేనని యెరిగినవాడు యోగి
అతనికి కర్మలంటవు కర్మమువలననూ. 5–7

తత్వవేత్త, యోగయుక్తుడు, చూచుచుండిన,
వినుచుండిన, తాకుచుండిన, వాసన జూచుచుండిన
తినుచుండిన, నడచుచున్నను,
నిదురలో, స్వప్నములో వుండిననూ. 5–8

నిశ్వాసమున, ప్రలాపమున, మౌనమున
గ్రహించునపుడు, కళ్లు తెరచినను, మూసినను,
యింద్రియములు తమ తమ వస్తునిమగ్నమైనవను తలపున
ఆ యా కర్మలన్నిట వుండు సంగమము లేక అకర్త బుద్ధితో! 5–9

తా చేయు కర్మలను బ్రహ్మమున కర్పించి
కర్తృత్వ, కర్మఫల త్యాగము చేయువాడు
తామరాకుపైని నీటిబిందు రీతినుండు
అంటవు ఆతనికి కర్మ ఋణ పాపములు. 5–10

నిష్కామ కర్మయోగులు
శరీరమున, మనసున, బుద్ధిన,
ఇంద్రియములందు అసంగులై
చేతురు కర్మలను చిత్తశుద్ధికై. 5–11

కర్మయోగి కర్మఫలత్యాగమున
చిత్తశుద్దితో, ప్రశాంతి బడయును
తదితరులు దురాశా ప్రేరితులై
కామ్య కర్మమున అవుదురు కర్మబద్ధులు. 5–12

యింద్రియనిగ్రహమున్న దేహధారి
మనసున కర్మఫలత్యాగమున
చేసినను, చేయనివాడై, చేయింపనివాడై,
నవద్వారపుర శరీరమున సుఖముగా నుండును. 5-13

కల్పింపడు ప్రభువు జీవులకు
కర్తృత్వమును, కర్మఫలమును
ప్రకృతి, జన్మాంతర సంస్కారమున
కలుగును కర్మబంధములు మనుజునకు. 5-14

స్వీకరింపడు విభుడెవ్వరి
పాపపుణ్యములు
అజ్ఞానావృతము ఆత్మజ్ఞానము
భ్రమనొందెదరు అందుచే. 5-15

దైవం మన పాపపుణ్యాలకు కారణం కాదు. వారివారి కర్మఫలమే వారి పాపపుణ్యములను నిర్ధారించును. మన జీవితానికి మనమే బాధ్యులం. మనమే కారణం. దైవంకాదు.

ఆత్మజ్ఞానమున, అజ్ఞానము దగ్ధమైన వాడు
భానుతేజమున ప్రకాశించుచు జ్ఞానమున
పొందును స్వస్వరూప దర్శనానుభవము. 5-16

పరమాత్మలోన బుద్ధినిల్పి
పరమాత్మనందు మనసునుంచి
పరమాత్మయందు బహునిష్ట గలిగి
పరమాత్మనే పరమగతిగ నెంచి
జ్ఞానముచే పాపనివృత్తి బడచిన

యోగులు పొందెదరు
పునర్జన్మ రహిత శాశ్వత మోక్షము. 5-17

విద్యావినయుడైన బ్రాహ్మణుని యందు,
గోవునందు, గజరాజునందు,
కుక్క యందు, కుక్కమాంసము తినుచండాలుని యందు
సమదృష్టి కలవారినే జ్ఞానులందురు. 5-18

స్థిర మనసున, సమ మదిన నుండెడు
వారలు యీ జన్మనందే అగుదురు
జననమరణ సంసార విజయులు
బ్రహ్మమెప్పుడు సమమై దోష రహితము,
సమదర్శనమున వీరలు పొందెదరు బ్రహ్మము. 5-19

స్థిర బుద్ధుడు, మోహరహితుడు
బ్రహ్మ స్థిరచిత్తుడగు బ్రహ్మజ్ఞాని
కోరినది దొరికిన సంతసించడు,
దొరకని యెడల దుఃఖించడు. 5-20

బాహ్య శబ్ద విషయ దూరులు
ఆత్మసుఖమును అనుభవింతురు
బ్రహ్మ చిత్త సమాధిన వారలు
బడయుదురు అక్షయ సుఖమును 5-21

ధనుంజయా!
ఇంద్రియ విషయసంపర్కమున
కలిగిన భోగములుండును స్వల్పకాలము
అగునవి దుఃఖ హేతువులు, కావున
విజ్ఞులు చూపరు ఆసక్తి వీటిపై. 5-22

విషయం విషం సాధకునకు
అస్థిరం, అల్పం సుఖం, కడుదుఃఖం
విషయాసక్తి ప్రియమందరికీ,
ఇదే ప్రియం, కడువిషం అందరికి
అత్మాసక్తి శ్రేయం, విషయ దూరం
క్షేమం, దివ్యానందకరం శ్రేయం. **5-22.2**

యెవ్వడు చనిపోవుటకు ముందు
కామ క్రోధముల త్రుంచెనో
వాడీ జన్మమందే యోగి అగును
అతడే నిజమైన సుఖుడు అగును 5-23

యెవ్వడు ఆత్మనందు సుఖించునో,
క్రీడించునో -
యెవ్వడు ప్రకాశించునో-
అట్టి యోగి బ్రహ్మస్వరూపుడై,
బ్రహ్మసాక్షాత్కారము బడయును. 5-24

కల్మష (పాప) దూరులు,
సంశయ రహితులు,
యింద్రియ నిగ్రహులు,
సర్వ భూతహితులు నగు,
ఋషులు పొందుదురు
బ్రహ్మసాక్షాత్కారమును. 5-25

కామ, క్రోధ విసర్జితులు,
మనో నిగ్రహమున్న వారలు,
తత్వమెరిగిన సాధకులు,

బ్రహ్మసాయుజ్యమొంది
ఉందురు సర్వవ్యాప్తులుగా. 5-26

బాహ్యశబ్ద, స్పర్శాదుల,
విషయముల బహిష్కరించి
చూపును నిలిపి భ్రూమధ్యమున,
నాసికన ప్రాణవాయువును
క్రమమున సమము చేసి - 5-27

ఇంద్రియ మనోబుద్ధుల నిగ్రహించి
కామక్రోధముల నిర్మూలించి
మోక్షాసక్తుడైన నిరంతర మననశీలుడు
ముక్తుడవును నిక్కము పార్థా! 5-28

యజ్ఞ(నిష్కామకర్మ) తపస్సులకు భోక్తగా,
సమస్తలోక ఈశ్వరునిగా
సమస్త ప్రాణుల హితునిగా
నన్నెరిగినవాడు పొందును శాంతిని. 5-29

కర్మసన్యాస (జ్ఞాన), కర్మఫల త్యాగములు ఒకటైన మోక్షం అయిననూ కర్మఫల త్యాగం సులువైన మార్గమని ఈ కర్మసన్యాస యోగమున తెలుపబడినది.


Sankar

6

ఆరవ అధ్యాయము

ఆత్మ సంయమ యోగము

శరీరము, యింద్రియములు, మనస్సు, బుద్ధిలను ఆత్మకు అనుసంధానం చేయటం ఆత్మ సంయమ యోగం. యిదే ధ్యానయోగం. అభ్యాసంతో మనో నిగ్రహాన్ని ఎలా యిందు తెలుపబడింది. యోగభ్రష్టుని పతన మార్గ వివరణ యివ్వబడింది.

భగవంతుడు ఇట్లు తన బోధను కొనసాగించెను:

సన్యాసి, యోగి అనగా కర్మఫలాసక్తి లేకనే విద్యుక్తకర్మలు చేయువాడు. అంతియేకాని, అగ్నిహోత్రమును, కర్మలను విడచినవాడు మాత్రమే కాదు. 6-1

సన్యాసం, యోగం ఒక్కటే-
కామాదిసంకల్పములు వీడనివాడు
కాలేదు యోగి ఎన్నడూ. 6-2

జ్ఞానధ్యానయోగమునకు
మూలము నిష్కామ కర్మయోగ
జనిత చిత్తశుద్ధి- తదుపరి కర్మనివృత్తి. 6-3

ఇంద్రియార్థ శబ్ద, స్పర్శ, రూప, రస, గంధముల
ఆసక్తి లేనివాడు, కర్మ అనాసక్తుడు,
సర్వ సంకల్ప రహితుడు
అయిన మనుజుడు అనబడును యోగారూఢుడని. 6–4

ఉద్ధరించుకొనవలె స్వశక్తితో యెవరిని వారే
పొందకూడదు అధోగతి తన శక్తిని వాడక
తనకు తానే బంధువు యింద్రియ మనో నిగ్రహమున
తనకు తానే శత్రువు, వాని నిగ్రహించ లేకున్న 6–5

మనసును గెలిచిన మనకది బంధువు
గెలవనిచో అదే మనకు ప్రబల శత్రువు 6–6

మనో విజయుడు, ప్రశాంతచిత్తుడు,
శీతోష్ణ, సుఖ, దుఃఖముల,
మానావమానముల బెదరక చెదరక,
ఆత్మానుభవమునందే నిష్ఠుడై వుండును. 6–7

శాస్త్రానుభవ జ్ఞానవిజ్ఞానముల తృప్తుడు,
నిర్వికారుడు, యింద్రియ నిగ్రహమున్నవాడు
మన్ను, రాయి, బంగారముల నొక్కటిగ చూచు యోగిని
అనెదరు యోగారూఢుడని, ఆత్మానుభవ సంపన్నుడని. 6–8

శ్రేయోభిలాషిని, మిత్రుని, శత్రువును
తటస్థ, మధ్యస్థ, విరోధుల, బంధువుల, సాధువుల
పాపుల యెడ సమబుద్ధితో నుండువాని
అందురు యోగారూఢుడు అని. 6–9

యోగి ఏకాంత ప్రదేశమున,
దేహేంద్రియ మనోబుద్ధుల నిగ్రహించి
ఆశారహితుడు, అపరిగ్రహుడై,
నిల్పవలె వానిని సతతం ఆత్మనందు. 6-10

మెరక పల్లములు లేని పరిశుభ్ర సమప్రదేశమున
దర్భాసనముపై చర్మమును, దానిపైన వస్త్రమును
దానిపై స్థిరాసనమును ప్రతిష్ఠించి తాను – 6-11

కూర్చుండి దానిపై, యేకాగ్రతన
యింద్రియ మనో వ్యాపారముల
నిగ్రహించి చేయవలె సాధకుడు
చిత్తశుద్ధి కొరకు ధ్యానాభ్యాసమును. 6-12

సమముగ నొక్కటిగ శరీర, శిరో,
కంఠములు కదలక, స్థిరముగ నుంచి,
దిక్కుల చూడక నాశికాగ్రమున దృష్టి నిలుపవలె. 6-13

ప్రశాంత హృదయుడై, నిర్భయుడై
బ్రహ్మచర్యనిష్టతో, మనోనిగ్రహముతో
నాయందు మనసు నిలిపి, నన్నే పరమగతిగ నమ్మి
ధ్యాన సమాధియుక్తుడు కావలె. 6-14

మనో నిగ్రహమున్న యోగి, సదా
మది ఆత్మధ్యానమున నుంచి,
నా స్వస్వరూప అతి ఉత్కృష్ఠ
మోక్ష శాంతిని పొందును. 6-15

అన్నమెక్కువ తినెడువానికి,
తినక పస్తులు ఉండువానికి,
నిద్రయెక్కువ పోవు వానికి
నిద్రలేమితో నుండువానికి
యీ ధ్యానయోగము కలుగబోదు
తెలియుమోయీ అర్జునా! 6-16

యుక్తాహారవిహారులకు,
మితాచారులకు, మితకర్ములకు,
మితనిద్రా, మెలకువల వారికి
సంసారదుఃఖహరం యీ యోగం. 6-17

మనో నిగ్రహమున ఎప్పుడు
ఆత్మనందే చిత్తముండిన
సమస్త కోరికలు హరణ మొందిన,
విషయ తృప్తుడు, యోగసమాధి యుక్తుడు. 6-18

గాలి లేని తరినున్న దీపము
నిశ్చలముగా వెలుగు రీతి
ఆత్మధ్యాసుని నిశ్చల చిత్తము
అదే రీతిన వుండు నెప్పుడు. 6-19

యోగాభ్యాసమున మనో నిగ్రహముతో
చిత్తశుద్ధిన మనసు ఆత్మ యందు
నిలిపిన యోగి పొందును
పరమశాంతిని, ఆత్మానుభవ ఆనందమును. 6-20

యింద్రియములకు అగోచరం
నిర్మల బుద్ధి గ్రాహ్యం

అనంత నిరంతర సుఖం
నిశ్చల స్వానుభవ జ్యోతి 6–21

ఏ గొప్పలాభం తదుపరి
అన్ని లాభములు గొప్పవికావో
దేనియందున్న మహా దుఃఖమున కూడా
చలింపమో మనము 6–22

అట్టి దుఃఖ సంబంధ రహిత స్థితిని
యోగమని మరి తెలియ వలయు
అట్టి యోగము దుఃఖమున కలత చెందని
స్థిర మనమున, పట్టు వదలక సాధింపదగును 6–23

సంకల్పమున కలిగెడు
కోర్కెలన్నియు విడచి, పూర్తిగా
నిగ్రహించి యింద్రియాలను
నలుదిశల నుండి బాగుగా – 6–24

పట్టు వీడక మదిని మెల్లగ
మరలించి లోనికి, స్థాపించు ఆత్మలో
చింతించక ఆత్మకు అన్యమగు దేనిని
పొందవలయు ప్రశాంతిని. 6–25

చంచలము, మనసు, స్థిరము లేనిది
యెచటెచట మది ఏ విషయమున చనిన
అచటచటనే మరలించి దానిని
ఆత్మయందే మదిని నిలుపుము
ఆత్మను అధీనమందు వుంచుము 6–26

ప్రశాంతచిత్తుడు, కామక్రోధాది
గుణరహితుడు, బ్రహ్మానుభవ సిద్ధుడు
కల్మష రహితుడైన యోగిని సదా
వరించును సర్వోత్తమ ఆత్మానందం 6-27

యీ తీరున మదినెల్లపుడు
ఆత్మలో నిలుపు నిర్మల యోగి సులభమున
బ్రహ్మానుభవ పరమానందమును బడయును. 6-28

యోగ చిత్తుడు, చూచునెప్పుడు
తనను సర్వభూతాంతరాత్మగ
సర్వభూతములను తన హృదయాంతరాత్మగా
సమ దర్శనముతో ఎల్లెడల. 6-29

ఎవడుచూచునో ఎల్లపుడు
నన్ను సర్వ భూతములందు,
సర్వభూతములనూ నాయందు
అట్టివానికి నేను ఎరుక అవుదును
నాకు కూడ అతడు ఎరుక అగును. 6-30

సర్వభూతాత్మకుడనైన నన్నెవరు
అభేద బుద్ధితో సేవింతురో
అట్టి యోగి ప్రవర్తన ఎటుల యున్ననూ
నాయందే వున్నవాడౌను తాను. 6-31

అర్జునా!
సమస్త ప్రాణుల సుఖదుఃఖములను
తనవిగా నెంచెడి యోగి కడు శ్రేష్ఠుడు. 6-32

సామాన్యంగా ప్రపంచంలో ఎవరికి ఏమి జరిగినా మనం స్పందించం. అదే మన కుటుంబంలోనో, మన మిత్రులకో జరిగితే మనం మనకే జరిగినట్టు స్పందించి బాధపడతాం. అంటే ఎక్కడ బంధం, సంబంధం వుందో, అక్కడ మన వుంటుంది. దీనినే బాంధవ్యం అంటాం. అంటే మన మనోశరీరం మన దేహ అవధులు దాటి మనవాళ్లనేవాళ్ళను కూడా మన శరీరంలో యిముడ్చు కున్నాం. దయకల హృదయం వున్న మానవులు తమ బంధువులకే పరిమితంకాక అందరినీ ప్రేమించి యితరుల కష్టసుఖాలూ తనవే అన్నట్లు స్పందిస్తారు. వసుధైకకుటుంబం వీరి దృష్టిలో అక్షరాల నిజం.

అర్జునుడు తన ప్రశ్నలు కొనసాగించెను: (8వ ప్రశ్న)

ఓ కృష్ణా! నిశ్చలమనమున సిద్ధించు ఏ యోగమును చెప్పితివో నా మనోచపలత వలన అది నాకు తెలియలేదు. 6-33

మనసు అతి చంచలం కృష్ణా!
విక్షేపకరం, బహు దృఢం
కావున దానిని, నిగ్రహించటం
అతి కష్టం గాలిని అణగ దొక్కుటవలె 6-34

శ్రీకృష్ణ ఉవాచ:

అసంశయం మహాబాహో
మనో నిగ్రహం అతి కష్టం, చంచలం
అభ్యాస వైరాగ్యాదులతో
కష్టమైనను అది సాధ్యం, కౌంతేయా 6-35

మనో నిగ్రహము లేనివానికి
సాధ్యపడదు యోగమెప్పుడు
మనసు నిలకడగానున్న
సాధ్యమగును తెలివితో. 6-36

అర్జునుడనెను: (9వ ప్రశ్న)

కృష్ణా! శ్రద్ధ వున్ననూ
మనోనిగ్రహము లేక
యోగభ్రష్టుడైనవాడు
యోగ సిద్ధిని పొందక ఏమౌను వాడు? 6-37

ఓ కృష్ణా! స్థిరత్వ లేమితో నున్న
మేఘ రీతిన వున్న మూఢుడు
రెండింటనూ చెడిన వాడగునా ఏమి ? 6-38

కృష్ణా! నీవొక్కడవే సమర్థుడవు
తీర్చుటకీ సందేహమును
ఇతరులెవ్వరు తీర్చలేరు
తొలిగించలేరు సందేహముల పూర్తిగ 6-39

భగవానుడనెను:

అట్టి యోగభ్రష్టున కెప్పుడూ
ఇహపర లోకముల లేదు వినాశనం
మంచి చేసిన వ్యక్తి
పొందడెప్పుడు దుర్గతి. 6-40

యోగ భ్రష్టులు దేహము వదలిన తదుపరి
ఊర్ధ్వలోకపు పుణ్యఫలములను పొంది
ధనం, సంస్కారం ఉన్న యింట
పునర్జన్మము నొందుచుందురు. 6-41

అతడు ఉత్తమ యోగి అయితే
జ్ఞానులైన యోగుల ఇండ్లలో
జన్మించును పునర్జన్మలో
కడు దుర్లభమీ జన్మము. 6-42

కురునందనా ! అటుల జన్మనొంది
యోగులిటుల తీవ్ర యత్నము
చేయుదురు, పూర్వజన్మ బుద్ధి
సంస్కారమున, సంపూర్ణ యోగసిద్ధికై 6-43

పూర్వజన్మ సంస్కార బలాన
యోగాభ్యాసమునే కొనసాగించి అప్రయత్నముగ
పొందెదరు వీరు, యిచ్ఛా మాత్రాన
వేద కర్మానుష్టాన ఫలమును. 6-44

పట్టుదలతో సాధించు యోగులు,
పలుజన్మల సంస్కార బలమున
పాపమును వీడి పొందెదరు
యోగసిద్ధితో
సర్వోత్తమ మోక్షమును సదా. 6-45

యోగియైనవాడు, తపస్యులకన్న,
కర్మానుష్టానుల కన్నను, శ్రేష్టుడగును,
అందులకై ఓ అర్జునా!
నీవును కమ్ము శ్రేష్టమైన యోగీశ్వరునిగ. 6-46

నాయందే మది నిలిపి,
నన్ను శ్రద్ధతో ఉపాసించు వారలు
సర్వోత్తమమైన యోగులు
అని నే తలతును అర్జునా. 6-47

ఈ అధ్యాయమున ధ్యానయోగము, యోగభ్రష్టుని ముగింపు మార్గనిర్దేశము తెలుపబడింది.



7

ఏడవ అధ్యాయము

విజ్ఞాన యోగము

జ్ఞానం ప్రత్యక్షానుభవముతో విజ్ఞానమవుతుంది. అట్టి అనుభవ పూర్వక విశేష జ్ఞానాన్ని తెలిపేది కనుక దీనిని విజ్ఞాన యోగం అని అందురు. యిందున పరబ్రహ్మ స్వరూపము గురించి, మాయా వివరణము, రజ్జు సర్ప ఉదాహరణ, అధిభూతము, అధియజ్ఞము, అధిదైవం గురించి వివరణ కలదు.

భగవానుడనెను:

నా యందు ఆసక్తికలిగి, నన్నే ఆశ్రయించి, నన్ను పూర్తిగా తెలుసు కొందువో, ఆ యోగమును ఇప్పుడు నేను నీకు సమగ్రముగా తెలిపెదను, వినుము అర్జునా, వినుము. 7-1

ఏ జ్ఞానం తెలిసిన ప్రపంచమున మరియొకటి
మిగిలి వుండదో తెలుసుకొనుటకు
అట్టి జ్ఞానమును తెలిపెదను నీకిపుడు 7-2

అనేక వేలమందిలో ఒకానొక్కడు
యత్నించును మోక్షమునకు
వారిలో నిజముగ ఏ ఒక్కడో నను తెలిసికొనును. 7-3

భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము
మనో, బుద్ధి, అహంకారములు అని
కలవు ఎనిమిది అంశములు
నా మాయా అపరా ప్రకృతిలో. 7-4

పంచభూతములైదు అంతఃకరణములు మూడు
కలసిన ఎనిమిది రూపముల అపరా ప్రకృతి నాది. 7-4 (2)

మహాబాహో!
అల్పమైనది అపరా ప్రకృతి- దీనికన్నను మిన్న అయినది,
జగత్తంతను నిండివున్న - సర్వజీవరూపమున వున్న
పరా ప్రకృతియె మిన్న. 7-5

సమస్త భూతముల వునికీ - పరాపర ప్రకృతులవలెనే,
ద్వివిధ ప్రకృతులూ నేనై - విశ్వ సృష్టి, స్థితి, లయలకు
కారణముగ వున్నాను. 7-6

ఓ ధనుంజయా!
నాకంటే వేరుగలేదు లేదు వేరొక్కటి
సూత్రమందు మణులవలెనే
సమస్త విశ్వమున్నది నాయందున. 7-7

నేను కానిది వేరొకటి లేదు
కనపడే విశ్వానికంతకు
కనుపించని సూత్రధారిని నేనే. 7-7 (2)

జలమునందున రుచిని నేను
సూర్యచంద్రుల కాంతి నేను

వేదమందలి ఓంకారమును నేను
మానవుల పౌరుషమును నేను 7-8

భూమి యందలి సుగంధమును నేను
జీవులందున ప్రాణమును నేను
తాపసులలో తపస్సును నేను. 7-9

సమస్త భూతముల
శాశ్వత బీజమును నేను
విజ్ఞులందలి బుద్ధి నేను
ధీరులందలి ధైర్యమును నేను. 7-10

బలవంతుల బలాన్ని నేను
ధర్మవిరుద్ధముకాని
బంధములేని కోరికను నేను. 7-11

త్రిగుణాత్మక పదార్థాల
కారణము నేను
వానియందు లేను నేను
నాయందే త్రిగుణాలున్నవి. 7-12

సత్వ రజో తమో గుణముల కర్తను నేను
వానియందు నేను లేను
రజ్జున సర్పము లేనటులనే
అవియే వున్నవి నాయందున
వశుడను కాను త్రిగుణములకు
త్రిగుణాతీతుడను నేను. 7-12 (2)

త్రిగుణాత్మకం జగత్ సర్వం
త్రిగుణాల కర్త నేనైనను
త్రిగుణాతీతుడను నేను

త్రిగుణాల మాయపొరతో
కాంచలేరు మోహమున నను. 7-13

మాయ దైవికం, త్రిగుణాత్మకం
దాని దాటుటకు అతి కష్టమందరికి
యెవరెవరు నన్ను శరణు జొచ్చిన
నేనే సృజించిన నా మాయను
దాటగలరు సులువుగా 7-14

పాపాత్ములు, మూఢులు,
మాయమోహిత అజ్ఞానులు,
అసుర భావ నరాధములు
నన్నాశ్రయించక, నన్ను చేరరు. 7-15

ఓ భరతవంశ శ్రేష్ఠా!
ఆర్తులు, అర్థార్తులు, జిజ్ఞాసులు, మోక్షకాములని
నలువిధముల నను సేవింతురు సుజనులు. 7-16

ఆ నలుగురిలో నన్ను సతతము
మనమున నిలుపుచు, నాయందే భక్తి గలిగి
వున్నవాడు కడు శ్రేష్ఠుడు.
అట్టి జ్ఞానికి నేను యిష్టుడను, నాకూ అతడిష్టుడే. 7-17

సదా మరవక ఏకాగ్రతతో నుండువాడు
నాయందే మనసు నిల్పి
నన్నే ధ్యానించుచు
నాలోన నుండు జ్ఞానికి నేనంటే యిష్టము
నాకు కూడా అతనిష్టుడే 7-17(2)

పైన తెలిపిన ఆర్తులు, అర్థార్తులు, జిజ్ఞాసులు, మోక్షకాములు అను అందరూ నాకు యిష్టులైనను, అందరిలోనూ జ్ఞానులన్న నాకు యిష్టము. ఎందుకనగా

నాయందే మది నిలిపి నన్నే సర్వోత్తమ స్థానముగా నిశ్చయించి నన్ను చేరును. అందువలన జ్ఞానియన్న మిక్కిలి యిష్టము. 7-18

బహుజన్మల సంసారచక్ర పరిభ్రమణ అనంతరం మనుజుడు సమస్తము భగవంతుడేనను జ్ఞానముతో తుదకు నన్ను చేరును. అటువంటి మహాత్ములు, జ్ఞానులుచాలా అరుదు. 7-19

కొందరు పూర్వజన్మ సంస్కారపు వాసనలతో, మతి భ్రమలతో, యితర దేవతా సంబంధ నియమములను అనుష్టించి, తదితర దేవతలను పూజింతురు. 7-20

ఎవరే రీతిన నను సేవించిన
అదే రీతిన నేననుగ్రహించెద 7-21

నిరాకారుడను నేను
నిర్గుణుడ నేను
ఏఏ రూప గుణముల నను భజించిన,
ఆ రూపమున పలికి ప్రతిబింబించెదను నేను. 7-21(2)

ఆ విధంగా ఆయా దేవతలను శ్రద్ధతో ఆరాధించిన వారు ఆయా దేవతల నుండి నేను నియమించిన యిష్ట ఫలములను పొందెదరు. 7-22

'అల్పబుద్ధిః అల్పఫలం' - యే దేవతలను పూజించిన ఆయా దేవతలే లభ్యం. నన్ను పూజించువారలు నన్నే పొందెదరు. 7-23

అవ్యయం, సర్వ శ్రేష్ఠం, ప్రకృతికిపరమై అవ్యక్తముగనున్న నన్ను, నా నిజ స్వరూపమును తెలియని అవివేకులు పాంచ భౌతిక దేహ రూపముగా తలచెదరు. 7-24.

నా యోగమాయ ఆవరణతో నేకనుపించనందరికీ,
యెరుగరు మూర్ఖులు నన్ను అనాదిగా, అవ్యయునిగా. 7-25

ఓ అర్జునా!
యెరుగుదును భూత, భవిష్యత్,
వర్తమానములలోనున్న అన్ని ప్రాణులను
కాలాతీతుడనై నేనెరుగుదు అందరిని
యెరుగరెవ్వరు నన్ను మాత్రము. 7-26

యిచ్ఛా ద్వేషమున పుట్టిన
సుఖ దుఃఖాది ద్వంద్వ మోహమున
ప్రాణులందరు అజ్ఞానమున వుందురు. 7-27

యే జనులు, పుణ్యకార్య తత్పరులై,
అవుదురు పాపరహితులు
వారలు వీడెదరు అజ్ఞానమును
సేవించెదరు నన్ను దృఢ చిత్తులై. 7-28

జరామరణ సంసార దుఃఖబంధములను
త్రెంచుకొనుటకెవరు నన్నా శ్రయింతురో
వారలు సమస్తము దైవస్వరూపమని,
సకల కర్మలును బ్రహ్మమని తెలియుదురు. 7-29

అధిభూత, అధిదైవ, అధియజ్ఞములతో వున్నటుల
నన్ను తెలిసినవారు, తెలుసుకొందురు నన్ను
దేహ వియోగ సమయమున స్థిరచిత్తులై. 7-30

జ్ఞానము అన్నిటికీ ముఖ్యము. కర్మమునకు, భక్తికి, ధ్యానమునకు, జ్ఞానము తోడయినపుడే అవి పరాకాష్టకు చేరును. కర్మము నిష్కామకర్మగా పరిణతి చెందవలయున్న జ్ఞానము అత్యవసరం. సాకార సగుణభక్తి అనన్యనిరాకార, నిర్గుణ భక్తిగా మారి పరిపక్వతను పొందవలయునన్న దైవము సర్వమయుడని తెలియుట తప్పనిసరి.

భావ, రాగ, తాళములలో భావము ప్రధానము. అదే విధంగా దైవము భావప్రియుడు, బాహ్యప్రియుడు కాదు. కర్మమున, భక్తిన, ధ్యానమున, సరైన భావమే జ్ఞానము. అట్టి భావమే ఈ అధ్యాయమున తెలుపబడినది.

8

ఎనిమిదవ అధ్యాయము

అక్షర పరబ్రహ్మ యోగము

త్రికాలములలో నశించనిది అక్షరము, నశించునది క్షరము. నాశరహిత పరబ్రహ్మము గూర్చి విశదీకరించునది కావున అక్షర పరబ్రహమ యోగమైనది. యిందున బ్రహ్మము, ఆధ్యాత్మము, కర్మము, అధిభూతము, అధియజ్ఞుడు గురించి అర్జునుని ప్రశ్నలు, ప్రణవోపాసనాఫలములు, సృష్టి స్థితి లయలు, భగవానుని స్వరూపము, ఉత్తరాయణం, దక్షిణాయనం, యోగి మహిమల గూర్చి వివరణ కలదు.

అర్జునుడు తన సందేహములను ఇట్లు వెలిబుచ్చెను: (10వ ప్రశ్న)

ఓ పురుషోత్తమా! బ్రహ్మమేది? ఆధ్యాత్మమేది? కర్మమేది? అది భూతమేది? యీ దేహమందు అధియజ్ఞుడెవరు? అతనిని తెలియుటెట్లు? అంతిమయాత్ర సమయమున స్థిరమనస్కులకు నీవెటుల తెలియబడగలవు? 8-1, 2

భగవానుడు జవాబు చెప్పుచున్నాడు:

సర్వశ్రేష్ఠం, అవినాశిబ్రహ్మం -
ఆత్మానాత్మ వివరణ ఆధ్యాత్మము

జీవోత్పత్తికి వునికి కారణం–
యజ్ఞఫల త్యాగమైన నిష్కామకర్మం 8–3

నశించు పదార్థము అధిభూతము,
విశ్వ మనోదేహములైన
హిరణ్యగర్భ, విరాట్టులు అధిదైవతము
యీ దేహము నాశ్రయించిన
పరమాత్మయే అధియజ్ఞుడు. 8–4

ఓ కౌంతేయా!
అంత్యకాలమున, నను స్మరించుచు
దేహము విడుచువారు
చేరుదురు నను నిక్కము.
సందేహము వలదు దీనికి. 8–5

ఎవరు ఏయే భావమున
దేహమును వీడుదురో
వారలు ఆ భావప్రేరిత సంస్కారమున
ఆ రూపమును పొందెదరు మరు జన్మమున. 8–6

కావున, సర్వత్ర, సర్వకాలమున,
నను స్మరించుచు, చేయుము యుద్ధము
యీ విధి మనోబుద్ధులు, నాయందే నిలిపిన
పొందగలవు, నిస్సంశయముగా నన్నే 8–7

ఓ పార్థా! మనుజుడు అభ్యాసముతో, మనోనిశ్చలతతో దివ్యమైన పరమ పురుషుని స్మరించుచూ, సర్వోత్తమమైన దివ్యస్వరూపపరమాత్మను పొందును. 8–8

ఎవడు భక్తితో, అంత్యకాలమున యోగశక్తిని, ప్రాణవాయువును, భ్రూమధ్యమున నిల్పి, సర్వజ్ఞుడు, పురాణ పురుషుడు, లోకశాసనుడు, అణువుకన్న అతి సూక్ష్ముడు, లోకోద్ధారి, అచింత్య రూపుడు, సూర్యకాంతి స్వరూపుడూ, అజ్ఞానాంధకారమునకు ఆవలనున్నవాడునగు పరమాత్మను నిశ్చల మదిన, తదేకముగ చింతిచునో వాడు, దివ్య స్వరూప సర్వోత్తమ పరమాత్మను చేరును.
8-9,10

ఏ పరమపదమును కోరి, ఏది సనాతనము, నాశరహితమైనదని వేదవేత్తలు, రాగ రహితులు, జితేంద్రియులు బ్రహ్మచర్యమును అనుష్ఠించి, దేనియందు ప్రవేశించి, అనుభవించ కోరుదురో, అద్దానిని సమగ్రముగా వివరించెదను.
8-11

పార్థా! ఎవడు దేహద్వారములైన సర్వేంద్రియములను నిగ్రహించి, మదిని ఆత్మయందు నిలిపి, సహస్రారమున ప్రాణవాయువు నుంచి, ఓంకారమును ఉచ్ఛరించుచూ, నాయందే యేకాగ్రచిత్తమున నుండి, శరీరమును వదలునో వాడు సర్వోత్తమ స్థానమును పొందును. 8-12,13

అనన్య మనస్కుడై, నిత్యము నన్ను స్మరించువానికి నేను సులభ సాధ్యుడను.
8-14.

సర్వోత్కృష్టమైన మోక్షమును పొందిన వాడు దుఃఖనిలయమైన, అశాశ్వత జన్మను మరల ఎన్నడూ పొందడు. 8-15

బ్రహ్మలోక పర్యంతమున నున్న అన్ని లోకములు
పొందిన వారలు జన్మమెత్తవలె మరల మరల
తదితరముగ నను పొందినవానికి లేదు పునర్జన్మ. 8-16

బ్రహ్మ పగలు వేయి యుగములుగా,
బ్రహ్మ రాతిరి వేయి యుగములుగ

తెలిసిన వారలు ఎరుగుదురు
అనంత రాత్రింబవళ్ళ కాలతత్వమును. 8-17

బ్రహ్మోదయమున చరాచర వస్తువులు
పుట్టును అవ్యక్త ప్రకృతినుండి, ఇవియే
బ్రహ్మోస్తమయమున విలీనమగును
యీ అవ్యక్త ప్రకృతి నందే సమస్తం. 8-18

కర్మదాసులై భూతసమూహము జన్మించును
మరల మరల బ్రహ్మోదయమున,
విలీనం చెందును బ్రహ్మోస్తమయమున
మరల మరల పుట్టి నశింతురు. 8-19

అక్షర పరబ్రహ్మ అవ్యక్త వస్తువు, అపర ప్రకృతికన్నను వేరయినది, శ్రేష్ఠమయినది, ఇంద్రియగోచరము కానిది, అతిపురాతనమైనదియు అయి, సర్వభూతములు నశించిననూ, తాను నశించకయే శాశ్వతముగ వుండును.
8-20.

ఏ అవ్యక్త వస్తువు యింద్రియములకు అగోచరము, అక్షరముగ నాశరహితము అనబడునో, దేనిని సర్వోత్తమంగా పొందదగినస్థానముగా వేదజ్ఞానులు చెప్పుదురో, దేనిని పొందిన పునర్జన్మరాహిత్యము కలుగునో, అదియే నా శ్రేష్ఠమయిన ఉత్తమ స్థానము అని గ్రహింపుము. 8-21

ఓ పార్థా!
ఎవ్వని యందు నివసించు ప్రాణులన్నియు,
ఎవ్వనిచే వ్యాపింపబడినదో యీ విశ్వమంతయు,
లభ్యమగునట్టి పరమ పురుషుడు అనన్య భక్తితోనే. 8-22

ఏ మార్గమున శరీరము విడచిన యోగులు పునర్జన్మము నొందరో,
యే యితర మార్గమున పునర్జన్మము నొందెదరో
యీ యిరుమార్గములను వివరింతును వినుము. 8–23

అగ్ని, ప్రకాశము, పగలు, శుక్ల పక్షము
అను ఆరు మాసములు ఉత్తరాయణము
ఆ ఉత్తరాయణ మార్గమున ప్రాణము వదలిన
బ్రహ్మజ్ఞానులుపొందెదరు బ్రహ్మమునే. 8–24

అగ్నివలె స్వఛ్ఛ హృదయుడు,
ఆత్మజ్ఞాన ప్రకాశమున వెలిగెడు వాడు,
జ్ఞాన భాస్కరుడు ఉదయించినవాడు
ఊర్ధ్వగతిన మనోబుద్ధులు ఆత్మ యందుంచి
సహస్రారము వైపు ఎగసి, పరమాత్మతో ఐక్యమైన యోగి
జన్మరాహిత్యముతో పునర్జన్మను పొందదు. 8–24 (2)
(ఇది ఉత్తరాయణ అంతరార్థం)

పొగ, రాత్రి, కృష్ణపక్షం కూడిన,
ఆరు మాసములు అగును దక్షిణాయనము,
యీ దక్షిణాయన మార్గమున చనిపోయిన
ప్రతిఫలాక్ష కర్మయోగులు
చంద్ర సంబంధ దేహ మనోభ్రాంతిన
పునర్జన్మము నొందెదరు. 8–25

పొగవలె మది నాక్రమించిన మాయా మోహము వలె,
చీకటి రాత్రివలె నుండు అజ్ఞానము, అవిద్యతోనున్న,
కృష్ణ పక్షమువలె క్షీణించు మనసు
అను ఆరు మాసముల దక్షిణాయనము. ఈ దిశగా పయనించువారు

ప్రతిఫలాశతో జరుపు కామ్య కర్మలు

మూలాధారము వైపు పయనించి పునర్జన్మమునొందెదరు. **8-25(2)**

ఉత్తరాయణమను ఆరుమాసములు అగ్ని, ప్రకాశము, శుక్లపక్షములతో కూడియున్నది. ఈ దిశలో ఉత్తరాయణంలో అసువులు వీడిన పుణ్యమని నమ్మిక. అగ్ని జ్ఞానాగ్ని దగ్ధకర్మమున వచ్చు స్వచ్ఛతకు - ప్రకాశం ఆత్మజ్ఞాన ప్రకాశానికి - శుక్లపక్షము, చంద్రుడు వర్ధిల్లు ఊర్ధ్వ దశకు - కుండలినీశక్తి సహస్రార దిశాపయనానికి సంకేతాలు. స్వచ్ఛమైన వ్యక్తి, ఆత్మప్రకాశము గలిగి, ఊర్ధ్వదిశగా పయనించిన వ్యక్తి మరణానంతరము ఉచ్ఛస్థితికి చేరునని అంతరార్థము. అందుకొరకే దక్షిణాయనమున అంతిమదశకు చేరిన భీష్మ పితామహుడిని, ఆయన కోరిక మేరకు ఉత్తరాయణం వచ్చు వరకు నేలపై వాలకుండా ఉంచుటకు అర్జునుడు బాణాలతో అంపశయ్యను నిర్మించెను.

దక్షిణాయనం. ఈ ఆరుమాసాలు పొగ, రాత్రి, కృష్ణపక్షముతో కూడియున్నవి. ఈ కాలములో అసువులు బాసిన వారికి పుణ్యగతులు ప్రాప్తించవని నమ్మిక. ఇది భౌతిక అర్థం. ఇందులో పొగ మనసును ఆవరించిన ఆవరణ దోషానికి చెందిన అజ్ఞానము. నేను దేహమునే అనుకునే దేహాత్మ భ్రాంతి. రాత్రి చీకటికి గుర్తు. చీకటి అజ్ఞానానికి ప్రతీక. కృష్ణపక్షము క్షీణదశ. కుండలిని మూలాధారాన్ని అంటిపెట్టుకొని ఉండటం. దీని అంతరార్థము ఆవరణ దోషంతో దేహభ్రాంతితో ఉండి, అజ్ఞానంతో పరిణతి చెందని మానవత్వముతో మూలాధారమున ఉండి ప్రాణాలు విడిచిన వ్యక్తి అధోగతి చెందునని అంతరార్థము.

ఇవి భౌతికసంబంధ సూర్యమాన, చాంద్రమాన సంవత్సరాలకే కాక అంతర్భూతమైన ఉత్తరాయణ, దక్షిణాయనముల అంతరార్థం.

శుక్ల కృష్ణ, ఉత్తరాయణ, దక్షిణాయన,

ఊర్ధ్వఅధో మార్గములు ఉండెను అనాదిగ, శాశ్వతముగ,

అందున ఊర్ధ్వగతిన జన్మరాహిత్యమును
అధోగతిన పునర్జన్మమును పొందును యోగి. 8-26

ఓ పార్థా! ద్వివిధ మార్గములను ఎరిగిన యోగి మోహమునొందడు, కావున నీవు ఎల్ల కాలముల ఊర్ధ్వమార్గమున, దైవ ధ్యాసలో యోగయుక్తుడవు కమ్ము. 8-27.

యోగి అయినవాడు, యీ ఊర్ధ్వమార్గమును ఎరిగి, వేద, యజ్ఞ, దాన, తపస్సుల పుణ్య ఫలమును అతిక్రమించి, అనాదియగు సర్వోత్తమ స్థానమైన బ్రహ్మమును పొందుచున్నాడు. 8-28

ఈ అక్షరపరబ్రహ్మ యోగమున పరబ్రహ్మమును గూర్చి ఊర్ధ్వమార్గపు ఉత్తరాయణము గూర్చి, అధోమార్గ దక్షిణాయనం గూర్చి తెలుపబడింది.


Hindupad

9

తొమ్మిదవ అధ్యాయము

రాజవిద్యా రాజగుహ్యా యోగము

విద్యలలో మేలైనది, అతి రహస్యమైనది ఈ రాజవిద్యా రాజగుహ్యా యోగం. యిందులో ఆధ్యాత్మవిద్య, భగవత్ స్వరూప వర్ణన, జగదుత్పత్తి, అసుర, దైవీ ప్రకృతుల, దైవ స్వరూప, భక్తి నిష్కామ కర్మల కలయిక మహిమ వర్ణనము కలదు.

భగవానుడు చెప్పెను:

పార్థా, నీవు దేనిని తెలిసికొనిన అశుభకరమైన సంసార బంధము నుండి విముక్తుడవు అవుదువో, అట్టి అతి రహస్య ప్రత్యక్షానుభవ బ్రహ్మజ్ఞానమును అసూయలేని, స్వఛ్చహృదయుడవు కాన నీకు చెప్పెదను వినుము. 9–1.

ఇది రాజవిద్య. విద్యలోకెల్ల ఘనము, రహస్యములలోకెల్ల అతి రహస్యము. అన్నిటికన్నను మిన్న. అతి పవిత్రము, ప్రత్యక్ష అనుభవము వలననే తెలియునది, ధర్మమైనది, సులభ సాధ్యమైనది, నాశరహితమై, నిత్యమయినది. 9–2

ఓ పరంతపా! ధర్మాసక్తత లేని మనుజులు
నన్ను పొందక మృత్యురూప సంసారమున
జన్మ పునర్జన్మ పరిభ్రమణచక్రమున
తిరుగుచుందురు-ఇది నిక్కమని తెలియుము. 9-3

యీ జగత్తంతయును
వ్యాపింపబడినది అవ్యక్తరూపుడగు నాచే
సమస్త భూతములు వున్నవి నాయందే
కాని, నేను లేను వానియందు 9-4

యీ ప్రాణులు లేవు నాయందు
చూడుము నా యోగ ఐశ్వర్యమును
భూత ఉత్పత్తి, స్థితులకు కారణమైన నేను
ఏ ప్రాణులందును లేను. 9-5

పైన తెలిపిన రెండు పద్యములందు తెలిపిన అంశములలో ప్రాణులు నాయందు ఉండును అని ఒక దానిలో, ఉండవు అని మరొక దానిలో చెప్పినందున అవి పరస్పరవిరుద్ధములు కదా అని సందేహము కలుగవచ్చు. ఇవి రెండు భావములతో చెప్పబడినవి. మొదటిది ద్వైత భావమున, రెండవది శుద్ధ అద్వైత భావమున చెప్పబడినవి. తరువాతి రెండు పద్యములలో ఈ సందిగ్ధతను వివరించే ప్రయత్నం జరిగింది.)

అద్వైత దృష్టిన, దృశ్య రూపకల్పిత
మాయా జగత్తు కాదు నాకు అధారము.
జగత్తు నాకు ఆధారము కాదు. తాడునందు పాము లేనటుల
నే నే ఆధారము నా యోగమాయకు.
నేనే ఆధారము జగత్తునకు. 9-5.2

వున్నది నిజముగ ఒక్కటే.
వున్నది నేనొక్కడినే
నేను కానిది వేరొకటి లేదు లేదు.
నేనే సర్వము, సర్వము నేనే. **9-5.3**

యే రీతిన వాయువు సర్వత్రా
వ్యాపించి ఉన్నదో ఆకసమున
అదే రీతిన సర్వభూతములు
నాయందు వున్నవి తెలియుము నిక్కము. 9-6

ప్రళయమునందు సమస్త భూతములు
నా మాయా ప్రకృతిని చేరును.
మరల సృష్టి సమయమున
సృజించుచుంటిని వీటిని. 9-7

జీవసముదాయము ప్రకృతికి అధీనమైనందున
నేనే నా స్వతంత్ర ప్రకృతి ననుసరించి
సమస్త జీవజాలమును
సృష్టించెదను మరల మరల. 9-8

(మాయా ప్రకృతికి లోబడియున్న భూతజాలము మాయాతీతుడనైన నాచే మరల, మరల సృష్టించబడును).

యీ విధముగా జీవసృష్టి కావించిననూ
ఆశాది కర్మ సంగమము లేక, సాక్షీభూతినైన
నేను బంధింపబడను ఆ కర్మలందు. 9-9

సాక్షీభూతుడనై నా అధీనమున వున్న ప్రకృతిన
చరాచర సమస్త జీవజాల సృష్టి జరుగును. 9-10

సర్వ భూతములకు ఈశ్వరుడనై
మానవ దేహమున ఉన్న నన్ను
నా యీ పరమతత్వము ఎరిగి, గుర్తించక
అవమానించెదరు మూఢులు. 9-11

అట్టి వారలు అతి ఆశలతో కామ్య కర్ములై
ఫలాపేక్షతో, అస్పష్ట జ్ఞానముతో, మూఢులై
అసురత్వమును ఆశ్రయింతురు. 9-12

సాత్వికులైన మహాత్ములు,
దైవీ ప్రకృతి స్వభావులు
నను సర్వభూతాధిపతిగ,
నాశరహితునిగ గుర్తించి
సేవింతురు ఏకాగ్రచిత్తమున. 9-13

వీరిలో కొందరు నిరంతరం నను కీర్తించుచు,
సాధన సలుపుతూ అతి శ్రద్ధతో,
భక్తితో నాకు నమస్కరిస్తూ,
మది నాయందే నిలిపి ఉపాసించెదరు. 9-14

కొందరు నను జ్ఞానమున సర్వవ్యాపిగా,
సర్వాంతర్యామిగ సేవింతురు
సర్వేశ్వరునిగా, మరికొందరు సేవింతురు
బహు రూప, నామముల వానిగా. 9-15

నేనే క్రతువు, యజ్ఞము, పిండము, ఔషధము
మంత్రము, నేయి, అగ్నిని, హెూమమును 9-16

నేనే విశ్వాధారము, మాతను, పితను, తాతను.
సర్వ కర్మ ఫలదాతను, తెలియదగినవాడను
ఓంకారమునూ, నాల్గు వేదములునూ నేనే. 9-17

నేనే జగతికి పతియు, గతియు, ప్రభువును,
సాక్షిని, నివాసమును, ఆశ్రయము, ఆప్తుడను,
సృష్టి, స్థితి, లయుడను, ఆధారము, ప్రళయము,
స్థానము, శాశ్వత బీజమును నేనే. 9-18

ఎండలు వానలు నేనే,
అతివృష్టి, అనావృష్టి నేనే
అమృతమును, విషమును,
ప్రాణమును, మృత్యువునూ,
సత్తూ అసత్తు నేనే. 9-19

త్రివేద జ్ఞానులు, సోమాపానమును చేసి
నను సేవింతురు యజ్ఞమున,
సుర లోక సుఖములకై. 9-20

యీ వేద కర్మానువర్తులు, భోగులు స్వర్గలోక సుఖానుభవం తదుపరి, క్షీణించిన పుణ్యముతో భువికి మరల పునర్జన్మమున వచ్చుచూ జనన మరణ చక్రమున తిరుగుచుందురు. 9-21

ఎవరు అనన్య చింతనమున, నిరంతర నిష్ఠన
నాయందే మనసు నిలిపి, ఎడతెగక నన్నే ధ్యానించెదరో,
అట్టిభక్తుల యోగ క్షేమములు
నేనే చూసుకొందును. 9-22

(ఈ శ్లోకము భగవద్గీతలో కేంద్రబిందువుగా పరిగణింపబడుచున్నది. అందుకు గల కారణములను, దీని విశిష్టతను తెలుసుకొనుట అవసరము. చూడుదు - 18-66, 2-7)

సర్వ యజ్ఞముల భోక్తను, ప్రభువును నేనే అయి వుండగా, నా నిజస్వరూపమును తెలియక, క్రమము తప్పి యితర దేవతలను భక్తి శ్రద్ధలతో పూజించువారునూ, నన్నే ఆరాధించు వారగుదురు. ఇతరులను ఆరాధించి, పునర్జన్మము పొందుచున్నారు. 9–23, 24

దేవతలను ఆరాధించువారు దేవతలనూ,
పితృదేవతలను ఆరాధించువారు పితృదేవతలనూ,
భూతములను ఆరాధించు వారలు భూతములను,
నన్ను ఆరాధించువారలు నన్నే పొందుచున్నారు. 9–25

ఎవరే రీతిన నను సేవించిన,
ఆరీతిగ నే కనుపించెద
యద్భావం, తత్ భవతి–
నీ భావమే నీ గమనం, నీ గమ్యం. 9–25.2

ఏ భావమున సేవించిన అదే ఫలితమును పొందుదురు. భావమెట్టిదో ఫలితమట్టిదే. అన్ని భావముల మూలము బ్రహ్మమునకే చేరును. పూర్ణభావమున బ్రహ్మమును తలచిన పూర్ణ ఫలితము బ్రహ్మము ఒసగును. అట్లు గాక పాక్షికభావమున బ్రహ్మమును తలచిన అదే బ్రహ్మముపాక్షిక ఫలములను ఒసగును. బ్రహ్మమునకు పక్షపాతము లేదు. ఆయన సాక్షీభూతుడు మాత్రమే. ఏ పాత్రతో కొలిచిన, ఆ పాత్ర నిండుగానే ఫలితమునందించును. ఫలితము బ్రహ్మదోషమున కలుగదు, అది మన పాత్రలదోషమువలన కలుగును. పాత్రల పరిమాణాల తేడాను అనుసరించి ఫలితపు పరిణామాల తేడా సంభవించును. పరమేశ్వరుని సంపూర్ణేశ్వరునిగా తలచిన వానికి సంపూర్ణ ఫలము లభించును. అది జన్మరాహిత్యము కలిగించును. దేవతా రూపమున స్వార్థ బుద్ధితో ఏదో ఒక ఫలితమును ఆశించి చేసిన ఆ తలంపు అదే సర్వేశ్వరునికి చేరి మనభావలేమివలన మనం కోరుకున్న ఫలితానికి మాత్రమే పరిమితం అవుతుంది.

నాకు పత్రంగాని, ఫలంగాని, నీరుగాని,
నాయందు భక్తితో ఏది సమర్పించినను
అట్టి పరిశుద్ధ హృదయులు, భక్తితో యిచ్చినవి
నేను అతి ప్రీతితో సేవించెదను. 9–26

భగవంతుడు భావప్రియుడు కాని, బాహ్యప్రియుడు కాదు. ఏది సమర్పించావని కాదు, ఏ భావనతో యిచ్చావనేది ముఖ్యం.

నీవు ఏది చేసినను, తినినను,
హెూమార్పణము చేసినను, దానమొసంగినను,
ఏ త్యాగమొనర్చినను, అవి అన్నియు
నాకు అర్పణ చేయు భావమున చేయుము. 9–27

యీ కర్మఫల త్యాగభావమున
(కర్మసన్యాస యోగము)
పుణ్య పాపముల, శుభాశుభముల,
కర్మ ఫల బంధముల నుండి
విడువబడినన్ను పొందెదవు. 9–28

నేను సమదృష్టితో నుండువాడను,
లేరెవ్వరు నాకు ద్వేషులు, ప్రియులు
ఎవరెవరు నన్ను భక్తితో కొలచిన
వారు నాలో, నేను వారిలో వుండెదము. 9–29

నా దృష్ఠి సమదృష్ఠి, సమత్వం యోగం,
యోగదృష్ఠి నా దృష్ఠి
నా అనుగ్రహం సర్వసమానం
భక్తుల భావాలకు ప్రతిధ్వని,
ప్రతిరూపం, ప్రతిచర్యే నా కృప. 9–29 (2)

నా శక్తికన్నను భక్తుని భక్తి మిన్న.
భక్తాధీనుడ నేను, భక్తవశుడను నేను
భక్త సేవకుడ నేను, భక్తుల భక్తియే నాకు ఆస్తి
భక్తుల భక్తి బలము నా శక్తి కన్న ఎంతో మిన్న.
సక్కుబాయి, తుకారాములే నిదర్శనం. 9–29 (3)

దురాచారి అయినను, అనన్య భక్తితో
నను సేవించువాడు, సత్పురుషుడు, శ్రేష్ఠుడు
ఏలననగ అతడు చంచలత్వము లేని
స్థిర మతి, అనన్య చింతనుడు కావున. 9–30

అతడు పాపాత్ముడైనను, శీఘ్రముగ ధర్మాత్ముడవును,
శాశ్వత శాంతిని పొందును,
కౌంతేయా ఇది నిశ్చయము. (ప్రతిజ్ఞ చేయుము)
నా భక్తుడు ఎప్పుడూ చెడడు,
చెడడెన్నడు నా భక్తుడని. 9–31

ఓ పార్థా! పలుజన్మల ఇంద్రియ విషయ బంధితులు (పాపజన్ములు), స్వలాభాపేక్షతో కర్మములు చేయువారు (వైశ్యులు),జీవన పరమావధిని మరచి తామసిక గుణముతో దినదినము ప్రాపంచిక కర్మల ఆధారంగా జీవించువారు (శూద్రులు), అసూయ, రాగద్వేషములను అంటిపెట్టుకొని ఉన్నవారు (స్త్రీలు)కూడ నన్ను ఆశ్రయించి సర్వోత్తమ మోక్షము పొందుచున్నారు.

పుణ్యాత్ములయిన బ్రహ్మజ్ఞానులు (బ్రాహ్మణులు),
భక్తులగు రాజర్షుల విషయము యిక చెప్పనేల!
అందువల్ల అశాశ్వతమైన, సుఖరహితమైన
యీ లోకమున నున్న నీవు నన్ను భజింపుము. 9– 32, 33

జన్మ నందరు శూద్రులవుదురు
మంచి కర్మల ద్విజులగుదురు
వేద జ్ఞానమున విప్రులగుదురు
బ్రహ్మజ్ఞానమున బ్రాహ్మణులు అగుదురు. – అత్రి సంహితమూలం

నా యందే మనసునుంచి, నాయందే భక్తిగలిగి,
నన్నే పూజించువానిగా నాకే నమస్కరింపుము.
యీ రీతిన చిత్తము నాయందే నిలిపి,
నన్నే పరమావధిగా తలచి, పొందుము నన్నే. 9–34

అతిగుప్తమగు రాజవిద్య గూర్చి తను కేవలం సాక్షీభూతుడని, వారివారి భావానుగుణంగానే ఫలితాలు లభ్యమగునని, యద్భావం తత్‌భవతనీ, చాతుర్వర్ణ ప్రస్తావన యీ అధ్యాయమున వివరించబడినది.


Sankar

10

పదవ అధ్యాయము

విభూతి యోగము

భగవదైశ్వర్యము, మహిమలగూర్చి తెలుపునది కాన, యిది విభూతి యోగమైనది. యిందు భగవానుని విభూతి, భక్తి వర్ణనలు కలవు.

భగవానుడనెను:

ఓ మహాబాహో!
సంతస మనమున వున్న నీకు హితముకోరి తెలిపెదను
మరొక శ్రేష్ఠమైన విషయమును – వినుము దానిని. 10–1

దేవతలుగాని, ఋషులుగాని ఎరుగరు నా మొదలు
నేనే వారి జన్మలకు కారణము కావున. 10–2

అనాది నేను, అపౌరుషేయం నేను
ఆది మధ్యాంత రహితుడను నేను
మొదలు, తుది, మధ్యములు లేవు నాకు
కాలాతీతుడను నేను, కాలగర్భుడను నేను 10–2 (2)

నన్ను జనన మరణములు లేని అనాదిగ
సకలలోకములను నియంత్రించు దర్శకునిగ
యెరిగిన వాడు మనుజులలో అజ్ఞానము లేక,
విజ్ఞానధనుడై సర్వ పాప విముక్తుడు అగుచున్నాడు. 10–3

బుద్ధి, జ్ఞానము, మోహరాహిత్యము, ఓర్పు, సత్యము,
బాహ్యేంద్రియ నిగ్రహము, అంతరేంద్రియ నిగ్రహము,
సుఖము, ఉత్పత్తి, నిర్భయము, అహింస,
సమత్వము, సంతుష్ఠి, తపస్సు, దానము, కీర్తి,
దుఃఖము, భయము, అపకీర్తి, నాశము,
అను యిరవై గుణములు కలుగు చున్నవి నాయందే. 10–4,5

సర్వ గుణముల సాక్షిని నేను
పదునారు విజ్ఞాన గుణములకు
నాల్గు అజ్ఞాన గుణములకు
సాక్షీభూతుడను నేను 10–4,5 (2)

గుణము కర్మానుసారము
మంచి కర్మము మంచి గుణము
దుష్ట కర్మము దుష్ఠ గుణము
వారివారి కర్మ శేష గుణ
సంస్కారమునకు నే సాక్షిని మాత్రమే. 10–4,5 (3)

నా మనోసంకల్పమున నాయందు
దైవభావముతో జనించిరి, సప్తమహర్షులు,
సనకాది నలుగురు దేవర్షులు, పదునలుగురు మనువులు–
వీరందరు సమస్త లోకాల జనుల పూర్వీకులు. 10–6

ఎవడు నా యీ విభూతిని, యోగమును
యదార్ధ రీతిన తెలియునో, అట్టివాడు

నిశ్చల యోగములోనున్న ముని.
సందేహము వలదు, నిక్కము. 10-7

నేనే సర్వము, నేనే ప్రభువును
నేనే ఉత్పత్తి, స్థితి, లయల కారకం
యిది తెలిసిన విజ్ఞులు పరిపూర్ణ నిర్మల
భక్తి భావమున నను భజింతురు. 10-8

అట్టి వారు, నాయందే మనసు నిలిపి,
నాయందే ప్రాణముంచి, ఒకరికొకరు
భోధించుకొనుచు, చెప్పుకొనుచు నా కథలను
సంతృప్తిని, ఆనందమును పొందుచున్నారు. 10-9

ఏ జ్ఞానమున నాయందు మనసు నిలిపి,
నను ప్రీతితో భజించి సేవింతురో,
ఏ విధిన వారు నను పొందెదరో,
అట్టి జ్ఞానమును ప్రసాదించుచున్నాను నీకు. 10-10

వారి యందు దయతో, వారి
అంతఃకరణముననే నిలచి నేను
జ్ఞాన దీప ప్రకాశమున పలు జన్మల
అజ్ఞానాంధకారమును నశింప జేయుచున్నాను. 10-11

అర్జునుడడిగెను :

(11వ ప్రశ్న) తన మహిలను గురించి తెలుపమనెను.

పరబ్రహ్మవు, పరంధాముడవు, పరమపావనుడవు నీవు -
ఋషులందరు, దేవర్షి నారదుడు, అసితుడు, దేవలుడు, వేదవ్యాసుడు
నిన్ను నిత్యునిగ, ప్రకాశ స్వరూపునిగ, పరమ పురుషునిగ,

ఆదిదేవునిగ, జన్మ రహితునిగ, సర్వవ్యాపకునిగా చెప్పిరి.
నీవును అదేరీతిన స్వయముగ చెప్పుచున్నావు నాకు. 10-12,13

ఓ కేశవా! నీవు నాకు చెప్పినదంతయు
సత్యమేయని నమ్ముచున్నాను నేను
నీ నిజ స్వరూపమును సురాసురులు కూడా
ఎరుగజాలరు కదా భగవాన్. 10-14

ఓ పురుషోత్తమా! సర్వజీవముల సృష్టికర్తవు,
సర్వభూతముల ప్రభువా, సకల దేవదేవుడవు,
జగద్రక్షకుడవు, నీ నిజస్వరూపము
నీకు నీవే తప్ప, తదితరులు తెలిసికొనలేకున్నారు. 10-15

దివ్యములైన నీ మహిమలచే
సర్వలోకముల నాశ్రయించితివి, అట్టి
నీ మహిమలను గురించి చెప్పుటకు
నీవొక్కడవే తగినవాడవు. 10-16

నిను నేనెట్లు తెలిసికోగలను!
నిన్ను సదా ధ్యానము చేయువానిగ,
అదే ధ్యానము ద్వారానా? లేక తదితర భావముతోనా?
నిన్ను ఎటుల ధ్యానించి తెలుసుకోగలను? 10-17

ఓ జనార్దనా! ఎంత వినినను నీ మహిమలు
తనివి తీరుట లేదు నాకు,
నీ మహిమలు, శక్తుల గురించి
వివరముగ తెలియజేయుము కృష్ణా! 10-18

ఈ శ్లోకంలో 'ఎంత విన్ననూ నీ మహిమలు తనివి తీరుట లేదు' అని పార్థుడు అన్నాడు. అర్జునుడు అన్న ఈ మాట భగవంతుని విభూతి, దైవత్వ లక్షణం. ఈ లక్షణము ఎవరికి ఉన్ననూ (అనన్య భక్తుడు, అవతారపురుషుడు, యోగి, ఋషి, స్వఛ్ఛ మనస్కులు) వారిలో దైవత్వము ప్రకాశించుచున్నట్లే. దైవత్వం ఎంత చూచినా, ఎన్నిమార్లు చూసినా, ఎంత విన్నను, ఎన్నిమార్లు విన్ననూ నిత్యనూతనముగా మరల, మరల పదేపదే చూడాలని, వినాలని అనిపిస్తుంది. ఇది దివ్యాకర్షణ. కృష్ణ అనగా ' కర్షతేతి కృష్ణః' ఆకర్షించే శక్తి. అందువలన అర్జునుడు ఈ మాట అనటం ఎంతో సమంజసం.

భగవానుడిలా అన్నాడు:

ఓ కురుశ్రేష్ఠా! నా మహిమలు అనంతములు.
అందులకై నే తెలిపెదను ముఖ్యమైనవి కొన్నిటిని నీకు. 10-19

ఓ గుడాకేశా! సమస్త జీవుల
హృదయాలలో నున్న జీవాత్మను నేను,
సర్వభూతముల సృష్టి, స్థితి, లయ కారకుడను నేను. 10-20

అదితి సంతానములలో విష్ణువును
వెలుగులలో సూర్యుడను,
వాయువులలో మరీచిని
నక్షత్రాలలో చంద్రుడను. 10-21

వేదాలలో సామవేదాన్ని - దేవతలలో యింద్రుడిని,
యింద్రియాలలో మనసును - భూతాలలో చేతనను. 10-22

రుద్రులలో శంకరుడను - యక్షులలో కుబేరుడను,
అష్ట వసువులలో అగ్నిని - పర్వతాలలో మేరువును. 10-23

పురోహితులలో బృహస్పతిని,
సేనాధిపతులలో కుమారస్వామిని,
సరస్సులలో సముద్రుడను. 10-24

మహర్షులలో భృగువును
శబ్దంలో ఓంకారమును,
యజ్ఞాలలో జ్ఞాన యజ్ఞాన్ని
జడ పదార్థాలలో హిమాలయాన్ని. 10-25

వృక్షాలలో అశ్వత్థ వృక్షాన్ని - దేవర్షులలో నారదుడిని,
గంధర్వులలో చిత్రరథుణ్ణి - సిద్ధులలో కపిల మునిని. 10-26

గుర్రాలలో ఉచ్చైశ్ర్శవమును
ఏనుగులలో ఐరావతాన్ని,
మనుజులలో రాజునని నన్ను తెలియుము. 10-27

ఆయుధాలలో వజ్రాయుధాన్ని
గోవులలో కామధేనువును
ఉత్పత్తిలో మన్మధుడను
సర్పాలలో వాసుకిని. 10-28

నాగులలో ఆదిశేషుడిని
జలదేవతలలో వరుణుడిని
పితృదేవతలలో ఆర్యమయుడను
శాసించే వారిలో యముడను. 10-29

రాక్షసులలో ప్రహ్లాదుడను -
గణించేవారిలో కాలాన్ని
మృగాలలో సింహాన్ని -
పక్షులలో గరుత్మంతుడను. 10-30

వీచేవానిలో గాలిని -
ఆయుధధారులలో రాముడిని,
జలచరాలలో మొసలిని -
నదులలో గంగా నదిని. 10-31

ఓ అర్జునా! సమస్త చరాచర సృష్టికీ,
ఉత్పత్తి, వునికీ, అంతమూ నేనే. 10-32

అక్షరాలలో అకారాన్ని
సమాసాలలో ద్వంద్వమును
నాశనములేని వాటిలో కాలాన్ని
దిక్కులలో చతుర్ముఖ బ్రహ్మను. 10-33

హరించేవారిలో మృత్యువును
రాబోయేవాటిలో సృజనాత్మకతను
స్త్రీలలోని కీర్తి, సంపద, వాక్కు,
జ్ఞాపకశక్తి, తెలివి, ధైర్యం, ఓర్పును నేనే. 10-34

సామవేద గానాలలో బృహత్సామాన్ని
చందస్సులో గాయత్రిని,
మాసాలలో మార్గశిరాన్ని
ఋతువులలో వసంత ఋతువును. 10-35

వ్యసనాలలో జూదాన్ని -
మంచి వారిలోని తేజస్సును,
గొప్పవారిలోని విజయాన్ని -
కృషి చేసే వారల కృషిని
బలవంతుల బలాన్ని నేను. 10-36

యాదవులలో వాసుదేవుడను
పాండవులలో అర్జునుడను,
మునులలో వ్యాసుడిని
కవులలో శుక్రాచార్యుడను. 10-37

న్యాయములో దండనము -
విజయములో నీతిని
రహస్యాలలో మౌనాన్ని -
బుద్ధిమంతుల జ్ఞానాన్ని నేను. 10-38

అర్జునా! సకల భూతజాలానికి మూలబీజాన్ని నేను,
నేను లేనిది, కానిది యీ చరాచర
విశ్వంలో యేదియును లేదు. 10-39

పరంతపా! నా దివ్య విభూతులు అనంతం.
అయినను విస్తారమైన నా విభూతులను
సంగ్రహముగ వివరించితిని నీకు. 10-40

యీ విశ్వంలోని ఐశ్వర్యవంతమూ,
శోభాయమానమూ, ఉత్సాహభరితమూ,
అయిన ప్రతిదీ, నా యీ తేజస్సులోని
ఒక అంశము అని తెలియుము. 10-41

అర్జునా! నాయీ వివిధ వివరాలకన్న మిన్న
ఒకే అంశము ముఖ్యము, అది యీ సమస్త విశ్వం
నాలోని ఒక చిన్న అంశమాత్రమేనని తెలియుము. 10-42

దైవ విభూతి వర్ణన ఈ అధ్యాయ సారాంశం.

11

పదకొండవ అధ్యాయము

విశ్వ రూప సందర్శన యోగము

విశ్వరూపదర్శన లక్ష్యం, ప్రత్యక్షానుభవాన్ని కలిగించటమే, ఈ అనుభవం త్రికాలాతీతం. యిందు విశ్వవిరాట్ దర్శనం కాలస్వరూపమైన కాలుడి దర్శనం. భీతిల్లిన అర్జునుడు తన సహజస్వరూపమునకు రమ్మనుట వివరించబడినది.

తనను గురించి తననే వివరించమని, అందుకు ఆయనే తగినవాడని, ఏవిధముగా ధ్యానించవలనో స్వయంగా తెలియజేయమని పార్థుడు శ్రీకృష్ణుని ప్రార్థించబోయే ఘట్టము. అనాది, అనంతుడు అయిన భగవంతుని నియమిత పరిధిగల మనసుతో తెలుసుకోవటం అసంభవం. అది ఒక అనంతుని ద్వారానే సాధ్యము. ఇది పరిమితమైన మనస్సు (జీవుడు) అనంతునికి ఆత్మ నివేదన చేయటం ద్వారానే సాధ్యం.విశ్వరూప దర్శనము ప్రతి ముముక్షువునకు అత్యున్నత దశ. విద్యకు పరాకాష్ట ప్రత్యక్షఅనుభవం. ప్రత్యక్ష అనుభవం లేని ఆత్మవిద్య సమగ్రము కాదు. ఇందులో తెలుసుకోవటం, వినటం, చదవటం, మననం, నిధిధ్యాస, అనుభవం వంటి వివిధ దశలు ఉంటాయి.

పాండవులలో ప్రధానయోధుడైన అర్జునుడు కృష్ణుడిని ఆజ్ఞాపించి 'రథాన్ని ఇరుసేనల మధ్య నిలుపుము' అనే (1-22) స్థాయి నుంచి ఆయననే ప్రార్థించి శిష్యుడిగా పరివర్తన చెంది 'నాకు ఏది శ్రేయమో నిర్దేశించి ఆజ్ఞాపించుము' (2-7) అనే స్థాయికి చేరి మౌనం వహించెను. (2-11) మౌనము లోనే అంతర్వాణి యైన ఆత్మఘోష వినపడుతుంది. ఆత్మవాణి యైన శ్రీకృష్ణుని బోధ అత్యవసర స్థితి నుంచి అర్జునుడిని కాపాడటం జరిగింది. సాంఖ్య, కర్మ, జ్ఞాన, కర్మసన్యాస, అత్మసంయమన, విజ్ఞాన, అక్షరపరబ్రహ్మ, రాజవిద్యా, రాజగుహ్య రహస్యాలనుతెలిపిన పిమ్మట - క ృష్ణపరమాత్ముని నిజస్వరూపాన్ని అర్థం చేసుకున్నవాడై, తదితర ప్రశ్నలను ఆపి భగవానుని గురించి మాత్రమే తెలుసుకొనగోరిన ఘట్టము ఇది.

ఫల్గుణుడు ప్రార్థించెను :

(12వ ప్రశ్న - ఈశ్వర సంబంధ విశ్వరూపమును చూపమని)

నామీద దయతో పరమ రహస్యమైన, ఆత్మజ్ఞాన అధ్యాత్మిక విషయము లన్నిటినీ విశదీకరించితివి. దీనితో నా అజ్ఞానమంతా నశించినది. 11-1

నీనుండి సమస్త ప్రాణుల చావు పుట్టుకల గురించియు, నీ అఖండ మహాత్మ్యం గురించియు వివరంగా వింటిని. 11-2

ఓ పరమేశ్వరా! నీ గురించి నీవు చెప్పినదంతా నేను నిజమని నమ్ము తున్నాను. పురుషోత్తమా! నీ ఈశ్వర సంబంధ విశ్వరూపాన్ని చూడాలని నా అభిలాష. 11-3

యోగీశ్వరా! నీ నిత్యమైన విశ్వరూపాన్నిచూచుట నాకు సాధ్యమని తలచిన, ఆ విశ్వ స్వరూపమును యిక నాకు చూపుము ప్రభో! 11-4

భగవానుడిలా చెప్పెను:

ఓ పార్థా! నానావిధములైన, దివ్యమైన, అనేక రంగులూ, ఆకారములు గల, వందలవేల రూపములతోనున్న నా అనంత రూపమును చూడుము.

11-5

ఓ భారతా! సూర్యచంద్రులను, వసువులను, రుద్రులను,
అశ్వనీ దేవతలను, మరుత్తులను చూడుము.
అదేవిధముగా, మునుపెన్నడూ చూడని రీతిన
మిక్కిలి ఆశ్చర్యకరమైనవి చూడుమిపుడు. 11-6

ఓ గుడాకేశా! యీ చరాచర జగత్తునూ,
యింకేమేమి చూడదలచిన, అవన్నియూ
ఒకే చోట నా శరీరమునందు చూడుమిపుడు. 11-7

చూడలేవు నీ యీ భౌతిక నేత్రాలతో
నా యీ అలౌకిక విశ్వరూపమును
కావున ప్రసాదించెదను నీకు దివ్య దృష్టిని,
నా యోగైశ్వర్యాలను చూడుమిపుడు. 11-8

కన్నులకు చూపును యిచ్చేవాడు భగవంతుడు. అంటే చూపుకు చూపును ఇచ్చే వాడు. కన్నులు చూడవు. కన్ను కాంతిని స్వీకరించి లోనికి పంపే పరికరం మాత్రమే. కంటి వెనుక తెర దానిని గ్రహించి చక్షునాడికి, మెదడులోని చక్షు కేంద్రానికి ప్రకంపనల రూపంలో చేర్చుతుంది. అలా చేరిన ప్రకంపనలను ఎరుకగా, దృశ్య జ్ఞానంగా మార్చి చూచేది మనలోని దైవ అంశ ఆత్మ మాత్రమే.

దీనిని అర్థం చేసుకోవటానికి ఋజువు చనిపోయినవారికి కూడా కళ్లు, చక్షునాడి,

చక్షుకేంద్రము, మెదడు ఉంటాయి. అంటే ఆత్మ దేహాన్ని విడిచిన తరువాత పరికరాలు అన్నీ ఉన్నప్పటికీ దేహము చూడలేదు. కనుక బాహ్యపు చక్షురేంద్రియాలతో దైవాన్ని దర్శించుకోలేము. కాని దైవకృపతో మాత్రమే దైవాన్ని అంతర్ చక్షువులతో (ఆత్మజ్ఞానంతో– మూడోనేత్రం) చూడగలము. పరిమిత చక్షుపరికరాలు అపరిమిత దైవత్వాన్ని చూడగలవా? అపరిమిత దైవకృప వల్లనే అనంత దైవాన్ని దర్శించగలము. దీనినే దివ్య దృష్టి అంటారు. దానినే పరమాత్మ అర్జునునికి ప్రసాదించాడు.

సంజయుడు ధృతరాష్ట్రునికి చెప్పటం ఇలా కొనసాగించాడు:

మహారాజా! యీవిధముగా చెప్పి, మహాయోగీశ్వరుడు తన సర్వోత్తమమైన, ఈశ్వర సంబంధమైన విశ్వరూపమును చూపెను. 11–9

అనేక ముఖములు, అనేక నయనములు, అనేకాద్భుతములు, అనేక దివ్య ఆభరణములతో, ఉద్యమించుటకు తయారుగానున్న అనేక దివ్య అస్త్రములతో, అనేక దివ్య వస్త్రములతో, దివ్య పుష్పమాలలతో, దివ్య గంధ లేపనములతో, అనేక ఆశ్చర్యములతో నిండియున్న, ప్రకాశవంతమైన, అనంతమైన, అనంత ముఖముల విశ్వరూపమును అర్జునునకు చూపెను.

11–10,11

ఆకసమున వేల సూర్యుల కాంతిని
పోలినదీ మహాత్ముని కాంతి. 11–12

నానావిధ విభిన్న సమస్త జగతిని
చూచెను ఒక్కచోటనే దేవదేవుని శరీరమున ఒక్కటిగ. 11–13

ఒకచోటనే, ఒక్కటిగా చూచితినని అర్జునుడు అనెను. సమస్త సృష్టి (అనేకత్వము) ఏకత్వమైన భగవానుని నుంచే ఏర్పడినది. ఏకత్వంలో (భగవానునిలో) సమస్త సృష్టి ఒక అంశ మాత్రమే. వేయితలలు, వేయి చేతులు, వేయి కళ్లు, వేయి

తొడలు, వేయి నోళ్లతోనని (11-10, 11) అన్న వర్ణన మనం చిత్రాలలో చిత్రించినట్లు, చూసినట్లు భావించగూడదు. అవి ప్రతీకలు మాత్రమే. అది మాటలతో వర్ణించటానికి వీలుకాని అద్భుత అనుభవం.

అనుభవం మాటలలోకి వచ్చి, మాటలు, పాటలు, చిత్రాలుగా మారేటప్పటికి ఈ అనుభవం అనుభూతికి దూరం అవుతుంది. జరిగిన వర్ణన అంతా భగవానుని దేహం (విశ్వం) లో ఉన్న అనేకత్వం. అన్నీ ఆ ఏకత్వంలో కనపడ్డాయి. ఇది మాటలకు అందని, వర్ణించలేని అలౌకిక అనుభూతి.

విశ్వరూపం అనగా విశ్వంలోని సమస్త విషయములందును భగవానుని చూడగలగటం. గోపికలు గోపాలుని అన్ని చోట్లా, ప్రకృతిలో ప్రతిచోటా చూడటం ఇందుకు ఒక ఉదాహరణ. ఇక్కడ అర్జునుడు భగవానునిలో విశ్వాన్ని మొత్తాన్ని దర్శించాడు. కాల, స్థల, పరిమాణాలకు, (space and time) పరిధులకు అతీతంగా అనగా భూత, భవిష్యత్, వర్తమాన కాలాలు అన్నీ ఏకమై ఒకటే అయినట్లుగా చూశాడు. తాను చేయబోయే యుద్ధఫలితాలను అర్జునుడు ముందే చూడగలిగాడు.

తదుపరి ధనంజయుడు ఆశ్చర్యచకితుడై, నిక్కబొడిచిన రోమములతో శిరసు వంచి, చేతులు జోడించి నమస్కరించి, ఈ విధంగా అన్నాడు.

11-14

పరంధామా,

దేవా! చూచుచున్నాను నేను నీయందు సమస్త దేవతలను, చరాచర జీవ సమూహమును, సృష్టి కర్తయగు, బ్రహ్మ దేవుని, సమస్త ఋషులను, దివ్య సర్పములను, 11-15

అనేక భుజములు, ఉదరములు, ముఖములు, నేత్రములతో- మొదలు, మధ్య, చివర లేక అనంత రూపునిగా నేను నిన్ను చూచుచున్నాను.

11-16

నిన్ను కిరీటం, గద, చక్రం ధరించి, సర్వత్రా వ్యాపించిన తేజోరాశిగా, జ్వలించే అగ్నిగా, సూర్యునివంటి కాంతి గలవానిగా, అపరిమితమైన వానిగా చూచు చున్నాను. 11-17

నీవు నాశరహిత అక్షరం. తెలియవలసిన పరమపురుషుడవు, విశ్వానికి ఆధార భూతుడవు, శాశ్వతుడవు, నిత్య ధర్మ రక్షకుడవు, పురాణ పురుషుడవు.

11-18

ఆదిమధ్యాంత రహితునిగా, అపరిమిత బలముతో, అనేక భుజములతో, సూర్యచంద్రులవలె నేత్రములతో **(అర్ధనారీశ్వరునిగా)**, భగ భగ మండే అగ్నిలాంటి ముఖముతో, తేజస్సుతో విశ్వమును తపింప చేయుచున్న వానిగా నిన్ను చూచుచున్నాను. 11-19

ఇక్కడ సూర్యచంద్రుల వంటి నేత్రములతో చూచుచున్నానని అర్జునుడు అన్నాడు. కుడికన్ను సూర్యునిలాగా, ఎడమ కన్ను చంద్రునిలాగా వర్ణించబడింది. సాధారణంగా రెండు కళ్లు ఒకే విధంగా ఉంటాయి. కాని రెండు కళ్లు వేరువేరుగా ఉన్నాయని విశ్వరూపదర్శనాన్ని చెప్పటంలో ఒక అంతరార్థం నిక్షిప్తంగా ఉంది. పరాప్రకృతి యైన భగవానుని నుంచే అపరాప్రకృతియైన ప్రకృతి ఉదయించింది. అలా ఉదయించిన ప్రకృతిలో తాను అర్ధభాగమై ప్రవేశించి అర్ధనారీశ్వరుడు అయ్యాడు.

విశ్వమంతా అర్ధనారీశ్వర స్వరూపం. భౌతిక శాస్త్ర దృష్టిలో చూస్తే విద్యుత్ శక్తి, అయస్కాంత శక్తి,(electro magnetism) విశ్వరూప దర్శనంలో విశ్వానికి

దేహమైన విశ్వవిరాట్‌ను దర్శించుకున్నాడు. ఆయనకు సగభాగం పరమేశ్వరుడు, మరో సగభాగం పార్వతి. కుడిభాగం ఈశ్వరుడైతే ఎడమభాగం పార్వతి. తీక్షణమైన కుడికన్ను సూర్యునిగా, స్వయంప్రకాశంగా వర్ణించబడింది. వామభాగం స్త్రీ స్వరూపమైన చల్లని వెన్నెలలు అందించే చంద్రునిగా చెప్ప బడింది. కనుక రెండు కళ్లనుసూర్యచంద్రులుగా పోల్చటం విశ్వవిరాట్ లోని అర్ధనారీశ్వర తత్వాన్ని వర్ణించటం. అదే దాని అంతరార్థం.

ఓ మహాత్మా!భూమ్యాకాశములపర్యంతము, అన్ని దిశలూ వ్యాపించిన, భయంకర, అశ్చర్యకర రూపమును చూచి ముల్లోకములూ మిక్కిలి భయము చెందుచున్నవి. 11-20

కొన్ని దేవతా సమూహములు నీలోనికి వెళ్ళుచున్నవి, కొందరు భీతితో నమస్కరిస్తూ నిన్ను స్తుతించుచున్నారు, మహర్షులు, సిద్ధ సమూహములు 'విశ్వమునకు మేలు జరుగుగాక' అంటూ స్తోత్రములతో కీర్తించుచున్నారు. 11-21

రుద్రులు, ఆదిత్యులు, వసువులు, సాధ్యులు, దేవతలు,అశ్వనీదేవతలు, గంధర్వులు, యక్షులు, అసురులు, సిద్ధుల పలుసంఘములు నిన్ను అశ్చర్యచకితులై చూచుచున్నారు. 11-22

ఓ మహాబాహూ, కృష్ణా! అనేక నోళ్లు, కళ్లు, భుజములు, తొడలు, పాదములు, ఉదరములు, కోరలతో భీతిగొల్పు నీ భయానక రూపమును చూచి జనులందరితోబాటు నేనుకూడా భయము చెందుచున్నాను. 11-23

ఓ విష్ణుమూర్తీ! ఆకసమును అంటిన ప్రకాశవంతమైన, వివిధ రంగులతెరచిన నోటితో, నిప్పులతో రగులుతున్న నేత్రములతో నున్న నీ యీ రూపము చూచి, భీతిల్లిన మనసుతో, ధైర్యశాంతులను పొందలేకున్నాను. 11-24

భయంకరమైన కోరలతోనున్న ప్రళయాగ్నివంటి నీ ముఖమును చూచి నేను మనోస్థైర్యాన్ని, సుఖమును కోల్పోయాను. ఓ దేవదేవా! శాంతించి ప్రసన్నుడవు కమ్ము. 11-25

ధృతరాష్ట్ర పుత్రులు, భీష్మ, ద్రోణ, కర్ణ, వైరి సేనలలోనున్నసమస్త రాజ సమూహము, అదేతీరున మన సైన్యంలోని ప్రముఖులునూ, 11-26

కోరలచే అతి భయంకరముగానున్న నీ నోళ్లలోకి త్వరితగతిన చేరుచున్నారు. వారిలో కొందరు నీ కోరల మధ్యన చిక్కుకొనియున్నారు. వారి తలలు పగిలి ముక్కలైన స్థితిలో కనబడుచున్నారు. 11-27

నదులన్నియు అతి వేగమున సాగరమున చేరు రీతిన, నరలోక వీరులు, ప్రజ్వలించుచున్న నీ నోరులలో ప్రవేశించుచున్నారు. 11-28

ఏ ప్రకారము మిడతలు (అప్రయత్నముగ వెలుగుచే ఆకర్షింపబడి) మండుచున్న అగ్నిలో వేగంగాపడి మాడిపోవునో ఆ రీతిన, యీ జనులు నాశనము కొరకు నీ నోరులలో ప్రవేశించుచున్నారు. 11-29

ఓ విష్ణుమూర్తీ! అగ్నితో ప్రజ్వలించు నోరులతో జనసమూహాలను మ్రింగి ఆస్వాదించుచున్నావు. నీ భయంకర వెలుగుల ప్రకాశము విశ్వమంతా వ్యాపించి తపింప చేయుచున్నది. 11-30

ఓ దేవదేవా! ఉగ్రరూపముతోనున్న నీవెవరివో ఎరిగింపుము, నాకు నీ ప్రకృతి తెలియదు. ఆది పురుషుడవగు నీ గురించి విశదముగ తెలియగోరెదను. నీకు నమస్కృతులు. అనుగ్రహించి తెలుపుము నాకు. 11-31

భగవానుడు యిలా చెప్పెను:

నేను ప్రాణులను చంపుటకువచ్చిన కాలుడను.
ప్రతిపక్ష సైన్యవీరులు నీవు లేకున్నను బ్రతుకజాలరు. 11-32

విశ్వరూపసందర్శనతో భయకంపితుడైన అర్జునుడు స్వామిని తన సహజస్వరూపమునకు రమ్మని వేడుకొనెను. తాను కాలుడను అని భగవానుడు తెలిపెను. దీనిని బట్టి విశ్వరూపం రెండు భిన్నకోణాలలో ఆవిష్కరించ బడినట్లు తెలుస్తుంది. మొదటిది విశ్వవిరాట్ స్వరూపము. అనేకత్వాన్ని ఏకత్వంలో చూడగలగటం.

రెండవది కాలస్వరూపము. కాలుడు అంటే కాలచక్రాధిపతి. అనగా భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు అతీతుడై వుండి త్రికాలాలను శాసించే వాడు. ఈ కాలుని రూపమే మరో కోణం నుంచి దర్శిస్తే స్త్రీ మూర్తిగా, ఆది మహాశక్తిగా, భద్రకాళి వలె వారు ఆరాధిస్తున్న రూపాలలో గోచరం అవుతుంది. కాలుడిని యమునిగా కూడా వర్ణిస్తారు.

మృత్యుదేవతను నేను, మృత్యువును నేను
జీవరాసుల చంపుటకు వచ్చిన మృత్యువును నేను
భూత భవిష్యత్తు వర్తమానములు నేను
కాలుడను నేను, కాల చక్రం నేను. **11-32 (2)**

నాటి జననం నేటి మరణం
నేటి మరణం రేపు జననం.
నేను లేక లేదు జననం. **11-32 (3)**

చావులేని పుట్టుక ఒక రోగం
విశ్వదేహానికది ఒక (Cancer) రాచపుండు
ఇదే జన్మ మరణ పునర్జన్మల
పరిభ్రమణ చక్రం! కాల చక్రం. **11-32 (4)**

జననమరణాల నడుమ యీ జీవనం
రాకపోకల ఆటుపోటుల ద్వైత సంసారం

ఇదే కాలం! భూత భవిష్యత్ వర్తమానం
జనన మరణ పునర్జన్మ పరిభ్రమణ చక్రం 11–32 (5)

కాల చక్రం నేను, కాలుడను నేను.
కాలాతీతుడను నేను
జనన మరణ పునర్జన్మల
కర్మబంధుల సాక్షి నేను. 11–32 (6)

జననం మోదము, మరణం ఖేదం
మరణం నవ లేత జననానికి ఒక నాంది
మరణం, పండిన ఫలామృతం,
లేత నవజననానికి ఇదే బీజం. 11–32 (7)

జనన మరణాల విభిన్న భావం పునర్జన్మకు బీజం
చిగురాకులు, పూతలు, పండి, ఎండి,
రాలిన ఆకుల చక్ర భ్రమణం, ప్రకృతి
సౌందర్య హేల – మన మనసుకు
ఋతురాగాల హరివిల్లు ప్రకృతి. 11–32 (8)

అంతరం ఎరిగిన మోదం, మరచిన ఖేదం
ఎరుక సుఖం, మరపు దు:ఖం
అనంత అఖండ అనన్య
ఏకాత్మ భావన పరమానందకరం 11–32 (9)

జనన మరణ పునర్జన్మల
పరిభ్రమణం కాలం, పరిభ్రమణ చక్రం కాలం
జననం మరణం వేర్వేరు భావనం బంధ కారకం
జనన మరణ ఏకత్వ భావన విముక్తిదాయకం

కాలాతీత స్థితి, యిదే జనన మరణ సంకెళ్ళ విడుదల,
విముక్తిదాయకం, ముక్తిదాయకం,
మోహ క్షయం, ఇదే మోక్షం. 11-32 (10)

కనుక లెమ్ము అర్జునా! లెమ్ము! శత్రువును జయించి (అంతః) కీర్తిని బడయుము. నీ శత్రువులను జయించి పరిపూర్ణ (స్వ) రాజ్యమును అనుభవించుము. వీరందరూ ఇప్పటికే చంపబడినందున నీవు నిమిత్త మాత్రునిగా యుద్ధము చేయుము. 11-33

ద్రోణచార్య, భీష్మాచార్యులు, జయద్రధుడూ, కర్ణుడూ, తదితర యుద్ధ వీరులను చంపుము. భయమును వీడి యుద్ధము చేయుము, నీవు శత్రువులపై గెలవగలవు. 11-34

సంజయుడు ఎప్పటికి అప్పుడు జరుగుతున్నవి చెపుతున్నాడు:

అర్జునుడు శ్రీకృష్ణభగవానుని యీ మాటలను విని, చేతులు జోడించి భయభక్తులతో నమస్కరిస్తూ, వణుకుతూ, గద్గదస్వరంతో, వినమ్రుడై ఇలా తన భావోద్వేగములను తెలుపుతున్నాడు. 11-35

ఓ ఋషీకేశా! లోకములు నీ నామమును ఉచ్చరించి, నీ మాహాత్మ్యమును కీర్తనము చేసి, ఎంతో సంతోషమును పొందుచున్నవి. రాక్షసులు భయముతో నలుదిశలకు పరుగిడుచున్నారు, సిద్ధులు నమస్కరిస్తున్నారు, యివి అన్నియు నీ మహిమలకు తగినట్లే వున్నవి.

11-36

మహాత్మా! అనంతరూపా, దేవదేవా! జగన్నివాసా! సత్, అసత్ లకు పరమైన అక్షర పరబ్రహ్మవు నీవు, సృష్టికారకుడగు బ్రహ్మకు కారకుడవు నీవు. కనుక సర్వశ్రేష్ఠుడవగు నీవు వారి ఆరాధనలకు తగుదువు. 11-37

ఓ భగవాన్! నీవు అనంత రూపుడవు, ఆది దేవుడవు, సనాతనుడవు, విశ్వాధారుడవు, సర్వజ్ఞుడవు, తెలియదగిన వాడవు, పరంధాముడవు, సర్వ వ్యాపివి. 11-38

వాయువు, యముడు, అగ్ని, వరుణుడు, చంద్రుడు, బ్రహ్మదేవుడు, వీరందరికి నీవే తండ్రివి. నీకు అనేకానేక వేల నమస్కారములు. 11-39

అన్ని దిశలా వ్యాపించి, సర్వరూపములవాడవైన భగవాన్! నీకు ముందు నుంచి, వెనుకనుంచి, మరియు అన్నిదిక్కుల నుంచియు నా నమస్కారములు. 11-40

కేవలము స్నేహితుడవనుకొని చనువున, నీ మహిమలు తెలియక పొరపాటున 'కృష్ణా!', 'యాదవా', 'సఖా' అని పిలచితిని. 11-41

విహారమున, శయనమున, కూరుచుండిన, భుజించునపుడూ, ఏకాంతమున, యితరులతో వున్నప్పుడు గాని పరిహాసమున నిన్ను నేనెప్పుడైన హేళన చేసి, యేవిధముగానైనను అవమానము చేసిన నా యీ అపరాధములను దయతో క్షమించుము. 11-42

చరాచర విశ్వ పితవై, పూజ్యుడవై, సర్వోత్తమ గురువువై అవతరించిన నీకు సరి ఎవరునూ లేరు. మరొకరు ముల్లోకములలో నీకన్నా మిన్న వుండుట కల్లకదా! 11-43


ఈశ్వరుడవు, స్తుతింప దగినవాడవు. ఆందువలన నేను నా శరీరముతో భూమిపై సాష్టాంగ నమస్కారము చేసి, నా అపరాధమును తండ్రివలె, మిత్రునివలె, ప్రియునివలె మన్నింపమని వేడుకొనుచుంటిని దేవా! 11-44

మును పెన్నడూ చూడని నీ యీ విశ్వరూపమును చూచి చాలా ఆనందపడితిని. అయిననూ నా మనము భీతిన మిక్కిలి వ్యధలోనున్నది. కావున ఓ జగదోద్ధారా! మునుపటి నీ సౌమ్య రూపమును దయతో మరల చూపించుము. 11-45

అనేక హస్తములతోనున్న ఓ ప్రభూ! కిరీటము, గద, చక్రములతోనున్న (మనుష్యాకార) పూర్వ చతుర్భుజ రూపమును ధరించుము. 11-46

(13వ ప్రశ్న – మునుపటి సౌమ్యరూపమునకు రమ్మని ప్రార్థించెను)

ఈ శ్లోకంలో అర్జునుడు భగవానుని తన చతుర్భుజములు కలిగిన రూపమునకు తిరిగి రమ్మని వేడుకొనెను. అందుకు కృష్ణుడు నాలుగు భుజములతో ఉండెనని తాత్పర్య అర్థము వచ్చును. కాని అంతరార్థం వేరొక కోణాన్ని చూపుతుంది. మంత్ర, యంత్ర, తంత్రాల్లో యంత్రంలో పంచభూతాలను, ప్రతీకలుగా చూపెడతారు.





శ్రీచక్రమును అందరికీ పరిచయమైన చిత్రాన్ని చూస్తే మొదటి వలయం నాలుగు భుజాలు కలిగి ఉంటుంది. ఈ చతుర్భుజ ఆకారం భూమికి సంకేతం. నాలుగు దిక్కులు కలిగినది అని అర్థం. యంత్రభాషలో చూస్తే చతుర్భుజం సామాన్య, లౌకిక మానవ ఆకారం (earthly) ఇహపరాలలో ఇహం.

భగవానుడు అంటున్నాడు:

తదితరులెవ్వరూ చూడని, చూడలేనినా యీ శ్రేష్ఠమైన, పరిపూర్ణ, ప్రకాశవంతమైన, అనంత, విశ్వరూపమును, నా యోగ మాయా శక్తితో, నీవు నాకు ప్రియ మిత్రుడవైనందున నీకిపుడు చూపితిని. 11-47

కురువంశ శ్రేష్ఠా! నా యీ విశ్వరూపమును, నీవు తప్ప తదితరు లెవ్వరూ భూలోకమునచూడలేదు. వేదాధ్యయనమున కాని, జ్ఞానముచే గాని, దానముచేగాని, కర్మమునగాని, ఘోర తపమున గాని, ఇట్టి రూపము చూచుటకు అలవికానిది. 11-48

ఈ విశ్వరూపాన్ని నీవు తప్ప ఇతరులు ఎవ్వరూ భూలోకమున చూడలేదనగా అందలి కాలస్వరూపమును ఎవ్వరూ చూడలేదని బావం. విశ్వవిరాట్ స్వరూపమును ఇతరులు చూసిన దాఖలాలు శాస్త్రాలలో ఉన్నవి.

ఇటువంటి భీకర విశ్వరూపమును చూచి భయముతో భ్రమ పడకుము. నీవు భయమును వీడి ప్రశాంత చిత్తమున నా మునుపటి చతుర్భుజాకారమును చూడుము. 11-49

సంజయుడు తెలియజేస్తున్నాడు:

ఈ విధంగా కృష్ణుడు అర్జునునకు తన పూర్వ రూపమును చూపెను, భగవానుడు సౌమ్య రూపమును ధరించిన పిమ్మట భీతిల్లిన అర్జునుని ఓదార్చెను. 11-50

ఊరట చెందిన అర్జునుడు అంటున్నాడు:

ఓ జనార్దనా! నీ యీ ప్రశాంతమైన మానవరూపమును చూచి నా మనసు కుదుట పడినది, శాంతించినది. 11-51

భగవానుడు చెప్పెను:

నా యే రూపమును నీవు చూచితివో, అది చాలా దుర్లభం. దేవతలు కూడ నిత్యం దానిని చూడవలెనని తహతహలాడుదురు. 11-52

నీవు చూచిన నా యీ రూపము వేదాధ్యయనమున గాని, తపస్సునగాని, దానమున గాని యజ్ఞములవలనగాని చూడ శక్యము కాదు. 11-53

పరంతపా! నా యీ రూపము అనన్య భక్తితో మాత్రమే వినుటకు, తెలుసు కొనుటకు, చూచుటకు, అనుభవించుటకు సాధ్యము. 11-54

పాండవ శ్రేష్ఠా! యెవరు నా కొరకే కర్మలు చేయుదురో, నన్నే పొందదలచి, నాయందే అనన్యభక్తిగలిగి, సమస్త దృశ్య పదార్థముల యెడ రక్తి వీడి, సమస్త ప్రాణులందు ద్వేషము లేని వాడయినచో నన్ను పొందును. 11-55

ఈ అధ్యాయమున కృష్ణుడు తన విరాట్ స్వరూపమును, కాల స్వరూపమును అర్జునునకు దివ్యచక్షువుల నిచ్చి చూపెను.





12

పన్నెండవ అధ్యాయము

భక్తి యోగము

భగవంతునిపై ప్రేమ భక్తి అని, భక్తి స్వరూపము, భక్తుని లక్షణాలు, సాకార, నిరాకారోపాసన గురించి వివరించబడింది.

అర్జునుడనెను:

(14వ ప్రశ్న - సాకార నిరాకార ఆరాధనా భక్తులలో ఎవరు శ్రేష్ఠం అని)

నీయందే మనసు నిలిపి, సాకార సగుణ బ్రహ్మాగా
నిన్ను ఉపాసించు భక్తులు, యింద్రియ గోచరముగాని
అవ్యక్తమైన, నిర్గుణమైన, అక్షరబ్రహ్మాము
ఉపాసించు భక్తులు - వీరిరువురు యోగులలో
యెవరుశ్రేష్ఠులని నీ అభిప్రాయమో తెలుపుము కృష్ణా. 12-1

భగవానుడు చెప్పెను:

నా యందే మనసు నిలిపి, మిక్కిలి శ్రద్ధతో నన్నే ఉపాసించు
సాకార సద్గుణ భక్తులు ఉత్తమ యోగులని నాతలంపు. 12-2

యింద్రియములను నిగ్రహించి,
సమభావనతో ప్రాణులకు హితమొనర్చుచూ,
యింద్రియములకు అగోచర, అనిర్వచనీయ, నిర్వికార,
అచల, నిత్య, సర్వవ్యాప్త, నిరాకార నిర్గుణబ్రహ్మముగా
నన్ను ఉపాసించు భక్తులు కూడా నన్నే పొందుదురు 12-3,4

దేహాభిమానముతో నన్ను సాకార, సగుణునిగా
ఉపాసించు భక్తుల మార్గముకన్నను
అవ్యక్త నిర్గుణ నిరాకార పరబ్రహ్మను
ఉపాసించు భక్తుల మార్గము అతిక్లిష్టము 12-5

యెవరు సమస్త కర్మములు నాకు సమర్పించి,
నన్నేమదినుంచి, నన్ను ఉపాసించెదరో అట్టి వారిని,
సత్వరమే జనన, మరణసంసార
సాగరము నుండి ఉద్ధరింతును. 12-6,7

మనసును స్థిరముగ నాయందే నిలిపి,
నీ బుద్ధిని ఆత్మయందు లయము చేసి
నిస్సందేహముగ నన్నే పొందుము. 12-8

ఓ ధనుంజయా!
ఒకపరి మనమును స్థిరముగ
నిలుపుట కడు అసాధ్యము - యేరీతినైనను
మరల మరల అభ్యాసముతో సాధింపుము. 12-9

ఒకపరి యీ అభ్యాసమునకు సాధ్యుడవైన,
ఆసక్తితో దైవసంబంధిత కార్యములు చేయుము,
అత్తరిన పొందుము మోక్షము. 12-10

యిదియును నీకసాధ్యమైన
కర్మఫల త్యాగమును నీవు చేయుము 12-11

అంతరమెరుగని అభ్యాసము కన్న
జ్ఞానముమేలగు,
జ్ఞానముకన్నను ధ్యానము మేలగు,
ధ్యానముకన్నను కర్మ ఫలత్యాగము ఉత్తమము,
అట్టికర్మఫల త్యాగమున,
చిత్తశుద్ధిన, శాంతి లభించును. 12-12

సమస్తప్రాణులందు ద్వేషము లేనివాడు
మైత్రి, కరుణలతో మెలగువాడు,
మోహము, అహంకారము లేనివాడు,
సుఖదుఃఖముల సమముగ నుండువాడు
అయిన భక్తుడు నాకుప్రియుడు. 12-13

ఎల్లపుడు తృప్తిగ నుండువాడు,
సతతము యోగిగా నుండువాడు,
ధృఢనిశ్చయుడుగా నుండువాడు,
మనోబుద్ధులను నాకు అర్పించినవాడు,
నాయందు అత్యంత భక్తిగలవాడు,
అట్టి భక్తుడు నాకు ప్రియుడు. 12-14

భయము చెందక, భయము కల్పించక మసలు వాడు
సంతోషము, క్రోధము, వ్యాకులతనొందనివాడు
అత్యాశ, బాహ్య, అంతరశుద్ధిగల వాడు
తటస్తుడు, చింతావ్యధలు లేనివాడు
సర్వకార్యముల కర్తననే భావము వదిలిన
భక్తుడు నాకు ప్రియుడు. 12-15,16

అతిసంతోషము, ద్వేషము లేనట్టి వాడు
కష్టములందును అతిశోకము పొందనివాడు
శుభాశుభములకు అతీతుడుగానుండెడు
భక్తుడు నాకు పరమ ప్రియుడు పార్థా. 12-17

శత్రు మిత్రులందు సమభావం కలిగిన వాడు
మానావమానములందు సమబుద్ధి గలవాడు
శీతోష్ణ సుఖ దుఃఖముల సమముగనుండువాడు
విషయ సంగమము లేని వాడు
అయిన భక్తుడు నాకు అతి ప్రియుడు. 12-18

నిందాస్తుతులను ఒకటిగ తీసుకొనెడు వాడు
మౌనముగ, స్థిరమదిన వుండెడు వాడు
లభించిన దానితోనె మిక్కిలి తృప్తి చెందెడువాడు
నివాస స్థానముల ఆసక్తివీడినవాడు
స్థిరమైన బుద్ధితో భక్తినిండిన వాడు నాకు ప్రియుడు. 12-19

శ్రద్ధతో, నాయెడల నిశ్చలభక్తితో అమృత రూప ధర్మమును
ఆచరించెడు భక్తులు నాకు అత్యంత ప్రియులు. 12-20

ఈ అధ్యాయమున భక్తిమార్గ వివరణ, అనన్య భక్తుని లక్షణములు, ప్రియత్వము వర్ణించబడినది.

13

పదమూడవ అధ్యాయము

క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము

పాంచభౌతిక దేహమే క్షేత్రము. శాశ్వతుడైన ఆత్మ క్షేత్రజ్ఞుడు. ఈ రెండిటి వివరములు, జ్ఞేయవస్తువు, ప్రకృతి, పురుషుల వర్ణన యిందున వివరించబడినవి.

అర్జునుడనెను:

ఓ కేశవా! ప్రకృతిగురించి, పురుషునిగురించి, క్షేత్రము, క్షేత్రజ్ఞుని గురించీ, జ్ఞానము, జ్ఞేయమును గురించి తెలియగోరెదను నేను. 13–1

15వ ప్రశ్న – ప్రకృతి, పురుషుడు, క్షేత్రము, క్షేత్రజ్ఞుడు, జ్ఞానము, జ్ఞేయమును గూర్చి తెలుపుమని.

భగవానుడు చెప్పెను:

ఓ కౌంతేయా! యీ శరీరము క్షేత్రము. యీ శరీరమునందు తెలియువాడు క్షేత్రజ్ఞుడు, క్షేత్రక్షేత్రజ్ఞులను గురించి తెలిసినవారు యిట్లు చెప్పుదురు. 13–2

సమస్త శరీరక్షేత్రములలో నుండిన
క్షేత్రజ్ఞునిగా నన్నెరుగుము.
క్షేత్రక్షేత్రజ్ఞుల జ్ఞానమే సరిఅయిన జ్ఞానము. 13-3

క్షేత్రమేదియెా, అది ఎటువంటిదో, దాని లక్షణములేవో? ఎలా ఉత్పన్న మైనదో, ఆ క్షేత్రజ్ఞుడు ఎవరు, అతని ప్రభావము ఎట్లున్నదనే అంశాల గురించి సంక్షిప్తముగ తెలిపెదను వినుము. 13-4

వీటి గురించి ఋషులచే అనేక విధముల నాల్గువేదములలో, బ్రహ్మసూత్ర వాక్యములలో కూడా సహేతుకముగా బాగుగా నిర్ధారించబడి చెప్పబడినది. 13-5

పంచభూతములు, అహంకారము, బుద్ధిని కలిపి మూల ప్రకృతి అందురు. దశేంద్రియములు, మనస్సు, పంచయింద్రియ శబ్దాదివిషయములు, రాగము, ద్వేషము, సుఖము, దుఃఖము, దేహేంద్రియాది సముదాయం, ధైర్యము అను వికారాలతో నిండినది క్షేత్రమనబడును. 13-6,7

వినయము, నిరాతిశయము, నిరాడంబరత, అహింస,
క్షమ, ఋజుత్వము, సత్యము, ఆచార్యసేవనము,
యింద్రియ మనోనిగ్రహము, స్వఛ్ఛత, శౌచము,
ధీరత, స్థిరత, స్థైర్యము, ఆత్మనిగ్రహము -
యింద్రియ విషయ వైరాగ్యము, నిరహంకారము,
చావు-పుట్టుకలు-వార్ధక్యము-రోగబాధల విషయ విరక్తి,
జీవన ద్వంద్వములలో నిత్య సమ చిత్తత,
నిష్కామము, దారా పుత్ర గృహాది విషయ అనాసక్తత,
అనన్య, అచంచల దైవభక్తి, యోగము,
ఏకాంతము, సజ్జన సాంగత్యము, దుర్జన విసర్జనము,
ఆధ్యాత్మ, ఆత్మజ్ఞాన నిష్ఠ అనునవి జ్ఞాన సంబంధమైనవి.
వీటికి వ్యతిరేకములు అజ్ఞానమని అందురు. 13-8నుండి12

తెలియవలసినది యేదియో, ఏదితెలిసిన
మనుజుడు అమృతత్వమగు మోక్షమును పొందునో
అట్టిదానిని గూర్చి చెప్పబోవుచున్నాను
అనాది, అపౌరుషేయమైన యీ బ్రహ్మము
యిది సత్తుఅసత్తుల మూలము గనుక
సత్తు అనిగాని అసత్తు అనిగాని అనబడదు. 13-13

సర్వత్రచేతులూ, పాదములు నేత్రములు,
తలలు, ముఖములు చెవులు గలదిగా
విశ్వమంతయు వ్యాపించి యున్నదది. 13-14

క్షేత్రజ్ఞుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపి,
సర్వశక్తిమంతుడు క్షేత్రజ్ఞుడు, బ్రహ్మము,
అది కానిదేదీ విశ్వమున లేదు,
సర్వము బ్రహ్మమయము, సర్వం బ్రహ్మం. 13-14 (2)

జ్ఞేయరూపబ్రహ్మము సర్వేంద్రియములకు
ఎరుకనిచ్చి, తానందక ఎరుకకు, ఆవల
నున్నవాడు, ఏగుణములు లేకనే
అన్నిగుణములను అనుభవించువాడు. 13-15

ప్రాణుల వెలుపల, లోపలనుండి, చలాచలమై,
అతిసూక్ష్మమై అతిదగ్గరగను, అతిదూరముగను
వుండి తెలియనిదీ, ఏకమై, విభజింపబడనిదీ,
అనేకమై, విభజనతో నున్నటుల కనుపించునదీ,
ప్రాణుల సృష్టి, స్థితి, లయము చేయునదీ,
సూర్య, చంద్ర, అగ్ని ఆది ప్రకాశకులకు ప్రకాశము
నిచ్చెడువాడు, అజ్ఞానముకానిది,

జ్ఞానస్వరూపమైనది, తెలియదగినది, జ్ఞానమున
పొందదగినది, సమస్తజనుల
హృదయాంతరాళములవుండి
క్షేత్రజ్ఞుడనిచెప్పబడుతున్నది. 13-15నుండి18

యిటుల క్షేత్రము, జ్ఞానము, జ్ఞేయము
గురించి సంక్షిప్తముగ చెప్పబడెను
నా భక్తుడు వీనిని ఎరిగి
నా స్వరూపమును పొందుచున్నాడు. 13-19

ప్రకృతీ, పురుషుడూ అనాది రూపములు
మనోబుద్ధి అహంకారములు, పంచభూతములు
త్రిగుణములు, ఏకాదశాంశములకు
మూలము మూల ప్రకృతి. 13-20

కార్యకారణములకు ప్రకృతి,
సుఖ దుఃఖానుభవములకు
పురుషుడు కారణములు. 13-21

పురుషుడు ప్రకృతి నందుండి
గుణాత్మక సుఖ దుఃఖములు
అనుభవించును దేహాత్మబుద్ధినందున. 13-22

పురుషుడాత్మగ శరీరమున,
సాక్షీభూతిగ, భర్తగ, భోక్తగ,
మహేశ్వరునిగ వుండును. 13-23

యీ విధిన పురుషుడు గురించి,
గుణములతో కూడిన ప్రకృతిని

గురించి ఎరిగినవాడు.
అతడే విధముగా నున్ననూ
పునర్జన్మము నొందదు. 13-24

ఆత్మను అనుభవించుచుందురు పలురీతుల
కొందరు చిత్తశుద్ధి కలిగి జ్ఞానయోగమున
సాధువులు కొందరు సాంఖ్యయోగమున
మరి కొందరు కర్మయోగ మార్గమున 13-25

ఆత్మను కొందరు చిత్తశుద్ధితో ధ్యానయోగముచే,
కొందరు సాంఖ్యయోగము ద్వారా, కొందరు కర్మ
యోగముద్వారా, అనుభవించుచున్నారు. 13-25.2

ధ్యాన, సాంఖ్య, కర్మయోగములు తెలియకున్నను
అన్యుల బోధన నుండి అరయుచున్నారు కొందరు
ఆచరించి, ఉపాసించి దాటుచున్నారు మరికొందరు
మృత్యు రూప సంసార సాగరమును దాటుచున్నారు 13-26

మరి కొందరు ధ్యాన, సాంఖ్య, కర్మయోగమున తెలియక, యితరుల వలన విని ఉపాసించుచున్నారు, వీరు కూడా మృత్యురూప సంసారమును దాటుచున్నారు. 13-26.2

ఓ భరతశ్రేష్ఠా! యీ ప్రపంచమున
స్థావరజంగమాత్మక పదార్థమేది
పుట్టిననూ, అది ప్రకృతిపురుషుల
సంయోగము ద్వారానే జరుగుచున్నది. 13-27

ఎవడు సమస్త ప్రాణులందు సమముగ
నున్న పరమేశ్వరుడిని ఆయా

దేహములందు నశింపనివానిగ చూచుచున్నాడో
అతడు సర్వము నెరిగినవాడే అగును 13–28

ఏలనన సమస్తప్రాణులందు
సమముగా యీ విధముగ చూచెడివాడు
తనను తాను హింసించుకొనడు,
యితరులనూ హింసించడు. 13–29

సమస్త ప్రాణులందు సమముగా
పరమేశు దర్శించగలుగు వాడు
తనను తాను హింసించుకొనడు,
పరుల హింసింప ప్రయత్నము చేయడు
జీవహింస పరమాత్మ హింస భావమున 13–29.2

ప్రకృతిని కర్మ కారణముగను,
పురుషుని అకర్తగాను
దర్శించు వాడు నిజమైన జ్ఞాని యగును. 13–30

వివిధరకముల జీవులతో విస్తృతమై
ప్రపంచమంతయును పరమాత్మ నందుండి
విస్తరించుచున్నటుల వీక్షించు వాడు
బ్రహ్మమునే పొందుట బహుసత్యము. 13–31

ఓ కౌంతేయా! అనాదిగ నున్నందున
గుణరహితుడవుట వలన,
పరమాత్మదేహమున నిండి వుండి కూడ
తాను కర్త కాక, కర్మలచే అంటబడకనున్నాడు. 13–32


అంతటా వ్యాపించిన సూక్ష్మమైన
ఆకాశము ధూళిచే అంటబడనటుల
సకల శరీరముల నున్న పరమాత్మ
తాను అంటబడకనే వున్నాడు అందరిలో. 13-33

విశాల ఆకాశము ధూళిచే అంటబడనటుల
సర్వజీవములలోనున్న ఆత్మ అంటబడదు 13-33.2

ఒక సూర్యుడు సమస్తలోకములను
ప్రకాశింపచేయు విధముగా
పరమాత్మ ప్రకాశింప జేయును
సమస్త జీవరాశులను సతతము. 13-34

అంతర్ దృష్టితో క్షేత్రక్షేత్రజ్ఞుల భేదమెరిగి
ప్రకృతి బంధముల వీడు వుపాయ మరసి
వర్తించు వారు సంసారబంధముల
విముక్తులై పొందగలరు మోక్షమును. 13-35

క్షేత్ర క్షేత్రజ్ఞ విభజన పురుషుల వర్ణన ఈ అధ్యాయమున వివరించబడినది.



14

పదునాల్గవ అధ్యాయము

గుణత్రయ విభాగయోగము

త్రిగుణవర్ణన, జ్ఞానమహిమ, ప్రకృతి పురుషుల జగదుత్పత్తి, భగవత్ ప్రాప్తికి ఉపాయము, త్రిగుణాతీతుని లక్షణాలు గూర్చి వివరణ యిందులో ఉంది. భోజన ప్రార్థన "అహం వైశ్వానరో" యిందులోనే వున్నది.

భగవానుడిలా చెప్పెను:

జ్ఞానములలోకెల్ల ఉత్తమ, పారమార్థిక, సంసార బంధ విమోచక జ్ఞానమును నీకు చెప్పుచున్నాను. 14-1

యీ జ్ఞానము తెలిసినవారలు నాతో ఐక్యము నొంది, మరల సృష్టికాలమున జన్మించరు. లయకాలమున నశించరు, పునర్జన్మను పొందరు.

14-2

ఓ భరతశ్రేష్టా! నేను ఉత్పత్తి చేయుదు
సమస్త భూతజాలమును
నా స్వరూప బీజమును

సర్వ భూతోత్పత్తి స్థాన
మూలప్రకృతిన వుంచి 14-3

తల్లియే మూలప్రకృతి,
సర్వ గర్భములందు
ఉద్భవించు జీవరాశులకు
బీజమైన తండ్రిని నేను. 14-4

ఓ మహాబాహో! త్రిగుణములు ప్రకృతిన పుట్టి,
నిత్యమైన ఆత్మను దేహమున బంధించును. 14-5

సత్వాది గుణములు నిర్మలమై,
మనోప్రకాశమున, యింద్రియలోలతన
సుఖ, జ్ఞానాసక్తితో బంధించును జీవుని. 14-6

ఓ కౌంతేయా!
రజోగుణం అంతులేని కోరికల నిలయమై
కర్మ ఫలాసక్తిని పెంచి బంధించు
ఆత్మను శరీరమున కదలకుండ. 14-7

అజ్ఞాన, మోహములు తామసికములు
బంధించును ఆత్మను మరపున, పరాకున,
సోమరితనముల, అతినిద్రల 14-8

ఓ భారతా! సత్వము సుఖమున,
రజోగుణము కర్మమున,
తమోగుణము అవివేకమున
జీవుని పడవేయును ప్రమాదమున. 14-9

సత్వాధికము అణచును రజోతమములను,
రజోగుణాధికము అణచును సత్వ తమముల,
తమోగుణాధికము అణచును రజోసత్వములను. 14-10

మూడు గుణాలలో ప్రతిదీ మిగతా రెండు గుణాలను అదుపు చేయటానికి ప్రయత్నిస్తుంటుంది. దీని అర్థం సృష్టి ధర్మం సమత్వం. సమతత్వం సృష్టిది. మరో కోణం నుంచి చూస్తే ఉన్నది రెండు గుణాలే. అవి రాజస, తామసాలే. చలనం, అచలనం. ఈ రెండు భిన్నమైనవి. వీటిమధ్య సమతుల్యతనే సాత్వికం అంటారు. మూడు గుణాలను నమ్మే వాళ్లు మరింత ఉత్తమ స్థాయికి వెళ్లి దానిని శుద్ధసత్వమని కూడా అంటారు. సృష్టిలో సమతుల్యత సహజ స్థితి. జీవుడు గుణత్రయముల సమతుల్యతను సాధించవలెను. దీనినే గీతాచార్యుడు సాంఖ్యయోగంలో తెలియజేశాడు. స్థితప్రజ్ఞుని గురించి బుద్ధుడు మధ్యేమార్గంగా బోధించినది కూడా ఇదే.

ఎవ్వని దేహపు నవద్వారములు
బుద్ధితో ప్రకాశించునో, అట్టివాని
సత్వగుణం పెరుగుతున్నదని ఎరుగుము. 14-11

ఓ భరతశ్రేష్టా!
లోభము, కర్మము, నిషిద్ధ కర్మము,
అశాంతి, అలజడి, ఆశ, దురాశలు,
మనుజుల రజోగుణవృద్ధి సంకేతములు. 14-12

ఓ కురునందనా!
అవివేకము, అతినిద్ర, సోమరితనం,
అజాగ్రత్త, అజ్ఞానములు, మనుజుల
తమోగుణ అభివృద్ధికి గుర్తులు. 14-13

సత్వ గుణాతిశయమున అసువులు బాసిన
సాత్వికులు ఊర్ధ్వ లోకములు చేరుదురు,
తదుపరి జన్మింతురు జ్ఞానుల గృహములందున. 14-14

రజో గుణాతిశయమున అసువులు వీడిన రాజసుడు
జనియించును కర్మాసక్తుల గృహమున
తమో గుణాతిశయమున అసువులు వీడిన తామసికుడు
జనియించును పామరుల, పశు, పక్షులుగ హీనజాతుల గృహాల.
14-15

సాత్విక కర్మ ఫలము స్వశ్ఛత, సుఖం,
రాజసిక కర్మ ఫలము దుఃఖము,
తామసిక కర్మ ఫలం అజ్ఞానము.
సత్వ గుణ ఫలము జ్ఞానం
రజో గుణ ఫలము లోభం
తమో గుణ ఫలము అజ్ఞానం. 14- 16,17

సాత్వికులు ఊర్ధ్వ లోకాలకు
రాజసికులు మనుష్య లోకాలకు
తామసికులు అధో లోకాలకు
పోయెదరు మరణాంతమున. 14-18

వివేకవంతుడై, త్రిగుణాతీతముగ,
అకర్తగా నను చూచునట్టివాడు
నన్ను ఎరుగుచున్నాడు, సమగ్రముగ 14-19

జన్మమూలమగు త్రిగుణముల దాటినవాడు,
జరా మరణ వార్ధక్య దుఃఖములను దాటి
పొందును మోక్షమును. 14-20

అర్జునుడనెను: (16 వ ప్రశ్న – త్రిగుణాతీతుని లక్షణాలను గురించి)

ప్రభో! ఈ త్రిగుణాలను దాటినవాడు ఎలా వుంటాడు?
వాని లక్షణాలు ఏమిటి? వాని ప్రవర్తన ఎలా వుంటుంది?
ఈ గుణాలను అతడు ఏలాగున అధిగమిస్తాడో చెప్పుము.

14–21

భగవానుడు చెప్పెను:

ఓ అర్జునా! ఎవరు సాత్వికమైన ప్రకాశమును, సుఖమును, రాజసికమైన కర్మప్రవృత్తిని, తామసికమైన మోహమును, నిద్రను ద్వేషింపడో, అవి తొలగినచో కావలెనని కోరడో, తటస్థుడై గుణాతీతుడవునో, గుణములకు సాక్షుడవునో, నిశ్చలమదిన వుందురో వారు గుణాతీతులు.

సుఖ దుఃఖములను, మట్టిగడ్డను, రాయిని, బంగారములను సమానముగా చూచెడివాడు, ఆత్మయందే స్థిరముగ నున్నవాడు, యిష్టాయిష్టములను సమముగా చూచెడువాడు, ధైర్యవంతుడు, కర్తృత్వబుద్ధిని వదలినవాడు, కామ్యకర్మలను విడచి బ్రహ్మనిష్ఠ యందు వున్నవాడు గుణాతీతుడని చెప్పబడును.

14–22 నుండి25

అచంచల భక్తితో నను సేవించిన వారు
త్రిగుణములను దాటి బ్రహ్మమందు
ఐక్య మగుటకు అర్హుడగును.
నేనే అనంతుడను, నిర్వికారుడను,
శాశ్వతుడను, ధర్మస్వరూపుడను,
ఆనందస్వరూపుడను, నన్ను సేవించు
వారలు చేరెదరు నాలోనె. 14–26, 27

త్రిగుణముల గూర్చి, త్రిగుణాతీతుని లక్షణముల గూర్చి ఈ అధ్యాయమున వివరించబడినది.

గుణం	లక్షణం	ప్రమాదం	ఫలం	గమ్యం	మరణానంతరం
సత్వ	జ్ఞానాసక్తి	సుఖం	సుఖం	జ్ఞానం	ఊర్ధ్వ లోకాలకు
రజో	యింద్రియ లోలత	కర్మమున	దుఃఖం	లోభం	మనుష్య లోకాలకు
తమస్	మరపు	అవివేకం	అవివేకం, అజ్ఞానం	అజ్ఞానం	అధోలోకాలకు

15

పదునైదవ అధ్యాయము

పురుషోత్తమ ప్రాప్తి యోగము

సంసారవృక్షవర్ణన, జీవాత్మను గూర్చి, క్షర, అక్షర, జీవ, పురుషోత్తముని గూర్చి వర్ణన యిందు పొందు పరచబడినది.

భగవానుడు చెప్పెను:

సంసారమనెడు అశ్వత్థ వృక్షమునకు
వ్రేళ్ళు పైన, కొమ్మలు క్రిందుగ వుండి,
వేదములు ఆకులుగా నున్నవని
ఎవరు తెలిసికొందురో,
వారు వేదార్థమును ఎరిగిన వారలు. 15-1

సంసార వృక్షపు కొమ్మలు త్రిగుణములు
శబ్దాది విషయ వాసనలు చిగుళ్ళు
కమ్మలు పైకి బ్రహ్మలోకమువరకూ,

క్రిందికి మానవలోకము వరకు
విస్తరించి కర్మ సంబంధ
వాసనలను గలుగ చేయుచున్నవి. 15-2

యీ సంసారవృక్షస్వరూపము కానీ, దాని ఆదిమధ్యాంతములు కానీ ప్రపంచమున తెలియకున్నవి. లోతుగా నాటుకున్న వ్రేళ్ళతో ఎదుగుతున్న యీ అశ్వద్ధవృక్షాన్ని అసంగము అనే గట్టి ఆయుధముతో నరికి, పునర్జన్మరహిత పరమపధాన్ని వెదకి, ఎవనినుండి అనాది అయిన యీ సంసారవృక్ష ప్రవృత్తి వ్యాపించెనో, అట్టి ఆదిపురుషుని శరణు పొందవలెను. 15-3, 4

అహంకారము, అవివేకము లేక, దృశ్యపదార్ధవిరక్తుడూ, నిరంతర ఆత్మజ్ఞానాభిలాష కలవాడు, కోర్కెలు తీరిన తృప్తుడు, నిరంతరమైన బ్రహ్మ పదమును (మోక్షమును) పొందును. 15-5

ఆ బ్రహ్మపదమును సూర్యచంద్రులు, అగ్నికూడా ప్రకాశింపచేయలేరు, దేనిని పొందిన సంసారమునకు జీవుడు తిరిగిరాడో, అదే నా నివాసస్ధానమని తెలియుము. 15-6

నాలోని శాశ్వతమైన ఒక అంశమే జీవాత్మ అయి,
ప్రకృతిలోని మనోజ్ఞానేంద్రియాలను ఆకర్షించుచున్నది. 15-7

వాయువు పుష్ప సువాసనలను తీసుకుపోవు నటుల
జీవుడు శరీర ప్రవేశ, నిష్క్రమణ సమయాల
కొనిపోవును తనతోడ మనోయింద్రియములను. 15-8

యీ జీవుడు పంచేంద్రియములు, మనస్సును
ఆశ్రయించి శబ్దాది విషయజ్ఞానములను
అనుభవించుచున్నాడు. 15-9

శరీరములో ఉన్నపుడు కానీ,
యింద్రియ విషయానుభవమున కానీ
మరో శరీరాన్ని పొందునపుడు కానీ
చూడలేరు మూఢులు ఈ జీవాత్మను,
చూడగలరు జ్ఞానదృష్టి గలవారలు మాత్రమే. 15-10

యోగులు దర్శింతురు
తమలోని జీవాత్మను సాధనతో
హృదయశుద్ధిహీనులు
దాని గాంచలేరు సాధన చేసియు 15-11

జగత్తునంతనూ ప్రకాశింపజేయు సూర్యునిలోని తేజస్సూ, చంద్రుడు, అగ్నిలోని తేజస్సూ నేనే (నా తేజస్సే) అని తెలియుము. 15-12

భూమి యందు నేను ప్రవేశించి
సమస్త ప్రాణులకు ఆధారమైతిని
చంద్రునియందు రస స్వరూపుడనై
పంటలను పండించుచుంటిని. 15-13

సకలప్రాణుల శరీరాలలో జఠరాగ్నిగా
వైశ్వానర రూపంలో వుండి,
ప్రాణ, అపానవాయు సంపర్కము,
నాలుగు రకముల ఆహారమును
జీర్ణము చేయుచున్నాను. 15-14

ఈ శ్లోకము భోజనము ముందు చేసే ప్రార్థనగా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రార్థనలో మన దేహంలో నున్న జఠరాగ్నిగా భుజించిన ఆహారాన్ని ప్రాణ, అపాన వాయువులతో కలసి శక్తిగా మార్చేది, మనలోని భగవంతుడని రెండవ ప్రార్థనగా

ప్రసిద్ధి చెందిందీ శ్లోకం. మొదటి ప్రార్థనా శ్లోకము బ్రహ్మార్పణం అనే 4-24 శ్లోకము. (యజ్ఞ సాధనములు బ్రహ్మము, యజ్ఞ పదార్థము బ్రహ్మము, యజ్ఞాగ్ని బ్రహ్మము యజ్ఞకార్యము బ్రహ్మము, యజ్ఞకర్త బ్రహ్మము, బ్రహ్మఫలము బ్రహ్మమునకే అర్పణం, బ్రహ్మము బ్రహ్మమునకే సమర్పణం అని. 4-24)

బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్	**అహం వైశ్వానరో భూత్వా**
బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతం	**ప్రాణినాం దేహమాశ్రితః**
బ్రహ్మైవ తేన గంతవ్యం	**ప్రాణాపాన సమాయుక్తః**
బ్రహ్మ కర్మ సమాధినా 4-24	**పచామ్యన్నం చతర్ విధం 15-4**

సర్వప్రాణుల హృదయవాసిని నేనే
నావల్లనే, జ్ఞాపకం, జ్ఞానం,
మరపులు కలుగుచున్నవి
వేదజ్ఞానపు గమ్యము నేనే,
వేదమెరిగినవాడను నేనే. 15-15

పురుషులు క్షర, అక్షరులని రెండు రకములు
తాత్కాలికుడు క్షరుడు, దేహము.
శాశ్వతుడు అక్షరుడు, కూటస్థుడు, జీవుడు.
వీరిరువురికన్న ఉత్తముడు ఈశ్వరుడు,
నాశరహితుడై, విశ్వవ్యాపిగ, విశ్వప్రభువై నిలచును 15-16,17

క్షరునికన్న మిన్న నేను
అక్షరునికన్న ఉత్తముడను
అందుకే, లోకములందు, వేదాలలో
ప్రసిద్ధినొందితి పురుషోత్తముగా. 15-18

ఓ భారతా!

మోహరహితుడై, నన్ను

పురుషోత్తమునిగా యెరిగి

సర్వము బ్రహ్మమను భావనతో

ఉపాసించువాడు ఆరాధించును నన్నే. 15-19

అతి గుప్తశాస్త్రమును తెలిపితి నీకు

యిది తెలిసినవాడు ధీమంతుడై, కృతార్థుడగును. 15-20

పురుషోత్తముని గూర్చి సంసార వృక్షమును గూర్చి, ముగింపు / సారాంశము, క్షర, అక్షరముల గూర్చి ఈ అధ్యాయమున వివరించబడెను.



16

పదునారవ అధ్యాయము

దైవాసుర సంపద్విభాగ యోగము

దైవ, అసుర సంపదల లక్షణాలు, వాటి ఫలములు, నరక ద్వారములు వాటి వివరణ యిందులో పొందుపరచబడినవి.

భగవానుడు చెప్పెను:

ఓ భారతా!

అభయం, చిత్త శుద్ధి, జ్ఞాన యోగ నిష్ఠ, దానం, యింద్రియ నిగ్రహం, యజ్ఞం, స్వాధ్యాయనం, తపస్సు, అహింస, సత్యం, శాంతం, త్యాగం, చాడీలు చెప్పకుండటం, దయ, కోరికల నియంత్రణ, మృదుత్వం, సిగ్గు, తేజస్సు, ఓర్పు, ధైర్యం, శుచి, నమ్మకం, అనాసక్తత, సరళత, స్థిరత్వం, వైరాగ్యము అను 26 సుగుణములు దైవ సంపద లక్షణములు. 16-1,2,3

ఓ పార్థా,

అసుర సంపత్తిలో పుట్టినవారి లక్షణాలివి. కపటం, గర్వం, దురహంకారం, కోపం, కఠినత, అవివేకం. 16-4

దైవ సంపత్తి ద్వార మోక్షమూ, అసుర సంపత్తి వలన
సంసార బంధమూ కలుగును, అర్జునా! నీవు దైవ సంపత్తి
లోనే జన్మించితివి కాన విచారింప పనిలేదు. 16-5

ఓ పార్థా!
యీ లోకంలో ప్రాణుల సృష్టి దైవికమనీ,
అసురమనీ రెండు రకములు. దైవీ సంపద గురించి
చెప్పుకున్నాం, ఇక అసురీ సంపద లక్షణాలు వినుము. 16-6

యుక్తాయుక్త విచక్షణ లేకుండుట, అశుభ్రత, దురాచారం, అబద్ధాలు చెప్పటం, దైవం లేడనటం, కామం, నాస్తికత్వం. అల్ప బుద్ధులు, లోక కంటకులు, వినాశకారులు. వీరు అదుపు లేని కోరికలతో, డంబము, గర్వము, దురభిమానము, అనెడు పలు దుర్గుణాలతో, అవివేకంతో, దుర్భావాలతో, దురాచారులై తిరుగుదురు. 16-7,8,9,10

వారు జీవన పర్యంతమూ, మితిమిరిన కోర్కెలతో, కామ భోగలాల సత్వములో మునిగి తేలుతూ, అదే జీవన పరమావధిగానెంచి, ఆశాపాశములతో సుఖముల నిమిత్తము అక్రమార్జనము చేయుదురు. 16-11,12

ఇది నాకు దొరికినది, యీ కోరిక నెరవేరినది, యింత ఆస్తి వున్నది, మరింత సంపాదిస్తాను, శత్రువును చంపేశాను, యితర శత్రువులను కూడా చంపుతాను అనీ, తానే ప్రభువును, భోగిని, సమర్ధుడను, బలవంతుడను, సుఖవంతుడను, ధనవంతుడను, సద్వంశజుడను,అని పలువిధములుగా గొప్పలు చెప్పటం, తనకు సాటెవరూ లేరనటం, యజ్ఞ, దానాలు చేస్తాననటం, అనందం అనుభవిస్తాననటం, యివి అసుర స్వభావుల లక్షణాలు.వీరు నిరంతరం కామభోగలాలసతో ఘోర నరకాల పాలవుదురు. 16-13-16

వీరు, సొంత పొగడ్తలతో, వినయ విధేయతలు లేక, ధన, మద గర్వంతో, శాస్త్ర విధిని పాటించక యజ్ఞాలు చేయుదురు. అహంకారం, బలం, గర్వం, కామ, క్రోధములకు ఆశ్రయమై, తమ దేహాలలో, ఇతరుల దేహాలలో నిబిడీకృతమై వున్న నన్ను ద్వేషిస్తారు. 16–17, 18

ద్వేషపూరిత, పాప చరితులు, క్రూర స్వభావులయిన యీ మానవాధములు సంసార చక్రములో తిరుగుతునే వుందురు. 16–19

ఓ కౌంతేయా! అసుర జన్మపొందే అలాంటి మూర్ఖులు జన్మజన్మలకు నను చేరక అధోగతి పొందెదరు. నరక ద్వారాలయిన కామ క్రోధలోభములు ఆత్మ వినాశకారులు. కావున వీటిని వదలుట ఆవశ్యకము. 16–20,21

ఓ కౌంతేయ! యీ మూడు దుర్గుణాలను వదిలినవారు తమకు తాము మేలుచేసుకొని పరమపదం చేరెదరు. 16–22

శాస్త్ర విధుల నిరాకరించి, యిష్టానుసారము ప్రవర్తించి, జ్ఞానం, సుఖం, మోక్షములను పొందరు. 16–23

యుక్తాయుక్తముల నిర్ణయమునకు శాస్త్రము ప్రమాణము. అది తెలుసుకొని లోకములో కర్మలన్నిటిని చేయుము. 16–24

మనలోని దైవిక, అసుర సంపత్తుల వర్ణన ఈ అధ్యాయమున వివరించబడినది.



17

పదునేడవ అధ్యాయము

శ్రద్ధా త్రయ విభాగ యోగము

త్రివిధ శ్రద్ధ, ఆరాధన, ఆహారము, యజ్ఞము, తపస్సు, దానముల గురించి వివరణ యిందులో యివ్వబడింది.

ఓం తత్ సత్ (భావం), వేదం (వాక్కు), ధర్మం (కర్మ)ల వివరణ వున్నది.

అర్జునుడు ప్రశ్నించెను:

(17వ ప్రశ్న - శాస్త్రనియమములు లేని పూజ సాత్వికమేనాయని)

ఓ కృష్ణా! శాస్త్రనియమములు వదలి
శ్రద్ధతో చేయు పూజాదులు, సాత్వికమా?
రాజసికమా? లేక తామసికమా?, తెలుపుము. 17-1

భగవానుడు చెప్పెను:

పూర్వజన్మ సంస్కారమున కలుగు
సహజమైన శ్రద్ధ మూడు రకములు,

సాత్వికం, రాజసికం, తామసికము.
వానిని నీకు వివరించెద విను. 17-2

ఓ భారతా!
శ్రద్ధ లేనివారు అరుదు మానవులందు
వారి సంస్కారములను బట్టి ఉండు శ్రద్ధ
శ్రద్ధను బట్టియే భావములు వుండు వారికి 17-3

సాత్వికులు పూజింతురు దేవతలను
రాజసికులు యక్ష రాక్షసులను
తామసికులు భూతప్రేత పిశాచాదుల. 17-4

అసుర స్వభావము కలిగిన వారలు,
అహంభావులు ఆడంబరులు, కామ బలగర్వితులై
శాస్త్ర విరుద్ధ ఘోర తపస్సులు చేయుచు
శరీర పంచభూతాలను, అంతర్యామినగు నన్ను
బాధించుచుందురు తెలియుము. 17-5,6

అందరికీ యిష్టమైన అహారము, యజ్ఞము,
తపస్సు, జ్ఞానములు కూడా మూడు రకములు.
వీటి తేడాలు వివరించెదను, వినుము. 17-7

ఆయువు, మేధస్సు, బలం, ఆరోగ్యము, సుఖం,
సంతోషములను పెంచే రసము, చమురూ కలిగి,
దేహములో యెక్కువ కాలం ఉండి ఆకలిని
అణచి, మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే
పదార్థాలు యిష్టపడెదరు సాత్వికులు. 17-8

ఎక్కువసేపు ఆకలి కానిదంటే, యీనాడు మన హైగ్లైసీమిక్ యిండెక్స్ ఆహారములని అర్థం. యిది యీనాటి వైద్యుల ఆరోగ్య సూచన కూడా.

అతి చేదూ, పులుపూ, ఉప్పదనం, వేడీ, కారమూ,
చమురు లకుండా, దాహం కలిగించే, ఆహార పదార్థాలు
రాజసులకు యిష్టము. యివి శరీరానికి బాధ,
మనోవ్యాకులత కలిగించునని తెలియుము. 17-9

చల్లబడి, సారము లేని,
దుర్వాసన గలిగిన, అపవిత్ర ఎంగిలి
ఆహారమనిన యిష్టపడుదురు తామసులు. 17-10

కర్మఫలాసక్తి లేకుండా, అత్యంత శ్రద్ధతో, స్వచ్ఛమైన హృదయంతో ధర్మంగా చేసే యజ్ఞమును సాత్విక యజ్ఞమని అందురు. కర్మఫలాసక్తితోగాని, డంబముతో ఆడంబరము కొరకు చేయు యజ్ఞమును రాజసిక యజ్ఞమని అందురు. శాస్త్ర సమ్మతముకాక, అన్నదానము, మంత్రములు, దాన దక్షిణలు లేక, శ్రద్ధాహీనముగ చేయు యజ్ఞమును తామసిక యజ్ఞమని అందురు. 17-11, 12,13

దేవతలు, బ్రాహ్మణులు, గురువులు, జ్ఞానులను పూజించడం, త్రికరణ శుద్ధిబ్రహ్మచర్యం, అహింసాచరణ లాంటివానిని దేహ తపస్సని అందురు. సత్యమై, ప్రియమై, ఆహ్లాదకరమై, హితమై, ఉద్వేగరహితమై, వేదాధ్యయనము చేయుట వంటివాటిని వాచక తపస్సుఅందురు. మనో నిర్మలత, మంచి భావము, మౌనము, అత్మనిగ్రహం, శాంతము, స్వచ్ఛతలతో చేసే తపమును మానసిక తపస్సు అందురు. యీ మూడు విధముల తపస్సులలో, నిర్మల మనస్కులు అతి శ్రద్ధతో, ప్రతిఫలాపేక్షలేక చేయు తపస్సును సాత్విక తపస్సని అందురు.

17- 14,15,16,17

సన్మాన సత్కారములతో పూజింపబడుట కొరకు, ఆడంబరంగా స్థిరమైన గమ్యములేని తపస్సును రాజసిక తపస్సని అందురు. 17-18

మూర్ఖంగా, దేహమును ఉపవాసాదులతో శుష్కింపజేసి, యితరులకు హానికలుగుట కొరకు చేయు తపస్సును తామసిక తపస్సు అందురు.

17-19

దానమొక బాధ్యత. మంచి సమయంలో, మంచి ప్రదేశాలలో, మంచి ఉద్దేశ్యముతో, తగిన యోగ్యునికి ప్రతిఫలాపేక్షలేకుండా చేసిన దానమును సాత్విక దానం అందురు. 17-20

ప్రతిఫలాపేక్షతో, తిరిగి రావాలనే భావంతో, బలవంతంతో, డంబము కొరకు మొఖమాటముతో అయిష్టముగా చేయు దానమును రాజసిక దానం అందురు. 17-21

అసందర్భముగా, అనువుగాని చోట, అపాత్రునకు, అగౌరవముగా, అవమానకరంగా యిచ్చే దానమును తామసిక దానమని అందురు.

17-22

పరబ్రహ్మకు "ఓం", "తత్", "సత్" అని మూడు పేర్లు. దీనివల్లనే పూర్వము జ్ఞానము (వేదము) ధర్మం (యజ్ఞం) సృష్టించబడినవి. 17-23


అందువలన వేదవేత్తలు, శాస్త్రోక్త కర్మలైన యజ్ఞ, దాన, తపస్సులను ఓంకారముతోనే ప్రారంభింతురు. 17-24

మోక్ష కాముకులు ఫలాపేక్ష రహితముగా పలు రకముల యజ్ఞములను, దానము, తపములవంటి పుణ్యకార్యములను "తత్" అనే శబ్దమును ఉచ్ఛరించిన తదుపరియే చేయుదురు. 17-25

ఓ పార్థా! "వుంది" (వునికి), "మంచిది" (సర్వోత్తమము) అనే అర్థమున "సత్" అను పరబ్రహ్మ నామమువాడుదురు. అదేవిధమున ఉత్తమ కర్మమునందునూ ఆ 'సత్" అను పదమును వాడెదరు. యజ్ఞ, దాన, తపములందు నిష్ఠ కూడ

"సత్" అని పిలువబడినది, యిదే విధమున భగవంతుని ప్రీతి కొరకు చేయబడుకర్మలు కూడా "సత్" అని పిలువబడుచున్నవి. 17-26, 27

ఓ పార్థా!
యజ్ఞ, దాన, తపములు, తదితర కార్యములు
అశ్రద్ధతో ఆచరించిన అందురు వానిని "అసత్" అని.
వుండదు ఫలితము దానికి యిహపరముల
నిష్ఫలములు అగునవి అర్జునా తెలియుము. 17-28



18

పదునెనిమిదవ అధ్యాయము

మోక్ష సన్యాస యోగము

సన్యాసం (కామ్యకర్మ విసర్జనం, కర్మఫల త్యాగం), త్యాగం (అహంకార విసర్జనం), త్రివిధ జ్ఞానం, కర్మ, బుద్ధి, ధైర్యము, సుఖము వర్ణన, చాతుర్వర్ణ ధర్మములు, భగవత్ సాక్షాత్కారమునకు జ్ఞాన, భక్తి, కర్మల ద్వారా ఉపాయములు, భగవత్ శరణాగతి వర్ణనలు యిందులో పొందుపరచబడినవి.

అర్జునుడు మరికొన్ని ప్రశ్నలు అడిగెను:

ఓ ఋషీకేశా! సన్యాసము, త్యాగము గురించి విడివిడిగా విశదీకరించుము.

18-1

(18వ ప్రశ్న - సన్యాసము, త్యాగము గురించి విశదీకరించుమనెను)

భగవానుడు చెప్పెను:

కామ్యకర్మలను వదలుటయే
సన్యాసము అందురు కొందరు.

కర్మఫలమును వదలుటయే
సన్యాసమందురు మరి కొందరు. 18-2

దోషరహిత కర్మ వుండదు కనుక,
సమస్త కర్మలను వదలవలెననుటొక వాదన,
యజ్ఞం, దానం, తపస్సు లాంటి సత్కర్మల
నెప్పుడు వదలగూడదను వాదన మరి యొకటి. 18-3

యజ్ఞ, దాన, తపములనెడి సత్కర్మలను ఎప్పుడూ వదలకూడదు. కాని వీటిని కూడా ఫలాపేక్ష రహితముగా నిష్కామముగా చేయ వలయును.

అయితే! కర్మ త్యాగం మీద నా అభిప్రాయమును వినుము.
త్యాగం మూడు రకాలు. 18-4

యజ్ఞ, దాన, తపములు సత్కర్మలు
కలిగించును చిత్త శుద్ధిని
వీటి నెన్నడు వదలక
విధిగా తప్పక చేయవలె. 18-5

అయినను, యజ్ఞ యాగాది సత్కర్మలుకూడా
అనాసక్తునిగ, ఫలత్యాగముతోనే
ఆచరించవలయు ననుటయే
నా నిశ్చయ అభిప్రాయము. 18-6

స్వధర్మముగా, నిత్యాచరణ కర్మముల
త్యాగము చేయుట తగదు ఎవ్వరికీ
అవివేక త్యాగమే తామసిక త్యాగము 18-7

దుఃఖము, శరీర శ్రమ అను భయములతో
నిత్యనిర్ణీత కర్మలు విడచుటయే అగును

రాజసిక త్యాగము
అట్టి త్యాగికి ఎట్టి ఫలము లేదు. 18-8

అర్జునా! శాస్త్ర నియమిత కర్మలను
కర్తవ్య భావనతో,
ఫలాసక్తిని వీడి ఆచరించటమే
సాత్విక త్యాగము. 18-9

సాత్వికుడూ, బుద్ధిమంతుడూ,
సంశయ రహితుడూ అయిన త్యాగి,
కర్మలు కష్టమైనవని వదలడు,
సులభ సాధ్య కర్మలను అభిమానించడు. 18-10

సాత్వికుడైన త్యాగి తాను చేయవలసిన కర్మలు కష్టమైనవి, శరీరానికి బాధ కలిగించేవి అను నెపములతో కొన్నిటిని మాత్రమే స్వీకరించి, కొన్నిటిని వదలి వేయుట తగదని హెచ్చరిక.

నిజముగ, మానవమాత్రుడికి, కర్మలు
పూర్తిగా వదులుట అసాధ్యము.
కానికర్మ ఫలమును వదలి, కర్మలు
అంటనివానిగ, కర్మత్యాగిగా నుండవచ్చును. 18-11

ఆచరించిన కర్మలనుబట్టి
సుఖము, దుఃఖము, మిశ్రమములని
మూడు రకముల ఫలితములు వచ్చును.
కాని కర్మఫల త్యాగము
చేసిన యోగికి అవి యేవీ అంటవు. 18-12

ఓ మహాబాహో! కర్మలన్నియు ఫలించుటకు కారణములు ఐదు అని సాంఖ్యులు అనెదరు. వాటిని వివరింతును. 18-13

కర్మలకు కలవు కారణములు ఐదు.
అవి దేహం, జీవాత్మ, యింద్రియములు,
యింద్రియ వ్యాపారములు, దైవము. 18-14

మానవుడు దేహ, మనో వాక్కులతో
మంచి, చెడు కార్యముల ఆచరణకు
కారణములు పై ఐదే. 18-15

బుద్ధి కాలుష్యమున జీవుడు
కర్తయే ఆత్మ అని భ్రమించు 18-16

అహంకార మమకారములు లేని కర్మడు,
లోకాలలోని అన్ని ప్రాణులనూ చంపినా,
అతడు హంతకుడు కాడు, కర్మ బంధుడు కాడు. 18-17

జ్ఞానం, జ్ఞేయం, జ్ఞాని అను మూడూ
కర్మ కారణములు. అదే రీతిన,
సాధన, సాధ్యం, సాధకం అనునవి
కర్మలకు కారణాలు. 18-18

సాంఖ్య శాస్త్రము మూడు విధములు
త్రిగుణ భేదాలను బట్టి జ్ఞానం, కర్త, కర్మలుగా
విభజింపబడె. చెప్పెదనిప్పుడు వీటి గురించి నీకు. 18-19

అనేకములుగా వున్న ప్రాణులను
అఖండ, అవినాశ, అవిభక్త ఆత్మగా
ఏకాత్మగా చూచువాని జ్ఞానమే సాత్విక జ్ఞానము. 18-20

విడివిడిగా కనిపించెడు సర్వ భూతములు
అనేకమనెడు భావనయే
రాజసిక జ్ఞానము, తెలియుము. 18-21

తత్వము తెలియక, తర్కించక,
కారణాధారములు లేక అనేకముగ వున్న
ఏ ఒక్కదానినో పట్టి, అదే సర్వమనెడి
సంకుచిత భావన, తామసిక జ్ఞానము. 18-22

రాగద్వేష రహితముగా,
కర్మఫలమాశించక,
చేయు కర్మలు సాత్విక కర్మలు
కోర్కెలు, అహంకారములు,
శ్రమతో చేయు కర్మములే
రాజసిక కర్మలు. 12-23, 24

మోహముతో, పరిణామమెరుగక,
బాధను, దేహ సామర్ధ్యమును తెలియక
అవివేకముగ ఆరంభించెడు
వాటి నందురు తామసిక కర్మలు. 18-25

సంగమము, ఫలాపేక్ష, కర్తృత్వ
అహంకారములు విడచిన వాడు,
ధైర్య వుత్సాహములు కలిగిన వాడు
కార్య, సాధ్యాసాధ్యములలో
ఏకరీతి నున్నవానిని
సాత్విక కర్త యని అందురు 18-26

అనురాగబంధితుడు, కర్మఫలభోగి,
లోభి, హింసల నాచరించు వాడు,
అశౌచ్య, సుఖ దుఃఖముల గూడినవానిని
రాజస కర్త అని అందురు. 8-27

మనోనిగ్రహ వినయరహితుడు, పామరుడు,
మోసగాడు, సోమరి, నిత్యచింతితుడు, పనులు
జాప్యముగ చేయువాడు, వంచన పరుడిని
తామసిక కర్త యని అందురు. 18-28

ఓ ధనుంజయా, గుణ దోషముల బట్టి బుద్ధి, ధైర్యము మూడు రకములు. వాటిని గురించి విడివిడిగ సంపూర్ణముగా చెప్పెదను, ఆలకించుము. 18-29

ఓ పార్థా! ప్రవృత్తి నివృత్తి మార్గమగు కర్మ సన్యాసములను,
కర్తవ్య అకర్తవ్యాలను, భయ అభయాలను, బంధ మోక్షాలను
గ్రహించెడి బుద్ధిని సాత్విక బుద్ధి అని అందురు. 18-30

ఓ పార్థా! ధర్మాధర్మాలనూ, కార్యాకార్యాలనూ,
స్పష్టముగా తెలుసుకోలేని బుద్ధి రాజసిక బుద్ధి. 18-31

అజ్ఞానపు చీకటి వలన ధర్మమును అధర్మముగా,
అధర్మమును, ధర్మముగా భ్రమించు బుద్ధియే
తామసిక బుద్ధి యనబడును. 18-32

ఓ పార్థా!

మనసు, ప్రాణం, యింద్రియాల వ్యాపారాలను యోగ సాధనతో నిలబెట్టునది సాత్విక ధైర్యం. 18-33

ధర్మార్థ కామ మోక్షాలపట్ల అభిమానం, ఫలాభిలాష కలిగి వుండేది రాజసిక ధైర్యం. 18-34

మూర్ఖుడు నిద్ర, భయం, దుఃఖం,విషాదం, మదములను విడువక చేసేది తామసిక ధైర్యం. 18-35

ఓ భరత శ్రేష్ఠా!

నేర్చే కొలది సంతోషమును యిచ్చి ,దుఃఖనాశనము చేయు సుఖము మూడు రకములు వినుము. 18-36

తొలుత విషమువలె,
పిదప అమృతము వలెవుండి,
బుద్ధి నిర్మల స్థితిలో పొందు సుఖము
సాత్విక సుఖము. 18-37

మొదట అమృతముగానుండి,
పిదప విషముగా మారి
విషయ, యింద్రియ సంపర్కము
వలన కలిగినది రాజస సుఖం. 18-38

నిద్ర, బద్ధకం, ప్రమాద స్థితిలో జనించి,
ఆద్యంతములలో మోహాన్ని కలిగించు
సుఖము తామస సుఖము అనబడును. 18-39

మాయా ప్రకృతినుండి ఉద్భవించిన
యీ మూడు గుణములు లేని వస్తువేదీ
ముల్లోకాలలోను లేదు. 18-40

ఓ పరంతపా!
చాతుర్వర్ణములైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు,
గుణాలు, స్వభావాల ఆధారంగా కర్మలు విభజించిరి. 12-41

బాహ్య ఇంద్రియ నిగ్రహం, మనో నిగ్రహం,
తపము, శుచి, ఋజువర్తనం, ఓర్పు, సత్ప్రవర్తన,
శాస్త్ర జ్ఞానం, అనుభవ జ్ఞానం, దైవ నమ్మకం
బ్రాహ్మణ స్వభావసిద్ధ కర్మలై వున్నవి. 18-42

పరాక్రమం, పౌరుషం, ధైర్యం, దక్షత,
యుద్ధమందున పారి పోకుండుట,
పాలనాసామర్థ్యం క్షత్రియ నైజ కర్మలు. 18-43

వ్యవసాయం, పశుపోషణ, వ్యాపారం వైశ్యులకు,
సేవారూప కర్మలు శూద్రులకు నైజ కర్మలు. 18-44

నైజాన్ని బట్టి (స్వభావం) కర్మలు గాని, జన్మని బట్టి అనలేదని గ్రహించ వలెను.

స్వభావసిద్ధముగ ఆచరించు కర్మయందు
శ్రద్ధ కలిగినవాడు సిద్ధిని పొందును.
అది ఎటులనో వివరించెద వినుము. 18-45

సమస్త ప్రాణుల జన్మకు, పోషణకు కారకుడై,
విశ్వమంతా వ్యాపించిన పరమాత్మను అర్చించి,
మానవులు వారి వారి స్వభావసిద్ధముగ వచ్చిన
నియమిత కర్మాచరణతో పరమగతిని పొందుదురు. 18-46

చక్కగా ఆచరింపబడిన పరధర్మము కన్నను,
అసంపూర్ణముగ ఆచరించిన స్వధర్మమే మేలు.
తన ధర్మమునే ఆచరించిన అంటదు పాపము. 18-47

ఓ కౌంతేయా! పొగచేత అగ్ని కప్పబడినటుల,
కర్మలన్నిటికీ దోషం ఆవరించి వుండును.
దోషమున్నను స్వభావసిద్ధ కర్మలను విడువ గూడదు. 18-48

విషయాసక్తత వీడి, ఆత్మ నిగ్రహమున,
ఆశారహితుడై, ఫల త్యాగ బుద్ధిన, కర్మలాచరించు
వాడు పరమోత్తమ స్థితిని పొందును. 18-49

ఓ కౌంతేయా!
నిష్కామ కర్మ సిద్ధుడు
పరమాత్మనెలా పొందునో,
జ్ఞాన నిష్ఠ అనగా నేమిటో
సంగ్రహముగ తెలిపెదను,
సావధానముగ వినుము. 18-50

స్వచ్ఛ బుద్ధిన, మనోధైర్యమున,
విషయ, రాగద్వేషముల విడచి,
ఏకాంతవాసియై, మితాహారము భుజించి,
వాక్కు, దేహము, మనమును అదుపున నుంచి,
నిరంతర ధ్యానమున, వైరాగ్యమున,
అహంకారమును నిర్మూలించి,
బల, గర్వ, కామ, క్రోధ వస్తు సేకరణలు విడచి,
మమత్వమును త్యజించి,
శాంత స్వభావమును పెంచిన శ్రేష్టుడు
అర్హుడౌను బ్రహ్మస్వరూపమును పొందుటకు. 18-51,52,53

బ్రహ్మస్వరూపమును పొందినవాడు
ప్రశాంత మనమున కోరడు దేనిని,

దుఃఖించడు దేనికై,
సమస్త భూతముల యెడ
సమ భావము కలిగి నాయెడ
పరమ పవిత్ర భక్తితోనుండును. 18–54

భక్తివలన, నేనెంతటివాడనో, ఎట్టివాడనో తెలియును.
నా మహిమలు గ్రహించును, నన్నే చేరును. 18–55

కర్మలు సమస్తము చేయుచున్నను
ఎల్లపుడు నన్నే అశ్రయించినవాడు,
నాశరహితమగు మోక్షపథమును
పొందును నా అనుగ్రహమున. 8–56

సర్వ కర్మలు నాకే హృదయ పూర్వకముగ అర్పించి,
నన్నే పరమగతిగ నెంచి, నీ మనసును నిరంతర
ధ్యానమున నిలుపుము సదా నాయందే. 18–57

నాయందు మనసు నిలిపిన, నా అనుగ్రహమున
అతిసులువుగ దాటగలవు ప్రతి సంసార అవరోధమును.
అటుల కాక అహంకారమున నా
ఉపదేశమును పెడచెవిన పెట్టిన చెడెదవు. 18–58

అహంకారము వలన, నీవు యుద్ధము చేయకూడదని
భావించిననూ, నెరవేరదా ప్రయత్నము. కారణము
నీ స్వభావమే చేయించి తీరును. 18–59

ఓ కౌంతేయ!
అవివేకమున నీకు యుద్ధము సమ్మతి కాక పోయినను,
నీ స్వభావసిద్ధ స్వధర్మ కర్మ అధీనుడవై
తప్పక యుద్ధము చేసెదవు మనముననే. 18–60

ఓ అర్జునా!
ఈశ్వరుడు సర్వ ప్రాణుల హృదయాలలో నివసిస్తూ,
తన మాయతో, ఆడించుచు సర్వ భూతాలనూ
యంత్రములవలె ఆడించుచున్నాడు. 18-61

ఓ భారతా!
సర్వ విధముల ఈశ్వరునే శరణు వేడుము,
ఆయన కృపతో పరమ శాంతినీ,
శాశ్వతమైన మోక్షమును పొందుము. 18-62

అతి గుప్తమైన జ్ఞానమును చెప్పితిని నీకు,
ఆలోచించి బాగుగా ఎలా సరి అని
నీకనిపించిన, చేయుము అదే. 18-63

నీవు నాకు చాలా యిష్టుడవు కావున,
నీ మేలుగోరి, అతి రహస్యమూ,
సర్వోత్కృష్టమూ అయిన మరో మాట
చెప్పెదను, వినుము. 18-64

నామీదే మనసునుంచి, నా యెడల భక్తితో
నన్నే భజించి, పూజించి నమస్కరింపుము,
నీవటుల చేసిన నన్ను తప్పక చేరెదవు
యిది నిజమని శపథము చేసి చెప్పుచుంటిని. 18-65

సర్వధర్మములను త్యజించి నన్నే ఆశ్రయించుము
సర్వ పాపములనుండి నీకు విముక్తితో
మోక్షమును ప్రసాదించెదను, విచారింపకు. 18-66

'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం' అను ఈ శ్లోకము గీతా సారాంశము. అన్ని ధర్మాలను వదలి భగవానుని శరణు పొందినచో మన యోగక్షేమాలు అన్నిటినీ ఆయనే చూచుకుంటాడు.అదే విధంగా (2–17 శ్లోకంలో) మొదటి సారి అర్జునుడు కృష్ణుని శరణు జొచ్చిన – కార్పణ్య దోషోప స్వభావ– అంకురార్పణ జరిగింది. అనన్యాశ్చింత యంతోమాం (9–22 శ్లోకములో) ఇది చెప్పబడింది. ఇది కేంద్రశ్లోకంగా, హృదయ శ్లోకముగా నిలుస్తుంది. ఇది భగవానుడు ప్రసాదించిన అభయశ్లోకము. 18 అధ్యాయాలలో మధ్యగల 9 వ అధ్యాయంలోనిది ఇది.

నీకు ఉపదేశించిన యీ గీతా శాస్త్రాన్ని,
తపము చేయని వానికి, భక్తి లేనివానికి,
వినుటకు సుముఖత లేనివానికి,
నన్ను నిందించే వానికీ ఎప్పుడూ చెప్పవలదు. 18–67

అన్నీ తెలుసన్నవాడికి ఏమీ తెలియదు. తెలియునన్న అహంకారం అతనిని వినే ధోరణిలో వుంచదు. అటువంటి వానికి బోధించడం, చెవిటి వానిముందు శంఖం ఊదినటులగును. శ్రోతలో వినాలని, తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉన్నప్పుడే బోధనకు ఫలితముంటుంది. నేల తడిగా, పదునులో వున్నప్పుడే విత్తనం నాటిన ఫలం చేకూరుతుంది.

పరమగుప్తమైన యీ గీతాశాస్త్రాన్ని
నా భక్తులకు బోధించెడివాడు, నా మీద పరమ
భక్తితో నన్నే చేరును అనుట నిస్సంశయము. 18–68

అతడే నాకు మిక్కిలి ప్రీతిపాత్రుడు,
అతనికంటే యెక్కువ ప్రీతిపాత్రుడు
ఈ లోకంలో వేరొకడు వుండబోడు. 18–69

మన యిరువురి నడుమ జరిగిన
యీ ధర్మ సంవాదాన్ని చదివినవాడు,
జ్ఞానయజ్ఞమున నన్నారాధించు
వాడని నా అభిమతము. 18-70

యీ గీతాశాస్త్రాన్ని శ్రద్ధతో, అనసూయుడిగా
వినెడివాడు, సర్వ పాప విముక్తుడై
పుణ్యలోకాలకు చేరును. 18-71

ఓ ధనుంజయా!
నిశ్చలమైన స్థిరచిత్తముతో
నే చెప్పిన యీ గీతాశాస్త్రాన్ని
వినిన నీకు అజ్ఞానము కలిగి
పెరిగిన భ్రాంతి తొలగినదా! 18-72

అర్జునుడనెను:

(తన మోహము తొలగినది, ఆజ్ఞాపించమని అడిగెను)

నీ కృపతో నా మోహము తొలగినది,
జ్ఞానోదయమయినది, నాకు
తొలగినవి సమస్త సందేహములు
నీ ఆదేశాన్ని శిరసావహించుటకు
నీ ఆజ్ఞను పాలించుటకు
సిద్ధముగా వున్నాను నేను. 18-73

సంజయుడనెను:

మహాత్ముడైన వాసుదేవునకు, అర్జునునకు మధ్య అద్భుతంగా, ఒళ్ళు జలదరించేలా జరిగిన యీ సంవాదాన్ని విన్నాను. 18-74

యోగీశ్వరుడైన శ్రీ కృష్ణ భగవానుడు స్వయముగా, అతి గుప్తమూ, సర్వోత్కృష్టమూ అయిన యీ యోగశాస్త్రాన్ని అర్జునునకు చెబుతున్నప్పుడు వేద వ్యాస మహర్షి కృపతో నేను విన్నాను. 18–75

ఓ ధృతరాష్ట్ర మహారాజా! పవిత్రమగు, అద్భుతమగు యీ కృష్ణార్జున సంవాదాన్ని తలచి తలచి ఆనందమును పొందుచున్నాను.

18–76

ధృతరాష్ట్ర మహారాజా!
అద్భుతమూ, పుణ్యప్రదమైన
కృష్ణార్జున సంవాదాన్ని
స్మరించుచూ మరల మరల
సంతోషించుచు వున్నాను నేను. 18–77

ఎక్కడెక్కడ యోగీశ్వరుడైన
శ్రీకృష్ణ భగవానుడు ఉండునో
అక్కడ అర్జునుడు ఉండును.
సంపద, విజయం, ఐశ్వర్యం,
నీతి అని నా నమ్మకం. 18–78

'ధర్మ' అనే పదంతో (1–1) ఆరంభ మయిన శ్రీమద్భగవద్గీత 'మమ' అను పదం (18 – 78) తో అంతం అయింది. ఈ రెండు పదాలను జోడిస్తే 'మమ ధర్మం' అవుతుంది. ఈ మమధర్మం ఆత్మ ధర్మం. ఇది అందరి ధర్మం. ఇది మనలోని దేహ, మనో, మమత్వాలకు విరుగుడై ఆత్మమయస్థితికి, మమ ఆత్మ స్థితికి, 'నేను ఆత్మనే' అను జీవ బ్రహ్మల ఐక్యస్థితికి చేరుస్తుంది.

ధైనందిన జీవిత భగవద్గీతా సారం

1. వేదం అపౌరుషేయం, అనాది, శ్రుతి. స్వచ్ఛహృదయులైన ఋషులకు అంతర్వాణిగా వినపడినది. వేద సారం ఉపనిషత్తులు, ఉపనిషత్తుల సారం భగవద్గీత.

2. వ్యాస విరచిత భారతంలోని భీష్మపర్వంనందు 25వ అధ్యాయము నుండి 42వ అధ్యాయమువరకు విస్తరించివున్నదీ భగవద్గీత. కురుక్షేత్ర మహాసంగ్రామ ప్రారంభమున శ్రీకృష్ణార్జున సంవాదంగా జనించి సంజయుని దూరదర్శనం ద్వారా ధృతరాష్ట్రునకు వినిపించ బడింది.

3. రగిలే క్రోధ ప్రతీకార జ్వాలతో కౌరవుల చంపుటకు యుద్ధరంగమునకు వచ్చి, కరుణా దయార్ద్రహృదయుడై పరివర్తనా చిత్తముతో అందరూ తనవారేనని, తనవారిని చంపలేననీ, చంపి పొందే రక్తపుకూడు తనకు వలదనిన మమత్వాన విలపించి శరణాగతిన శిష్యుడైన అర్జునుడు, గీతాబోధతో మనోసందిగ్ధతను తీర్చుకొని, విశ్వరూప సందర్శనంతో ప్రత్యక్ష అనుభవాన్ని పొంది, స్థితప్రజ్ఞతతో, అహంకార మమకార రహితుడై ధర్మసంరక్షణార్థం నిష్కామభావంతో, హృదయాంత రాత్మయైన శ్రీకృష్ణుని

సారథ్యంతో జీవన కురుక్షేత్ర సమరంలో పోరి జయించిన అర్జునుడు మనందరి ప్రతినిధి. గీత మనందరి హృదయసంవాదం.

4. కురుక్షేత్రం మన హృదయ ధర్మక్షేత్రం, మన హృదయంలోనే వున్న, అసురబలాలు (11 అక్షౌహిణుల సైన్యంతో కౌరవబలగాలు, 7 అక్షౌహిణుల బలగాలతో నున్న పంచపాండవులు మరొక వైపున), మధ్యనే యీ యుద్ధం. యిది మన దేహంలోనే, మన హృదయ ధర్మక్షేత్రంలోనే దైవగుణమైన సత్వానికీ, రజో, తమో గుణాలకూ మధ్యన జరిగిన జీవన సంగ్రామం. మన అంతరాత్మయైన భగవానుని శరణ్యమున, అంతర్వాణి ప్రబోధాన్ని విని ఆచరించి గెలవటం ఎలాగో తెలిపే సర్వోత్తమ సద్గ్రంథం ఈ భగవద్గీత.

5. జీవన విషాద కారకమైన మమత్వాన్ని వీడి, నేనే కర్తననే అహం భావమును వదలి, మనసును శరణాగతిన, సమతుల్యతన, నిష్కామమున జీవన సమరమున మనలోని దైవిక శక్తులతో, ఆత్మ సారథ్యమున అసురశక్తులను జయించు విధానమును తెల్పు సద్గ్రంథం గీత.

6. ధృతరాష్ట్రుని 'నేను, నా వారు' మాత్రమే అను అతి సంకుచిత తామసిక మమత్వం – అర్జునుని 'మనం, మన వారనే' రాజసిక మమత్వం – కృష్ణ భగవానుని ఆత్మిక, సాత్విక మమత్వం అనే మూడు రకముల మమత్వాలను విశదీకరించేది గీత.

ఈ ఆత్మిక, సాత్విక మమత్వంలో మనం సర్వభూతములందు, సర్వ భూతములు మనయందు వుండే సర్వవ్యాపకత, యిదే ప్రతి సాధకునిలో రావలసిన మార్పు. ఇదే అర్జునునిలో కృష్ణ భగవానుని బోధానంతరమున వచ్చిన మార్పు. సర్వభూతదయారూపంలో యిది గౌతముని బుద్ధునిగా మార్చిన ఆత్మిక మమత్వం.

యీ విధిన హృదయ సంకుచత్వ సంసార చెరసాల బంధం నుండి,

హృదయ విశాలతను పెంచి, మనో పరివర్తన గావించి, సంసార జీవన విముక్తిని కలిగించి ముక్తిని ప్రసాదించే బోధామృతం ఈ గీత.

7. అర్జునుని పరిణామక్రమం, ఆజ్జలిచ్చే వీరుడు నుండి, మమత్వ విషాదమున ఆర్తుడై, మనోసందిగ్ధతలో నున్న సంశయచిత్తుని నుండి, శరణాగతిలో శిష్యుడై, మౌనియై, జిజ్ఞాసియై, తదుపరి మనోసందిగ్ధత తొలగి సంపూర్ణ శరణాగతుడై, భగవానుని ఆజ్ఞాపాలనకు తయారైనాడు. అతని హృదయ పరివర్తన, క్రోధ, ప్రతీకారాల నుండి కరుణ, విషాదం నుండి, స్వీకరణ నుండి అభయమునకు, తదుపరి శరణాగతికీ మార్పు చెందింది. యిది మనం మన గమ్యానికి చేరుటకు రావలసిన హృదయ పరివర్తనా క్రమం.

8. ఇది నిత్య ఆచరణ గ్రంథం. స్మశానానికి వెళ్ళే ముందర మాత్రమే తెరిచి వినేది కాదు (సాధారణంగా చనిపోయినవారి శవ సందర్శన సమయంలో వినిపించే ఘంటసాలవారి గీతాగాన టేపు రికార్డింగ్). యిది శ్రవణ, మనన, నిధి ధ్యాసన తదుపరి, అనుభవించి, ఆచరించి తరించవలసిన గ్రంథం.

9. అమృతత్వాన్ని మనలో నింపాలంటే మనలోని అరిషడ్వర్గములనే విషాలను (అహంకార మమకారాలు - విషయాలను) కడిగి వేయాలి. జీవన విషాద ప్రక్షాళననుండే అమృతత్వ సిద్ధి కలుగుతుంది. వాల్మీకి రామాయణ కావ్యజననం, క్షీరసాగర మధనంలో హాలాహల ప్రక్షాళన, అష్టైశ్వర్య అమృతసిద్ధి దీనికి ఉదాహరణలు.

10. సర్వ భూతదయ, సమానత్వం, సమతుల్యత, జీవన సమతుల్యత నుండి విశ్వసమతుల్యత వరకు తీసుకువెళ్ళే పవిత్ర గంగాప్రవాహమీ గీత. సమతుల్యత, మధ్యే మార్గం, సమయుధి సమాధి అని, సమత్వమే యోగమని, యిదియే చిత్తవృత్తి నిరోధమని, అదియే యోగమని నిర్వచించినదీ గీత.

11. నిర్ణీత గతి తప్పక, సర్వ జీవ సమతుల్యతన వ్యష్టిని, సమిష్టిని, సృష్టిని, పరమేష్టివైపు నడిపేది ధర్మం. అన్ని ధర్మాలకు మిన్న ఆత్మ ధర్మం. మన అంతర్వాణే ఆత్మ ధర్మప్రభోధ వాణి. అది వినపడాలంటే, యింద్రియ, మనోరభసను అరికట్టి, నిష్కామకర్మమున చిత్తశుద్ధిని పొందవలసిన ఆవశ్యకతను తెలిపేదే గీత.

12. మానవుడు కర్మ జన్ముడని, ఏ కర్మ చేయవలసిన అవసరమూ లేని జ్ఞానులు కూడా, జనకుని వలె యితరులకు మార్గదర్శకంగా వుండుటకై కర్మలు చేయుచునే వుందురని చేయవలెనని (యద్యదాచరతె శ్రేష్టః), కర్మలు చేయక శరీర సౌష్ఠవాన్ని కూడా నిలుపలేమనీ, నిష్కామ కర్మమే మన జీవన ధర్మమని తెలిపేది గీత.

13. అకర్మ కన్న కర్మము మేలనీ, కామ్యకర్మ కన్న నిష్కామకర్మ ఉత్తమమనీ, ఈ నిష్కామ కర్మమొక యోగమనీ, యీ నిష్కామకర్మ, కర్మ పరిపక్వ ఉచ్ఛదశ అని తెలుపునదీ గీత.

14. నిష్కామకర్మతో చిత్తశుద్ధి, దానితో జ్ఞానం లభిస్తుందనీ, కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞాన మార్గము లన్నియును సమములని, సాధకులు వారి వారి సంస్కారముల ననుసరించి తమ కనుగుణమైన మార్గాన్ని ఎంచుకొని, ఆయా మార్గాల ద్వారా తరిస్తారనీ, యీయీ మార్గాలలో హెచ్చుతగ్గులు లేవని వాటన్నిటి గమ్యం ఒకటేనని తెలుపునది గీత.

15. గాలిని బంధించు విధమున కడు దుర్లభమైన మనస్సును నిగ్రహించుకొని, శ్రమ, అభ్యాసం, తితీక్షతో సౌలభ్యంగా మార్చి, నిర్దేశించి జయించవచ్చని, యిదియే చిత్తవృత్తి నిరోధమని, అదియే యోగమని తెలుపునది గీత.

16. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం, అద్వైత దర్శనము జ్ఞానం అని తెలుపునది గీత.

17. **స్థితప్రజ్ఞుడు :** అనన్య భక్తుడు, త్రిగుణాతీతుడు, యోగారూఢుడు, వీరందరి

లక్షణములొకటేనని, అది సమత్వం, సమతత్వం, సమానత్వం, సమతుల్యతని తెలిపేది గీత.

18. విషయం అందరికీ ప్రియం అనీ, ఆ విషయం విషమనీ, ప్రియం కంటే శ్రేయం మేలని, కనుక పార్థుడు శ్రేయమే అడిగెనని బోధించినది గీత.

19. సంశయం అవిద్యా రూపమని, సుజ్ఞాన, విజ్ఞానములతోనే సంశయ నివృత్తి జరుగునని, సంశయాత్మ వినశ్యతే అని చెప్పినది గీత.

20. రాగమునుండి ద్వేషము, తదుపరి మోహము, తదుపరి విచక్షణా రాహిత్యము, తదుపరి అధోగతి (ప్రణశ్యతి) అని మానవ పతనా క్రమాన్ని వివరించేది గీత.

21. మన ఆచరణకు శాస్త్రప్రమాణము, యద్యదాచరిత శ్రేష్ఠ ప్రమాణము. ఆత్మ ప్రమాణములని మూడు ప్రమాణములను నిర్దేశించి చెప్పినది గీత.

22. మూర్ఖునికి మన ఆచరణే మన బోధకన్న మేలగు ప్రేరణ అని తెలుపునది గీత.

23. మనందరిదీ కర్మ జన్మమని, అవతారుడు మాత్రమే కారణజన్ముడనీ, యీ విధిన మన జన్మ, అవతారపురుషుని జన్మల వ్యత్యాసమును తెలుపునది గీత.

24. అంతటికీ అన్నిటికీ కారణమై, ప్రకృతికి కర్తయై, ఆ ప్రకృతిలో సగపాలై, ధర్మమునకు కర్తయై అకర్తగ, సాక్షిగా నుండటం భగవానుని లక్షణంగా తెలుపునది గీత.

25. మనోలయం కావించి, మౌనం ఆత్మసాన్నిహిత్యాన్ని చేకూరుస్తుందనీ, ఆ మౌనంలోనే దైవవాణి వినబడుతుందనీ, యిదే ధ్యానం అని తెలుపునది గీత.

26. అచంచల విశ్వాసం, అనన్య చింతనగా, అనన్య భక్తిగా మారి, నిష్కామ కర్మమై, చిత్తశుద్ధిన జ్ఞాన, విజ్ఞానమై, జన్మజన్మల కర్మఫల శేషాన్ని దగ్ధం చేసి ప్రజ్ఞానమై స్వస్వరూప దర్శనాన్ని గావించేది గీత.

27. నిర్విరామ అనన్య దైవచింతనే (తైలధారగ, రాధగా) ఓ తపస్సై భావ సాయుజ్యతతో, (యద్భావం తద్భవతి) జీవబ్రహ్మైక్యతను కలిగించు నని తెలుపునది గీత, అచంచలమైన, నిర్విరామ, నిరంతర దైవచింతనే తపస్సు అని నిర్వచించినది గీత.

28. యజ్ఞమనగా నిష్కామకర్మమని, త్యాగమనిన అహంకార విసర్జనం అని, సన్యాసమనిన కర్మఫలమును ఈశ్వరార్పణ మొనర్చుటయేనని, సమత్వమే యోగమనీ, అద్వైతదర్శనమే జ్ఞానమనీ, మోహక్షయమే మోక్షమనీ, పూర్ణత్వమే కృతజ్ఞతా భావమనీ తెలుపునది గీత.

29. సర్వం బ్రహ్మం అనీ, తదితరం వేరే లేదనీ, బ్రహ్మమున పుట్టి, ఎదిగి, తరిగి బ్రహ్మమును చేరుటే సృష్టి క్రమం, సృష్టి లక్షణం, సృష్టి ధర్మమనీ, యీ అనుభవమే జ్ఞానమనీ తెలుపునది గీత.

30. సమస్త సృష్టికారకమైన బ్రహ్మన్ మన వెలుపల పరబ్రహ్మగా, మన లోపల ఆత్మగా, చైతన్యరూపునిగా, సచ్చిదానందమూర్తిగా, అన్నీ తానై, ఏమీ కాక, సాక్షీభూతిగా వున్నాడని తెలుపునది గీత.

ప్రశ్నోత్తర భగవద్గీత

01. భగవద్గీత అంటే ఏమిటి ?

వేదసారం ఉపనిషత్ – సర్వోపనిషత్ సారం భగవద్గీత – అంతర్ వాహిని. భగవద్గీత మన ఆత్మ వాహిని. భగవద్గీత ఓ బోధ, ఓ గానం, ఓ ప్రవాహం, ఓ ఔషధం, ఓ అమృతం. ఈ ప్రభావం 'నేను','నాది' అనే ధృతరాష్ట్ర భావాన్నుంచి 'మనం','మనది' అనే అర్జున భావాన్నుంచి 'సర్వం బ్రహ్మం' అనే శ్రీకృష్ణ ఏకత్వభావానికి తీసుకు పోయే ప్రవాహం. ఇది 'నేను','నాది' అనే జీవనవిషాదకారకమైన మనో ఇంద్రియ విషయవాసనలు అనే విషం నుండి 'సర్వం బ్రహ్మం' అనే అమృతానికి తీసుకు వెళ్లే ప్రవాహం.

02. ధర్మక్షేత్రం, కురుక్షేత్రం అనగా ఏమిటి ?

భౌతికంగా, కురుక్షేత్రం హరియానాలో యిప్పటికీవున్న ఒక ప్రదేశం. అంతరార్థంలో చూస్తే, మనందరిహృదయాలలో వున్నదీ ధర్మక్షేత్రం, కురుక్షేత్రం రెండూనూ, మంచీ, చెడ్డలలాగా. యిందులో కౌరవులు నూర్గురు మన విషయవాంఛలకు పంచ పాండవులు పంచేంద్రియాలకు మనస్సుకు, అర్జునుడు బుద్ధికి, కృష్ణుడు ఆత్మకు సంకేతాలు. బుద్ధిని ఆత్మవైపు మరల్చి, విషయవాసనలపై విజయం సాధించడం సంసార అంతర కురుక్షేత్ర లక్ష్యం. ప్రతి ధర్మక్షేత్రంలోనూ,

ఒక కురుక్షేత్రం వుంటుందని, ప్రతి కురుక్షేత్రం లోను ఒక ధర్మక్షేత్రం వుంటుందనేది కూడ మరొక అంతరార్ధం.

03. భగవద్గీత విషాదంతో ఎందుకు మొదలైంది ?

చెడును ప్రక్షాళన చేస్తేగాని మంచిని నింపలేము. క్షీరసాగర మధనంలోనూ, విషం మొదట వచ్చి తదుపరి అమృతం వచ్చింది. అంతర్గత విష ప్రక్షాళన అర్జున విషాద యోగ లక్ష్యం.

విషాదము అనంత ఆనందానికి మూలము. జీవన విషాదముతోనే బాహ్యదృష్టి అంతర్దృష్టిగా మారి, ఆధ్యాత్మిక జీవనమార్గానికి నాంది పలుకుతుంది. మహాకవి వాల్మీకికి మృతి చెందిన క్రౌంచపక్షిని చూడటం వలన కలిగిన విషాదంతో ఆవిర్భవించింది రామాయణ మహాకావ్యం. మహా యోధుడయిన అర్జునిని విషాదంతో మొదలయింది ఈ గీతామృత ప్రవాహం.

అమృతాన్వేషణలో ఆరంభమయిన క్షీరసాగర మధనంలో తొలుదొలుత లభించింది విషం. దానిని పరమేశ్వరునికి అర్పించగా, ఆయన దానిని మింగకుండా, బయటకు వెళ్లగక్కకుండా తన గళమందే నిలుపుకున్నాడు. దానిని బట్టి మనకు తెలుస్తుంది. విషాన్ని (చెడును) మింగి మనమే చెడుగా మారకుండా, బయటకు వెళ్లగ్రక్కి యితరులకు హానికలిగించకుండా ఉండాలి అని. మనలోని మాలిన్యాలను, కల్మషాలను ముందుగా తొలగించుకోకుండా మంచిని నింపి నప్పటికీ ప్రయోజనం ఉండదు. అలాగే ఆత్మజ్ఞానాన్ని నింపాలంటే అనాత్మజ్ఞాన కారకమైన అవిద్య, మమత్వాలను విడనాడాలి. గీతా ప్రథమాధ్యాయమైన 'అర్జున విషాదయోగం' లో అర్జునుని మమత్వాన్ని బయటకు తీసుకువచ్చి తన పాత్రను శుద్ధిచేసే ప్రక్రియే ఈ అధ్యాయం. అర్జునుడు మనందరి ప్రతినిధి.

మన దైనందిన జీవితాలలోకూడా, గుడి, బడులలాంటి ప్రజోపకార సత్కార్యాలను మొదలుపెట్టినపుడుకూడ మొదలవుతాయి వివిధ రకాల అడ్డంకులు,

అవాంతరాలు, మనస్పర్థలు. వీటన్నిటినీ (లోనికి తీసుకొనకుండా, సమాజంలోనికి వెళ్లగ్రక్కకుండా భగవంతునకర్పించి) అధిగమించిన గాని అనుకున్న సత్కార్యం సఫలం కాదు. యిది మన స్థితప్రజ్ఞతకు ఓ సవాలు, ఓ పరీక్ష.

04. 'శరణాగత శిష్యుడిని' అనక ముందు కృష్ణునితో అర్జునుని వాదన ఏమిటి ?

కృష్ణా! నాకు విజయము వలదు, రాజ్య భోగములు వలదు, ఎవరెవరితో యీ రాజ్య సుఖ భోగములు పంచుకోవాలని కోరుకుంటామో వారందరూ యుద్ధ సన్నద్ధులై నా ఎదుటనే వున్నారు. వీరిలో నాతండ్రులు, కుమారులు, తాతలు వున్నారు. వారిని నేనెలా చంపేది. వాళ్ళు నన్ను చంపదలచిననూ నేను వాళ్ళను చంపను. త్రిలోకాధిపత్యమునకైనను వారిని నే చంపలేను. యిక యీ రాజ్యము కొరకు చంపుతానా?. పాపాత్ములైన దుర్యోధనాదులను చంపి మనం పొందేదేముంది? పాపాత్ములను చంపితే మనకు పాపమే కదా మిగిలేది.

మాధవా! బంధువులు, స్వజనులైన దుర్యోధనాదులు మనకు బంధువులు, వారిని చంపుట మనకు మేలు కాదు. స్వజనమును చంపి ఎలా సుఖపడగలము? ఓ జనార్దనా! రాజ్యకాంక్షన, దుష్టబుద్ధులైనందున, కౌరవులు కులక్షయ మిత్ర ద్రోహ పాపమును చూడలేకున్నారు. అదే కులక్షయదోషము. 'యిది తప్పిదము', అని తెలిసి కూడా మనము చేయలేముగదా.

ఓ కృష్ణా! కులక్షయమున, పురాతన కుల ధర్మము. నశించును. కులధర్మము నశించిన అధర్మము పెరుగును. అధర్మము పెరిగిన కుల స్త్రీలు చెడెదరు. కుల స్త్రీలు చెడిన వర్ణము సంకరమౌను. వర్ణసంకరమైన ఆ జాతికి, ఆ కారకునకు నరకము – పితృతర్పణ, శ్రాద్ధములు లేక వర్ణసంకరమున జాతి అధోగతి పాలవును. యిది జాతి, సంఘ, దేశ, ధర్మ, సంస్కృతి వినాశనము. వర్ణము, జాతి, సమిష్ఠి ధర్మ క్షీణత, ఆ జాతికి జీవన నరకమని, జీవనం కడు దుర్భరమని విన్నాము కదా. అయ్యో రాజ్యకాంక్షతో, మైమరచి, తెలియక, బంధువులను

చంపుటకు ఎంచి ఎంత పాపానికి పూనుకున్నాం. ఈ పాపానికన్నా, ధార్తరాష్ట్రులు ఆయుధధారులై, నిరాయుధుడనైన నన్ను చంపిననూ మంచిదే.

మధుసూదనా!, పూజ్యులైన భీష్మ ద్రోణుల పైననే బాణములు వేసి ఎలా నే యుద్ధము చేయుదును? మహామహులైన నా తాతలు, గురువులను చంపుటకన్ననూ నాకు భిక్షాటనమే మేలగును. నేను యీ రక్తపు కూడును తినజాలను. గెలుపు, ఓటమిలో ఏది మంచిదో వికలమైన, నామది ఎరుగదు. ఎవరిని నిర్జించి మనలేమో, వారే నాఎదురుగ నిల్చొనివుంటే, యుద్ధములో నేను వారిని ఎలా చంపగలను? వారిని చంపి నేనెలాజీవించగలను?

అజ్ఞాన దోషమున నాలో అలజడి పెరిగెను. నాకు తప్పు ఒప్పులు యీనాడు తెలియుట లేదు. నేను నీ శిష్యుడనై నీ శరణు వేడుచున్నాను. కరుణతో, కృపతో నను శాసించి శ్రేయమేదియో నాకు తెలుపుము. నా యింద్రియములు, గుండె, క్షోభతో భగభగమని మండుచున్నవి. నా యీ దుఃఖము శత్రువులేని సామ్రాజ్యమేలినను, యింద్రునిలాగ స్వర్గమేలినను తొలగదు. ఈ విధిన శ్రేయమేదియో, తనకు తెలుపమని అర్జునుడు కృష్ణుని శరణు వేడెను.

05. కురుక్షేత్ర యుద్ధానికి బీజం ఏమిటి?

జ్ఞానాంధుడైన ధృతరాష్ట్రుని మమత్వ "మమకా" బీజంతో మొదలైనది కురుక్షేత్రం. మనలోని మన మమత్వమైన మమకారబంధంతో మొదలవుతుంది మన జీవన కురుక్షేత్రం. ఈ గీతాగ్రంథంలో మూడు మమత్వాలు ఉన్నాయి. అవి దేహభ్రాంతితో ఉన్న ధృతరాష్ట్రుని సంకుచిత మమత్వం. ఇది మొదటి మమత్వం, వ్యష్టికి సంబంధించినది, అంటే వ్యక్తికి చెందినది. యిది తామసిక మమత్వం.

రెండవది మనోభ్రాంతితో కూడి ఉన్న అర్జునిని మమత్వం. ఇది సమిష్టిది. ఇది 'మేము', 'మా వాళ్లు' అనుకునే భావనతో కూడినది. యిది రాజసిక

మమత్వం. మూడవది ఆత్మిక మమత్వం. అది శ్రీకృష్ణుడు బోధించినది, ఆత్మసంబంధ మైనది, విశ్వమానవ సౌభ్రాతృత్వం.

'నేను','నాది' లను వీడితే సుఖం
వీడకుంటే తప్పదు దుఃఖం
'మనం','మనది' లోనే ఉన్నవి
సుఖం, దుఃఖం సమపాళ్ళయి
సర్వం బ్రహ్మం, వసుధైక కుటుంబంగా
పరమేష్ఠిలోకి ప్రవేశం
యిది పరమానందమయం, అమృతం.

06. భగవద్గీత అధ్యాయాల వరుస క్రమానికి, కారణంవుందా ?

మొదటి 11 అధ్యాయాలు జ్ఞానానికి సంబంధించిన వివరణ.

అజ్ఞానము - జ్ఞానము - సుజ్ఞానము - విజ్ఞానము - ప్రజ్ఞానము గా, అంచెలంచెలుగా ఎదుగుతుంది. యిదే విధిన ప్రార్ధన - శ్రవణ- మనన - నిధిధ్యాస - దృష్టం - ప్రవేష్ఠం - మోక్షం

శ్రీకృష్ణ భగవానునికి యుద్ధ వీరునిగా రథమును యిరు సైన్యాల మధ్యన నిలుపమని ఆజ్ఞ నిచ్చిన అర్జునుడు, యుద్ధం చేయననుటకు తన దైన కుజ్ఞానంతో వాదాన్ని వినిపించిన పండితుడై, తదుపరి సందిగ్ధంతో శిష్యుడై, ఆ పరి ఆర్తుడై, తదుపరి శరణాగతిన భక్తుడై (అంతకుముందు ఆజ్ఞ నిచ్చిన అర్జునుడు) తనకు ఆజ్ఞ నిమ్మని శ్రీకృష్ణ భగవానునికి వేడుకొనెను.

సం.			
2	సాంఖ్య యోగం	శ్రవణం	జ్ఞానము
3	కర్మ యోగం	శ్రవణం	జ్ఞానార్థత - కర్మ యోగం - చిత్తశుద్ధి
4	జ్ఞాన యోగం	శ్రవణం	సుజ్ఞానము
5	కర్మ సన్యాస యోగం	మననం	జ్ఞానార్థత - కర్మ సన్యాసం - జ్ఞానం
6	ఆత్మసంయమన యోగం	మననం ధ్యానం	జ్ఞానార్థత - చిత్తవృత్తి నిరోధం-
7	విజ్ఞాన యోగం	మననం	విజ్ఞానము
8	అక్షరపరబ్రహ్మ యోగం	నిధి ధ్యాసన అశ్వద్ధము	క్షరుడు - అక్షరుడు - సృష్టి -
9	రాజవిద్యా రాజగుహ్యా యోగం	నిధి ధ్యాసన	ప్రజ్ఞానము
10	విభూతి యోగం	నిధి ధ్యాసన	దైవ విభూతి
11	విశ్వరూప సందర్శన యోగం	దృష్టం	విశ్వరూప సందర్శనం
12	భక్తి యోగం	దృష్టం	అనన్యభక్తి - సాయుజ్యం
13	క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగం	దృష్టం	క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ సంయోగం
14	గుణత్రయ విభాగ యోగం	ప్రవేష్టితం	త్రిగుణం- నిర్గుణం విభాగ సంయోగం
15	పురుషోత్తమ ప్రాప్తి యోగం	ప్రవేష్టితం	సంసారం- దేహం-దేహి ప్రకృతి పురుష విభాగ సంయోగం
16	దైవాసురసంపద్విభాగ యోగం	ప్రవేష్టితం	దైవ, అసుర సంపత్తు- సంయోగం
17	శ్రద్ధాత్రయ విభాగ యోగం	ప్రవేష్టితం	శ్రద్ధాత్రయ విభాగ సంయోగం
18	మోక్ష సన్యాస యోగం	మోక్షంతో	మోహక్షయం- మోక్షం

యిది అర్జునుని పరిణామ క్రమం. ప్రతీకారాగ్నిన రగిలి వచ్చిన పార్థుడు, తనవారినందరిని చూచి, దయార్ద్రహృదయుడై, వుప్పొంగిన కరుణతో, 'నకాంక్షే విజయం' అని యుద్ధ విముఖుడై, తదుపరి శ్రీకృష్ణ భగవానుని ఆజ్ఞ ఏదైననూ శిరసావహిస్తానని ధర్మ సంరక్షకుడైనాడు. యిది అర్జునుని మరొక పరిణామ క్రమం.

మానవుడు, మాధవుడు – దేహం, దేహి – క్షేత్రం, క్షేత్రజ్ఞుడు – ప్రకృతి, పురుషుడు – జ్ఞేయం, జ్ఞాత వేర్వేరు అనే ద్వైత భావన నుండి, మణుల యందు తను సూత్రమనీ, నీటియందు రుచిని తానను విశిష్టాద్వైత భావమునకు, తదుపరి సత్యం, అసత్యం, కీడూ మేలూ, ప్రాణం, మృత్యువు రెండూ తానేననీ, తానే సర్వమనీ, తానే బ్రహ్మం అనీ, తాను కానిది వేరొకటి లేదను అద్వైత తత్వానికి ప్రవహించిన గీతామృతం యిది.

07. కృష్ణభగవానుడు అర్జునునకుపదేశించిన సాంఖ్యయోగ సారమేమిటి?

సాంఖ్యయోగం అత్యవసర జ్ఞానం (Crisis Intervention). యుద్ధభూమిలో, యిరుసైన్యాలమధ్యన యుద్ధప్రారంభం కాబోతుందనగా, పాండవవీరులలో శ్రేష్టుడైన అర్జునుడు యుద్ధము చేయనని అత్యంత విపత్కర పరిస్థితికి తగిన అత్యవసర జ్ఞానాన్ని యీ సాంఖ్యయోగంలో యిచ్చెను.

శోకింప తగని వారి గూర్చి శోకము తగదు. జ్ఞానులెవ్వరు మరణము గురించి బాధపడరు. జనన మరణములు అతి సహజములు. ఒకపరిలేక యిప్పుడుంటిమని, రేపు వుండమని, బాధపడెదవు. పుట్టియు, యెదిగియు, తరిగి వెళ్లునది, నిత్యం మారే దేహపు తీరు మాత్రమే. బాల్యం, యవ్వనం, గృహస్తం, వార్ధక్యం, పాంచభౌతిక దేహపు తీరుమాత్రమే. నిత్యం మారే దేహమనిత్యము. కంటికగుపడని ఆత్మే నిత్యం. పుట్టిన వానికి చావు తప్పదు. మరి యీ తప్పని చావుకు చింత దేనికి? వస్తు విషయముల కలయిక కష్టసుఖాలకు బీజము.

కష్టసుఖములు కదిలే మేఘముల లాంటివి. సుఖ దుఃఖములు మన జీవితంలో ఒక భాగమనే సమభావనము ప్రశాంత జీవనమునకు దారి. యింద్రియ విషయ శబ్దాదుల చలింపని వాడు, శీతోష్ణ, సుఖ దుఃఖాదులైన ద్వంద్వముల, సమభావమున నుండువాడు,మోక్షానికి అర్హుడగును. ఈనాడు వుండి తదుపరి నశించే దేహమునకు వునికి లేదు. కనపడని, సత్యమైన, నిత్యమైన ఆత్మకు చావు లేదని తత్వజ్ఞానులకు తెలుసు. అన్నిట నిండిన ఆత్మకు అంతు లేదు, అవ్యయమైన ఆత్మకు నాశనము లేదు. దేహమశాశ్వతము. దేహి నిత్యము. దేహి నాశరహితుడు, అనంతుడు. దేహి నిత్యుడు, శాశ్వతుడు. కావున అర్జునా, దైన్యమును వీడి యుద్ధము చేయుము.

ఆత్మ చంపు వానిగా, చంపబడువానిగా, తెలుసని ఎవరు అందురో, వారికి ఆత్మ రహస్యం తెలియదు. ఆత్మ చావదు, ఆత్మ చంపదు, సత్య, నిత్య, అనాది ఆత్మ. దానికి జనన,మరణములు లేవని తెలిసినవాడే అసలు జ్ఞాని.

చిరిగిన వస్త్రమును వదిలినవాడు, నూతన వస్త్రము నేరీతిగా ధరించునో, చెదరిన దేహమును వదలిన జీవుడు(ఆత్మ), నూతన దేహము నాశ్రయించును. ఆత్మనుశస్త్రము చంప లేదు, అగ్నికాల్చ లేదు, నీరు తడుప లేదు. గాలి ఎండ బెట్ట లేదు. యీఆత్మచంపబడదు, కాల్చబడదు.యితడు నిత్యుడు, సర్వ వ్యాపి, స్థిరుడు, నిశ్చలుడు,పురాతనుడు. ఆత్మ నేత్రములకు అగోచరం. మనసుకు చింతింప నలవి కానిది.

ఒకపరి ఆత్మకు జనన మరణములున్నవని తలచిననూ, తప్పని దానికై శోకము తగదు. పుట్టిన వానికి తప్పదు చావు. చచ్చిన వానికి మరు జన్మ తప్పదు. అనివార్యమైన దానికి దుఃఖమెందులకు? కని, విని, చెప్పిన వారెవరును యీ ఆత్మరూపము, దాని అసలు స్వరూపమును తెలియరు. దేహి నిత్యముగాని దేహములు కావు. నిత్యమైన యీ ఆత్మ చంపబడదు.

ఓ అర్జునా! నీధర్మము నీ క్షత్రియ ధర్మము. ధర్మ రక్షణే నీ కర్తవ్యము. క్షత్రియునకు ధర్మరక్షణకొరకు చేయు యుద్ధముకన్న మించిన కార్యము వేరొకటి లేదు. యాదృచ్ఛికముగా లభించినదీ, తెరువబడిన స్వర్గద్వారములవంటిదీ అయిన ఈ యుద్ధములో భాగస్వాములైన క్షత్రియులు వారి స్వధర్మమైన క్షత్రియధర్మాన్ని నిర్వర్తించి సుఖింతురు. కనుక, నీవు స్వధర్మము మరచి యీ ధర్మయుద్ధము చేయవేని పాపమును, అపకీర్తి, పొందెదవు. జనమెల్లరు నీ యీఅపకీర్తిని కథలు, కథలుగా చెప్పుకుందురు. పేరున్న వీరునికి ధర్మ యుద్ధమున మరణముకన్నను. ఈఅపకీర్తి బాధాకరము. యిప్పటివరకూ నిన్ను పొగడిన మహారథులునూ, యుద్ధమున పారిపోయిన పిరికివాడివని, నిన్ను అవహేళనతో చులకనచేయుదురు. ఇదేకాక, నీ శత్రువులే నీవసమర్ధుడవని కించపరచి దుర్భాషలాడుదురు. ఇంతకు మించిన దుఃఖము నీకు వేరొకటి వుండదు. ధర్మ యుద్ధమున చంపబడిననూ వీరస్వర్గమును పొందెదవు. ఒకపరి నీవు విజయమొందిన, రాజ్యభోగములు అనుభవించెదవు. ఏ విధిగా చూచిననూ యీ ధర్మ యుద్ధము నీకు మేలు. కావున లేచి యుద్దము చేయుము అర్జునా! జీవన ఆటుపోటులను సమత్వబుద్ధిన స్వీకరించి యుద్ధము చేయుము.

పార్థా! అవివేకులూ, శుష్కవాదములకు స్వర్గాభిలాషులకు, విషయ వాంఛాపరులకు, అల్పజ్ఞులకూ, భోగైశ్వర్య ప్రియులకూ, దృశ్యవ్యామోహితు లకు, దైవ చింతనకు ఏకాగ్రత కలుగదు. వేదము కర్మకాండమున తెలిపిన గుణాత్మక విషయ వివరములు వదలి శుద్ధ సత్వమును ఆశ్రయింపుము,. నీ యోగక్షేమములు నాకే వదలి,అంతర్ముఖుడవై, ఆత్మజ్ఞానివి కమ్ము. నది నీరు వాడెడి వానికి, బావి నీరు కూడ ఎంత ముఖ్యమో, బ్రహ్మజ్ఞానులు అదే రీతిగా ప్రాముఖ్యత కర్మకాండకు యిత్తురు. సర్వవేద కర్మకాండ ఫలితమేదియో, పరమార్ధ తత్వమెరిగిన బ్రహ్మజ్ఞానికిని అదే ఫలము చేకూరును. అందువలన అర్జునా నీవు ఆత్మ జ్ఞానివి కమ్ము.

కర్మలకే నీకధికారము, కర్మఫలములకు కాదు. ప్రతిఫలము ఆశించి, కర్మలు చేయకుము. అలాగని కర్మలు చేయుట మానకుము. తదేకనిష్ఠన,

విషయ త్యాగమున గెలుపు ఓటములు, లాభనష్టములు సమముగ నెంచి, కర్మలను చేయుము. సమత్వ బుద్ధియే యోగమనబడును. సమత్వం యోగముచ్యతే. కామ్య కర్మ కన్న, నిష్కామకర్మ ఉత్తమము. ప్రతిఫలాపేక్ష కర్మలు అల్పులు.

చిత్తశుద్ధిన సమభావమున, యోగమున కర్మలు చేయుము. యిది పాపపుణ్యములకతీతమై కర్మ నైపుణ్యతకు దోహదమౌను. అందున కర్మ నైపుణ్యమే యోగం అనబడును. నిష్కామ కర్మయోగులు, సమత్వ బుద్ధితో, ఫలాపేక్ష రహితముగ కర్మలను ఆచరించి దుఃఖరహితమగు మోక్షమును పొందుదురు.

కర్మయోగమున కలిగిన అజ్ఞాన మలిన విమోచనము తదుపరికలిగిన చిత్తశుద్ధితో, యింద్రియ విషయ విరక్తి కలుగును. తద్వారా విన్న, వినబోవు వాటిపట్ల విషయాసక్తి తగ్గుతుంది. నానావిధ శ్రవణములతో (శబ్ద కాలుష్యమున) విచలితమైన మనసును పరమాత్మ ధ్యానమున స్థిరముగా నుంచినపుడు, ఆత్మ సాక్షాత్కారము నకు అర్హత కలుగుతుంది.

08. కర్మయోగ సారమేమిటి ?

లోకంలో మోక్షానికి రెండు మార్గాలున్నవి. సులభతరమైన కర్మ మార్గం, శీఘ్రతరమైన జ్ఞాన మార్గం. వారి వారి పూర్వజన్మ సంస్కార ప్రవృత్తి ననుసరించి వారివారి మార్గం నిర్దేశించబడి, మానవుడు వానికి అనువైన మార్గంలో ప్రయాణించును. జ్ఞానులకు సాంఖ్యము, కర్మయోగులకు నిష్కామ కర్మము. పూర్వజన్మల కర్మశేష ఫలమీ జన్మ. అందువల్ల కర్మలు చేయుట అతి సహజం. కర్మలు చేయకుండా వుండుట చాలా కష్టం. బయటికి మానిన మాత్రాన కర్మలు మాసిపోవు. మానసిక కర్మకూడ కర్మయే. భౌతికంగా కర్మలు మాని, అవి మనసున రగులుటకన్నను, కర్మలు చేయుట మేలగును. కర్మలు మానినంతన జ్ఞానోదయం కలుగదు.

కర్మ జన్మం మనది. ఒక క్షణంకూడ కర్మలు చేయక వుండలేము. సహజ ప్రకృతి గుణదోషాన మనము కర్మలు యంత్రంలా చేయుచునే వుందుము. మానిన కర్మలు మనసులోనే రగిలి ఎదుగును. యిలా కర్మేంద్రియాలను అణచి మానిన కర్మలు, బయట మాని, లోలోపల రగిలి భాదించును. ఇంద్రియ నిగ్రహమున, కర్మఫలాపేక్ష లేక, కర్మలు మనోబలాన ఆచరించు వాడే ఉత్తముడు. ఎవరికిని కర్తవ్య కర్మలు తప్పవు. చేయక మనసున రగిలే కర్మల కంటే కర్మలాచరించటమే మేలు మనకు. కర్మలు చేయక శరీరసౌష్టవం కూడా దుర్లభం. నలుగురి మేలు ఎంచి చేసిన కర్మలు యజ్ఞ సమములగును. తదితర కర్మలు బంధ కారకములు. అందున నీవు నిష్కామ కర్మలను, భగవత్ ప్రీతితో, ప్రతిఫలము కోరకనే చేయుము.

ప్రజలతోబాటుగ యజ్ఞ యాగములను కోరిక తీర్చే కామధేనువనుచూ ప్రజాపతి సృష్టించెను. వీటిని ఆచరించి కోరికలు తీర్చుకొని అభివృద్ధి చెందుమని ప్రజలను దీవించెను. నిస్వార్ధ కర్మలు, ప్రజోపకర కర్మలు, ప్రకృతి క్షేమకర కర్మలు పరస్పర శ్రేయం, దేవతా ప్రియం, సమృద్ధిగా ఫలములనిచ్చునవి. నిష్కామ యజ్ఞముగా చేసిన కర్మల వలన ముదము నొందిన దేవతలు యిచ్చిన భోగములను, దేవతల కాహుతినీయక తినెడు స్వార్ధం చౌర్యం. యజ్ఞఫలాన్ని సమిష్ఠితో పంచి, శేషాన్నమును దైవ ప్రసాదముగ భుజించువాడు సజ్జనుడు. అలా పంచక తినెడు ఆహారం పాపమై హాని సల్పును. యజ్ఞము. నిష్కామ కర్మ వలన పరబ్రహ్మము లభించును.

జీవ మూలం ప్రాణం. ప్రాణ మూలం అన్నం. అన్న మూలం వర్షం. వర్ష మూలం మేఘం. మేఘ మూలం యజ్ఞం. యజ్ఞ మూలం వేదం. వేద మూలం అక్షర పరబ్రహ్మం అని తెలియుము.

నాచే నియమిత యీ జీవపరబ్రహ్మ పరిభ్రమణ చక్రాన్ని మరచి, యింద్రియలోలుడై నిష్కామకర్మను ఆచరించని మానవుడు వ్యర్ధపు పాప జీవనమున

అధోగతిన చేరును. కార్యం, కర్మం, కర్తం, భోక్తం సర్వం ఆత్మమయం, పరమాత్మమయం. అట్టి జ్ఞానికి కర్మచేయకుండినను, చేసిననూ వేరొక ప్రయోజనం లేదు. వానికి ఏ దోషం అంటదు. అందువలన సతతం ప్రతిఫలాపేక్ష లేని కర్తవ్య కర్మలను యీరీతిన చేసి మోక్షమును పొందుము. జనకుని వంటి విజ్ఞానులు యిటువంటి నిష్కామ కర్మమును ఆచరించి మోక్షమును పొందిరి. నీవు కూడా యిటువంటి నిష్కామ కర్మలకే తగుదువు.

మంచివారలు, శ్రేష్ఠులు, సుజనులు ఏ రీతిన కర్మము ఆచరింతురో, అదే సామాన్యులందరికి ఆదర్శమయి ప్రమాణమవుతుంది. విధిగా చేయవలసినది, పొందవలసినది నాకు ముల్లోకములలో లేదు. లేకపోయిననూ, నేను నిత్యము ఎడతెగక ఎల్లప్పుడు సత్కర్మలను చేయుచుందును. యేలనన పార్థా! నేనే కర్మల చేయకుండిన, మానవులందరు నన్ను ఆదర్శముగా తీసుకొని కర్మలు మాని భ్రష్టులవుదురు.

ఫలాపేక్షతో చేసిన కర్మలతో మూర్ఖజనులు బందీలవుదురు. అందుకే జ్ఞాని నిష్కామకర్మము జాతి మేలుకై చేయవలెను. విజ్ఞులు, ఫలాపేక్షతో మసలు మూర్ఖులను కదిపి బోధించరు. తాము నిష్కామముగా చేయు కర్మలే, వారికి ప్రేరణయై వారిలో మార్పును తెచ్చును. వీరిలో త్రిగుణాత్మక జన్మాంతర ప్రారబ్ధ కర్మబంధ సంస్కార వాసనలే కర్మలను అహంకారమున, తామే కర్తలమని ఎంచి, కర్మలను చేయించి కర్మఫల బాధలు, దుఃఖములు అనుభవింపచేయును.

ఆత్మానాత్మ వివేకి గుణ, కర్మముల మర్మము ఎరుగును. ఇంద్రియ విషయ సంపర్కమే కర్మకారణమై కర్మలను చేయించును. ఆత్మ ఎప్పుడూ సంగరహిత సాక్షి అని ఎరిగి చేసిన కర్మ అకర్మం, యిదే నిజ నిష్కామకర్మం. సమస్త కర్మఫలము నా కర్పించి, నీ మదిన నన్ను నిలిపి, అత్మభావంతో, అశా మమకారములను వదలి, చిత్త శుద్ధిన నిర్భీతిగా యుద్ధము చేయుము. నిష్కామకర్మ ఆచరణ సాధువు, కర్మ బంధము నుండి విముక్తులవుదురు. యెవరు నిష్కామ కర్మమును, ద్వేషమున

అనుసరింపరో, వారు అల్పజ్ఞులని, మూఢులని, చెడినవారలని తెలిసికొనుము. లౌకిక జ్ఞానియును, జన్మాంతర సంస్కార బద్ధుడై, సంస్కార బద్ధముగ పుట్టిన పూర్వజన్మ కర్మముల నాచరించును. రాగ ద్వేషములు, యింద్రియములకు తమ విషయ సంగమున యేర్పడిన కర్మలను నిగ్రహించుట మనసుకు కష్టతరం. యివి శత్రువులై వేధించిననూ వాటికి మనము లొంగకూడదు.

చక్కగ చేసిన పరధర్మము కన్నను, లేమిగ చేసిన స్వధర్మమే మేలు. స్వధర్మాన కలిగిన మరణం కూడా శ్రేయమే. పరధర్మం అతి భయానకం. మితిమీరిన రజోగుణ జనిత కోరికలకు మన తృష్ణే కారణం. కామం తీరని కోరికగ మారి మహా పాపములను చేయించును. మోక్ష మార్గమున కిదియే ప్రబల శత్రువు. పొగచేత అగ్నియు, మాలిన్యముతో అద్దమూ, మావి చేత శిశువు కప్పబడినటుల, కామముతో ఆత్మ జ్ఞానము కప్పబడి వున్నది. నిందింపనలవి కానిదియు, అగ్నిలాగ తృప్తిచెందనిదైన, నిత్య శత్రువైన యీకామముచే, జ్ఞానము కప్పబడి వున్నది. యీ కామము ఇంద్రియ, మనో బుద్ధులను నివాస స్థానాలుగా చేసుకొని ఆత్మ జ్ఞానాన్ని కప్పివైచి, మనుజుని భ్రాంతికి గురిచేస్తున్నది. మొదట ఇంద్రియములను నిగ్రహించి, పాపకారక మైనదియు, శాస్త్ర, అనుభవ జ్ఞానాదులను (జ్ఞాన,విజ్ఞాన) నాశనము చేయునదైన కామమును నిగ్రహింపుము.

దేహముకన్న యింద్రియములు, యింద్రియములకన్న మనసు, మనసుకన్న బుద్ధి, బుద్ధి కన్న ఆత్మ మిన్న. కనుక ఓ మహాబాహో! బుద్ధికి అతీతమైన దానిగా ఆత్మనెరిగి, బుద్ధి విచక్షణతో మనసును అరికట్టి, అతి ప్రబల శత్రువైన కామమును జయింపుము. ఆత్మను బుద్ధికి అతీతముగా గుర్తించి, ఆత్మ శరణుజొచ్చి, ఆత్మతోనే ఇంద్రియమనోబుద్ధులను లొంగ దీసుకొని, శత్రువైన కామమును జయింపవలయును. యిది కర్మ యోగ సారాంశము.

09. జ్ఞానయోగ సారమేమిటని అర్జునునికి భగవానుడు తెలిపెను ?

అద్వైత దర్శనం జ్ఞానం. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం. బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి. ఉన్నది ఒక్కటేనని సూచించేది, మనందరి మధ్యనున్న బంధాన్ని అనుభవింపచేసేది జ్ఞానం. బయటనుంచి లభించనిది, మనలోనే ఎల్లప్పుడూ వున్నది జ్ఞానం. కాని యీజ్ఞానం మాయపొరలతో కప్పబడి మనకు అందుబాటులో లేదు. మల, విక్షేప, ఆవరణలనే మాయ పొరలతో కప్పబడినది జ్ఞానం. నిష్కామకర్మ యోగంతో లభ్యమగు చిత్త శుద్ధితో మల దోషాన్ని, మనోస్థిరత్వాన్ని ప్రసాదించే ధ్యాన యోగంతో విక్షేపాన్ని, అవిద్యా నిర్మూలనా జ్ఞానంతో ఆవరణ దోషాలను (మాయను) అధిగమించిన స్వస్వరూప జ్ఞాన దర్శనం కలుగుతుంది.

నాకును నీకును ఎన్నో జన్మలు గడచినా, అవి నేనెరుగుదును, కాని వాటన్నిటిని, నీ వెరుగవు ఈ మాయాకారణాన. మానవులది కర్మ జన్మ. నాది కారణ జన్మ. నాకు చావు పుట్టుకలు లేవు. నాశరహితుడను. ఈశ్వరుడను. ప్రాణులందునా ప్రకృతిని వశపరచి, నా మాయతో మరల మరల జన్మించెదను. ధర్మమెప్పుడెప్పుడు క్షీణించునో, అధర్మము వ్యాపించునో, అప్పుడు నన్ను నేనే సజ్జనుల సంరక్షణకొరకూ, దుష్కర్ముల దునుముటకు, అనంత ధర్మ రక్షణకూ, మరల మరల నేను అవతరింతును. అర్జునా! ఎవరెవరు నా యీ జన్మ కర్మరహస్య యదార్ధమును గ్రహింతురో, వారు పునర్జన్మరాహిత్యము నొంది, నన్నే (మోక్షము) పొందుదురు. మితిమీరిన అనురాగము, భయ క్రోధములను విడచి, తన మదిలో నన్ను నిలిపి, నన్ను ఉపాసించి, నన్ను ఆశ్రయించి, జ్ఞానతపస్వులై నను బడసి పవిత్రులైరి.

పార్థా ! నేను భక్తుల ప్రతి స్పందనను, ప్రతిధ్వనిని, ప్రతి రూపమును. నేను వారి ముందర నున్న దర్పణాన్ని. వారి వారి అంతర్భావాల ప్రతీకను. యెవరే రీతిన (నను) సేవించిన, అదే తీరుగానే పలుకుదును. పలు రీతుల జన సేవనం, పలు రీతులు నా అనుగ్రహం. సర్వ మార్గములు నావే. సర్వవిధముల సేవలు నాకే. సర్వ రీతుల అనుగ్రహము నాదే. నాదికానిది

వేరొకటి యీ విశ్వమున లేదు. గుణ కర్మల ననుసరించి నాలుగు వర్ణములను నేను సృష్టించితిని. కర్తనైన నన్ను అకర్తగా యెరిగి, కనపడక ఉన్న నన్ను అనాది అని తెలుసుకో. కర్మలంటవు నాకు.అనాసక్తుడను నేను. సాక్షీభూతిగా నన్నెరిగిన వాడు, కర్మబంధ విముక్తుడౌను. ముముక్షువులు మున్మందర యిది యెరిగి కర్మల నాచరించిరి. అర్జునా, పురాతనమైన యీ నిష్కామకర్మమును ఆచరించి తరించుము.

పండితులు కూడ యీ కర్మ, అకర్మల అంతరార్థం తెలియలేరు. సంసార బంధ విముక్తి నొసగు కర్మరహస్య మిపుడు నే తెల్పెదను. చేయదగిన పని కర్మము. నిషిద్ధమైనది వికర్మము. యేమీ చేయకుండిన అకర్మము. చేయుచు చేయనటుల ఉండుటయు అకర్మమే. కర్మలలో అకర్మను, అకర్మలోన కర్మను, అనుభవించువాడు వివేకుడు, సకల కర్మాచరణపరుడు. కామసంకల్పములు లేని కర్మలు, జ్ఞానాగ్నిన దగ్ధమైన కర్మలను, చేయువారు విజ్ఞులు. కర్మఫలమును విడనాడి త ృప్తితో తదితరముల వేటినీ ఆశ్రయించని వాడు, కర్మలు చేసినను చేయనివాడే అవును. అత్యాశలు లేక, యింద్రియములను నిగ్రహించి, విషయ, వస్తు అనాసక్తుడైన మనుజుడు, దేహధారణ నిమిత్తము కర్మలు చేసిననూ, కర్మ ఫలపాపములు అంటవు. అతిసహజముగ లభ్యమైన దానితో తృప్తుడు, సుఖదుఃఖాది ద్వంద్వాతీతుడు, మాత్సర్య రహితుడు, ప్రాప్తి, అప్రాప్తముల ఎడ సమభావమున్నవాడు, కర్మలు చేసినను కర్మబద్ధుడు కాడు. అనాసక్తుడు, అరిషడ్వర్గ బంధ విముక్తుడు, ఆత్మజ్ఞాన పరిపూర్ణుడు, యితరుల మేలుకే సదాకర్మలు చేయువానికి, ఈ కర్మలు జన్మ బంధములుకావు. యజ్ఞ సాధనములు బ్రహ్మము. యజ్ఞ పదార్థము బ్రహ్మము, యజ్ఞాగ్ని బ్రహ్మము. యజ్ఞ కార్యము బ్రహ్మము. యజ్ఞ కర్త బ్రహ్మము. బ్రహ్మఫలము బ్రహ్మమునకే అర్పణం.

కొందరు యోగులు తానూ, దైవం వేరను ద్వైత ఆరాధనా యజ్ఞంను సలుపుదురు. మరికొందరు చేతురు హోమాగ్ని పరబ్రహ్మమని, జీవుడు, దేవుడు ఒకటను ఏకాత్మ భావనాయజ్ఞం. కొందరు యోగులు, శబ్ద, స్పర్శ, రూప, రస,

గంధ విషయ మాలిన్యాలను, యింద్రియ హోమాగ్నిలో త్యాగమొనర్చి, యింద్రియ విషయ త్యాగయజ్ఞం. మరికొందరు, సర్వేంద్రియ విషయ వ్యాపారము లన్నియు, మనో నిగ్రహ యోగాగ్నికి సమర్పించి, జ్ఞానసమాధి హోమ మొనర్తురు యోగయజ్ఞమున. కొందరు దాన, ధర్మాది ద్రవ్య యజ్ఞమును, కొందరు తపోయజ్ఞంను, కొందరు అష్టాంగ యోగ యజ్ఞమును –ఈ రీతి పలువిధముల యజ్ఞములు చేయుదురు. ప్రయత్నశీలురు, దృఢవ్రతులు, ప్రాణాయామ తత్పరులు, ప్రాణాపాన గతుల నిరోధించి, అపానమునుండి ప్రాణమును, ప్రాణమునందు అపానమును, పూరక, కుంభక, రేచకములతో ప్రాణాయామ యజ్ఞమును చేయుదురు. కొందరు ఆహార నియమ నిష్ఠలతో ప్రాణాది వాయువులను ప్రాణమందే హోమము చేసి ప్రాణాగ్ని యజ్ఞం చేయుదురు. కురువంశశ్రేష్ఠా! ఆ విధమైన యజ్ఞశేషా మృతాన్నమును భుజించు వారు శాశ్వత పరబ్రహ్మమును పొందుదురు. అట్టి దొక్కటైనను చేయనివారికి యిహపరాలలో సుఖము లేదు. యీ విధముగ వేదములలోచెప్పబడిన అనేక యజ్ఞములు కర్మ యందు పుట్టినవని గ్రహించినవాడు మోక్షాన్ని పొందును. ద్రవ్య యజ్ఞము కంటె మేలు జ్ఞాన యజ్ఞం. ప్రతిఫలాసక్తిలేని సమస్త కర్మలూ, చిత్తశుద్ధితో జ్ఞానమున సమాప్తి నొందును. యీ జ్ఞానమును పొందిన తత్వదర్శనుల చరణ శరణ్యమున (సాష్టాంగ నమస్కారముతో), వుచిత సమయమున ప్రశ్నించి, సేవించి, వారి ఉపదేశముతో యీ జ్ఞానమును యితరులు పొందవచ్చును.

దేనిని తెలిసికొనిన, మోహము మరల కలగదో, దేనిని తెలిసికొనిన, సమస్త ప్రాణులకు నీయందు, నా యందు కూడా దర్శనం కలుగునో, అట్టి జ్ఞానమును తెలిసికొనుము. అందరికన్నను నీవెక్కువ పాపము చేసినాకూడా, అట్టి ఆ పాపసముద్రమును, జ్ఞానమను నావతో తప్పక దాటగలవు. రగిలే అగ్నిలో సమిధల కుప్పలు దగ్ధమైనటుల, సమస్త కర్మల పాపములు జ్ఞానాగ్నిన దగ్ధము అగును. జ్ఞానము సర్వోత్తమము. కాలగతిన నిష్కామ కర్మయోగి చిత్తశుద్దితో అదే జ్ఞానమును పొందును.

శ్రద్ధతో, తీవ్ర కాంక్షతో జ్ఞానము లభించును. జ్ఞానహీనుడు, శ్రద్ధా హీనుడు, సంశయచిత్తునకు ఇహ, పరములలో సౌఖ్యము లేక వినాశనము చెందును. ధనంజయా! కర్మ యోగమున, కర్మఫలత్యాగము చేసినవానిని, జ్ఞానముతో సర్వ సంశయ నివృత్తి అయినవానిని, కర్మములు బంధించవు. కావున ఓ భారతా! నీ హృదయములో నున్నదియు, అజ్ఞానమున ఉద్భవించి నదియూ అయిన యీ సంశయమును, జ్ఞాన ఖడ్గముతో ఛేదించి, నిష్కామముగ యుద్ధము చేయుటకు లెమ్ము, లేలెమ్మని జ్ఞాన యోగమును ప్రబోధించెను.

10. కర్మ సన్యాస యోగ సారమేమిటి ?

అహంభావ నిర్మూలనం త్యాగం. సంకుచిత భావాల నిర్మూలనం త్యాగం. విశాలత్వానికి నిచ్చెన త్యాగం. 'త్యాగైనేన అమృతత్వ మానసు' అంది వేదం. పూర్ణత, పరిపూర్ణతకు సోపానం త్యాగం. సంకుచిత నిర్మూలనంతోనే పూర్ణత్వం సిద్ధిస్తుంది. కర్మత్యాగం పరిపక్వ కర్మ. యిదియే అకర్మ. యిటువంటి కర్మత్యాగము జ్ఞానమే. కర్మమనిన నిష్కామ కర్మయోగము. కర్మఫల త్యాగము జ్ఞానమున కన్నను మేలే. జ్ఞానము అతి త్వరిత మార్గము అయిననూ, కర్మమే అతి సులభ మార్గము. ఈ రెండు మార్గముల గమ్యం మోక్షమే. రాగ ద్వేష విసర్జనం సన్యాసం. రాగ ద్వేషములు వీడిన కర్ముడే, నిజమైన సన్యాసి, సంసార బంధ విముక్తుడు. యీ రెంటిలో ఏ ఒక్కటయిన చక్కగ చేసిన, ఫలితము ఒకటే. జ్ఞానులు యే స్థానమును పొందెదరో, కర్ములు కూడా అదే స్థానమును పొందెదరు. జ్ఞాన, కర్మముల ఏకదృష్టిన చూచువారలే నిజమైన విజ్ఞులు. కర్మలు చేయకుండా బ్రతుకుట బహు కష్టతరం. నిష్కామకర్మ సాంఖ్యుడు తదేక దైవ చింతనమున, బ్రహ్మమును అతి శీఘ్రముగ పొందును.

కర్మ యోగి, పరిశుద్ధ హృదయుడు, స్థిరమనస్కుడు, యింద్రియ నిగ్రహం కలిగినవాడు, సమస్త భూతాలలోనూ, తనలోనూ వున్న ఆత్మ ఒకటేనని యెరిగిన వానికి కర్మము చేసిననూ కర్మలంటవు. తత్వవేత్త, యోగయుక్తుడు, చూచుచుండిన,

వినుచుండిన, తాకుచుండిన, వాసన జూచుచుండిన, తినుచుండిన, నడచుచున్నను, నిదురలో, స్వప్నములో వుండిననూ, నిశ్వాసమున, ప్రలాపమున, మౌనమున గ్రహించునపుడు, కళ్లు తెరచినను, మూసినను, యింద్రియములు తమతమ వస్తునిమగ్నమైనవను తలపున, ఆ యా కర్మలన్నిట నాతడు అకర్త బుద్ధితో తాచేయు కర్మలను బ్రహ్మమున కర్పించి, కర్తృత్వ, కర్మఫల త్యాగము చేసి తామరాకుపైని నీటిబిందువు రీతిన వుండును. ఆతనికి కర్మ ఋణ పాపములు అంటవు. నిష్కామ కర్మయోగులు, శరీరమున, మనసున, బుద్ధిన, ఇంద్రియములందు అసంగులై కర్మలను చిత్తశుద్ధికై చేతురు. కర్మయోగి కర్మఫల త్యాగమున చిత్తశుద్ధితో, ప్రశాంతిని బడయును . తదితరులు దురాశా ప్రేరితులై, కామ్య కర్మమున కర్మ బద్ధులవుదురు. యింద్రియ నిగ్రహమున్న దేహధారి, మనసున కర్మఫలత్యాగముచేసి కర్మము చేసినను, చేయనివాడై, చేయింపని వాడై, నవద్వారపుర శరీరమున సుఖముగ నుండును. దేవుడు జీవులకు కర్తృత్వమును, కర్మఫలమును కల్పింపడు. మనుజునకు ప్రకృతి, జన్మాంతర సంస్కారమున యివి కలుగును. విభుడెవ్వరి కర్మబంధములను, పాప పుణ్యములను స్వీకరింపడు. ఆత్మజ్ఞానమున, అజ్ఞానం దగ్ధమైన వాడు, భాను తేజమునప్రకాశించుచు, స్వస్వరూప దర్శనానుభవముతో జ్ఞానమును పొందును.. పరమాత్మలోన బుద్ధినిల్పి, పరమాత్మనందు మనసునుంచి, పరమాత్మయందు బహునిష్టతో, పరమాత్మనే పరమ గతిగ నెంచి, జ్ఞానముచే పాపనివృత్తి పొందిన యోగులు, పునర్జన్మ రాహిత్య శాశ్వత మోక్షమును పొందెదరు. విద్యావినయుడైన బ్రాహ్మణుని యందు, గోవునందు, గజరాజు నందు, కుక్క యందు, కుక్కమాంసము తిను వాని యందును సమదృష్టి కలవారినే జ్ఞానులని చెప్పుదురు. స్థిర మనసున, సమ మదిన నుండెడు వారలు యీ జన్మనందే జననమరణ సంసార విజయులు అగుదురు. బ్రహ్మమెప్పుడు సమము, దోష రహితము. సమదర్శనమే బ్రహ్మసాక్షాత్కారానికి రాచబాట. స్థిర బుద్ధుడు, మోహరహితుడు, బ్రహ్మస్థిరచిత్తుడగు బ్రహ్మజ్ఞాని, కోరినది దొరికిన

సంతసించడు, దొరకని యెడల దుఃఖించడు. బాహ్య శబ్ద విషయ దూరులు, ఆత్మసుఖమును అనుభవించి. బ్రహ్మ చిత్త సమాధిన అక్షయ సుఖమును బడయుదురు.

ఇంద్రియ విషయ సంపర్కమున కలిగిన భోగములు స్వల్ప కాలము మాత్రమే వుండును. అవి దుఃఖ హేతువులు, కావున, విజ్ఞులు వీటిపై ఆసక్తి చూపరు. యెవ్వడు చనిపోవుటకుముందు కామ క్రోధముల త్రుంచునో, వాడీ జన్మమందే యోగి. అతడే నిజమైన సుఖుడు. యెవ్వడు ఆత్మనందు సుఖించునో, క్రీడించునో, యెవ్వరు ఆత్మనందు ప్రకాశించునో, అట్టి యోగి బ్రహ్మస్వరూపుడై, బ్రహ్మసాక్షాత్కారము బడయును. కల్మష (పాప) దూరులు, సంశయ రహితులు, యింద్రియ నిగ్రహులు, సర్వ భూతహితులు నగు, ఋషులు బ్రహ్మ సాక్షాత్కారమును పొందుదురు. కామ, క్రోధ విసర్జితులు, మనో నిగ్రహమున్న వారలు, తత్వమెరిగిన సాధకులు, బ్రహ్మ సాయుజ్య మొంది, సర్వవ్యాప్తులుగా ఉందురు. బాహ్య శబ్ద, స్పర్శాదుల, విషయముల బహిష్కరించి, చూపును భ్రూమధ్యమున నిలిపి, ప్రాణవాయువును నాసికన, క్రమమున సమము చేసి, ఇంద్రియమనోబుద్ధుల నిగ్రహించి, కామ క్రోధముల నిర్మూలించి, మోక్షాసక్తుడైన నిరంతర మననశీలుడు, ముక్తుడగును. యజ్ఞ(నిష్కామ కర్మ) తపస్సులకు భోక్తగా, సమస్తలోక ఈశ్వరునిగా, సమస్త ప్రాణుల హితునిగా, నన్నెరిగినవాడు శాంతిని పొందును.

11. ఆత్మ సంయమ (ధ్యాన) యోగ సారమేమిటి ?

దేహ, యింద్రియ, మనో, బుద్ధులను ఆత్మకు కలపటమే ఆత్మ సంయమము. యిదే ధ్యానం. ధ్యాన యోగం. కర్మఫలాసక్తి లేక విద్యుక్త కర్మలు చేయువాడు సన్యాసి. అతడే యోగి. అంతేకాని అగ్నిహోత్రమును, కర్మలను విడచినవాడు మాత్రమేకాదు. సన్యాసం, యోగం ఒక్కటే. కామాది సంకల్పములు వీడనివాడు, ఎన్నడూ యోగి కాలేడు. నిష్కామ కర్మయోగజనిత చిత్త శుద్ధి జ్ఞాన ధ్యాన

యోగమునకు మూలము – తదుపరి కర్మ నివృత్తి. ఇంద్రియార్థ శబ్ద, స్పర్శ, రూప, రస, ఆసక్తి లేనివాడు, కర్మ అనాసక్తుడు, సర్వ సంకల్ప రహితుడైన మనుజుడు యోగి. ఎవరిని వారే స్వశక్తితోఉద్ధరించుకొనవలెను. తన శక్తిని వాడక అధోగతి పొందకూడదు. యింద్రియ, మనోనిగ్రహమున తనకు తానే బంధువు యింద్రియ మనోనిగ్రహారాహిత్యమున, తనకుతానే శత్రువు. మనసును గెలిచిన మనకది బంధువు, గెలవనిచో అదే మనకు ప్రబల శత్రువు. మనో విజయుడు, ప్రశాంతచిత్తుడు, శీతోష్ణ, సుఖ, దుఃఖముల, మానావమానముల బెదరక చెదరక, ఆత్మానుభవమునందే నిష్ఠుడై వుండును. శాస్త్రానుభవ జ్ఞానవిజ్ఞానముల తృప్తుడు, నిర్వికారుడు, యింద్రియ నిగ్రహమున్నవాడు, మన్ను, రాయి, బంగారముల నొక్కటిగ చూచు యోగిని యోగారూఢుడని అనెదరు. ఆత్మానుభవ సంపన్నుడని. శ్రేయోభిలాషిని, మిత్రుని, శత్రువును, తటస్త, మధ్యస్త, విరోధుల, బంధు, సాధువుల పాపుల యెడ సమబుద్ధితో నుండువానిని యోగారూఢుడు అని అనెదరు.

యోగి ఏకాంత ప్రదేశమున, దేహేంద్రియ మనోబుద్ధుల నిగ్రహించి, ఆశారహితుడు, అపరిగ్రహుడై, వానిని సతతం ఆత్మనందు నిల్పవలెను. మెరక పల్లములు లేని పరిశుభ్ర సమ ప్రదేశమున, దర్భాసనముపై చర్మమును, దానిపైన వస్త్రము, దానిపై స్థిరాసనమును ప్రతిష్టించి, తానుకూర్చుండి దానిపై, యేకాగ్రతన యింద్రియ మనో వ్యాపారముల నిగ్రహించి సాధకుడు చిత్తశుద్ధి కొరకు ధ్యానాభ్యాసమును చేయవలెను. శరీర, శిరో, కంఠములు సమముగ నొక్కటిగ కదలక, స్థిరముగ నుంచి, దిక్కుల చూడక నాశికాగ్రమున దృష్టి నిలుపవలెను. ప్రశాంత హృదయుడై, నిర్భయుడై, బ్రహ్మచర్యనిష్టతో, మనోనిగ్రహముతో, నాయందు మనసు నిలిపి, నన్నే పరమగతిగ నమ్మి, ధ్యాన సమాధియుక్తుడు కావలెను. మనో నిగ్రహమున్న యోగి, సదా మదిని ఆత్మధ్యానమున నుంచి, నా స్వస్వరూపమైన, అతి ఉత్కృష్ఠ మోక్ష శాంతిని పొందును.

అన్నమెక్కువ తినెడువానికి, తినక పస్తులు ఉండువానికి, నిద్రయెక్కువ పోవు వానికి, నిద్రలేమితో నుండువానికి, యీ ధ్యానయోగము కలుగబోదు. యుక్తాహార విహారులకు, మితాచారులకు, మిత కర్మలకు, మిత నిద్రా, మెలకువల వారికి, సంసార దుఃఖహరం యీ యోగం. మనో నిగ్రహమున ఎప్పుడు ఆత్మనందే చిత్తముంచిన, సమస్త కోరికలు హరణ మొందించిన, విషయ తృప్తుడు, యోగ సమాధి యుక్తుడు. గాలి లేని తరినున్న దీపము నిశ్చలముగా వెలుగు రీతిన, ఆత్మధ్యానుని నిశ్చల చిత్తము, అదే రీతిన వుండును. యోగాభ్యాసమున మనో నిగ్రహముతో, చిత్తశుద్ధిన మనసు ఆత్మ యందు నిలిపిన యోగి పరమశాంతిని, ఆత్మానుభవ ఆనందమును పొందును.

ఆత్మ యింద్రియముల కగోచరం, నిర్మల బుద్ధి గ్రాహ్యం, అనంత నిరంతర సుఖం, నిశ్చల స్వానుభవ జ్యోతి. ఏ గొప్ప లాభం తదుపరి, అన్ని లాభములు గొప్పవి కావో, దేనియందున్న మహా దుఃఖమున కూడా మనము చలింపదో, అట్టి దుఃఖ సంబంధ రహిత స్థితిని, యోగమని తెలియ వలయు, అట్టి యోగము దుఃఖమున కలత చెందని, స్థిర మనమున, పట్టు వదలక సాధింప దగును. సంకల్పమున కలిగెడు కోర్కెలన్నియు విడచి, పూర్తిగా నిగ్రహించి యింద్రియాలను నలుదిశలనుండి బాగుగా, పట్టు వీడక మదిని లోనికి మరలించి, స్థాపించి, ఆత్మకు అన్యమగు దేనిని చింతించక ప్రశాంతిని పొందవలయును. స్థిరము లేనిది చంచలము మనస్సు. యెచటెచట మది ఏ విషయమున చనిన, అచటచటనే దానిని మరలించి, ఆత్మయందే నిలుపుము, మనస్సును అధీనమందు వుంచుము. ప్రశాంత చిత్తుడు, కామ క్రోధాదిగుణరహితుడు, బ్రహ్మానుభవ సిద్ధుడు, కల్మష రహితుడైన యోగిని సర్వోత్తమ ఆత్మానందం వరించును. యీ తీరున మదినెల్లపుడు, ఆత్మలో నిలుపు నిర్మల యోగి, బ్రహ్మానుభవ పరమానందమును బడయును. యోగ చిత్తుడు, ఎవడు చూచునో ఎల్లపుడు నన్ను సర్వ భూతములందు, సర్వ భూతములనూ నాయందు, అట్టి వానికి నేను ఎరుక అవుదును.

నాకు కూడ అతడు ఎరుక అగును. సర్వభూతాత్మకుడనైన నన్నెవరు అభేద బుద్ధితో సేవింతురో, అట్టి యోగి ప్రవర్తన ఎటుల యున్ననూ, నాయందే వున్నవాడౌను. సమస్త ప్రాణుల సుఖ దుఃఖములను తనవిగా నెంచెడి యోగి కడు శ్రేష్ఠుడు. మనో నిగ్రహం అతి కష్టం, చంచలం. అభ్యాస వైరాగ్యాదులతో, కష్టమైనను అది సాధ్యం. మనో నిగ్రహము లేనివానికి యోగం సాధ్యపడదు. యోగసాధన అసంపూర్ణంగా వుండి, ప్రాణం వదలిన జీవిలాంటి యోగభ్రష్టున కెప్పుడూ ఇహపరలోకమున వినాశనం లేదు. యోగ భ్రష్టులు దేహము వదలిన తదుపరి, ఊర్ధ్వలోకపు పుణ్యఫలములను పొంది, ధనం, సంస్కారం ఉన్న యింట పునర్జన్మము నొందెదరు. ఉత్తమ యోగి అయితే కడు దుర్లభమైన జ్ఞానులైన యోగుల ఇండ్లలో పునర్జన్మలో జన్మించును. అటులజన్మ నొందిన యోగులిటుల పూర్వజన్మ సంస్కారమున సంపూర్ణయోగ సిద్ధికి తీవ్ర యత్నము చేసి, యిచ్చా మాత్రాన, యోగసిద్ధితో సర్వోత్తమ మోక్షమును పొందెదరు. సదాయోగియైన వాడు, తపస్యుల కన్న, కర్మానుష్టానుల కన్నను, శ్రేష్టుడగును, నాయందే మది నిలిపి, నన్ను శ్రద్ధతో ఉపాసించు వారలు, సర్వోత్తమమైన యోగులు.

12. విజ్ఞానయోగ సారమేమిటి ?

జీవనానుభవసార జ్ఞానం విజ్ఞానం. యుక్తాయుక్త విచక్షణాజ్ఞానం విజ్ఞానం. జ్ఞాన, ప్రజ్ఞానాల నడుమనున్నది విజ్ఞానం. అనేక వేలమందిలో ఒకానొక్కడు మోక్షమునకు యత్నించును. వారిలో నిజముగ ఏ ఒక్కడో నన్ను తెలిసికొనును. భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, మనో, బుద్ధి, అహంకారములు అని, నా మాయావృత అపరా ప్రకృతిలో ఎనిమిది అంశములు కలవు. అల్పమైనది అపరా ప్రకృతి. దీనికన్నను మిన్న అయినది, జగత్తంతను నిండివున్న, సర్వజీవరూపమున వున్న పరా ప్రకృతి మిన్న. సమస్త భూతముల ఉనికీ పరాపర ప్రక ృతులవలనే. యీద్వివిధ ప్రకృతులు నేనై, విశ్వ, సృష్ఠి, స్థితి, లయలకు కారణముగ వున్నాను. నాకంటే వేరుగ లేదు, లేదు వేరొక్కటి. సూత్రమందు

మణులవలెనే సమస్త విశ్వమున్నది నాయందున. జలము నందున రుచిని నేను. సూర్యచంద్రుల కాంతి నేను. వేదమందలి ఓంకారమును నేను. మానవుల పౌరుషమును నేను. భూమి యందలి సుగంధమును నేను. జీవులందున ప్రాణమును నేను. తాపసులలో తపస్సును నేను. సమస్త భూతముల శాశ్వత బీజమును నేను. విజ్ఞులందలి బుద్ధి నేను. ధీరులందలి ధైర్యమును నేను. బలవంతుల బలాన్ని నేను. ధర్మవిరుద్ధము కానిబంధములేని కోరికను నేను. త్రిగుణాత్మక పదార్థాల కారణము నేను.

వానియందు లేను నేను. నాయందే త్రిగుణాలున్నవి. త్రిగుణాత్మకం జగత్ సర్వం. త్రిగుణాల కర్త నేనైనను, త్రిగుణాతీతుడను నేను. త్రిగుణాల మాయపొరతోకాంచలేరు మోహమున నను. మాయ దైవికం, త్రిగుణాత్మకం. దాటుట అతి కష్టమందరికి. యెవరెవరు నన్ను శరణు జొచ్చిన, నేనే సృజించిన నా మాయను దాటగలరు వీరలు. పాపాత్ములు, మూఢులు, మాయమోహిత అజ్ఞానులు, అసుర భావ నరాధములు, నన్నాశ్రయించక, నన్ను చేరరు.

ఆర్తులు, అర్థార్తులు, జిజ్ఞాసులు, మోక్షకాములని, నలువిధముల సుజనులు నను సేవింతురు. పైన తెలిపిన వారందరూ నాకు యిష్టులైనను, అందరిలోనూ జ్ఞానులన్న నాకు ఎక్కువ యిష్టము. ఎందుకనగా నాయందే మది నిలిపి నన్నే సర్వోత్తమ స్థానముగా నిశ్చయించి నన్ను చేరును కావున. బహుజన్మల సంసారచక్ర పరిభ్రమణ అనంతరం మనుజుడు సమస్తము భగవంతుడేనను జ్ఞానముతో తుదకు నన్ను చేరును. అటువంటి మహాత్ములు, జ్ఞానులు చాలా అరుదు. కొందరు పూర్వజన్మ సంస్కారపు వాసనలతో, మతి భ్రమలతో, యితర దేవతా సంబంధ, నియమములను అనుష్టించి, తదితర దేవతలను పూజింతురు. ఎవరే రీతిన నను సేవించిన, అదే రీతిన నేనను గ్రహించెదను. ఆ విధంగా ఆయా దేవతలను శ్రద్ధతో ఆరాధించిన వారు ఆయా దేవతల నుండి నేను నియమించిన యిష్ట ఫలములను పొందెదరు.

'అల్పబుద్ధిః అల్పఫలం.' యే దేవతలను పూజించిన ఆయా దేవతలే లభ్యం. నన్ను పూజించువారలు నన్నే పొందెదరు. అవ్యయం, సర్వ శ్రేష్ఠం, ప్రకృతికి పరమై అవ్యక్తముగ నున్న నన్ను, నా నిజ స్వరూపమును తెలియని అవివేకులు పాంచ భౌతిక దేహరూపముగా తలచెదరు. నా యోగమాయ ఆవరణతో నేను కనుపించనందరికీ. మూర్ఖులు నన్ను అనాదిగా, అవ్యయునిగా ఎరుగరు. భూత, భవిష్యత్, వర్తమానములలోనున్న అన్ని ప్రాణులను కాలాతీతుడనై నేనెరుగుదును అందరిని. యెరుగరెవ్వరు నన్ను మాత్రము. యిచ్ఛా ద్వేషమున పుట్టిన సుఖ దుఃఖాది ద్వంద్వ మోహమున ప్రాణులందరు అజ్ఞానమున వుందురు. యే జనులు, పుణ్యకార్య తత్పరులై, పాపరహితులైన వారలు అజ్ఞానమును వీడి నన్నుసేవించెదరు. దృఢ చిత్తులై. జరామరణ సంసార దుఃఖబంధములను త్రెంచుకొనుటకు ఎవరు నన్ను ఆశ్రయింతురో, వారలు సమస్తము దైవస్వరూపమని, సకల కర్మలును బ్రహ్మమని తెలియుదురు. అధిభూత, అధిదైవ, అధియజ్ఞములతో వున్నటుల నన్నుతెలిసిన వారు, దేహ వియోగ సమయమున స్థిర చిత్తులై నన్ను తెలిసికొందురు.

13. అక్షరపరబ్రహ్మయోగ సారమేమిటి ? బ్రహ్మమేది? ఆధ్యాత్మమేది? కర్మమేది? ఆదిభూతమేది? యీ దేహమందు అధియజ్ఞుడెవరు? అతనిని తెలియుటెట్లు?

సర్వశ్రేష్ఠం, అవినాశి బ్రహ్మం. ఆత్మానాత్మవివరణ ఆధ్యాత్మము. జీవోత్పత్తికి వునికికి కారణం, యజ్ఞ ఫల త్యాగ నిష్కామ కర్మం. నశించు పదార్థము అధిభూతము, విశ్వ మనోదేహములైన హిరణ్యగర్భ, విరాట్టులు అధి దైవతము. యీ దేహము నాశ్రయించిన పరమాత్మయే అధియజ్ఞుడు.

అంత్యకాలమున, నను స్మరించుచు, దేహము విడుచువారు, చేరుదురు నన్ను. ఎవరు ఏయే భావమున దేహమును వీడుదురో, వారలు ఆ భావప్రేరిత సంస్కారమున, ఆ రూపమును పొందెదరు మరు జన్మమున. కావున, సర్వత్ర, సర్వకాలమున, నను స్మరించుచు, చేయుము యుద్ధము.

ఈవిధంగా మనోబుద్ధులు, నాయందే నిలిపిన పొందగలవు నిస్సంశయముగా నన్నే. మనుజుడు అభ్యాసముతో, మనోనిశ్చలతతో దివ్యమైన పరమ పురుషుని స్మరించుచూ, సర్వోత్తమమైన దివ్యస్వరూప పరమాత్మను పొందును. ఎవడు భక్తితో, అంత్యకాలాన యోగశక్తిని, ప్రాణవాయువును, భ్రూమధ్యమున నిల్పి, సర్వజ్ఞుడు, పురాణ పురుషుడు, లోకశాసనుడు, ఆణువుకన్న అతి సూక్ష్ముడు, లోకోద్ధారి, అచింత్య రూపుడు, సూర్యకాంతి స్వరూపుడూ, అజ్ఞానాంధకారమునకు ఆవలనున్నవాడునగు పరమాత్మను నిశ్చల మదిన, తదేకముగ చింతిచునో వాడు, దివ్య స్వరూప సర్వోత్తమ పరమాత్మను చేరును.

ఏ పరమపదమును కోరి, ఏది సనాతనము, నాశరహితమైనదని వేదవేత్తలు, రాగ రహితులు, జితేంద్రియులు బ్రహ్మచర్యమును అనుష్ఠించి, దేనియందు ప్రవేశించి, అనుభవించ కోరుదురో, అద్దానిని సమగ్రముగా వివరించెదను. ఎవడు దేహ ద్వారములైన సర్వేంద్రియములను నిగ్రహించి, మదిని ఆత్మయందు నిలిపి, సహస్రారమున ప్రాణవాయువు నుంచి, ఓంకారమును ఉచ్చరించుచూ, నాయందే యేకాగ్ర చిత్తమున నుండి, శరీరమును వదలునో వాడు సర్వోత్తమ స్థానమును పొందును. అనన్య మనస్కుడై, నిత్యము నన్ను స్మరించు వానికి నేను సులభ లభ్యుడను. సర్వోత్కృష్ఠమైన మోక్షమును పొందిన వాడు దుఃఖనిలయమైన, అశాశ్వత జన్మను మరల ఎన్నడూ పొందడు. బ్రహ్మలోక పర్యంతమున నున్న అన్నిలోకములు పొందిన వారలు జన్మ మెత్తవలె మరల మరల. తదితరముగ నను పొందిన వానికి లేదు పునర్జన్మ.

14. భగవద్గీత ఎవరికి, ఎప్పుడు బోధ పడుతుంది?

నర–నారాయణ సఖ్యతతో, చిత్త శుద్ధి, దైవవాణిని వినటానికి తయారై నప్పుడు, కరిగినప్పుడు, విషాదంలో అట్టడుగుకు చేరినప్పుడు, సంపూర్ణ శరణా గతిలో, జీవన ద్వందాలతో సతమతమై విసిగి వేసారినప్పుడు బోధపడుతుంది.

15. మన కష్టాలకు కారణం ఏది?

యిష్టాలవలన కష్టాలు – విషయం విషం – తామసిక, రాజసిక మమత్వం.

16. కష్ట విమోచనం ఎలా ?

కోర్కెల అదుపు – విషయత్యాగం – చిత్త వృత్తి నిరోధం – అద్వైత దర్శనం – ఏకాత్మ భావనం – స్థిత ప్రజ్ఞత – నిష్కామకర్మం – నామస్మరణం – శరణాగతి.

17. ధర్మం అనగా ఏమిటి ?

ప్రకృతిసిద్ధమైన చేయవలసిన కార్యం, కర్మం. రీతం, రీతి.

18. "మమ ధర్మం" ఏమిటి ?

వివిధ పాత్రలలో వివిధ ధర్మాలతో ఆత్మ ధర్మాన్ని పాటించటం. అన్ని ధర్మాలను ఆత్మధర్మంతో అనుసంధానంచేసి ఆత్మ ధర్మంలో లయం చేయటం.

19. ఏది "ధర్మం"? ఏది "అధర్మం"?

కలిపెడిది ధర్మం. విడదీసేది అధర్మం. ఏకాత్మ భావనాకర్మం ధర్మం. సత్యాచరణం.

20. "యోగం" అనగా ఏమిటి ?

యోగం చిత్త వృత్తి నిరోధం (పతంజలి) – సమత్వం యోగం – సమ తత్వం.

21. "కర్మ యోగం" అనగా ఏమిటి ?

నిష్కామ ధర్మాచరణ – స్వలాపేక్షరహిత ధర్మకర్మాచరణ (Love without Duty). చిత్త శుద్ధి దీని ఫలం.

22. "భక్తి యోగం" అనగా ఏమిటి ?

అచంచల దైవ ప్రేమ - సారూప్య, సామీప్య. సాలోక్యతలను దాటి సాయుజ్యానుభవం కలిగించేది.

23. "ధ్యాన యోగం" (రాజ యోగం) అనగా ఏమిటి ?

మనో చంచలత్వం నుండి మనో స్థిరత్వం – చిత్త వృత్తి నిరోధం– సమత్వం యోగం. అష్టాంగ కుండలినీ యోగం.

24. "జ్ఞాన యోగం" అనగా ఏమిటి ?

అద్వైత దర్శనం జ్ఞానం - సత్యదర్శనం - ఏకత్వదర్శనం. దీనికి చిత్త శుద్ధి ప్రధమావసరం.

25. స్వస్వరూప అద్వైత దర్శనానికి అవరోధాలు ఏమిటి ?

గతజన్మల కర్మ శేషపు మూటలు – అరిషడ్వర్గములు – మనోచంచలత – తమో, రజో గుణాలు - అవిద్య - మాయ.

26. "మాయ" అంటే ఏమిటి? ఎలా అధిగమించటం ?

సత్యమైన, నిత్యమైన ఏకత్వాన్ని భ్రమతో, మనో చపలతతో అనేకత్వ దర్శనం. మల, విక్షేప, ఆవరణ నిలయం. మనో స్థిరత్వం, చిత్త శుద్ధి, అవిద్యానిర్మూలనంతో, శరణాగతితో అధిగమించగలం.

27. "సురాసుర సంపత్తులు" అనగా ఏమిటి ?

సానుకూల, ప్రతికూల భావనలే సురాసుర సంపత్తులు. యద్భావం తద్భవతి.

28. "త్రిగుణములు" అంటే ఏమిటి ?

దృశ్య కల్పిత ద్వైత జగత్తు త్రిగుణమయం. అచలం, చలనం, స్వచ్ఛత (చలనాచలన సమత్వం).

29. "దైవం" అంటే ఏమిటి ?

త్రికాలబాధ్యమైన సత్యం దైవం – విశ్వవ్యాపకం, విశ్వవిజ్ఞానం, విశ్వ శక్తి ఆ దైవ లక్షణం. ఎరుకలో దైవం, మరపులో మాయ. సర్వం దైవమయం. తత్వమసి – ప్రజ్ఞానం బ్రహ్మం – అహం బ్రహ్మోస్మి–ఆయమాత్మన్ బ్రహ్మం – సర్వం ఖలియిదం బ్రహ్మం – సర్వం బ్రహ్మం.

29. "త్యాగం" అనగా ఏమిటి? "త్యాగనైక అమృతత్వమానసు" అనగా ఏమిటి ?

సంకుచత్వనిర్మూలనం త్యాగం. అహంకారభావ నిర్మూలనం త్యాగం. కర్మత్యాగం కన్నా కర్మ ఫలత్యాగం మిన్న.

30. మనకు ఆచరణ ప్రమాణాలేవి ?

శ్రేష్టులైనవారి నడవడిక, శాస్త్రప్రమాణం, ఆత్మ ప్రమాణం.

31. మానవ పతన క్రమమేమిటి ?

విషయ చింతన – విషయాసక్తి – రాగము – క్రోధము – అవివేకము – మరపు – యుక్తాయుక్త విచక్షణా రాహిత్యము – బుద్ధి నాశనము – మానవ అధోగతి.. (2–63)

32. సృష్టి క్రమంలో ప్రాణమెలా మొదలైనది?

ఏకాత్మ అక్షర పరబ్రహ్మ నుండి – సద్భావం – సద్వచనం (వేదం) – సత్కర్మ (యజ్ఞం) – మేఘం – వర్షం – అన్నం – ప్రాణం. (3–15).

33. చేయకూడనివి అని తెలిసికూడా మనిషి తప్పులు ఎందుకు చేస్తున్నాడు?

గతజన్మల కర్మ శేష జనిత కుసంస్కారం వలన.

34. కర్మ, భక్తి, జ్ఞాన, ధ్యాన యోగముల గమ్యమేమిటి ?

అన్ని యోగాల గమ్యం స్వస్వరూప జ్ఞానం. కర్మ యోగం ద్వారా చిత్త శుద్ధి - భక్తి యోగం ద్వారా భగవత్ సాయుజ్య ఏకత్వం జ్ఞాన యోగం ద్వారా అవిద్యా హరణంతో అద్వైత దర్శనం - ధ్యాన యోగం ద్వారా చిత్తవృత్తి నిరోధం. పై నాల్గు మార్గాలు స్వస్వరూప జ్ఞానలబ్ధికి సోపానాలే.

35. దుస్సాధ్యాన్ని సుసాధ్యం ఎలా చేయగలం ?

తితీక్షతో, పట్టువిడవని నిరంతర కృషితో

36. చాతుర్ వర్ణాలకు, కులానికి వ్యత్యాసం ఏమిటి ?

చాతుర్ వర్ణాలు ప్రకృతి సిద్ధ, దైవదత్తం కాగా, కులాలు మానవ సమాజ నిర్మితాలు (4-13)

37. ఆత్మ లక్షణాలు ఏమిటి ?

అనంతం, నిత్యం, సత్యం, అనాది, జనన మరణ రహితం, నాశరహితం, శాశ్వతుడు, చావదు, చంపబడదు, కాలదు, కాల్చబడదు, తడువదు, తడపబడదు, ఎండదు, ఎండబడదు, సర్వవ్యాపి, స్థిరం, నిశ్చలం, పురాతనం, యింద్రియ అగోచరం, మనసుకు చింతింపనలవి కానిది, జగత్తునంతనూ ప్రకాశింపజేయు సూర్యునిలోని తేజస్సూ, చంద్రుడు, అగ్నిలోని తేజస్సు, సమస్తప్రాణులకు ఆధారం, చంద్రునందు రసస్వరూపుడై పంటలను పండించుచూ, సకలప్రాణుల శరీరాలలోజఠరాగ్నిగావైశ్వానర రూపంలోవుండి, ప్రాణ, అపానవాయు సంపర్కమున, నాలుగురకముల ఆహారమును జీర్ణము చేయుచువాడు.

38. అవతారమనగా ఏమిటి ? ఎలా ?, ఎప్పుడు?, ఎందుకు ?

అధర్మం పెరిగి, ధర్మ గ్లాని సంభవించినప్పుడు, ధర్మ సంరక్షణకు, అధర్ముల త్రుంచుటకు, దైవం తనకుతాను మానవరూపంలో సృష్టించు కొనును. కారణ జన్ముడు అవతారుడు. కర్మజన్ముడు జీవుడు(4-6,7)

39. కర్మ, వికర్మ, అకర్మ, లనగా ఏమిటి ?

చేయదగినది కర్మ - చేయకూడనిది, నిషిద్ధమైనది వికర్మ - ఏమీ చేయకుండుట, చేయుచూ చేయనటుల నుండుట (పరిణితిచెందిన కర్మము) అకర్మము.

40. కర్మబంధము కాని కర్మలేమిటి ? (4-18,23,41)

కామసంకల్ప రహిత కర్మలు, జ్ఞానాగ్ని దగ్ధ కర్మలు, కర్మఫలాపేక్ష రహితకర్మలు, అత్యాశారహిత, విషయ, వస్తు విరక్త కర్మలు, పరోపకార కర్మలు బంధరహిత కర్మలు.

41. ద్రవ్య, కర్మ, జ్ఞాన దానములలో ఏది దేనికంటే శ్రేష్ఠం ?

అత్యుత్తమం జ్ఞాన దానము, తదుపరి కర్మ దానం, తదుపరి ద్రవ్యదానం. (4-33)

42. జ్ఞానమెలా సంపాదించాలి ?

తత్వదర్శనులైన గురువుల చరణ శరణ్యమున, ఉచితసమయమున, వినయమున ప్రశ్నించిన, వారి సేవనమున, శ్రద్ధతో కూడిన కృషితో జ్ఞానము లభించును (4-34, 39).

43. దైవానికి ప్రియాప్రియములు వుంటాయా?

దైవం కేవలం సాక్షీభూతుడు. సృష్టి తదనంతరం, సృష్టి ధర్మాన్ని సృష్టించి, ఆ ధర్మాన్ని అతిక్రమించిన వారి వారి కర్మానుసార ప్రతిఫలాన్ని నిర్దేశించి, విశ్వమంతా అప్రమేయంగా జరుగునటుల నిర్దేశించెను దైవం. ఎవరెవరికర్మలకు వారినే బాధ్యులుగా చేసి తాను కేవలం సాక్షీభూతు డాయెను. (4-14).

44. పండితుడెవరు ?

సమ దర్శనుడు. (5-18).

45. యోగి ఎవరు ?

సమదర్శి, స్థిరమతి, మోహరహితుడు, బ్రహ్మజ్ఞాని, బాహ్య, శబ్ద విషయదూరుడు, ఆత్మరతి, యింద్రియ విషయవిరక్తుడు, కామక్రోధాతీతుడు, ఆత్మ ప్రకాశి, కల్మష పాపదూరి, సంశయరహితుడు, యింద్రియనిగ్రహుడు, తత్వవేత్త, ధ్యానచిత్త, సమస్త ప్రాణిహితుడు, చిత్తవృత్తి నిరోధి, యోగి. (5-19 నుండి 29 వరకు).

46. ఆహారం ఏ ఉద్దేశంతో తీసుకొనవలె ?

బ్రహ్మమైన వంట పదార్థములు, బ్రహ్మమైన వంట పాత్రలలో, బ్రహ్మమైన అగ్నిమీద, బ్రహ్మమైన వంట పాకము చేసి, బ్రహ్మమునకే అర్పణభావమున ఆహారం తీసుకొనవలె. అలా తీసుకున్న చతుర్విధ ఆహారం బ్రహ్మమైన వైశ్వానరుడిచే జీర్ణించబడి, బ్రహ్మమునకే సమర్పించు భావమున భుజించవలెను. (4-24, 15-4).

47. యుగాల కాలం ఎలా కొలిచారు ?

436,000 సంవత్సరాలు కలియుగం

872,000 సంవత్సరాలు ద్వాపరయుగం (2 × 436000)

1,308,000 సంవత్సరాలు త్రేతాయుగం (3 × 436000)

1,744,000 సంవత్సరాలు కృతయుగం (4 × 436000)

4.36 మిలియన్ సంవత్సరాలు 1 మహా యుగం (10 × 436000)

4.36 బిలియన్ సంవత్సరాలు 1000 మహా యుగాలు (బ్రహ్మకు పగలు) (10000 × 436000)

8.72 బిలియన్ సంవత్సరాలు 1000 మహా యుగాలు (బ్రహ్మకు 1 రోజు) (20000 × 436000)

3.1828 ట్రిలియన్ సంవత్సరాలు బ్రహ్మకు 1 సంవత్సరం (365 × 20000 × 436000)

318.28 ట్రిలియన్ సంవత్సరాలు బ్రహ్మకు 100 సంవత్సరాల జీవనం ($100 \times 365 \times 20000 \times 436000$)

మనం ప్రస్తుత బ్రహ్మ 51 వ సంవత్సరంలో వున్నాము ($51 \times 365 \times 20000 \times 436000$)

168.3228 ట్రిలియన్ సంవత్సరాల క్రితం యిప్పటి సృష్టి మొదలైంది. (దేహంలోని కణాలసంఖ్య సంవత్సరాలు)

48. భక్తులు ఎన్ని రకాలు ?

ఆర్తి, అర్థార్తి, జిజ్ఞాసు, మోక్షకామి అని నాలుగు రకాలు. (7-18).

49. పరా, అపరా ప్రకృతి వివరణ ఎలా ?

పరాప్రకృతి దైవం. దానినుండే అపరా ప్రకృతి ఆవిర్భవించి, సృష్టి ఏర్పడింది. పంచ భూతములు (ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి), మూడు అంతఃకరణలు (మనో, బుద్ధి, అహంకారము) కలసి ఎనిమిది రూపముల అపరా ప్రకృతి, పరాప్రకృతితో కలసి సృష్టి ఏర్పడినది.

50. దైవం చరాచర జగత్తులో ఏ విధంగా వున్నాడు ?

కనపడే జగత్తులో, కనపడని సూత్రంలా, పాలలో వెన్నలా వున్నాడు. (7-7).

51. ఉత్తరాయణ, దక్షిణాయనాలు దేనికి సంకేతం ?

ఉత్తరాయణమను ఆరుమాసములు అగ్ని, ప్రకాశము, శుక్లపక్షములతో కూడియున్నది. ఈ దిశలో ఉత్తరాయణంలో అసువులు వీడిన పుణ్యమని నమ్మిక. అగ్ని జ్ఞానాగ్ని దగ్ధకర్మమున వచ్చు స్వచ్ఛతకు - ప్రకాశం. ఆత్మజ్ఞాన ప్రకాశానికి - శుక్లపక్షము, చంద్రుడు వర్ధిల్లు ఊర్ధ్వ దశకు - కుండలినీశక్తి సహస్రార దిశాపయనానికి సంకేతాలు. స్వఛ్ఛమైన వ్యక్తి, ఆత్మప్రకాశము గలిగి, ఊర్ధ్వదిశగా

పయనించిన వ్యక్తి మరణానంతరము ఉచ్ఛస్థితికి చేరునని అంతరార్థము. అందుకొరకే దక్షిణాయనమున అంతిమదశకు చేరిన భీష్మ పితామహుడిని, ఆయన కోరిక మేరకు ఉత్తరాయణం వచ్చు వరకు నేలపై వాలకుండా ఉంచుటకు అర్జునుడు బాణాలతో అంపశయ్యను నిర్మించెను.

దక్షిణాయనం. ఈ ఆరుమాసాలు పొగ, రాత్రి, కృష్ణపక్షముతో కూడియున్నవి. ఈ కాలములో అసువులు బాసిన వారికి పుణ్యగతులు ప్రాప్తించవని నమ్మిక. ఇది భౌతిక అర్థం. ఇందులో పొగ మనసును ఆవరించిన ఆవరణ దోషానికి చెందిన అజ్ఞానము. నేను దేహమునే అనుకునే దేహాత్మ భ్రాంతి. రాత్రి చీకటికి గుర్తు. చీకటి అజ్ఞానానికి ప్రతీక. కృష్ణపక్షము క్షీణదశ. కుండలిని మూలాధారాన్ని అంటిపెట్టుకొని ఉండటం. దీని అంతరార్థము ఆవరణ దోషంతో దేహభ్రాంతితో ఉండి, అజ్ఞానంతో పరిణతి చెందని మానవత్వముతో మూలాధారమున ఉండి ప్రాణాలు విడిచిన వ్యక్తి అధోగతి చెందునని అంతరార్థము. ఇవి భౌతికసంబంధ సూర్యమాన, చాంద్రమాన సంవత్సరాలకే కాక అంతర్భూతమైన ఉత్తరాయణ, దక్షిణాయనములని అంతరార్థం. (8-24,25).

52. విద్యలలోకెల్ల అతి రహస్యమేది?

విద్య అజ్ఞానము, జ్ఞానము, విజ్ఞానము ప్రజ్ఞానము అని నాల్గు రకాలు. మంచిని చెడుగా, చెడును మంచిగా గుర్తించడం అజ్ఞానం. చెడును చెడుగా, మంచిని మంచిగా గుర్తించడం జ్ఞానం. యిది జీవితానుభవ విజ్ఞానం. అంతర్వాణిగా వచ్చిన జ్ఞానం, ప్రజ్ఞానం. యిది జ్ఞానానికి పరాకాష్ట. అద్వైత దృష్టిన, దృశ్య రూప కల్పిత జగత్తు నాకు ఆధారము కాదు, తాడునందు పాము లేనటుల, నేనే ఆధారము నా యోగమాయకు, నేనే ఆధారము జగత్తునకు. ఉన్నది నిజముగ ఒక్కటే, వున్నది నేనొక్కడినే. నేను కానిది వేరొకటి లేదు లేదు. నేనే సర్వము. సర్వము నేనే. యే రీతిన వాయువు సర్వత్రావ్యాపించి ఉన్నదో ఆకాశమున, అదే

రీతిన సర్వభూతములు నాయందు వున్నవని తెలియుము. ప్రళయ సమయము నందు సమస్త భూతములు నా మాయా ప్రకృతిని చేరును, మరల సృష్టి సమయమున వాటిని సృజించు చుంటిని. జీవసముదాయము ప్రకృతికి అధీనమైనందున నేనే నా స్వతంత్ర ప్రకృతి ననుసరించి సమస్త జీవజాలమును మరల మరల సృష్టించెదను. మాయా ప్రకృతికి లోబడియున్న భూతజాలము మాయాతీతుడనైన నాచే మరల,మరల సృష్టించబడును. యీ విధముగా జీవసృష్టి కావించిననూ ఆశాదికర్మ సంగమము లేక, కర్మలందు బంధింపబడను. ప్రకృతిన చరాచర సమస్త జీవజాలం నా అధీనంలో సృష్టించ బడుతున్నది. సాక్షీభూతుడనై, మానవ దేహమున ఉన్న నన్ను, సామాన్యులు ఎరుగరు. అట్టి మూఢులు అత్యాశలతో ఫలాపేక్షతో, కామ్య కర్ములై, అజ్ఞానంతో, అసురత్వమును ఆశ్రయింతురు.

సాత్వికులైన మహాత్ములు, దైవీ ప్రకృతి స్వభావులు, నన్ను సర్వ భూతాధి పతిగ, నాశరహితునిగ గుర్తించి ఏకాగ్రచిత్తమున సేవింతురు. వీరిలో కొందరు నిరంతరం నన్ను కీర్తించుచు, సాధన సలుపుతూ అతి శ్రద్ధతో, భక్తితో నాకు నమస్కరిస్తూ, మది నాయందే నిలిపి ఉపాసించెదరు. కొందరు నను జ్ఞానమున సర్వవ్యాపిగా, సర్వాంతర్యామిగ సేవింతురు. సర్వేశ్వరునిగా కొందరు బహు రూప, నామముల వానిగా సేవించెదరు. నేనే క్రతువు, యజ్ఞము, పిండము, ఔషధము, మంత్రము, నేయి, అగ్నిని, హెూమమును. నేనే విశ్వాధారము, మాతను, పితను, తాతను. సర్వ కర్మ ఫలదాతను, తెలియదగిన వాడను.

ఓంకారమునూ, నాల్గు వేదములునూ నేనే. నేనే జగతికి పతియు, గతియు, ప్రభువును, సాక్షిని, నివాసమును, ఆశ్రయము, ఆప్తుడను, సృష్ఠి, స్థితి, లయుడను, ఆధారము, ప్రళయము, స్థానము, శాశ్వత బీజమును నేనే. ఎండలు వానలు నేనే, అతివృష్టి, అనావృష్టి నేనే. అమృతమును, విషమును, ప్రాణమును, మృత్యువునూ, సత్తూ అసత్తు నేనే. త్రివేద జ్ఞానులు, సోమపానమును చేసి యజ్ఞమున నను సేవింతురు. సురలోక సుఖములకై. యీ వేద కర్మానువర్తులు,

భోగులు స్వర్గలోక సుఖానుభవం తదుపరి, క్షీణించిన పుణ్యముతో భువికి మరల పునర్జన్మమున వచ్చుచూ జనన మరణచక్రమున తిరుగుచుందురు.

నాయందే మనసు నిలిపి, ఎడతెగక నన్నే ధ్యానించెదరో, అట్టిభక్తుల యోగ క్షేమములు నేనే చూసుకొందును. సర్వ యజ్ఞముల భోక్తను, ప్రభువును నేనే అయి వుండగా, నా నిజస్వరూపమును తెలియక, క్రమము తప్పి యితర దేవతలను భక్తి శ్రద్ధలతో పూజించువారునూ, నన్నే ఆరాధించు వారగుదురు. ఇతరులను ఆరాధించి, పునర్జన్మము పొందు చున్నారు. దేవతలను ఆరాధించు వారు దేవతలనూ, పితృ దేవతలను ఆరాధించు వారు పితృ దేవతలనూ, భూతములను ఆరాధించు వారలు భూతములను, నన్ను ఆరాధించు వారలు నన్నే పొందుచున్నారు. నాకు పత్రంగాని, పుష్పంగాని, ఫలంగాని, నీరుగాని, నాయందు భక్తితో ఏది సమర్పించినను అట్టి పరిశుద్ధ హృదయులు, భక్తితో యిచ్చినవి నేను అతి ప్రీతితో స్వీకరించెదను.

నీవు ఏదిచేసినను, తినినను, హోమార్పణము చేసినను, దాన మొసంగినను, ఏ త్యాగమొనర్చినను, అవి అన్నియు నాకు అర్పణ చేయు భావమున చేయుము. యీ కర్మఫల త్యాగభావమున (కర్మసన్యాస యోగము) పుణ్య పాపముల, శుభాశుభముల, కర్మ ఫల బంధముల నుండి విడువబడి నన్ను పొందెదవు. నేను సమదృష్టితోనుండు వాడను. నాకు ద్వేషులు, ప్రియులు లేరు. ఎవరెవరు నన్ను భక్తితో కొలచిన వారు నాలో, నేను వారిలో వుండెదము.

దురాచారి అయినను, పాపాత్ముడైననూ, అనన్య భక్తితో నను సేవించువాడు, సత్పురుషుడు, శ్రేష్ఠుడై, ధర్మాత్ముడై, శాశ్వత శాంతిని పొందును. నా భక్తుడు ఎప్పుడూ చెడడు. పలుజన్మల ఇంద్రియ విషయ బంధితులు(పాప జన్ములు), స్వలాభాపేక్షతో కర్మములు చేయువారు (వైశ్యులు), జీవన పరమావధిని మరచి తామసిక గుణముతో దినదినము ప్రాపంచిక కర్మల ఆధారంగా జీవించువారు (శూద్రులు), అసూయ, రాగద్వేషములను అంటిపెట్టుకొని ఉన్నవారు (స్త్రీలు) కూడ నన్ను ఆశ్రయించి సర్వోత్తమ మోక్షము పొందుచున్నారు.

పుణ్యాత్ములయిన బ్రహ్మ జ్ఞానులు (బ్రాహ్మణులు), భక్తులగు రాజర్షుల విషయము యిక చెప్పనేల. అందువల్ల అశాశ్వతమైన, సుఖరహితమైన యీ లోకమున నున్న నీవు నన్ను భజింపుము. నాయందే మనసు నిల్పి, నాయందే భక్తిగలిగి, నన్నే పూజించి, నాకే నమస్కరించి, చిత్తము నాయందే నిలిపి, నన్నే పరమావధిగా తలచి నన్నే పొందుము. (9-1 నుండి 9-34)

53. భగవత్ ఐశ్వర్యం ఎలా వర్ణించబడింది ?

అనాది, అపౌరుషేయుడను, బుద్ధి, జ్ఞానము, మోహరాహిత్యము, ఓర్పు, సత్యము, బాహ్యేంద్రియ నిగ్రహము, అంతరేంద్రియ నిగ్రహము, సుఖము, ఉత్పత్తి, నిర్భయము, అహింస,సమత్వము, సంతుష్ఠి, తపస్సు, దానము, కీర్తి, దుఃఖము, భయము, అపకీర్తి, నాశము, అను యిరవై గుణములు కలుగు చున్నవి నాయందే. నా మనోసంకల్పమున నాయందు దైవభావముతోజనించిరి, సప్తమహర్షులు, సనకాది నలుగురు దేవర్షులు, పదునలుగురు మనువులు- వీరందరు సమస్త లోకాల జనుల పూర్వీకులు. నేనే సర్వము, నేనే ప్రభువును, నేనే ఉత్పత్తి, స్థితి, లయల కారకం. భక్తులయందు దయతో, వారి అంతః కరణముననే నిలచి నేను జ్ఞాన దీప ప్రకాశమున పలు జన్మల అజ్ఞానాంధ కారమును నశింప జేయుచున్నాను. సమస్తజీవుల హృదయాలలో నున్న జీవాత్మను నేను. సర్వభూతముల సృష్ఠి, స్థితి, లయ కారకుడను నేను.

అదితి సంతానములో విష్ణువును. వెలుగులలో సూర్యుడను, వాయువులలో మరీచిని. నక్షత్రాలలో చంద్రుడను. వేదాలలో సామవేదాన్ని. దేవతలలో యింద్రుడిని. యింద్రియాలలో మనసును. భూతాలలో చేతనను. రుద్రులలొ శంకరుడను. యక్షులలో కుబేరుడను. అష్ట వసువులలో అగ్నిని. పర్వతాలలో మేరువును. పురోహితులలో బృహస్పతిని. సేనాధిపతులలో కుమారస్వామిని. సరస్సులలో సముద్రుడను. మహర్షులలో భృగువును.

శబ్దంలో ఓంకారమును. యజ్ఞాలలో జ్ఞాన యజ్ఞాన్ని. జడ పదార్థాలలో

హిమాలయాన్ని. వృక్షాలలో అశ్వద్ధ వృక్షాన్ని. దేవర్షులలో నారదుడిని. గంధర్వులలో చిత్రరధుణ్ణి. సిద్ధులలో కపిల మునిని. గుర్రాలలో ఉచ్ఛైశ్రవమును. ఏనుగులలో ఐరావతాన్ని. మనుజులలో రాజును. ఆయుధాలలో వజ్రాయుధాన్ని. గోవులలో కామధేనువును. ఉత్పత్తిలో మన్మధుడను. సర్పాలలో వాసుకిని. నాగులలో ఆదిశేషుడిని. జలదేవతలలో వరుణుడిని. పితృదేవతలలో ఆర్యమయుడను.

శాసించే వారిలో యముడను. రాక్షసులలో ప్రహ్లాదుడను. గణించే వారిలో కాలాన్ని. మృగాలలో సింహాన్ని. పక్షులలో గరుత్మంతుడను. వీచేవానిలో గాలిని. ఆయుధధారులలో రాముడిని, జలచరాలలో మొసలిని. నదులలో గంగా నదిని. సమస్త చరాచర సృష్టికీ, ఉత్పత్తి, వునికీ, అంతమూ నేనే. అక్షరాలలో అకారాన్ని. సమాసాలలో ద్వంద్వమును. నాశనములేనివాటిలో కాలాన్ని. దిక్కులలో చతుర్ముఖ బ్రహ్మను. హరించేవారిలో మృత్యువును. రాబోయేవాటిలో సృజనాత్మకతను. స్త్రీలలోని కీర్తి, సంపద, వాక్కు, జ్ఞాపకశక్తి, తెలివి, ధైర్యం, ఓర్పును నేనే.

సామవేద గానాలలో బృహత్ సామమును. చందస్సులో గాయత్రిని. మాసాలలో మార్గశిరాన్ని. ఋతువులలో వసంత ఋతువును. వ్యసనాలలో జూదాన్ని. మంచి వారిలోని తేజస్సును. గొప్పవారిలోని విజయాన్ని. కృషి చేసే వారల కృషిని. బలవంతుల బలాన్ని నేను. యాదవులలో వాసుదేవుడను. పాండవులలో అర్జునుడను. మునులలో వ్యాసుడిని. కవులలో శుక్రా చార్యుడను. న్యాయములో దండనను. విజయములో నీతిని. రహస్యాలలో మౌనాన్ని. బుద్ధిమంతుల జ్ఞానాన్ని నేను. సకల భూతజాలానికి మూల బీజాన్ని నేను. నేను లేనిది, కానిది యీ చరాచర విశ్వంలో యేదియును లేదు. యీ విశ్వంలోని ఐశ్వర్యవంతమూ, శోభాయమానమూ, ఉత్సాహ భరితమూ, అయిన ప్రతిదీ, నా యీ తేజస్సు లోని ఒక అంశము అని తెలియుము. నా యీ వివిధ వివరాలకన్న మిన్న ఒకే అంశము ముఖ్యము, **అది యీ సమస్త విశ్వం నాలోని ఒక చిన్న అంశ మాత్రమేనని తెలియుము.**

54. అర్జునుడు చూచిన కృష్ణుని విశ్వరూప దర్శనా అర్హతలేవి ?

విశ్వరూపదర్శనం, ప్రత్యక్షానుభవాన్ని కలిగించటమే, ఈ అనుభవం త్రికాలాతీతం. యిందున విశ్వవిరాట్ దర్శనం, కాలస్వరూపమైన కాలుడి దర్శనం. తనను గురించి తననే వివరించమని, అందుకు ఆయనే తగినవాడని, ఏ విధముగా ధ్యానించవలనో స్వయంగా తెలియజేయమని పార్థుడు శ్రీకృష్ణుని ప్రార్థించిన తదుపరి ఘట్టము. అనాది, అనంతుడు అయిన భగవంతుని నియమిత పరిధిగల మనసుతో తెలుసు కోవటం అసంభవం. అది ఒక అనంతుని ద్వారానే సాధ్యము. ఇది పరిమితమైన మనస్సు (జీవుడు) అనంతునికి ఆత్మ నివేదన చేయటం ద్వారానే సాధ్యం.విశ్వరూప దర్శనము ప్రతి ముముక్షువునకు అత్యున్నత దశ. విద్యకు పరాకాష్ట ప్రత్యక్షఅనుభవం. ప్రత్యక్ష అనుభవం లేని ఆత్మవిద్య సమగ్రము కాదు. ఇందులో తెలుసుకోవటం, వినటం, చదవటం, మననం, నిధిధ్యాస, అనుభవం వంటి వివిధ దశలు ఉంటాయి.

పాండవులలో ప్రధానయోధుడైన అర్జునుడు కృష్ణుడిని ఆజ్ఞాపించి 'రథాన్ని ఇరుసేనల మధ్య నిలుపుము' అనే (1-22) స్థాయి నుంచి ఆయననే ప్రార్థించి శిష్యుడిగా పరివర్తన చెంది 'నాకు ఏది శ్రేయమో నిర్దేశించి ఆజ్ఞాపించుము' (2-7) అనే స్థాయికి చేరి మౌనం వహించెను.(2-11) మౌనము లోనే అంతర్వాణి యైన ఆత్మఘోష వినపడుతుంది.ఆత్మవాణి యైన శ్రీకృష్ణుని బోధ అత్యవసర స్థితి నుంచి అర్జునుడిని కాపాడటం జరిగింది. సాంఖ్య, కర్మ, జ్ఞాన, కర్మసన్యాస, అత్మసంయమన, విజ్ఞాన, అక్షరపరబ్రహ్మ, రాజవిద్యా, రాజగుహ్యా రహస్యాలనుతెలిపిన పిమ్మట - కృష్ణపరమాత్ముని నిజస్వరూపాన్ని అర్థం చేసుకున్నవాడై, తదితర ప్రశ్నలను ఆపి భగవానుని గురించి మాత్రమే తెలుసుకొనగోరిన పార్థపరిణామ ఘట్టము ఇది. తనమీద దయతో పరమ రహస్యమైన, ఆత్మజ్ఞాన అధ్యాత్మిక విషయములన్నిటినీ విశదీకరించిన తదుపరి తన అజ్ఞానమంతా నశించినదని తెల్పి, తన నుండి సమస్త ప్రాణుల చావు పుట్టుకల గురించియు, అఖండ మహాత్మ్యం గురించియు వివరంగా వింటినని,

తాను చెప్పినదంతా నిజమని నమ్ముతున్నానని తెల్పి, తన ఈశ్వర సంబంధ విశ్వరూపాన్ని చూడాలని తన అభిలాష అని, నిత్యమైన విశ్వరూపాన్ని చూచుటకు తనకు అర్హత వుందని తలచిన, ఆ విశ్వ స్వరూపమును తనకు చూపుమని సవినయముగా ప్రార్థించెను. స్వచ్ఛత, చిత్త శుద్ధి, జ్ఞానం, అనన్య భక్తి, పట్టుదల, వినయం, శరణాగతులు – విశ్వరూపసందర్శనకు తగిన అర్హతలు.

55. పార్థుడు చూచిన విశ్వరూప మెలాంటిది ?

నానావిధములైన, దివ్యమైన, అనేక రంగులూ, ఆకారములుగల, వందలవేల రూపములతోనున్న అనంత రూపమది. సూర్యులను, వసువులను, రుద్రులను, అశ్వనీ దేవతలను, మరుత్తులను కలిగిన రూపం. చర జగత్తంతానూ ఒకే చోట చూడగలిగిన రూపం. భౌతిక నేత్రాలతో చూడలేని, దివ్య అంతర్ దృష్ఠితోనే చూడ గలిగిన రూపం. (కన్నులకు చూపును యిచ్చేవాడు భగవంతుడు. అంటే చూపుకు చూపును ఇచ్చే వాడు. కన్నులు చూడవు. కన్ను కాంతిని స్వీకరించి లోనికి పంపే పరికరం మాత్రమే. కంటి వెనుక తెర దానిని గ్రహించి చక్షునాడికి, మెదడులోని చక్షు కేంద్రానికి ప్రంకంపనల రూపంలో చేర్చుతుంది. అలా చేరిన ప్రకంపనలను ఎరుకగా, దృశ్య జ్ఞానంగా మార్చి చూచేది మనలోని దైవ అంశ ఆత్మ మాత్రమే. దీనిని అర్థం చేసుకోవటానికి ఋజువు చనిపోయినవారికి కూడా కళ్లు, చక్షునాడి, చక్షుకేంద్రము, మెదడు ఉంటాయి. అంటే ఆత్మ దేహాన్ని విడిచిన తరువాత పరికరాలు అన్నీ ఉన్నప్పటికీ దేహము చూడలేదు. కనుక బాహ్యాపు చక్షురేంద్రియాలతో దైవాన్ని దర్శించుకోలేము. కాని దైవకృపతో మాత్రమే దైవాన్ని అంతర్ చక్షువులతో (ఆత్మజ్ఞానంతో– మూడోనేత్రం) చూడగలము. పరిమిత చక్షుపరికరాలు అపరిమిత దైవత్వాన్ని చూడగలవా! అపరిమిత దైవకృప వల్లనే అనంత దైవాన్ని దర్శించగలము. దీనినే దివ్యదృష్టి అంటారు. దానినే పరమాత్మ అర్జునునికి ప్రసాదించాడు).

అనేక ముఖములు, అనేక నయనములు, అనేకాద్భుతములు, అనేక దివ్య ఆభరణములతో, ఉద్యమించుటకు తయారుగానున్న అనేక దివ్య

అస్త్రములతో, అనేక దివ్య వస్త్రములతో, దివ్య పుష్పమాలలతో, దివ్య గంధ లేపనములతో, అనేక ఆశ్చర్యములతో నిండియున్న, ప్రకాశవంతమైన, అనంతమైన, అనంత ముఖముల రూపమది. ఆకసమున వేల సూర్యుల కాంతిని పోలినదా కాంతి. నానావిధ విభిన్న సమస్త జగతి ఒక్కచోటనే దేవదేవుని శరీరమున ఒక్కటిగ వుండెను. (సమస్త సృష్టి, అనేకత్వము ఏకత్వమైన భగవానుని నుంచే ఏర్పడినది. ఏకత్వంలో, భగవానునిలో సమస్త స ృష్టి ఒక అంశ మాత్రమే. వేయితలలు, వేయి చేతులు, వేయి కళ్లు, వేయి తొడలు, వేయి నోళ్లతోనని (11-10, 11) అన్న వర్ణన మనం చిత్రాలలో చిత్రించినట్లు, చూసినట్లు భావించ గూడదు. అవి ప్రతీకలు మాత్రమే. అది మాటలతో వర్ణించటానికి వీలుకాని అద్భుత అనుభవం. అనుభవం మాటలలోకి వచ్చి, మాటలు, పాటలు, చిత్రాలుగా మారేటప్పటికి ఈ అనుభవం అనుభూతికి దూరం అవుతుంది. జరిగిన వర్ణన అంతా భగవానుని దేహం(విశ్వం)లో ఉన్న అనేకత్వం. అన్నీ ఆ ఏకత్వంలో కనపడ్డాయి. ఇది మాటలకు అందని, వర్ణించలేని అలౌకిక అనుభూతి. విశ్వరూపం అనగా విశ్వంలోని సమస్త విషయములందును భగవానుని చూడగలగటం. గోపికలు గోపాలుని అన్ని చోట్లా, ప్రకృతిలో ప్రతిచోటా చూడటం ఇందుకు ఒక ఉదాహరణ. ఇక్కడ అర్జునుడు భగవానునిలో విశ్వాన్ని మొత్తాన్ని దర్శించాడు. కాల, స్థల, పరిమాణాలకు, (space and time) పరిధులకు అతీతంగా అనగా భూత,భవిష్యత్, వర్తమాన కాలాలు అన్నీ ఏకమై ఒకటే అయినట్లుగా చూశాడు. తాను చేయబోయే యుద్ధఫలితాలను అర్జునుడు ముందే చూడగలిగాడు).

సమస్త దేవతలు, చరాచర జీవ సమూహము, సృష్టి కర్తయగు, బ్రహ్మ దేవుని, సమస్త ఋషులను, దివ్య సర్పములను, అనేక భుజములు, ఉదరములు, ముఖములు, నేత్రములతో- మొదలు, మధ్య, చివర లేని అనంత రూపమది. కిరీటం,గద, చక్రం ధరించి, సర్వత్రా వ్యాపించిన తేజో రాశిగా, జ్వలించే అగ్నిగా, సూర్యునివంటి కాంతి గలవానిగా, అపరిమితమైన వానిగా దర్శించెను. నాశరహితునిగా, అక్షరంగా, తెలియవలసిన పరమ పురుషునిగా, విశ్వానికి ఆధార

భూతునిగా, శాశ్వతునిగా, నిత్య ధర్మ రక్షకునిగా, పురాణ పురుషునిగా కనపడెను. ఆదిమధ్యాంత రహితునిగా, అపరిమిత బలముతో, అనేక భుజములతో, సూర్యచంద్రులవలె (అర్ధ నారీశ్వరునిగా) నేత్రములతో, భగ భగ మండే అగ్నిలాంటి ముఖముతో, తేజస్సుతో విశ్వమును తపింప చేయుచున్న వానిగా కనుపించెను.

ఇక్కడ సూర్యచంద్రుల వంటి నేత్రములతో చూచుచున్నానని అర్జునుడు అన్నాడు. కుడికన్ను సూర్యునిలాగా, ఎడమ కన్ను చంద్రునిలాగా వర్ణించబడింది. సాధారణంగా రెండు కళ్లు ఒకే విధంగా ఉంటాయి. కాని రెండు కళ్లు వేరువేరుగా ఉన్నాయని విశ్వరూప దర్శనాన్ని చెప్పటంలో ఒక అంతరార్థం నిక్షిప్తంగా ఉంది. పరాప్రకృతి యైన భగవానుని నుంచే అపరాప్రకృతియైన ప్రకృతి ఉదయించింది. అలా ఉదయించిన ప్రకృతిలో తాను అర్ధభాగమై ప్రవేశించి అర్ధనారీశ్వరుడు అయ్యాడు. విశ్వమంతా అర్ధనారీశ్వర స్వరూపం. భౌతిక శాస్త్ర దృష్టిలో చూస్తే విద్యుత్ శక్తి, అయస్కాంత శక్తి, (electro magnetism) విశ్వరూప దర్శనంలో విశ్వానికి దేహమైన విశ్వవిరాట్ ను దర్శించుకున్నాడు. ఆయనకు సగభాగం పరమేశ్వరుడు, మరో సగభాగం పార్వతి. కుడిభాగం ఈశ్వరుడైతే ఎడమ భాగం పార్వతి. తీక్షణమైన కుడికన్ను సూర్యునిగా, స్వయంప్రకాశంగా వర్ణించబడింది. వామభాగం స్త్రీ స్వరూపమైన చల్లని వెన్నెలలు అందించే చంద్రునిగా చెప్ప బడింది. కనుక రెండు కళ్లను సూర్యచంద్రులుగా పోల్చటం విశ్వవిరాట్ లోని అర్ధనారీశ్వర తత్వాన్ని వర్ణించటం. అదే దాని అంతరార్ధం.

రెండవ దర్శనము కాల స్వరూపము. భూమ్యాకాశముల పర్యంతము, అన్ని దిశలూ వ్యాపించిన, భయంకర, ఆశ్చర్యకర రూపము. దేవతా సమూహములు లోనికి వెళ్ళుతున్న రూపం. కొందరు భీతితో నమస్కరిస్తూ స్తుతించుచూ, మహర్షులు, సిద్ధ సమూహములు 'విశ్వమునకు మేలు జరుగుగాక' అంటూ స్తోత్రములతో కీర్తించు రూపం. రుద్రులు, ఆదిత్యులు, వసువులు, సాధ్యులు, దేవతలు, అశ్వనీదేవతలు, గంధర్వులు, యక్షులు, అసురులు, సిద్ధుల పలుసంఘములు ఆశ్చర్యచకితులై చూచురూపం. అనేక నోరులు, కనులు, భుజములు, తొడలు,

పాదములు, ఉదరములు, కోరలతో భీతిగొల్పు రూపం. ఆకసమును అంటిన ప్రకాశవంతమైన, వివిధ రంగుల తెరచిన నోటితో, నిప్పులతో రగులుతున్న నేత్రములతో నున్న భయంకరమైన కోరలతోనున్న ప్రళయాగ్నివంటి ముఖముతోనున్న రూపం. ధృతరాష్ట్ర పుత్రులు, భీష్మ, ద్రోణ, కర్ణ, వైరి సేనలలోనున్న సమస్త రాజ సమూహము, అదే తీరున పాండవ సైన్యంలోని ప్రముఖులునూ, కోరలచే అతి భయంకరముగా నున్న నోళ్లలోకి త్వరిత గతిన చేరుచున్న రూపం. వారిలో కొందరు కోరల మధ్యన చిక్కుకొని, తలలు పగిలి ముక్కలైన స్థితిలో కనబడు రూపం. నదులన్నియు అతి వేగమున సాగరమున చేరు రీతిన, నరలోక వీరులు, ప్రజ్వలించుచున్న నీ నోరులలో ప్రవేశించుచున్న రూపం. ఏ ప్రకారము మిడతలు అప్రయత్నముగ వెలుగుచే ఆకర్షింపబడి మండుచున్న అగ్నిలో వేగంగా పడి మాడిపోవునో ఆ రీతిన, యీ జనులు నాశనము కొరకు తన నోరులలో ప్రవేశించున్న రూపం. అగ్నితో ప్రజ్వలించు నోరులతో జనసమూహాలను మ్రింగి ఆస్వాదించుచున్న రూపం. భయంకర వెలుగుల ప్రకాశము విశ్వమంతా వ్యాపించి తపింప చేయుచున్న రూపం.

56. కృష్ణ భగవానుని కాలస్వరూప ఉగ్రరూప స్వవర్ణన తెలుపుము ?


నేను ప్రాణులను చంపుటకువచ్చిన కాలుడను. ప్రతిపక్ష సైన్య వీరులు నీవు లేకున్నను బ్రతుకజాలరు. కనుక లెమ్ము అర్జునా! లెమ్ము! శత్రువును జయించి (అంతః) కీర్తిని బడయుము. నీ శత్రువులను జయించి పరిపూర్ణ (స్వ) రాజ్యమును అనుభవించుము. వీరందరూ ఇప్పటికే చంపబడినందున నీవు నిమిత్తమాత్రునిగా యుద్ధము చేయుము. ద్రోణచార్య, భీష్మాచార్యులు, జయద్రధుడూ, కర్ణుడూ, తదితర యుద్ధ వీరులను చంపుము. భయమును వీడి యుద్ధము చేయుము, నీవు శత్రువులపై గెలవ గలవు.

విశ్వరూపసందర్శనతో భయకంపితుడైన అర్జునుడు స్వామిని తన సహజస్వరూపమునకు రమ్మని వేడుకొనెను. తాను కాలుడను అని భగవానుడు

తెలిపెను. దీనిని బట్టి విశ్వరూపం రెండు భిన్నకోణాలలో ఆవిష్కరించ బడినట్లు తెలుస్తుంది. మొదటిది విశ్వవిరాట్ స్వరూపము. అనేకత్వాన్ని ఏకత్వంలో చూడగలగటం. రెండవది కాలస్వరూపము. కాలుడు అంటే కాలచక్రాధిపతి. అనగా భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు అతీతుడై వుండి త్రికాలాలను శాసించే వాడు. ఈ కాలుని రూపమే మరో కోణం నుంచి దర్శిస్తే స్త్రీ మూర్తిగా, ఆది మహాశక్తిగా, భద్రకాళి వలె వారు ఆరాధిస్తున్న రూపాలలో గోచరం అవుతుంది. కాలుడిని యమునిగా కూడా వర్ణిస్తారు).

57. అర్జునుడు భగవానుని తన చతుర్భుజాకార రూపమునకు రమ్మనిన వివరణ ఏమిటి ?

అర్జునుడు భగవానుని తన చతుర్భుజములు కలిగిన రూపమునకు తిరిగి రమ్మని వేడుకొనెను. అందుకు కృష్ణుడు నాలుగు భుజములతో ఉండెనని తాత్పర్య అర్ధము వచ్చును. కాని అంతరార్ధం వేరొక కోణాన్ని చూపుతుంది. మంత్ర, యంత్ర, తంత్రాల్లో యంత్రంలో పంచభూతాలను, ప్రతీకలుగా చూపెడతారు.



శ్రీచక్రమును అందరికీ పరిచయమైన చిత్రాన్ని చూస్తే మొదటి వలయం నాలుగు భుజాలు కలిగి ఉంటుంది. ఈ చతుర్భుజ ఆకారం భూమికి సంకేతం. నాలుగు దిక్కులు కలిగినది అని అర్థం. యంత్రభాషలో చూస్తే చతుర్భుజం సామాన్య, లౌకిక మానవ ఆకారం(earthly) ఇహపరాలలో ఇహం. తన సహజ మానవాకారంలోకి రమ్మని భావన.

58. ఏ భక్తుడు దైవానికి ప్రియుడు ?

సమస్తప్రాణులందు ద్వేషము లేనివాడు, మైత్రి, కరుణలతో మెలగువాడు, మోహము, అహంకారములేనివాడు, సుఖదుఃఖముల సమముగనుండువాడు, ఎల్లపుడు తృప్తిగ నుండువాడు, సతతముయోగిగా నుండువాడు, ధృఢ నిశ్చయుడుగా నుండువాడు, మనోబుద్ధులను నాకు అర్పించినవాడు, నాయందు అత్యంతభక్తిగలవాడు, భయము చెందక, భయము కల్పించక మసలు వాడు, సంతోషము, క్రోధము, వ్యాకులత నొందనివాడు, బాహ్య, అంతరశుద్ధిగల వాడు, తటస్తుడు, చింతా వ్యధలు లేనివాడు, సర్వకార్యముల కర్తననే భావము వదిలినవాడు, అతిసంతోషము, ద్వేషము లేనట్టివాడు, కష్టములందును అతిశోకము పొందనివాడు, శుభాశుభములకు అతీతుడుగా నుండెడువాడు, శత్రు మిత్రులందు సమభావం కలిగినవాడు, మానావమానములందు సమబుద్ధి గలవాడు, శీతోష్ణ సుఖ దుఃఖముల సమముగా నుండువాడు, విషయ సంగమము లేని వాడు, నిందాస్తుతులను ఒకటిగ తీసుకొనెడు వాడు, మౌనముగ, స్థిరమదినవుండెడు వాడు, లభించిన దానితోనె మిక్కిలి తృప్తిచెందెడువాడు, నివాస స్థానముల ఆసక్తి వీడినవాడు, స్థిరమైన బుద్ధితో భక్తినిండినవాడు నాకు ప్రియుడు, శ్రద్ధతో, నాయెడల నిశ్చలభక్తితో అమృత రూప ధర్మమును ఆచరించెడు భక్తులు నాకు అత్యంత ప్రియులు.(12-13 నుండి 20 వరకు).

59. క్షేత్ర క్షేత్రజ్ఞు లనగా ఏమిటి?

పాంచభౌతిక దేహమే క్షేత్రము, శాశ్వతుడైన ఆత్మ క్షేత్రజ్ఞుడు. పంచ భూతములు, అహంకారము, బుద్ధిని కలిపి మూలప్రకృతి అందురు. దశేంద్రియములు, మనస్సు, పంచ యింద్రియ శబ్దాది విషయములు, రాగము, ద్వేషము, సుఖము, దుఃఖము, దేహేంద్రియాది సముదాయం, ధైర్యము అను వికారాలతో నిండినది క్షేత్రమనబడును. (13-6,7).

క్షేత్రజ్ఞుడు సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, సర్వశక్తిమంతుడు, బ్రహ్మము, అతనుకానిదేదీ విశ్వమునలేదు, సర్వము బ్రహ్మమయము, సర్వం బ్రహ్మం. సర్వత్రచేతులూ, పాదములు నేత్రములు, తలలు, ముఖములు చెవులు గలదిగా విశ్వమంతయు వ్యాపించి యున్నదది. ప్రాణుల వెలుపల, లోపలనుండి, చలాచలమై, అతిసూక్ష్మమై అతిదగ్గరగను, అతిదూరముగను వుండి తెలియనిదీ, ఏకమై, విభజింప బడనిదీ, అనేకమై, విభజనతో నున్నటుల కనుపించునదీ, ప్రాణుల సృష్టి, స్థితి, లయము చేయునదీ, సూర్య, చంద్ర, అగ్ని ఆదిప్రకాశకులకు ప్రకాశము నిచ్చెడువాడు, అజ్ఞానము కానిది, జ్ఞాన స్వరూపమైనది, తెలియదగినది, జ్ఞానమున పొందదగినది, సమస్తజనుల హృదయాంతరాళముల వుండి క్షేత్రజ్ఞుడని చెప్పబడుతున్నది. అంతర్దృష్టితో క్షేత్రక్షేత్రజ్ఞుల భేదమెరిగి ప్రకృతిబంధములు వదులు వుపాయమరసి వర్తించు వారు సంసారబంధముల నుండి విముక్తులవుదురు.

60. త్రిగుణములనగా ఏమిటి ?

త్రిగుణములు ప్రకృతిన పుట్టి, దేహమును, నిత్యమైన ఆత్మను బంధించుచున్నవి. సత్వాదిగుణములు నిర్మలమై, మనోప్రకాశమున, యింద్రియలోలతన సుఖ, జ్ఞానాసక్తితోనూ, రజోగుణం అంతులేని కోరికల నిలయమై, కర్మ ఫలాసక్తిని పెంచి, బంధించునవి జీవుని. తామసికం అజ్ఞాన, మోహములచే ఆత్మను శరీరమున కదలకుండ బంధించు చున్నవి. సత్వము సుఖమున, రజోగుణము కర్మమున, తమోగుణము అవివేకమున జీవుని ప్రమాదమున పడవేయును. సత్వాధికము రజోతమములను, రజోగుణాధికము సత్వల, తమోగుణాధికము రజోసత్వములను అణచును.మూడు గుణాలలో ప్రతిదీ మిగతా రెండు గుణాలను అదుపు చేయటానికి ప్రయత్నిస్తుంటుంది. దీని అర్థం సృష్టి ధర్మం సమత్వం. సమతత్వం సృష్టిది. మరో కోణం నుంచి చూస్తే ఉన్నది రెండు గుణాలే. అవి రాజస, తామసాలే. చలనం, అచలనం. ఈ రెండు భిన్నమైనవి. వీటిమధ్య సమతుల్యతనే సాత్వికం అంటారు. మూడు గుణాలను నమ్మే వాళ్లు మరింత ఉత్తమ స్థాయికి వెళ్లి దానిని శుద్ధసత్వమని కూడా అంటారు.

సృష్టిలో సమతుల్యత సహజ స్థితి. జీవుడు గుణ త్రయముల సమతుల్యత సాధించవలయును. దీనినే గీతాచార్యుడు సాంఖ్యయోగంలో తెలియజేశాడు. స్థితప్రజ్ఞుని గురించి బుద్ధుడు మధ్యేమార్గంగా బోధించినది కూడా ఇదే.

ఎవ్వని దేహపు నవద్వారములు బుద్ధితో ప్రకాశించునో, అట్టివాని సత్త్వగుణం పెరుగుతున్నదని ఎరుగుము. లోభము, కర్మము, నిషిద్ధకర్మము, అశాంతి, అలజడి, ఆశ, దురాశలు, మనుజుల రజోగుణవృద్ధి సంకేతములు. అవివేకము, అతినిద్ర, సోమరితనం, అజాగ్రత్త, అజ్ఞానములు, మనుజుల తమోగుణ అభివృద్ధికి గుర్తులు. సత్త్వగుణాతిశయమున అసువులు బాసిన సాత్త్వికులు ఊర్ధ్వలోకములు చేరి, తదుపరి జ్ఞానుల గృహములందున,   రజోగుణాతిశయమున అసువులీడిన రాజసుడు కర్మాసక్తులగృహమున, తమోగుణాతిశయమున అసువులు వీడిన తామసికుడు పామరుల, పశు, పక్షి, హీనజాతుల గృహాలలో జనియించును. సాత్త్వికకర్మఫలము స్వచ్ఛత, సుఖం, రాజసికకర్మఫలము దుఃఖము, తామసికకర్మఫలం అజ్ఞానము. సత్త్వగుణఫలము జ్ఞానం. రజోగుణఫలము లోభం. తమోగుణఫలము అజ్ఞానం. సాత్త్వికులు ఊర్ధ్వలోకాలకు, రాజసికులు మనుష్యలోకాలకు, తామసికులు అధోలోకాలకు పోయెదరు మరణాంతరమున. వివేకవంతుడై, త్రిగుణాతీతముగ, అకర్తగా ననుచూచునట్టివాడు నన్ను ఎరిగి, జన్మ మూలమగు త్రిగుణములదాటి, జరామరణవార్ధక్యదుఃఖములను దాటి మోక్షమును పొందుచున్నాడు.

61. గుణాతీతుని లక్షణాలు ఏవి ?

ఎవరు సాత్త్వికమైన ప్రకాశమును, సుఖమును, రాజసికమైన కర్మ ప్రవృత్తిని, తామసికమైన మోహమును, నిద్రను ద్వేషింపడో, అవి తొలగినచో కావలెనని కోరడో, తటస్థుడై గుణాతీతుడవునో, గుణములకు సాక్షుడవునో, నిశ్చలమదిన వుందురో వారు త్రిగుణాతీతులు. సుఖదుఃఖములను, మట్టిగడ్డను, రాయిని, బంగారములను సమానముగా చూచెడివాడు, ఆత్మయందే స్థిరముగ నున్నవాడు,

యిష్టాయిష్టములను సమముగా చూచెడువాడు, ధైర్యవంతుడు, కర్తృత్వబుద్ధిని వదలినవాడు, కామ్యకర్మలను విడచి బ్రహ్మనిష్ఠయందు వున్నవాడు త్రిగుణాతీతుడు.

62. సంసార అశ్వద్ధ వృక్ష వర్ణన వివరణ ఏమిటి ?

సంసారమనెడు అశ్వద్ధవృక్షమునకు వ్రేళ్ళుపైన, కొమ్మలు క్రిందుగ వుండి, వేదములు ఆకులుగా, త్రిగుణములు కొమ్మలుగా, శబ్దాది విషయవాసనలు చిగుళ్ళు కాగా, కొమ్మలు పైకి బ్రహ్మలోకము వరకూ, క్రిందికి మానవలోకము వరకు విస్తరించి కర్మసంబంధవాసనలను గలుగచేయుచున్నవి. యీ సంసారవృక్ష స్వరూపము కానీ, దాని ఆదిమధ్యాంతములు కానీ ప్రపంచమున తెలియకున్నవి. లోతుగా నాటుకున్న వ్రేళ్ళతో ఎదుగుతున్న యీ అశ్వద్ధవృక్షాన్ని అసంగము అనే గట్టి ఆయుధముతో నరికి, పునర్జన్మ రహిత పరమపధాన్ని వెదకి, ఎవని నుండి అనాది అయిన యీ సంసారవృక్ష ప్రవృత్తి వ్యాపించెనో, అట్టి ఆది పురుషుని శరణుకోరి మోక్షమును పొందవలెను.

63. ఆత్మ శరీరప్రవేశ, నిష్క్రమణసమయాలలో ఏమవుతుంది ?

వాయువు పుష్పసువాసనలను తీసుకుపోవు నటుల, జీవుడు శరీరప్రవేశ, నిష్క్రమణ సమయాల తన తోడ మనోయింద్రియములను కొనిపోవును. యీ జీవుడు పంచేంద్రియములు, మనస్సును ఆశ్రయించి శబ్దాది విషయజ్ఞానములను అనుభవించుచున్నాడు. మూఢులు శరీరములో ఉన్నపుడు కానీ యింద్రియ విషయానుభవమున కానీ, మరోశరీరాన్ని పొందునపుడు కానీ చూడలేరు యీ జీవాత్మను, జ్ఞానదృష్టిగల యోగులు మాత్రమే దర్శింతురు.

64. దైవాసుర సంపత్తు వివరణ ఏమిటి ?

భయం, చిత్త శుద్ధి, జ్ఞాన యోగ నిష్ఠ, దానం, యింద్రియ నిగ్రహం, యజ్ఞం, స్వాధ్యాయం, తపస్సు, అహింస, సత్యం, శాంతం, త్యాగం, చాడీలు చెప్పకుండటం, దయ, కోరికల నియంత్రణ, మృదుత్వం, సిగ్గు, తేజస్సు, ఓర్పు,

ధైర్యం, శుచి, నమ్మకం, అనాసక్తత, సరళత, స్థిరత్వం, వైరాగ్యము అను 26 సుగుణములు దైవ సంపద లక్షణములు. కపటం, గర్వం, దురహంకారం, కోపం, కఠినత, అవివేకం, యుక్తాయుక్త విచక్షణ లేకుండుట, అశుభ్రత, దురాచారం, అబద్ధాలు చెప్పటం, కామం, నాస్తికత్వం కలవారు. అల్ప బుద్ధులు, లోక కంటకులు, వినాశకారులు. వీరు అదుపు లేని కోరికెలతో, డంబము, గర్వము, దురభిమానము, అనెడు పలు దుర్గుణాలతో,అవివేకంతో, దుర్భావాలతో, దురాచారులై తిరుగుట, జీవన పర్యంతమూ, మితిమిరిన కోర్కెలతో, కామ భోగలాలసత్వములో మునిగి తేలుతూ, అదే జీవన పరమావధిగా నెంచి, ఆశాపాశములతో సుఖముల నిమిత్తము అక్రమార్జనము చేయుట, ఇది నాకు దొరికినది, యీ కొరిక నెరవేరినది, యింత ఆస్తి వున్నది, మరింత సంపాదిస్తాను, శత్రువును చంపేశాను, యితర శత్రువులను కూడా చంపుతాను అనీ, తానే ప్రభువును, భోగిని, సమర్ధుడను, బలవంతుడను, సుఖవంతుడను, ధనవంతుడను, సద్వంశజుడను, అని పలువిధములుగా గొప్పలు చెప్పటం, తనకు సాటెవరూ లేరనటం, యజ్ఞ, దానాలు చేస్తాననటం, ఆనందం అనుభవిస్తాననటం, యివి అసుర స్వభావుల లక్షణాలు. వీరు నిరంతరం కామభోగలాలసతో వుండటం, వీరు, సొంత పొగడ్తలతో, వినయ విధేయతలు లేక, ధన, మద గర్వంతో, శాస్త్ర విధిని పాటించక యజ్ఞాలు చేయటం, అహంకారం, బలం, గర్వం, కామ, క్రోధములకు ఆశ్రయమై, తమ దేహాలలో, ఇతరుల దేహాలలో నిబిడీకృతమై వున్న నన్ను ద్వేషించటం, అసుర సంపత్తిలో పుట్టినవారి లక్షణాలు. వీరు ద్వేష పూరిత, పాప చరితులు, క్రూర స్వభావులయిన యీ మానవాధములు సంసార చక్రములో తిరుగుతునే వుందురు. అసుర జన్మపొందే అలాంటి మూర్ఖులు జన్మజన్మలకు నను చేరక అధోగతి పొంది ఘోర నరకాల పాలవుదురు. శాస్త్ర విధుల నిరాకరించి, యిష్టానుసారము ప్రవర్తించి, జ్ఞానం, సుఖం, మోక్షములను పొందరు. దైవ సంపత్తి ద్వార మోక్షమూ, అసుర సంపత్తి వలన సంసార బంధమూ కలుగును.

65. వివిధ శ్రద్ధల వివరణ ఏమిటి ?

శ్రద్ధ: పూర్వజన్మ సంస్కారమున కలుగు సహజమైన శ్రద్ధ మూడు రకములు, సాత్వికం, రాజసికం, తామసికము. సాత్వికులు దేవతలను, రాజసికులు యక్ష రాక్షసులను, తామసికులు భూతప్రేతపిశాచాదులను పూజింతురు.

ఆహారము: అందరికీ యిష్టమైన అహారము, యజ్ఞము, తపస్సు, జ్ఞానములు కూడా మూడు రకములు. ఆయువు, మేధస్సు, బలం, ఆరోగ్యము, సుఖం, సంతోషములను పెంచే రసము, చమురూ కలిగి, దేహములో యెక్కువ కాలం ఉండి ఆకలిని అణచి, మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే పదార్థాలు యిష్టపడెదరు సాత్వికులు. (ఎక్కువసేపు ఆకలి కానిదంటే. యీనాడు మనం హైగ్లైసీమిక్ యిండెక్స్ ఆహారములని అర్థం. యిది ఈనాటి వైద్యుల ఆరోగ్య సూచన కూడా. అతి చేదూ, పులుపూ, ఉప్పదనం, వేడీ, కారమూ, చమురు లేనిదీ, దాహం కలిగించే, ఆహార పదార్థాలు రాజసులకు యిష్టము. యివి శరీరానికి బాధ, మనోవ్యాకులత కలిగించునవని తెలియుము. చల్లబడి, సారము లేని, దుర్వాసన గలిగిన, అపవిత్ర ఎంగిలి ఆహారమనిన యిష్టపడుదురు తామసులు. 17-10

యజ్ఞం: కర్మఫలాసక్తి లేకుండా, అత్యంత శ్రద్ధతో, స్వచ్ఛమైన హృదయంతో ధర్మంగా చేసే యజ్ఞమును సాత్విక యజ్ఞమని అందురు. కర్మఫలాసక్తితోగాని, డంబముతో ఆడంబరము కొరకు చేయు యజ్ఞమును రాజసిక యజ్ఞమని అందురు. శాస్త్ర సమ్మతముకాక, అన్నదానము, మంత్రములు, దాన దక్షిణలు లేక, శ్రద్ధాహీనముగ చేయు యజ్ఞమును తామసిక యజ్ఞమని అందురు.

తపస్సు: దేవతలు, బ్రాహ్మణులు, గురువులు, జ్ఞానులను పూజించడం, త్రికరణ శుద్ధిబ్రహ్మచర్యం, అహింసాచరణ లాంటివి దేహ తపస్సని అందురు. సత్యమై, ప్రియమై, ఆహ్లాదకరమై, హితమై, ఉద్వేగరహితమై, వేదాధ్యయనము చేయుట వంటివాటిని వాచక తపస్సు అందురు. మనో నిర్మలత, మంచి భావము, మౌనము, ఆత్మనిగ్రహం, శాంతము, స్వచ్ఛతలతో చేసే తపమును మానసిక

తపస్సు అందురు. యీ మూడు విధముల తపస్సులలో, నిర్మల మనస్కులు అతి శ్రద్ధతో, ప్రతిఫలాపేక్షలేక చేయు తపస్సును సాత్విక తపస్సని అందురు. సన్మాన సత్కారములతో పూజింపబడుటకొరకు, ఆడంబరంగా స్థిరమైన గమ్యములేని తపస్సును రాజసిక తపస్సని అందురు. మూర్ఖంగా, దేహమును ఉపవాసాదులతో శుష్కింపజేసి, యితరులకు హానికలుగుటకొరకు చేయు తపస్సును తామసిక తపస్సు అందురు. 7-19

దానం: తగిన యోగ్యునికి ప్రతిఫలాపేక్ష లేకుండా చేసిన దానమును సాత్విక దానం అందురు. ప్రతిఫలాపేక్షతో, తిరిగి రావాలనే భావంతో బలవంతంతో, డంబము కొరకు మొఖమాటముతో, అయిష్టముగా చేయు దానమును రాజసిక దానం అందురు. అసందర్భముగా, అనువుగాని చోట, అపాత్రునకు, అగౌరవముగా, అవమానకరంగా యిచ్చే దానమును తామసిక దానమని అందురు.

జ్ఞానం: అనేకములుగా వున్న ప్రాణులను అఖండ, అవినాశ, అవిభక్త ఆత్మగా, ఏకాత్మగా చూచువాని జ్ఞానమే సాత్విక జ్ఞానము. విడివిడిగా కనిపించెడు సర్వ భూతములు అనేకమనెడు భావనయే రాజసిక జ్ఞానం. తత్వము తెలియక, తర్కించక, కారణాధారములు లేక అనేకముగ వున్న ఏ ఒక్కదానినో పట్టి,అదే సర్వమనెడి సంకుచిత భావన, తామసిక జ్ఞానము.

కర్మలు: రాగద్వేష రహితముగా, కర్మఫలమాశించక, చేయు కర్మలు సాత్విక కర్మలు. కోర్కెలు, అహంకారములు, శ్రమతో చేయు కర్మములే రాజసిక కర్మలు. మోహముతో, పరిణామమెరుగక, బాధను, దేహ సామర్థ్యమును తెలియక అవివేకముగ ఆరంభించెడు కర్మలు తామసిక కర్మలు.

కర్త: సంగమము, ఫలాపేక్ష, కర్తృత్వ అహంకారములు విడచిన వాడు, ధైర్య వుత్సాహములు కలిగిన వాడు, కార్య, సాధ్యాసాధ్యములలో ఏకరీతి నున్నవానిని సాత్విక కర్త యని అందురు. అనురాగబంధితుడు, కర్మఫలభోగి, లోభి, హింసలనాచరించువాడు, అశౌచ్య, సుఖ దుఃఖముల గూడినవాడు రాజస కర్త

అని అందురు. మనోనిగ్రహ వినయరహితుడు, పామరుడు, మోసగాడు, సోమరి, నిత్యచింతితుడు, పనులు జాప్యముగ చేయువాడు, వంచనా పరుడిని తామసిక కర్త యని అందురు.

ధైర్యము: మనసు, ప్రాణం, యింద్రియాల వ్యాపారాలను యోగ సాధనతో నిలబెట్టునది సాత్విక ధైర్యం. ధర్మార్ధ కామ మోక్షాలపట్ల అభిమానం, ఫలాభిలాష కలిగి వుండేది రాజసిక ధైర్యం. మూర్ఖుడు నిద్ర, భయం, దుఃఖం, విషాదం, మదములను విడువక చేసేది తామసిక ధైర్యం.

బుద్ధి: ప్రవృత్తి నివృత్తి మార్గమగు కర్మ సన్యాసములను, కర్తవ్య అకర్తవ్యాలను, భయఅభయాలను, బంధమోక్షాలను గ్రహించెడి బుద్ధిని సాత్విక బుద్ధి అని అందురు. ధర్మాధర్మాలనూ, కార్యాకార్యాలనూ, స్పష్టముగా తెలుసుకోలేని బుద్ధి రాజసిక బుద్ధి. అజ్ఞానపు చీకటి వలన ధర్మమును అధర్మముగా, అధర్మమును, ధర్మముగా భ్రమించు బుద్ధియే తామసిక బుద్ధి యనబడును.

సుఖము: తొలుత విషమువలె,పిదప అమృతము వలె వుండి, బుద్ధి నిర్మల స్థితిలో పొందు సుఖము సాత్విక సుఖము. మొదట అమృతముగానుండి, పిదప విషముగా మారి విషయ, యింద్రియ సంపర్కము వలన కలిగినది రాజస సుఖం. నిద్ర, బద్ధకం, ప్రమాద స్థితిలో జనించి, ఆద్యంతములలో మోహాన్ని కలిగించుసుఖము తామస సుఖము అనబడును. 18-39

వర్ణాలు: బాహ్య యింద్రియ నిగ్రహం, మనో నిగ్రహం, తపము, శుచి, ఋజువర్తనం, ఓర్పు, సత్ప్రవర్తన, శాస్త్ర జ్ఞానం, అనుభవ జ్ఞానం, దైవ నమ్మకం బ్రాహ్మణ స్వభావసిద్ధ కర్మలై వున్నవి. పరాక్రమం, పౌరుషం, ధైర్యం, దక్షత, యుద్ధమందున పారి పోకుండుట, పాలనాసామర్ధ్యం క్షత్రియ నైజ కర్మలు, వ్యవసాయం, పశుపోషణ, వ్యాపారం వైశ్యులకు సేవారూప కర్మలు. శూద్రులకు నైజ కర్మలు.

66. సన్యాస మనగా నేమి?

కామ్యకర్మ విసర్జనం సన్యాసం, కర్మ ఫల త్యాగం సన్యాసం. అహంకార విసర్జనం సన్యాసం. సాత్వికుడూ, బుద్ధిమంతుడూ, సంశయ రహితుడూ అయిన త్యాగి, కర్మలు కష్టమైనవని వదలడు, సులభ సాధ్య కర్మలను అభిమానించడు. నిజముగ, మానవమాత్రుడికి, కర్మలు పూర్తిగా వదులుట అసాధ్యము. కాని కర్మ ఫలమును వదలి, కర్మలు అంటనివానిగ, కర్మత్యాగిగా నుండవచ్చును. అహంకార మమకారములు లేని కర్ముడు, లోకాలలోని అన్ని ప్రాణులనూ చంపినా, అతడు హంతకుడు కాడు, కర్మ బంధుడు కాడు. (18-18)

67. బ్రహ్మస్వరూపమును పొందుటకు అర్హుడెవరు ?

స్వచ్ఛ బుద్ధిన, మనోధైర్యమున, విషయ, రాగద్వేషముల విడచి, ఏకాంతవాసియై, వైరాగ్యమున,అహంకారమును నిర్మూలించి, బల, గర్వ, కామ, క్రోధ వస్తు సేకరణలు విడచి, మమత్వమును త్యజించి, శాంత స్వభావమును పెంచిన శ్రేష్టుడు బ్రహ్మస్వరూపమును అందుటకు అర్హుడౌను.

బ్రహ్మస్వరూపమును పొందినవాడు ప్రశాంత మనమున దేనినీ కోరడు, దేనికై దుఃఖించడు, సమస్త భూతముల యెడ సమ భావము కలిగి దైవం యెడ పరమ పవిత్ర భక్తితో, నేనెంతటివాడనో, ఎట్టివాడనో తెలిసి, నా మహిమలు గ్రహించి, నన్నే చేరును, కర్మలు సమస్తము చేయుచున్నను ఎల్లపుడు నన్నే ఆశ్రయించినవాడు, నా అనుగ్రహమున నాశరహితమగు మోక్షపథమును పొందును. సర్వ కర్మలు నాకే హృదయ పూర్వకముగ అర్పించి, నన్నే పరమ గతిగ నెంచి, మనసును నిరంతర ధ్యానమున నాయందు నిలిపిన, నా అనుగ్రహమున అతిసులువుగ దాటగలవు ప్రతి సంసార అవరోధమును. అటుల కాక అహంకారమున నా వుపదేశమును పెడచెవిన పెట్టిన చెడెదవు. అహంకారమువలన, నీవు యుద్ధము చేయకూడదని భావించిననూ, నెరవేరదా ప్రయత్నము.కారణము నీ స్వభావమే చేయించి తీరును.

68. కృతజ్ఞతా భావ వివరణ ఏమిటి ?

పొంగిపొరలిన పరిపూర్ణతా ప్రవాహం కృతజ్ఞతా భావం. ఏకాత్మ భావనా ప్రవాహం.

69. స్థిత ప్రజ్ఞుడు – అనన్యభక్తుడు – త్రిగుణాతీతుడు – యోగారూఢుని లక్షణాలేమి ?

01. జీవన ద్వందాతీతుడు
02. రాగద్వేషాతీతుడు
03. సాక్షీభూతుడు
04. ఆత్మనిలయుడు
05. మనోనిశ్చలుడు
06. వాసనారహితుడు
07. కర్తృత్వ రహితుడు
08. సమ దృష్టుడు
09. నిరంతర నిష్కామ కర్ముడు
10. తృప్తుడు
11. అహంకార రహితుడు
12. మాయాతీతుడు
13. యింద్రియ నిగ్రహుడు
14. యుక్తాయుక్త విచక్షుడు
15. త్రికరణ శుద్ధుడు
16. వ్యవహార దూరుడు, అంతరంగానికి మిత్రుడు
17. నిత్యానందుడు

70. భగవద్గీతయందు కర్మ, జ్ఞాన, ధ్యాన, విశ్వరూప సందర్శన యోగాల తదుపరి భక్తి యోగం రావటానికి కారణమేంటి?

కర్మమార్గము విడరాని కాలి బాట
భక్తి మార్గము సులువైన బండి బాట
జ్ఞానమార్గము శీఘ్ర విమానయానగాదె
ధ్యానమనిన జలధిపై ఓడ గాదె. (స.సా.బా)

కర్మ జన్మము మనది. గడచిన పలుజన్మల కర్మ శేషఫలమీ జన్మ. పుట్టిన ప్రతి వ్యక్తి కర్మలు చేయక తప్పదు. చేయ వద్దని కూర్చున్ననూ, పూర్వ జన్మ సంస్కారముల వలన కర్మలను ఆచరించక తప్పదెవరికిని (3-5). అట్లు తప్పక చేయవలసిన పనులను, ఒక ధర్మకర్త భావనతో చేస్తే అదినిష్కామ కర్మమవుతుంది. యిలా నలుగురి మేలెంచి చేయు కర్మలను యజ్ఞమందురు (3-9). "అర్జునా! నీవేకారణము చేతనయిననూ, యీ యుద్ధము చేయవేని, నీ సంస్కారము నీతో మనో యుద్ధము చేయించును" (3-4). "నాకు ఏ కర్మలూ చేయవలసిన అవసరం లేదు. అయిననూ, యితరులకు ఆదర్శముగా నుండుట కొరకు నేను సదా కర్మలను ఆచరించుచునే యుందును" (3-21, 22,23,24). ఆత్మసాక్షాత్కారము పొందిన వానికి ఏ కర్మలు చేయవలసిన అవసరము లేకపోయిననూ, యితరులకు ఆదర్శంగా యుండుటకొరకు కర్మలు చేయుచునే వుందురు, జనకుని లాగా. నిష్కామకర్మము పరిపక్వమైనపుడు దానిని అకర్మమందురు. దైవం అన్నీ చేయుచూ, ఏమీ చేయకుండునటుల వుండు రీతిన. యీ పరిపక్వ అకర్మమునే యోగమందురు. పరిపక్వ నిష్కామకర్మము ఒక యోగం.

ఏ రీతిగా యీనిష్కామకర్మలను ఆచరించవలెను? యీప్రశ్నకు సమాధానం ప్రకృతి ఆచరణనుండి వస్తుంది. ఏరకంగా వృక్షాలు నీడనూ, చల్లని గాలిని, ప్రాణవాయువును యిచ్చి మన కాలుష్యాన్ని (Co_2) తీసుకుంటున్నాయో, అలాగా! ఏ రకంగా నదులు ప్రవహిస్తూ, మన దేహార్తిని తీరుస్తూ, భూమిని సశ్యశ్యామలం చేసి, తాను మలినమవుతూ, మన కాలుష్యాలను ప్రక్షాళన గావించునో, అలాగా! సూర్య చంద్రులు తర, తమ భేధాలు లేకుండా సమతాభావనతో అందరికీ సమంగా వెలుగును ప్రసాదిస్తారో, అలాగా! గోమాతలు ఎండుగడ్డిని తిని అమృతతుల్యమైన

పాలను, తన దూడకంటే ఎక్కువ మనకిచ్చి, తన వ్యర్థాలతో మన పొలాలను సారవంతం చేసి, చనిపోయిన తదుపరి సైతం మన పాదరక్షలై ఎలా ఆద్యంతం సేవ చేస్తాయో అలా! మన దేహంలోని దాదాపు 200 ట్రిలియన్ పైచిలుకు కణాలన్నీ, దేహి కార్యమే స్వకార్యమనే భావనలో పనిచేస్తున్నాయో, అలాగా! నిష్కామ కర్మాచరణ ప్రకృతి సహజ ధర్మం. నిష్కామ కర్మాచరణకు ప్రకృతే మనకు గురువు. నిష్కామ కర్మాచరణ మన స్వధర్మం. కార్యకారణ సిద్ధాంత పరంగా(Law of Cause and Effect) యీనాటి (జన్మ) కార్య (శ్రమ) ఫలితం యిప్పుడే చూడాలిగదా?యిది యీనాటి ప్రపంచ జన సామాన్య భౌతిక వాదన. మనం ప్రస్తుతం జీవించే యీ జన్మఒక్కటే అనే భావనా మూలంతో వచ్చేది యీ భౌతిక వాదన. కాని యీనాటి మన జన్మానుభవాలకు గతంలోని పలు జన్మలు కారణం అనేది పునర్జన్మ సిద్ధాంత మూలం. యిప్పుడు అనుభవిస్తున్న పూర్వజన్మ కర్మ ఫలం,ప్రారబ్ధ కర్మ. ప్రస్తుతం అనుభవంలోకి రాని, పూర్వజన్మల కర్మ ఫల శేషం సంచిత కర్మ. యీజన్మ కర్మఫలం, భవిష్యత్ జన్మలలో అనుభవించేది ఆగామి కర్మ (క్రియామాన).

కామ్యకర్మ పూర్వజన్మ సంస్కారాలను రద్దు చేస్తూ, కొత్త కర్మ పద్దులను తయారుచేసి, మరోజన్మకు విత్తనమౌతుంది. కామ్యకర్మసంకుచిత జన్మబంధకర్మ. నిష్కామకర్మ పూర్వజన్మ సంస్కారాలను రద్దు చేస్తూ, కొత్తకర్మ పద్దులను తయారు చేయక, మనోమాలిన్యాన్ని దహింపజేసి చిత్త శుద్ధిని కల్గించి, జ్ఞానానికి నాంది పలుకుతుంది. కర్మయోగఫలం చిత్త శుద్ధి.

నిష్కామకర్మ మనోవికాస, విశాల, పూర్ణతా, బంధ విమోచన, స్వేఛ్ఛాప్రసాద సాధనా కర్మ. కర్మయోగం ఓ భావనారీతి (Attitude). జ్ఞానం ఒక ఎరుక (Awareness). ధ్యానం సమత్వం (Balance), భక్తి ఒక ఆరాధన (Adoration).

భగవంతుని విశాలత, పూర్ణత, అనంతతను అనుభవిస్తేగాని నిజమైన భక్తి మొదలవదు. భగవంతునిపై అనురక్తి భక్తి. తనమీద తనకు మూలమైన

తల్లితండ్రులమీదా, అభిలాష, అనురక్తి, ప్రేమ అతి సహజం. యిది మన సంబంధ సూచన. మన తల్లితండ్రుల కలయికతో ఏర్పడిన ఒకేఒక కణం రెండై, నాలుగై, ఎనిమిదై, పదునారై, అలాగున దాదాపు 200 ట్రిలియన్ కణాలతో నిండిన యీదేహమైనది. యీ దేహంలోని ప్రతి అణువూ, అవినాభావ సంబంధంతో, 200 ట్రిలియన్ కణాలూ ఒకే కణంలాగా జీవిలోపనిచేయటం మనకు సుపరిచితం. అలాగే ఒకే బ్రహ్మన్ నుండి వచ్చిన మనమంతా అవినాభావ సంబంధంతో వసుధైక కుటుంబ బంధువులం అనటం సత్యదూరం కానేరదు. ఈ కారణంచేతనే, సృష్టికీ, సృష్టికర్తకూ మధ్య సంబంధం, ప్రేమ అతి సహజం. మనలో, సహజమై, నిద్రాణమైవున్న యీప్రేమను జాగృతం చేయుటే భక్తి. తల్లికి బిడ్డకూ, దైవానికీ భక్తునికి, గురువు శిష్యునకూ మధ్యనవుండే బంధం, సంబంధం యీ ప్రేమే. యీప్రేమలో ఒక ఐక్యత, వ్యాపకత అనే లక్షణాలు నిబిడీకృతమయివున్నాయి. తల్లీబిడ్డల ప్రేమలో తల్లీబిడ్డల ఐక్యత వుంది. తల్లి దేహం విశాలమై బిడ్డదేహమును తనతో పంచుకొంటుంది. అందుకనే, బిడ్డకు ముల్లుగుచ్చుకుంటే, తల్లి నొప్పి అనుభవించి, తక్షణమే ప్రతిస్పందిస్తుంది. యిదే ప్రేమానుబంధం భగవంతునకూ భక్తునకూ మధ్యన.

భక్తిలో ఒక భావన, ఒక అనుబంధం, ఒక ఆరాధన వుంది. ఈ ఆరాధన కలగాలంటే యిరుపక్షాలలో తారతమ్యభావన అవసరం. భగవంతుడు అనంతం, ఆ అనంతంలో తానొకనలుసనే భావనతో యీ ఆరాధన మొదలవుతుంది. అహంకార రాహిత్యంలోనే ఆరాధన మొదలవుతుంది. తనను మించిన శక్తి ఒకటి వున్నదని నమ్మి, తను కష్టంలోవున్నప్పుడు ఆర్తితో 'నీవే దిక్కు' అనే భక్తుడు ఆర్తి.

పదవికోసం, పదోన్నతి కోసం పరీక్షలలో వుత్తీర్ణతకొరకు దైవానికి మ్రొక్కే భక్తుడు అర్థార్తి.

క్రమేణ యీ భక్తి పరిపక్వత చెంది, జీవన గమ్య శోధన వైపు మరల్చి, ఎక్కడి నుండి వచ్చాను? ఎక్కడకు పోతున్నాను? నేనెవరు? యీజన్మ ఎందుకు? అనే పలు ప్రశ్నలకు సమాధానం కొరకు వెదుకు భక్తుడు జిజ్ఞాసు.

కోరికలు స్వార్థమైన భౌతిక అవసరాలకు కాక, ఆధ్యాత్మిక ప్రగతికి, జీవన గమ్యానికి మరల్చినవాడు మోక్షకామి. సామాన్యభక్తుడైన ఆర్తుడు, అర్థార్తికూడ, కాలక్రమేణా, జిజ్ఞాసు, మోక్షకామియై, ప్రపన్నుడై, భగవత్ సాయుజ్యం చెందుటకు ఆస్కారం వుంది.

భగవద్గీతలో కృష్ణ భగవానుడు తొలుత మొదలైన అర్జున విషాదమనే అత్యవసర పరిస్థితికి సరిపడు అత్యవసర జ్ఞానాన్ని (Crisis Intervention) అందించిన తదుపరి, జ్ఞాన, విజ్ఞాన, ప్రజ్ఞానాలను బోధించి, తదుపరి, కర్మ, ధ్యాన యోగాల గురించి విశదీకరించి, తన విభూధిని వివరించి, తన విశ్వరూపాన్ని చూపించిన తదుపరి భక్తి యోగం గురించి ప్రస్తావించెను. దైవం యొక్క అనంతరూపదర్శనంలో తన వునికి ఏమిటో చూపించిన తదుపరి భక్తి ప్రస్తావన అతి సమంజసం.

